

'బీడుబడిన భూముల్లో జలయజ్ఞంతో ఆనందపు సిరులు పండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 226

సోమవారం 7-11-2022



దర్జాగా సెమీస్‌కు..
టీ20 ప్రపంచకప్‌లో జింబాబ్వేపై భారత్ విజయం.. గ్రూప్–2లో టాప్ - 12లో



ప్రతి నెలా ఆదాయం కావాలా?
రిస్క్ లేని సాధనాలు బోలెడు.. సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీమ్ - 13లో

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

మహిళలకు ప్రత్యేకం
ఉమ్మడి పౌర స్మృతి, మహిళలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పిస్తామని హిమాచల్ ప్రజలకు బీజేపీ ఎన్నికల హామీ ఇచ్చింది.
వివరాలు 6లో



గుజరాత్‌పై కాంగ్రెస్ చార్జిషీట్
గుజరాత్‌లో ఎన్నికల ప్రచారం వేడెక్కింది. బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా 22 పాయింట్లతో కాంగ్రెస్ చార్జిషీట్ వేసింది.
వివరాలు 6లో



సరస్సులో పడిపోయిన విమానం
టాంజానియాలోని విక్టోరియా సరస్సులో విమానం పడిపోయింది. 43 మంది ప్రయాణికుల్లో 19 మంది మృతి చెందారు.
వివరాలు 6లో



ఆ చీతాలు ఆరోగ్యంగా ఉన్నాయి
నమీబియా నుంచి తీసుకువచ్చిన చీతాలు ఆరోగ్యంగా ఉన్నాయని పేర్కొంటూ ప్రధాని మోదీ ట్విటర్‌లో వీడియో షేర్ చేశారు.
వివరాలు 6లో

ఇళ్లన్నీ భద్రం

ఇప్పటంలో ఏ ఒక్క ఇంటినీ కూల్చలేదు

తొలగించింది ఆక్రమిత ప్రహరీలను మాత్రమే

- మానవత్వంతో వ్యవహరించిన అధికార యంత్రాంగం
- నివాసాలకు ఏమాత్రం నష్టం వాటిల్లకుండా చర్యలు
- 8 ఇళ్ల ప్రహరీలు రెండు నెలల క్రితమే తొలగింపు
- సుముఖంగా ముందుకొచ్చిన స్థానికులు
- 'సాక్షి' గ్రౌండ్ రిపోర్టులో వాస్తవాలు బహిర్గతం
- విద్వేషాలను రగిల్చేందుకు పవన్ పథకం
- టీడీపీతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా అల్లర్లు సృష్టించే ఎత్తుగడ
- నాలుగు రోజుల ముందే గ్రామంలో నాదెండ్ల పర్యటన



ఇప్పటంలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన కారణంగా ఇళ్ల ప్రహరీ గోడలను తొలగించిన దృశ్యం

ఇప్పటం నుంచి సాక్షి ప్రతినిధులు మేడికొండ కోటిరెడ్డి, నానాజీ అంకంరెడ్డి: ఆక్రమణల తొలగింపు సందర్భంగా మంగళగిరి నియోజకవర్గంలోని ఇప్పటంలో స్థానిక వైఎస్సార్ సీపీ నేత ఇంటి ప్రహరీని సైతం అధికారులు తొలగించారు. పార్టీలు, కుల మతాలనే వివక్ష లేకుండా మానవత్వంతో విధులు నిర్వర్తించారు. విపక్షాలు బురద చల్లుతున్నట్లుగా ఏ ఒక్క ఇంటినీ కూల్చలేదు. సాధారణ పాలన ప్రక్రియలో భాగంగా ఆక్రమణలను గుర్తించి కేవలం ప్రహరీలను మాత్రమే తొలగించారు. వాస్తవాలు ఇలా ఉండగా జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ మాత్రం శనివారం నానా హంగామా చేస్తూ ఇప్పటం వెళ్లి విద్వేషాలను రేకెత్తించారు. రోడ్డు విస్తరణ పేరుతో ప్రభుత్వం ఇళ్లను కూల్చి వేస్తోందంటూ అడ్డగోలు విమర్శలకు దిగారు. రాష్ట్రవ్యాప్తంగా వైషమ్యాలను రగిల్చేందుకు పథకం వేశారు. ఈ నేపథ్యంలో నిజానిజాలను పరిశీలించేందుకు 'సాక్షి' ప్రతినిధి బృందం ఆదివారం ఇప్పటం గ్రామాన్ని సందర్శించి స్థానికులతో మాట్లాడింది. ఇంటి ముందు ఉండే ప్రహరీ గోడలు మాత్రమే తొలగించారని, ఏ ఒక్క నివాసాన్నీ కూల్చి వేయలేదని స్పష్టంగా వెల్లడైంది.

రాజకీయ చిచ్చే..
గౌడులు, నాయుళ్లు, రెడ్లు నివసించే ఇప్పటంలో ఎన్నికలప్పుడు ఎవరి రాజకీయాలు వారు చేసుకున్నా గ్రామస్తులంతా సామరస్యంగా జీవిస్తుంటారు. ఈ ఏడాది మార్చిలో జనసేన ఆవిర్భావ సభను అక్కడ నిర్వహించాలని భావించినప్పుడు

మిగతా 2వ పేజీలో ▶

ఇళ్లను తాకలేదు



"మా నాన్న సమయం నుంచి మేం టీడీపీ అభిమానులం. ఆక్రమణల తొలగింపు సమయంలో అధికారులు మా ఇంటికి ఏమాత్రం నష్టం వాటిల్లకుండా ప్రహరీ మాత్రమే తొలగించారు. చాలా మంది ఇళ్లు ప్రభుత్వ స్థలంలోకి వచ్చినా అధికారులు వాటిని తాకలేదు. కేవలం ప్రహరీలే తీసేశారు.

- యామినేని వెంకట కృష్ణారావు, ఇప్పటం

కారెక్కిన మునుగోడు

ఉప ఎన్నికలో టీఆర్‌ఎస్ జయకేతనం

- ఆ పార్టీ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డికి 10,309 ఓట్ల మెజారిటీ
- తొలుత హోరాహోరీగా సాగిన ఓట్ల లెక్కింపు
- ఆ తర్వాత టీఆర్‌ఎస్ గెలుపుపై స్పష్టత.. మొత్తం 15 రౌండ్లలో మూడింటిలోనే బీజేపీకి ఆధిక్యం
- పోరాడి ఓడిన ఆ పార్టీ అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డి.. మూడో స్థానంతో సరిపెట్టుకున్న కాంగ్రెస్ అభ్యర్థి పాల్వాయి స్రవంతి



టీఆర్‌ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డికి స్వీటు తినిపిస్తున్న టీఆర్‌ఎస్ నేతలు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: మునుగోడు ప్రజలు కారుకే జై కొట్టారు. ఉప ఎన్నికలో టీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి విజయం సాధించారు. ఆయన సమీప ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి అయిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిపై 10,309 ఓట్ల మెజారిటీని సాధించారు. ఈ ఎన్నికలో మూడో స్థానంలో నిలిచిన కాంగ్రెస్ అభ్యర్థి పాల్వాయి స్రవంతి డిపాజిట్ దక్కించుకోలేకపోయారు. 2018 ఎన్నికల్లో కోల్పోయిన మునుగోడు స్థానాన్ని టీఆర్‌ఎస్ ఈ ఉప ఎన్నికల్లో తిరిగి దక్కించుకుంది.

ముగ్గురి మధ్యే పోటీ..
మునుగోడు ఉప ఎన్నిక పోలింగ్ ఈ నెల 3న జరగ్గా ఆదివారం నల్లగొండలోని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గోదాములో ఓట్ల లెక్కింపు నిర్వహించారు. మునుగోడు నియోజకవర్గంలో మొత్తం 2,41,855 మంది ఓటర్లు ఉండగా.. 686 పోస్టల్ బ్యాలెట్లు సహా 2,25,878 ఓట్లు (93.41 శాతం) పోలయ్యాయి. ఇందులో

మిగతా 10వ పేజీలో ▶

ఏడింట్లో నాలుగు బీజేపీకి..
దేశవ్యాప్తంగా ఉప ఎన్నికల ఫలితాలు వెల్లడి 6లో

న్యూస్‌రీల్

జపాన్‌లో భారత యుద్ధనౌకల సందడి



జపాన్‌లోని యెకొసుకా సముద్ర జలాల్లో అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ ఆదివారం ప్రారంభమైంది. ఇందులో 13 దేశాలకు చెందిన 40 యుద్ధనౌకలు, జలాంతర్గాములు, హెలికాప్టర్లు, యుద్ధ విమానాలు పాల్గొన్నాయి. భారత్ తరఫున ఐఎన్‌ఎస్ శివాలిక్, ఐఎన్‌ఎస్ కమోర్తా యుద్ధ నౌకలు పాల్గొన్నాయి.
– సాక్షి, విశాఖపట్నం

ఏసీపీ, సీఐలపై వేటు



విశాఖ విమానాశ్రయంలో మంత్రులపై దాడి ఘటన సమయంలో బందోబస్తు కల్పనలోను, జనసేన అధినేత పవన్ పర్యటనలో విధుల నిర్వహణలోను విఫలమైన కారణంగా వెస్ట్ డివిజన్ ఏసీపీ టేకు మోహనరావు, అప్పటి ఎయిర్‌పోర్ట్ సీఐ సిహెచ్.ఉమాకాంత్‌లను విశాఖ సీపీ సస్పెండ్ చేశారు.
వివరాలు 2లో ▸

9న అల్పపీడనం



సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం: బంగాళాఖాతంలో 9న ఏర్పడనున్న అల్పపీడనం ప్రభావం రాష్ట్రంపై పెద్దగా ఉండదని వాతావరణ శాఖ అధికారులు చెప్పారు. దక్షిణ కోస్తా, రాయలసీమపై కొద్దిపాటి ప్రభావం చూపే అవకాశం ఉండటంతో ఆయా ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షాలు కురవొచ్చని అధికారుల అంచనా. శ్రీలంక తీరం వెంబడి నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడనున్న ఈ అల్పపీడనం.. వాయువ్య దిశగా తమిళనాడు, పుదుచ్చేరి తీరం వైపు వెళ్లే అవకాశం ఎక్కువగా ఉంది. 48 గంటల్లోనే బలహీనపడి పుదుచ్చేరి, చెన్నై మధ్య 11, 12 తేదీల్లో తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావం తమిళనాడు చెన్నై పైనే ఎక్కువగా ఉంటుందని పేర్కొంది. ఏపీలో పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 1 నుంచి 3 డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయి. రాష్ట్రంలో కెల్లా కర్నూలులో అత్యధికంగా 33.8(+2.2) డిగ్రీల పగటి ఉష్ణోగ్రత రికార్డయింది.

ఇదండీ సంగతి



కర్నూలులో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ తదితరులు



మహా సంకల్పానికి జన నీరాజనం

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాదయాత్ర ప్రారంభించి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్రంలో సంబరాలు
- దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు
- కేక్‌లు కట్ చేసిన పార్టీ నేతలు
- పాదయాత్ర చేపట్టడానికి దారితీసిన పరిస్థితులు, ఇచ్చిన హామీల అమలును వివరిస్తూ ప్రజాప్రతినిధుల ర్యాలీలు
- వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా వేడుకలు

- వివరాలు 3లో

ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 2,185 ఎంబీబీఎస్ సీట్లు

ప్రైవేట్, మైనారిటీ కళాశాలల్లో 3 వేల సీట్లు

- శ్రీ పద్మావతిలో 175 సీట్లు
- అన్నీ కలిపి ఈ ఏడాది రాష్ట్రంలో 5,360 ఎంబీబీఎస్ సీట్లు
- రేపటితో వెబ్ ఆప్షన్‌ల నమోదుకు ముగియనున్న గడువు
- డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం నోటిఫికేషన్



సాక్షి, అమరావతి: 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంబీబీఎస్, బీడీఎస్, ఇతర యూజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం కౌన్సెలింగ్ ప్రక్రియను డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ప్రారంభించింది. ఈ క్రమంలో ఎంబీబీఎస్ సీట్ల వివరాలను ప్రకటించింది. ఈ విద్యా సంవత్సరం అదనంగా 300 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వచ్చాయి. మరోవైపు యూజీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల సంఖ్య ఈ ఏడాది బాగా తగ్గింది. గత ఏడాది 14 వేల మంది వరకూ దరఖాస్తు చేసుకోగా ఈ ఏడాది ఆ సంఖ్య 11 వేల లోపునకే పరిమితమైంది. 10,782 మంది విద్యార్థులు విశ్వవిద్యాలయం విడుదల చేసిన

మిగతా 14వ పేజీలో ▶

విద్యార్థుల మొగ్గు ఆంధ్రా వైద్య కళాశాలకే..

విద్యార్థుల మొగ్గు విశాఖపట్నంలోని ఆంధ్రా వైద్య కళాశాల వైపే ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఆ తర్వాత స్థానాల్లో గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల, కాకినాడ రంగరాయ, కర్నూలు ప్రభుత్వ వైద్య కళాశాల ఉన్నాయి. గతేడాది ఆంధ్రా కళాశాలలో ఎస్టీ కేటగిరీలో 472 స్కోరుతో 1,10,270 ర్యాంక్ సాధించిన విద్యార్థికి చివరి సీటు వచ్చింది. ఇక ఎస్సీల్లో 79,876 ర్యాంక్, బీసీ కేటగిరీలో 32,693 ర్యాంక్, ఓసీల్లో 15,824 ర్యాంక్, ఈడబ్ల్యూఎస్‌లో 20,137 ర్యాంక్ తుది కటాఫ్ ర్యాంకులుగా నిలిచాయి.



వేగంగా కొప్పర్తి వైఎస్సార్

ఈఎంసీ అభివృద్ధి

- రూ.20.60 కోట్లతో ఎగ్జిక్యూటివ్ కేంద్ర నిర్మాణం
- రూ.26.99 కోట్లతో మూడు రెడీ టు బిల్ట్ ఫ్యాక్టరీలు
- టెండర్లు పిలిచిన ఏపీఐఐసీ
- ఇప్పటికే రూ.100.18 కోట్లతో నీటి సరఫరాకు టెండర్లు

2లో



రాజ్యాంగ విలువలను

పాటిస్తున్న ఏపీ

- దేశంలో తొలిసారిగా ఏపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ తీసుకొచ్చింది
- ఇంకా 15 రాష్ట్రాల్లో కనీసం ఎస్సీ అభివృద్ధి కార్పొరేషన్లు లేకపోవడం దురదృష్టకరం
- దేశంలో సామాజిక సంస్కరణలు తేవాలి.. 75 ఏళ్ల స్వతంత్ర భారతంలో ఇంకా అస్పృశ్యత ఉండటం బాధాకరం
- అంటరానితనాన్ని రూపుమాపేందుకు రాజకీయ నాయకులు, అధికారులు నడుం బిగించాలి
- కేంద్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నారాయణస్వామి

2లో

భూమాత రక్షణకు భుజం కలిపి..

- ఈజిప్ట్‌లో 'కాప్–27' ప్రారంభం
- వాతావరణ మార్పులు, దుష్పరిణామాలపై చర్చలు

6లో

అపరాలు, చిరుధాన్యాలపై గురి

వడివడిగా ప్రారంభమైన రబీ సాగు

- సాధారణ విస్తీర్ణం 56.19 లక్షల ఎకరాలు.. గతేడాది రికార్డు స్థాయిలో 57.27 లక్షల ఎకరాల్లో సాగు
- ఈ ఏడాది సాగు లక్ష్యం 58.68 లక్షల ఎకరాలు.. ఇప్పటివరకు మూడు లక్షల ఎకరాల్లో సాగు
- వరికి ప్రత్యామ్నాయంగా అపరాలు, చిరుధాన్యాలపై దృష్టి
- బోర్ల కింద ఆరుతడి పంటలు.. రైతులకు ప్రోత్సాహకాలు
- 50% సబ్సిడీపై ఇన్‌పుట్స్ సరఫరా



సాక్షి, అమరావతి: రబీలో బోర్ల కింద వరిసాగు చేసే రైతుల ఇబ్బందులను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం వారిని ఆదుకోవాలని సంకల్పించింది. ఆరుతడి పంటలవైపు వీరిని మళ్లించేందుకు కార్యాచరణ సిద్ధంచేసింది. వాస్తవానికి మైదాన ప్రాంతాలతో పోల్చుకుంటే బోర్ల కింద వరి సాగుకయ్యే ఖర్చు ఎక్కువ. ఫలితంగా పెట్టుబడి పెరిగి, గిట్టుబాటు ధర దక్కక ఆర్థికంగా నష్టపోతుంటారు. దీనిని నివారించేందుకు సర్కారు ఈ ప్రణాళిక రూపొందించింది. సాధారణంగా రబీలో సాగు విస్తీర్ణం 56.19 లక్షల ఎకరాలు. అయితే, గతేడాది 57.27 లక్షల ఎకరాల్లో సాగైంది. 19.72 లక్షల ఎకరాల్లో వరి, 24 లక్షల ఎకరాల్లో అపరాలు, 4.97 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న, 3.47 లక్షల ఎకరాల్లో నూనెగింజలు, 3.2 లక్షల ఎకరాల్లో

మిగతా 3వ పేజీలో ▶

ప్రోత్సాహకాలు ఇలా..

బోర్ల కింద ఆరుతడి పంటలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అన్నదాతలకు అనేక ప్రోత్సాహకాలు అందించబోతోంది. బోర్ల కింద అపరాలకు రూ.9వేలు, నూనెగింజలకు రూ.10వేలు, బోర్లతోపాటు మైదాన ప్రాంతాల్లో చిరుధాన్యాలు సాగుచేసే రైతులకు హెక్టార్‌కు రూ.6వేల విలువైన విత్తనాలు, విత్తనశుద్ధి చేసే రసాయనాలు, బయో ఫెర్టిలైజర్స్, పీపీ కెమికల్స్, లింగాకర్షక బుట్టలను ఆర్బీకేల ద్వారా అందించనున్నారు. వీటితో పాటు రూ.1.25 లక్షల రాయితీతో రూ.3 లక్షల విలువైన మినీ ప్రాసెసింగ్ యూనిట్లు 20–25 మందితో ఏర్పాటయ్యే ఫార్మర్ ఇంట్రస్ట్ గ్రూపులకు (ఎఫ్ఐజీ) అందించనుంది. చిరుధాన్యాలు, అపరాలు, నూనెగింజలు పండించే రైతుల గ్రూపులకు ప్రభుత్వం 150 యూనిట్లు ఇవ్వనుంది.

క్లుప్తంగా

ఏపీ రైతు సాధికార సంస్థకు గ్లోబల్ అవార్డు

ఫ్యూచర్ ఎకానమీ ఫోరం లీడర్‌షిప్ అవార్డుకు ఎంపిక

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడంలో కీలకపాత్ర పోషిస్తున్న ఆంధ్రప్రదేశ్ రైతు సాధికార సంస్థను ప్రతిష్టాత్మక గ్లోబల్ అవార్డు వరించింది. ప్రపంచ వ్యాప్తంగా ఆర్థికాభివృద్ధి కోసం వివిధ రంగాల్లో విశేష కృషి చేస్తున్న సంస్థలకు ఏటా 'ఫ్యూచర్ ఎకానమీ ఫోరం' అంతర్జాతీయ స్థాయిలో ఫ్యూచర్ ఎకానమీ లీడర్‌షిప్ అవార్డులను ప్రదానం చేస్తుంది. ఈ నేపథ్యంలో వాతావరణ సవాళ్లను అధిగమించడంపై ప్రస్తుతం ఈజిప్టులో ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యాన జరుగుతున్న కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్–27 (కాప్–27) సదస్సులో 2022 సంవత్సరానికి సంబంధించి ఫ్యూచర్ ఎకానమీ ఫోరం తమ అవార్డులను ప్రకటించింది. ప్రభుత్వ సహకారంతో ఆరేళ్లుగా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ రైతుల ఆర్థికాభివృద్ధి కోసం కృషి చేస్తున్న ఏపీ రైతు సాధికార సంస్థను 'ఫ్యూచర్ ఎకానమీ ఫోరం' అవార్డుకు ఎంపిక చేసింది. అవార్డు గ్రహీతల గౌరవార్థం నోబెల్ పురస్కారం పొందిన 'సెకెం' వారి ఈజిప్టియన్ వైట్ డెజర్ట్ ఫాంలో 100 చెట్లతో ప్రత్యేకంగా వనం ఏర్పాటు చేస్తున్నారు. ఈ వనం సందర్శనకు రైతుసాధికార సంస్థ ప్రతినిధులను ఫోరం ఆహ్వానించింది. ఈ సందర్భంగా ఏపీ రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్ ఆదివారం మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పం మేరకు ప్రకృతి వ్యవసాయ విస్తరణలో తనవంతు కృషి చేస్తున్న రైతు సాధికార సంస్థ సేవలను ఫ్యూచర్ ఎకానమీ ఫోరం గుర్తించి లీడర్‌షిప్ అవార్డుకు ఎంపిక చేయడం గర్వంగా ఉందన్నారు. నిజంగా ఇది అరుదైన గౌరవమని చెప్పారు.

వైద్య పథకాల అమలుపై కేంద్ర బృందం సంతృప్తి



మచిలీపట్నం జిల్లా ఆస్పత్రిలో వివరాలు తెలుసుకుంటున్న కేంద్ర వైద్య బృందం

మచిలీపట్నం: కృష్ణా జిల్లాలో కేంద్ర వైద్య బృందం ఆదివారం పర్యటించింది. ఐదు రోజులపాటు జిల్లాలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆస్పత్రులు, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను ఈ బృందంలోని సభ్యులు సందర్శించనున్నారు. మచిలీపట్నంలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిని సందర్శించిన బృందం ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలు, ఆరోగ్యశ్రీ అమలు, రోగులకు కల్పించిన సౌకర్యాలను పూర్తిస్థాయిలో పరిశీలించారు. జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా మంజూరైన నిధులతో అమలు చేస్తున్న పథకాలు రోగులకు ఎలా అందుతున్నాయనేది తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ ఇందిరాదేవి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జయకుమార్ కేంద్ర వైద్యబృందానికి ఇక్కడ అమలు చేస్తున్న కార్యక్రమాలపై వివరించారు. అంతకుముందు మచిలీపట్నంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో కేంద్ర బృందానికి డీఎంహెచ్‌వో డాక్టర్ గీతాబాయి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలో అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. ఈ బృందంలో డాక్టర్ త్రిపాఠి షిండే, డాక్టర్ ఆసీమా భట్నాగర్, డాక్టర్ రష్మీ వాద్వా, డాక్టర్ అనికేట్ చౌదరి, శ్రీ శుభోధ్ జైస్వాల్, ప్రీతీ ఉపాధ్యాయ, అభిషేక్ దదిచ్ ఉన్నారు. వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర కమిషనరేట్ నుంచి డాక్టర్ దేవి, డాక్టర్ శిరీష, డాక్టర్ రమాదేవి, డాక్టర్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

'బోదకాలు' నిర్మూలనలో కీలక ముందడుగు

సాక్షి, అమరావతి: ఫైలేరియా దోమల ద్వారా వ్యాప్తిచెందే బోదకాలు వ్యాధి నిర్మూలనలో రాష్ట్రం కీలక ముందడుగు వేసిందని వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు తెలిపారు. ఉమ్మడి శ్రీకాకుళం, కృష్ణా, నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు జిల్లాలను కేంద్ర ప్రభుత్వం బోదరహిత జిల్లాలుగా ప్రకటించిందని పేర్కొన్నారు. గడిచిన ఏడాదిలో ఒక్క లెప్రసీ కేసు కూడా నమోదుకాని తూర్పుగోదావరి జిల్లా సిల్వర్ అవార్డుకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశం నుంచి వ్యాధిని పూర్తిగా పారదోలడానికి నేషనల్ వెక్టార్ బార్న్ డిసీజ్ కంట్రోల్ ప్రోగ్రాం (ఎన్వీబీడీసీపీ) అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో బోదకాలు వ్యాధి తీవ్రంగా ప్రబలుతుండేదని తెలిపారు. ఈ వ్యాధి నియంత్రణకు అవసరమైన చర్యలను తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం ఆయా ప్రాంతాల్లోని ప్రజల వయసుల వారీగా మందులు పంపిణీ చేయడంతో పాటు, వారికి వ్యాధిపై అవగాహన కల్పించినట్టు వివరించారు. మరోవైపు తూర్పుగోదావరి జిల్లాలో ఏడాది కాలంలో ఒక్క లెప్రసీ కూడా నమోదవ్వలేదని తెలిపారు. దీంతో ఆ జిల్లాకు 2021 సంవత్సరానికి కేంద్ర వైద్య శాఖ సిల్వర్ అవార్డు ఇవ్వనుందని పేర్కొన్నారు. కుష్టు నిర్మూలన కార్యక్రమాన్ని సమర్థంగా అమలు చేయటం ద్వారా 2018 నుంచి కొత్త కేసులు నమోదు కాలేదని తెలిపారు.

పాపికొండలకు పోటెత్తారు

తొలిరోజు 112 మంది..
- ఇతర రాష్ట్రాల నుంచి కూడా వచ్చిన పర్యాటకులు
- పోశమ్మగండి పాయింట్ నుంచి 2 బోట్లలో పయనం
- 3 నెలల తర్వాత మొదలైన విహారం



పర్యాటకులతో బయలుదేరిన టూరిజం బోటు

రంపచోడవరం/దేవీపట్నం: పాపికొండల విహార యాత్రకు ఆదివారం తొలిరోజే పర్యాటకులు పోటెత్తారు. రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. ఒక్కరోజు మాత్రమే సమయం ఉన్నా ఎక్కువమంది టికెట్లు బుక్ చేసుకున్నారు. రెండు బోట్లలో 112 మంది పర్యాటకులు బయలుదేరారు. మూడునెలల విరామం తరువాత పర్యాటక, పోలీసు, రెవెన్యూ, జలవనరుల శాఖల అధికారుల పర్యవేక్షణ, సూచనల మధ్య పాపికొండల పర్యాటకం ప్రారంభమైంది. అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలం పోశమ్మగండి బోట్ పాయింట్ నుంచి రెండు బోట్లు ఉదయం 11 గంటలకు బయలుదేరాయి. మొదటి బోటుగా గోదావరి గ్రాండ్‌లో 82 మంది ఉన్నారు. వీరిలో బోటు పైభాగంలో 46 మంది, లోపల 36 మంది కూర్చునేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. రెండో బోటు భగీరథిలో 30 మంది పర్యాటకులు ఉన్నారు. వీరందరిని టికెట్ ఆధారంగా అనుమతించారు. తొలిరోజు కావడంతో బోట్లు బయలుదేరేందుకు కొంత ఆలస్యం అయింది. రోజూ ఉదయం 9 గంటలకే పర్యాటకులతో బోట్లు బయలుదేరతాయని అధికారులు చెప్పారు. బెంగళూరు నుంచి కూడా కొందరు పర్యాటకులు పాపికొండల విహారానికి వచ్చారు.



పాపికొండలు విహారయాత్రకు బయలుదేరిన పర్యాటకులు

చాలా ఆనందంగా ఉంది



గోదావరిలో ప్రయాణించి పాపికొండల అందాలు చూడాలని కోరిక ఉంది. అయితే పాపికొండల రైడ్ క్యాన్సిల్ అయిందని చెప్పారు. తిరిగి పాపికొండలకు బోట్లు తిరుగుతాయని చెప్పారు. దీంతో 8 రోజులు టూర్ ప్లాన్ చేసుకుని వచ్చాం. పాపికొండల టూర్‌కు రావడం చాలా ఆనందంగా ఉంది. – సుష్మ, పర్యాటకురాలు, బెంగళూరు

జాగ్రత్తలు పాటించాలి..



పాపికొండల విహారయాత్రను విజయవంతంగా ముగించేందుకు పర్యాటకులు జాగ్రత్తలు పాటించాలి. బోట్‌లో ప్రయాణించేటప్పుడు, తిరిగి బోట్ పాయింట్‌కు వచ్చేవరకు లైఫ్ జాకెట్లు తీయవద్దు. రోడ్డు ప్రయాణానికి, నీటిపై బోటులో ప్రయాణానికి చాలా తేడా ఉంటుంది. బ్యాలెన్స్‌పై ఆధారపడి ఉంటుంది. గోదావరిలో బోటు వెళ్తున్నప్పుడు అటూ ఇటూ తిరగడం, అందరూ ఒకవైపు రావడం, తొంగిచూడడం చేయకూడదు. ఇలాచేస్తే బోటు ఒరిగిపోతుంది. సంతోషకరమైన ప్రయాణానికి వ్యక్తిగత జాగ్రత్తలు కూడా అవసరం. – సురేష్‌బాబు, సీఐ రంపచోడవరం

వేగంగా కొప్పర్తి వైఎస్సార్ ఈఎంసీ అభివృద్ధి

సాక్షి, అమరావతి: వైఎస్సార్ జిల్లా కొప్పర్తిలో వైఎస్సార్ ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్ (ఈఎంసీ) అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. తాజాగా రూ.20.6 కోట్లతో ఎగ్జిక్యూటివ్ సెంటర్ నిర్మాణానికి ఏపీఐఐసీ టెండర్లు పిలిచింది. వైఎస్సార్ ఈఎంసీతో పాటు వైఎస్సార్ జగనన్న మెగా ఇండస్ట్రియల్ హబ్‌కు అవసరమైన నీటిని బ్రహ్మంసాగర్ రిజర్వాయర్ నుంచి సరఫరా చేయడానికి రూ.100.18 కోట్లతో టెండర్లు పిలిచిన సంగతి తెలిసిందే. అలాగే ఇప్పటికే ఆరు రెడీ టు బిల్ట్ ఫ్యాక్టరీ (ఆర్‌బీఎఫ్) షెడ్లు నిర్మించగా మరో మూడు ఆర్‌బీఎఫ్‌లను రూ.26.99 కోట్లతో నిర్మించడానికి టెండర్లు పిలిచింది. దీంతో మొత్తం ఈ తొమ్మిది ఆర్‌బీఎఫ్‌ల ద్వారా ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల సంస్థలకు 4.50 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం అందుబాటులోకి రానుంది. ఇందులో ఇప్పటికే నాలుగు ఆర్‌బీఎఫ్‌లను డిక్సన్ సంస్థకు కేటాయించగా త్వరలోనే ఉత్పత్తి ప్రారంభించనుంది. ఈ ఈఎంసీ ద్వారా ఉమ్మడి వైఎస్సార్ జిల్లా స్థూల ఉత్పత్తి 15 శాతం పెరుగుతుందని పరిశ్రమల శాఖ అంచనా వేసింది. ప్రస్తుతం రూ.41 వేల కోట్లున్న ఉమ్మడి కడప జిల్లా స్థూల ఉత్పత్తి విలువ ఈఎంసీతో మరో రూ.6,045 కోట్లు పెరుగుతుందని అంచనా. మొత్తం రూ.8,910 కోట్ల విలువైన పెట్టుబడుల ద్వారా సుమారు 29,870 మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించనుంది.

విశాఖలో మంత్రులపై దాడి ఘటనలో ఏసీపీ, సీఐలపై వేటు

నగర కమిషనర్ ఉత్తర్వులు

దొండపర్తి (విశాఖ దక్షిణ): విశాఖ విమానాశ్రయంలో మంత్రులపై దాడి ఘటన సమయంలో బందోబస్తు కల్పనలోను, జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ పర్యటనలో విధుల నిర్వహణలోనూ విఫలమైన కారణంగా వెస్ట్ డివిజన్ ఏసీపీ టేకు మోహనరావు, అప్పటి ఎయిర్‌పోర్ట్ సీఐ సీహెచ్ ఉమాకాంత్‌లను నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ సస్పెండ్ చేశారు. గత నెల 15న విమానాశ్రయం వద్ద మంత్రులు ఆర్కే రోజా, జోగి రమేష్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి కార్ల మీద జనసేన కార్యకర్తలు దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ దాడిలో మంత్రి రోజా వ్యక్తిగత సహాయకుడి తలకు తీవ్ర గాయమైంది. ఘటనలో ఇప్పటికే సుమారు 100 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. మరో 80 మంది ఆచూకీ కోసం గాలిస్తున్నారు. ఇదిలా ఉంటే.. గత నెల 15వ తేదీన పవన్ విశాఖ పర్యటనకు వస్తున్న సందర్భంలో జనసేన కార్యకర్తలు ఎయిర్‌పోర్టులో రచ్చ రచ్చ చేశారు. పవన్‌కళ్యాణ్ విమానంలో సాయంత్రం 4.30 గంటలకు రాగా.. కార్యకర్తలు మాత్రం మధ్యాహ్నం ఒంటిగంటకే పెద్ద సంఖ్యలో విమానాశ్రయానికి చేరుకుని హంగామా చేశారు. ఎయిర్‌పోర్టు వద్ద ఉన్న హోర్డింగ్స్ పైకెక్కి పెద్ద ఎత్తున నినాదాలు చేస్తున్నా పోలీసులు వారిని నిలువరించే ప్రయత్నం చేయలేదు. ఆ రోజున విశాఖ గర్జన ర్యాలీ ముగించుకుని మంత్రులు ఎయిర్‌పోర్టుకు వస్తున్న విషయం తెలిసినప్పటికీ వారికి బందోబస్తు కల్పించడంలో పోలీసులు విఫలమయ్యారనే ఆరోపణలు వినిపించాయి. దీంతో మంత్రులకు భద్రత, పవన్ పర్యటనకు బందోబస్తు చూసుకోవాల్సిన ఏసీపీ, సీఐలు విఫలమయ్యారని సీపీ వారిపై చర్యలు తీసుకున్నారు. ఎయిర్‌పోర్ట్ పోలీస్‌స్టేషన్ సీఐ ఉమాకాంత్‌ను గత నెల 18నే అక్కడి నుంచి బదిలీ చేసి రేంజ్‌కు సరెండర్ చేశారు.

రాజ్యాంగ విలువలను పాటిస్తున్న ప్రభుత్వం ఏపీ

కేంద్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నారాయణస్వామి

సాక్షి, అమరావతి/మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): రాజ్యాంగ విలువలను పాటిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దేశంలోనే తొలిసారిగా ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌ను తీసుకొచ్చిందని కేంద్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి ఎ.నారాయణస్వామి కితాబిచ్చారు. తద్వారా బలహీన వర్గాల ప్రజలకు బాసటగా నిలుస్తూ రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగిస్తోందన్నారు. విజయవాడలో సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సమరసత సమ్మేళనంలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. చాలాచోట్ల రాజకీయ పార్టీలకు దళితుల అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదని.. ఇప్పటికీ 15 రాష్ట్రాల్లో ఎస్సీ అభివృద్ధి కార్పొరేషన్ లేకపోవడం ఇందుకు నిదర్శనమని ఆవేదన వ్యక్తం చేశారు. 75 ఏళ్ల స్వాతంత్ర భారతంలో ఎన్ని ప్లానింగ్, స్టాండింగ్ కమిషన్లు వచ్చినా అంబేడ్కర్ ఆశించినట్టు అస్పృశ్యతను రూపుమాపలేకపోయాయన్నారు. కుక్కను ముద్దాడుతున్న సమాజంలో దళితుడిని ముట్టుకోవడానికి ఆలోచిస్తున్నారన్నారు. ఈ దృక్పథంలో మార్పు తెచ్చేందుకు రాజకీయ నాయకులు, అధికారులు సామాజిక కార్యకర్తలుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో ప్రత్యేక చీమా రెజ్మెంట్‌లో పోరాడిన దళిత యోధులను సైతం తర్వాత కాలంలో అంటరాని వాళ్లుగా చిత్రీకరించారన్నారు. జాతి వ్యవస్థను సంఘటితం చేస్తున్న అగ్ర వర్ణాల్లోని వ్యక్తులు కూడా వెలికి గురయ్యారన్నారు. ఇప్పటికీ దళిత సీఎంలు గుళ్లలోకి వెళ్లలేని పరిస్థితి దేశంలో ఉందన్నారు. ప్రస్తుతం రిజర్వేషన్లపై చర్చ జరుగుతోందని.. దళితుల అంటరానితనంపై కూడా చర్చించాలని అభిప్రాయపడ్డారు. సమరసత, ఆర్‌ఎస్‌ఎస్ వంటి సంస్థలు సామాజిక సమస్యలను ఎత్తి చూపుతూ.. సంస్కరణలకు బాటలు వేస్తున్నాయని కొనియాడారు. స్కూళ్లలో దళితులకు ప్రవేశం కల్పించిన కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు, బెనారస్ హిందూ వర్సిటీ తొలి దళిత విద్యార్థి కూర్మయ్య, సామాజిక సంస్కర్త భాగ్యరెడ్డి వర్మలను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.

అంటరానితనం సోదర కులాల్లోనూ ఉండటం బాధాకరం: ఎమ్మెల్సీ డొక్కా

ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ.. అంటరానితనం కేవలం అగ్రకులాలకే పరిమితం కాలేదని, సోదర కులాల్లోనూ ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దాని నివారణకు ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం చాలా పదునైన ఆయుధమని, దానిని జాగ్రత్తగా సామాజిక సంస్కరణల కోసం ఉపయోగించాలని కోరారు. ఆర్‌ఎస్‌ఎస్ జాతీయ ప్రచార ప్రముఖ్ సునీల్ అంబేకర్ మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా అనేక మతాలు ఇప్పటికీ మనుగడ కోసం సంఘర్షణ పడుతుంటే.. దేశంలో మాత్రం హైందవం ఐక్యతకు ప్రతీకగా నిలుస్తోందన్నారు. సమయానికి అనుగుణంగా కావాల్సిన సంస్కరణలతో ఐక్యతను పెంచుకోవాలన్నారు. గన్నవరంలోని శ్రీభువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతీస్వామి మాట్లాడుతూ.. కుల వ్యవస్థ దేశానికి వెన్నెముక అన్నారు. ప్రతి కులం వెనుక ఒక సైన్స్ ఉందన్నారు. ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కుల సంప్రదాయాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. వందేళ్ల కిందటే దళితుల బస్తీల్లో దేవాలయాలు నిర్మించుకున్నారని గుర్తు చేశారు. సామాజిక సమరసత వేదిక రాష్ట్ర అధ్యక్షుడు టి.విష్ణు మాట్లాడుతూ.. ఆది ఆంధ్రా సమ్మేళనం నిర్వహించి 105 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా సమరసత సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు, శాసనసభ మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్, సామాజిక సమరసత మహిళా విభాగం రాష్ట్ర కన్వీనర్ కోడూరు జయప్రద పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంగిపూడి వెంకటశర్మ రాసిన నిరుద్ధ భారతం పునర్ముద్రణ, వచన వ్యాఖ్యానం, కృష్ణానదీ తీరాన సమతా ఉద్యమాలు అనే పుస్తకాలను ఆవిష్కరించారు. కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు ముని మనుమరాలు రాధిక, వేముల కూర్మయ్య కుమారుడు డాక్టర్ రామలింగేశ్వరరావు, భాగ్యరెడ్డి వర్మ మనుమడు అజయ్ గౌతమ్‌లను నిర్వాహకులు సత్కరించారు.

ఇళ్లన్నీ భద్రం

రెండు నెలల క్రితమే 8 ప్రహరీల తొలగింపు

ఆది నుంచి టీడీపీ మద్దతుదారులైన యామినేని వెంకట కృష్ణారావు, మల్లికార్జునరావు నివాసాలు ఇవి. ఇప్పటంలో కొత్తగా రూ.1.65 కోట్లతో నిర్మించ తలపెట్టిన రహదారి అవసరాల మేరకు ఆక్రమణలను తొలగించాల్సి వస్తే ఈ ఇద్దరు అన్నదమ్ముల ఇంటి గుమ్మం కూడా కూల్చివేతల పరిధిలోకే వస్తుంది. రెవెన్యూ రికార్డుల ప్రకారం వీరిద్దరి ఇళ్లలో ముందువైపు గదుల్లో సగం దాకా ఆక్రమణలు తొలగించాలి. కానీ మానవత్వంతో వ్యవహరించిన ప్రభుత్వం శ్లాబ్ భాగం ఉండే ఇంటిని కూల్చకుండా గుమ్మం ముందు దాదాపు రెండు అడుగుల స్థలం కూడా వదిలేసి మిగిలిన ప్రహరీ మాత్రమే తొలగించింది. మొత్తం 54 భవనాలు ఆక్రమణల తొలగింపు పరిధిలోకి రాగా అందులో ఎనిమిది ఇళ్ల ప్రహరీలను రెండు నెలల కిత్రమే ఆగస్టు 28వ తేదీన తొలగించారు.







జనసేన పార్టీ మద్దతుదారుడి ఇల్లు ఆక్రమణ పరిధిలోకి వచ్చినా.. కేవలం ప్రహరీని మాత్రమే తొలగించిన దృశ్యం. (ఇన్‌సెట్‌లో..) ఆక్రమణను గుర్తిస్తూ అధికారులు వేసిన మార్క్ (వృత్తంలో)

▶ మొదటి పేజీ తరువాయి

ఇప్పటంలో మూడు ప్రధాన కులాల పెద్దల సమావేశం నిర్వహించి చర్చించారు. జనసేన సభ జరిగిన వేదిక ఆ పార్టీ సానుభూతిపరుల పొలం ఉండే ప్రాంతంలోనే ఉన్నా ఆ చుట్టు పక్కల పొలాల యజమానుల్లో అన్ని పార్టీల వారున్నారు. ఇప్పటం అభివృద్ధికి రూ.50 లక్షల విరాళం ఇస్తామని జనసేన ప్రకటించడంతో ఆ డబ్బుతో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలనే అంశంపై గ్రామంలోని మూడు సామాజిక వర్గాలు మరోసారి సమావేశమై చర్చించాయి. ఈ ఏడాది జూన్‌లో కూడా మూడు సామాజిక వర్గాలు కలసి రూ.2.50 లక్షల చందాలు సేకరించి ఉమ్మడిగా పోతురాజు ఆలయాన్ని అభివృద్ధి చేసుకున్నాయి. అలాంటి ప్రశాంత ఇప్పటంలో జనసేనాని రగిల్చిన చిచ్చుతో విద్వేష వాతావరణం నెలకొందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

31నే గ్రామానికి వచ్చి వెళ్లిన నాదెండ్ల..

ఇప్పటంలో రోడ్డుకు ఇరువైపులా ప్రభుత్వ స్థలంలో అక్రమంగా ఇంటి ప్రహరీలు, షెడ్లు నిర్మించుకున్న వారికి మంగళగిరి– తాడేపల్లి నగర కార్పొరేషన్ అధికారులు ఈ ఏడాది ఏప్రిల్, మే నెలలో రెండు విడతలు నోటీసులు జారీ చేశారు. అంతకు ముందు ఫిబ్రవరిలోనే ఆక్రమణలకు సంబంధించి మార్కింగ్ చేశారు. తొలగింపుపై జూన్‌లో మైక్ ద్వారా ప్రచారం చేశారు. రూ.25 లక్షలతో సైడు కాలువల నిర్మాణం సమయంలోనే ఆక్రమణల పరిధిలోకి వచ్చిన 8 ఇళ్ల ప్రహరీ గోడలను ఆగస్టులోనే తొలగించి పనులు పూర్తి చేశారు. తాజాగా రూ.1.65 కోట్లతో రోడ్ల విస్తరణ పనులకు సంబంధించి అక్టోబరులో టెండర్ల ప్రక్రియ ప్రారంభించారు. ఈ నెల 2వ తేదీతో టెండర్ల గడువు ముగియగా పనులను సంబంధిత కాంట్రాక్టరుకు అప్పగించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో మిగిలిన ఇళ్లకు సంబంధించిన ప్రహరీ ఆక్రమణలను నాలుగో తేదీన తొలగించనున్నట్లు గత నెల 31, ఈ నెల 1వతేదీన ఇప్పటంలో పంచాయతీ మైక్ ద్వారా ప్రచారం కూడా చేశారు. జనసేన కీలక నేత నాదెండ్ల మనోహర్ గత నెల 31న గ్రామంలో పర్యటించారు. ఆ సమయంలో కరెంట్ పోవడంతో కావాలనే ప్రభుత్వం విద్యుత్తు నిలిపి వేసిందంటూ చిందులు తొక్కారని గ్రామస్తులు గుర్తు చేస్తున్నారు. అనంతరం నాలుగో తేదీన ఆక్రమణల తొలగింపు సమయంలో అత్యధికులు ఎలాంటి అభ్యంతరం చెప్పకున్నా జనసేన మద్దతుదారులు కొందరు అడ్డుకునే యత్నం చేయడం, ఆ మరుసటి రోజే పవన్‌కళ్యాణ్ పర్యటించడం లాంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఇప్పటంలో ఇన్నాళ్లూ టీడీపీ మద్దతుదారులే కాంట్రాక్టు పనుల్లో పెత్తనం చలాయించారు. వీరంతా ఇప్పుడు జనసేన ముసుగు కప్పుకున్నారు. ఇప్పటంలో గత మూడేళ్లలో రూ.2.85 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ఇప్పటికే పూర్తి చేయగా మరో రూ.6 కోట్ల పనులు మంజూరై టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది.

ఇళ్లకు నష్టం లేకుండా..

ఇప్పటంలో ప్రధాన రోడ్డు అంతా ఒకే వెడల్పుతో లేదు. ఒకచోట 60 అడుగులు, మరో చోట 75 అడుగులు.. ఇంకోచోట 118 అడుగులు చొప్పున ఉంది. దీంతో అధికారులు మార్కింగ్ చేసిన ప్రాంతాల్లో ఒకచోట ఎక్కువ ఆక్రమణలు, మరోచోట తక్కువ తొలగించే పరిస్థితి తలెత్తింది. అందరికీ ఒకేలా తొలగింపు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరడంతో బ్రిటిష్ హయాంలో వేసిన సర్వే రాళ్ల ఆధారంగా ఆక్రమణల తొలగింపు చర్యలు చేపట్టారు. సరిహద్దు రాళ్ల ఆధారంగా తొలగింపు చేపట్టగా కొన్ని నివాసాలు దెబ్బతినే ప్రమాదం ఉండడంతో అధికారులు ఇళ్లకు నష్టం జరగకుండా కేవలం ప్రహరీలు, అదనంగా నిర్మించిన షెడ్లను మాత్రమే తొలగించారు. రెండు నెలల క్రితం ఇలా ఆక్రమణలను తొలగించిన చోట డ్రైనేజీ నిర్మాణం చేయడంతో నివాసితులు తమ ఇళ్లకు మార్పులు సైతం చేసుకున్నారు.

సగం దూరం తగ్గుతుంది..

దుగ్గిరాల మండలంలోని ఐదు ఊర్లను వడ్డేశ్వరం వద్దనున్న హైవేతో ఇప్పటం కలుపుతుంది. దుగ్గిరాల ప్రాంతం నుంచి విజయవాడ రావాలంటే ప్రధాన మార్గంలో వెళ్తే 14 కి.మీ ప్రయాణించాలి. అదే ఇప్పటం మీదుగా ప్రయాణిస్తే 7 కి.మీ దూరం తగ్గుతుంది. ఈ నేపథ్యంలో ఇప్పటంలో ఆర్ అండ్ బీ రోడ్డు విస్తరణకు సంబంధిత శాఖ అధికారులు పనులు చేపట్టారు.

మురుగు అంతా రోడ్డుపైకి..

ఇప్పటం మీదుగా వెళ్లే ఆర్ అండ్ బీ రోడ్డు ఆక్రమణలతో ఇరుకుగా మారిపోవడం, సరైన డ్రైనేజీ లేకపోవడంతో మురుగు అంతా రోడ్డుపైనే చేరుతోంది. దీంతో రోడ్డు విస్తరణ, డ్రైనేజీ నిర్మాణానికి అధికారులు అనివార్యంగా చర్యలు చేపట్టారు. టెండర్లు పిలిచి 350 మీటర్ల పరిధిలో రోడ్డు నిర్మించేందుకు రూ.1.65 కోట్లతో పనులు చేపట్టారు.

పచ్చని పల్లెలో పవన్ చిచ్చు

ప్రశాంతంగా ఉన్న ఇప్పటంలో బయటి నుంచి వచ్చిన కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం చిచ్చు రేపారు. సుమారు 2 వేల మంది జనాభా, 1,350 ఓటర్లున్న ఈ గ్రామం మంగళగిరి – తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉంది. రెండేళ్ల క్రితమే కార్పొరేషన్‌లో రోడ్ల విస్తరణ పనులు ప్రారంభించారు. అందులో భాగంగా ఇప్పటంలోనూ రోడ్ల విస్తరణ చేపట్టాలని నిర్ణయించారు. 53 నివాసాలు, ఒక పంచాయతీ భవనం (మొత్తం 54) ఆర్ అండ్ బీ రోడ్డు స్థలాన్ని ఆక్రమించినట్లు గుర్తించి మార్కింగ్ చేశారు. ప్రతి ఇంటికీవెళ్లి తొలగింపుపై అవగాహన కల్పించారు. చట్ట ప్రకారం ప్రభుత్వ స్థలాన్ని తీసుకోవాలని స్థానికులు సైతం కోరారు. జనసేన నేత నాదెండ్ల మనోహర్ రాకతో గ్రామంలో ప్రశాంతత భగ్నమైంది.

30 ఏళ్ల క్రితమే..

ఇప్పటంలో ఆక్రమణల గుర్తింపు మార్కింగ్ ఫిబ్రవరిలో చేపట్టడమే తొలిసారి కాదని స్థానికులు వెల్లడించారు. 30 ఏళ్ల క్రితం ఒకసారి, 15 ఏళ్ల క్రితం మరోసారి మార్కింగ్ చేశారని చెప్పారు. తాము ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేపట్టిన మాట వాస్తవమేనని, అందువల్ల సహకరించామని తెలిపారు. ఆక్రమణల తొలగింపు ప్రక్రియ రెండు నెలలుగా సాగుతున్నా ఈనెల 2వ తేదీన కొందరు అలజడికి తెర తీశారని గ్రామస్తులు పేర్కొన్నారు. అన్ని సామాజిక వర్గాలు కలసి మెలసి జీవించే తమ గ్రామానికి ఇప్పటిదాకా పోలీసులు వచ్చిందే లేదని పేర్కొంటున్నారు.

వైఎస్సార్ కల్యాణ మండపం..

ఇప్పటంలో ప్రజల చందాలతో ప్రభుత్వ స్థలంలో కల్యాణ మండపాన్ని నిర్మించారు. గతంలో ఈ ప్రాంత కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఇద్దరు రూ.11 లక్షలు, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి మరో రూ.30 లక్షలు ఇవ్వగా ఇప్పుడు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. స్థలం సరిపోకపోవడంతో మరో కొంత ప్రభుత్వ స్థలాన్ని అదనంగా తీసుకున్నారు. స్థానిక పెద్దలు ఈ భవనానికి 'డాక్టర్ వైఎస్సార్ కల్యాణ మండపం' అని నామకరణం చేయాలని తీర్మానించగా జనసేన వర్గం కోర్టుకు వెళ్లగా వారి పిటిషన్‌ను కొట్టివేసింది.



ఆక్రమణ పరిధిలోకి వచ్చిందని వైఎస్సార్‌సీపీ నేత ఇంటి ప్రహరీని కూల్చేసిన దృశ్యం

రికార్డుల ప్రకారం తీసుకున్నారు..



2014లో ఇల్లు కట్టా. ఆక్రమణల తొలగింపులో మొదట తొలగించింది మా ఇంటి ప్రహరీనే. రోడ్డు పక్క ఖాళీగా ఉండడంతో గోడ కట్టా. గతంలో రెండుసార్లు మార్కింగ్ చేసినా చర్యలు తీసుకోలేదు. ఫిబ్రవరిలోనూ మార్కింగ్ చేసినా తొలగించరనుకున్నాం. అధికారులు రెండుసార్లు నోటీసులిచ్చి ప్రతి ఇంటికీ వచ్చి పరిస్థితిని వివరించారు. రికార్డుల్లో ఉన్నట్లుగానే తొలగించాలని వారిని కోరాం. దీంతో మా ఇంటి ప్రహరీ తొలగించారు. ఇదంతా రెండు నెలల క్రితమే జరిగింది. అందరివీ ప్రహరీలు, చిన్నచిన్న షెడ్లు మాత్రమే తొలగించారు. ఒక్క ఇల్లు కూడా కూలగొట్టలేదు.
– పొన్నంగి శివారెడ్డి, ఇప్పటం

ఎవరి ఇల్లూ కూల్చలేదు..



రోడ్డు విస్తరణకు ఆక్రమణల తొలగింపు కోసం పూర్వం వేసిన సర్వే హద్దు రాళ్లను ప్రామాణికంగా తీసుకున్నారు. హద్దు దాటి కట్టిన నిర్మాణాలను మాత్రమే తొలగించారు. ఇళ్లు ఎవరికి వారు తమ సొంత స్థలంలోనే కట్టుకుని అవకాశం ఉన్నవారు గోడలు, షెడ్లు రోడ్డు ఆనుకుని నిర్మించారు. రెండు నెలల క్రితం తొలగించినప్పుడు ఎలాంటి వివాదం లేదు. ఎవరి ఆస్తులూ పోకపోయినా ఇప్పుడు గొడవలు సృష్టించారు. మా ఇంటి గోడ కూడా ప్రభుత్వ స్థలంలో కట్టిందే. దాన్ని తొలగించి డ్రైనేజీ కట్టారు.
– మున్నంగి సాంబిరెడ్డి, బాలకోటిరెడ్డి, ఇప్పటం

ప్రభుత్వానిది కాబట్టి ఇచ్చేశాం..



రోడ్డు ఆనుకుని చిల్లర కొట్టు పెట్టుకుని వ్యాపారం చేసుకుంటున్నాం. ఆ స్థలం ప్రభుత్వానిది అని తెలుసు. ఖాళీగా ఉందని షెడ్డు వేసుకున్నాం. సర్వే చేసి దాన్ని తొలగిస్తామని అధికారులు ముందుగానే చెప్పి నోటీసులిచ్చారు. ఇంటికి వచ్చి కూడా చెప్పారు. ఇంటిని మాత్రం ముట్టుకోలేదు. ఆ స్థలం ఏదో రోజు తప్పకుండా తీసుకుంటారని తెలుసు. అందుకే అడ్డు చెప్పలేదు.
– వీరంకి సుమలత, ఇప్పటం

క్లుప్తంగా

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 2022–23 ఖరీఫ్ ధాన్యం సేకరణ ప్రక్రియను ఆదివారం ప్రారంభించినట్లు పౌర సరఫరాల శాఖ ఎండీ వీరపాండియన్ తెలిపారు. రైతు భరోసా కేంద్రాల్లో కనీస మద్దతు ధరకు కొనుగోళ్లు చేపడుతున్నామని పేర్కొన్నారు. సుమారు 37 లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ సీజన్‌లో వలంటీర్లు రైతు సేవకులుగా ధాన్యం కొనుగోళ్లలో సేవలందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ లక్ష్యాలు, సేవలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది

లోక్‌సత్తా నేత జయప్రకాష్‌నారాయణ



వేటపాలెం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని లోక్‌సత్తా నేత ఎస్.జయప్రకాష్ నారాయణ చెప్పారు. బాపట్ల జిల్లా వేటపాలెం మండలం వేటపాలెంలోని బండ్ల బాపయ్య విద్యాసంస్థల శతాబ్ది ఉత్సవాల్లో రెండో రోజు ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యకోసం ఒక్కో విద్యార్థికి రూ.30 వేల నుంచి రూ.40 వేలు ఖర్చు చేస్తుంటే ఆంధ్రప్రదేశ్ మాత్రం అత్యధికంగా ఒక్కొక్క విద్యార్థికి రూ.90 వేలు ఖర్చు చేస్తోందని చెప్పారు. ఇది అభినందించాల్సిన విషయమన్నారు. విద్యా, వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. సినీనటుడు, రచయిత తనికెళ్ల భరణి మాట్లాడుతూ బండ్ల బాపయ్యశెట్టి నెలకొల్పిన విద్యాసంస్థలో చదువుకున్న ఎందరో దేశ, విదేశాల్లో ఉన్నత స్థాయిల్లో ఉన్నారని చెప్పారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని రాణించాలని సూచించారు. ఎస్‌టీసీవో డైరెక్టర్ చెంగపల్లి వెంకట్, నటుడు అజయ్‌ఘోష్, విద్యాసంస్థ అధ్యక్షుడు బండ్ల అంకయ్య, ఉపాధ్యక్షుడు కోడూరి ఏకాంబేశ్వరబాబు, కార్యదర్శి బండ్ల శరత్‌బాబు, ఉత్సవ కమిటీ చైర్మన్ గొల్లపూడి సీతారాం తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి: సీపీఎం

సాక్షి, అమరావతి: అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలంలో నేవల్ ఆల్టర్‌నేటివ్ ఆపరేషన్ బేస్ (ఎన్ఏవోబీ) మెయిన్ గేట్ వద్ద ఆందోళన చేస్తున్న నిర్వాసితులు, మత్స్యకారుల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. శారదా, వరాహ నదుల్లో చేపలు వేట చేసుకుంటున్న మత్స్యకారులకు జెట్టి నిర్మాణం చేపడతామని, ఆ నిర్మాణం జరిగే వరకు చేపల వేటకు అంతరాయం కలగకుండా చూస్తామని 2011లో అప్పటి కలెక్టర్ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఇప్పుడు వరాహ, శారద నదులకు చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టారని, చేపల వేటకు వెళ్లకుండా గేట్లు పెట్టారని తెలిపారు. దీంతో మత్స్యకారులు ఉపాధి కోల్పోయారని వారిని ఆదుకోవాలని కోరుతూ సీఎం వైఎస్ జగన్‌కు ఆయన లేఖ రాశారు.

'క్లాప్' ఆటోడ్రైవర్లకు కనీస వేతనం ఇవ్వాలి

ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్

సాక్షి, అమరావతి/కృష్ణలంక(విజయవాడ తూర్పు): మున్సిపాలిటీల్లో సేవలందిస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్లకు కనీస వేతనం రూ.18,500 ఇవ్వాలని సీఐటీయూ అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో ఆదివారం మున్సిపల్ క్లాప్ ఆటో డ్రైవర్స్ రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఫెడరేషన్ నాయకుడు పి.వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న మామహేశ్వరరావు మాట్లాడుతూ ఒక్కో ఆటోకు నెలకు రూ.63 వేలు మున్సిపాలిటీలు చెల్లిస్తున్నా డ్రైవర్లకు మాత్రం తక్కువ వేతనాలు ఇస్తున్నారన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని కోరారు. వీరి సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంకటరెడ్డి మాట్లాడుతూ డిమాండ్ల సాధనకు ఈ నెల 15 నుంచి ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ప్రకటించారు. సదస్సులో ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు డేవిడ్, జ్యోతిబసు, ప్రసాదరావు పాల్గొన్నారు.

ఏపీలో వేగంగా ఆర్టీఐ అప్పీళ్ల పరిష్కారం

దక్షిణాది రాష్ట్రాల్లో అగ్రస్థానంలో నిలిచిన ఆంధ్రా

- ఫిర్యాదు పరిష్కారానికి గరిష్టంగా 4 నెలలు
- కేరళలో 15 నెలలు... తెలంగాణలో ఏడాది సమయం
- దేశంలో సమాచార కమిషన్‌ల పనితీరు 2021-22 నివేదిక వెల్లడి

సాక్షి, అమరావతి: దక్షిణాది రాష్ట్రాల్లో సమాచార కమిషన్‌కు వచ్చే అప్పీళ్లు, ఫిర్యాదుల పరిష్కారంలో ఆంధ్రప్రదేశ్ వేగంగా స్పందిస్తున్నట్లు 'భారతదేశ సమాచార కమిషన్‌ల పనితీరు 2021–22' నివేదిక స్పష్టం చేసింది. కేరళలో ఒక ఫిర్యాదును పరిష్కరించడానికి 15 నెలలు, కర్ణాటకలో 14 నెలలు, తెలంగాణలో ఏడాది సమయం పడుతున్నట్లు పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం కేవలం 4 నెలల్లోనే పరిష్కరిస్తున్నట్లు వివరించింది. వివిధ రాష్ట్రాల్లో కమిషన్‌లో పోస్టులు భర్తీ చేయకపోవడం, కమిషనర్లు కేసుల పరిష్కారంలో లక్ష్యాలను నిర్దేశించుకోకపోవడం ఆలస్యానికి కారణంగా పేర్కొంది. కర్ణాటక సమాచార కమిషన్‌లో ఈ ఏడాది జూన్ 30 నాటికి అత్యధికంగా ఫిర్యాదులు, అప్పీళ్లు పెండింగ్‌లో ఉన్నాయని, తమిళనాడులో సమాచార చట్టం కింద కోరిన సమాచారాన్ని అందించట్లేదని చెప్పింది. ఆర్టీఐకి వచ్చిన కేసుల్లో బ్యాక్‌లాగ్, నెలవారీ డిస్పోజల్ రేట్‌ను ఉపయోగించి ఢిల్లీకి చెందిన సిటిజన్స్ గ్రూప్, సతార్క్ నాగరిక్ సంగతన్ (ఎస్ఎన్ఎస్) బృందం ఈ ఏడాది జూలై 1న అప్పీళ్ల పరిష్కారాల సమయాన్ని లెక్కించింది. 2022 జూన్ 30 నాటికి దేశ వ్యాప్తంగా 26 సమాచార కమిషన్లలో 3,14,323 అప్పీళ్లు, ఫిర్యాదులు పెండింగ్‌లో ఉండగా.. ఇందులో కర్ణాటకలో 30,358, తెలంగాణలో 8,902, కేరళలో 6,360, ఆంధ్రప్రదేశ్‌లో కేవలం 2,814 మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించింది.

జరిమానాల్లో కర్ణాటక టాప్

కర్ణాటకలో 2021 జూన్ 1 నుంచి 2022 జూన్ 30 మధ్య అత్యధిక అప్పీళ్లు నమోదు, పరిష్కారం పొందాయి. ఇక్కడ 26,694 అప్పీళ్లు వస్తే.. 25,710 కేసులను పరిష్కరించారు. తెలంగాణలో 7,169 కేసులకు గానూ 9,267 (గత ఏడాది పెండింగ్ కలిపి) అప్పీళ్లను, ఏపీలో 6,044 కేసులు నమోదవగా, 8,055(పెండింగ్‌తో కలిపి) డిస్పోజ్ అయ్యాయి. నిర్దిష్ట సమయానికి సమాచారం ఇవ్వకపోవడం, కావాలని జాప్యం చేయడం వంటి కారణాలతో కర్ణాటక దేశంలోనే అత్యధికంగా 1,265 కేసుల్లో రూ.1.04 కోట్లు జరిమానాలు విధించింది. కేరళ 51 కేసుల్లో రూ.2.75 లక్షలు, తెలంగాణ 52 కేసుల్లో రూ.2 లక్షలు, ఏపీ 9 కేసుల్లో రూ.55 వేలు జరిమానా విధించాయి. మధ్యప్రదేశ్‌లో రూ.47.50 లక్షలు, హరియాణా రూ.38.81 లక్షలు పెనాల్టీ విధించాయి. అయితే, సమాచారం ఇవ్వడంలో జాప్యానికి జరిమానాలు విధించడానికి అర్హత ఉన్నప్పటికీ, చాలా తక్కువ కేసుల్లో మాత్రమే పెనాల్టీ వేశారని పేర్కొనడం గమనార్హం.



ఏపీలో కమిషన్‌కు జవసత్వాలు

రాష్ట్రంలో ఆర్టీఐ చట్టం అమలు, సమాచార కమిషన్ నియామకంపై గత టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. విభజన అనంతరం 2014 నుంచి 2017 వరకు సమాచార కమిషన్‌ను ఏర్పాటు చేయలేదు. ఆ తర్వాత మొక్కుబడిగా నలుగురు కమిషనర్లను నియమించి చేతులు దులిపేసుకుంది. ఇక్కడ కమిషన్ ఉన్నప్పటికీ సరైన మౌలిక వసతులు లేక 2019 వరకు పూర్తి స్థాయిలో కార్యకలాపాలు సాగించలేక ఇబ్బందులు ఎదుర్కొంది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సమాచార కమిషన్‌కు నూతన జవసత్వాలు తీసుకొచ్చింది. అప్పటివరకు ఉన్న నలుగురు కమిషనర్లకు తోడు కొత్తగా మరో నలుగురిని నియమించి కేసులు త్వరితగతిన పరిష్కారం అయ్యేలా చర్యలు చేపట్టింది. ఇటీవల ఇద్దరు కమిషనర్లు పదవీ విరమణ చేయగా.. ఆ పోస్టులను సైతం వెంటనే భర్తీ చేసింది. తద్వారా కేసులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ.. వేగంగా పరిష్కరించేందుకు వీలు కల్పించింది.

ప్రభుత్వ ఆఫీసుల్లో ఆర్టీఐ డే!

రాష్ట్రంలో పూర్తిస్థాయిలో సమాచార కమిషన్ ఉండటంతో ఆర్టీఐపై వచ్చే అప్పీళ్లను వేగంగా పరిష్కరిస్తున్నాం. ప్రజలకు పెద్దఎత్తున అవగాహన కల్పించేలా ఆర్టీఐ వారోత్సవాలను నిర్వహించాం. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ప్రతి నెల మూడవ శుక్రవారాన్ని ఆర్టీఐ డేగా ప్రకటించింది. ఫలితంగా క్షేత్ర స్థాయిలో ఫిర్యాదుల పరిష్కారానికి మార్గం సుగమం అయ్యింది. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం సమాచార కమిషన్‌ను బలోపేతం చేయడం సంతోషంగా ఉంది.

– ఆర్.శ్రీనివాసరావు, చీఫ్ కమిషనర్ (ఇన్‌చార్జి)

టిడ్కో ఇళ్లకు సంక్షేమ సంఘాలు

- జగనన్న నగరాల్లో ప్రతి వెయ్యి గృహాలకు ఒక కమిటీ
- సొసైటీ చట్టాల ప్రకారం ఏర్పాటు
- ప్రభుత్వం నిర్మిస్తున్న నివాసాలకు ఇదే తొలిసారి

సాక్షి, అమరావతి: పట్టణ పేద ప్రజల కోసం నిర్మిస్తున్న టిడ్కో ఇళ్ల మెరుగైన నిర్వహణకు 'రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లు' ఏర్పాటు చేయనున్నారు. సొసైటీల చట్ట నిబంధనలకు అనుగుణంగా ఇవి ఏర్పాటు కానున్నాయి. మొత్తం 88 యూఎల్బీల్లో 2,62,212 ఇళ్లను జీ+3 అంతస్తులతో నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. 163 ప్రాంతాల్లో ఉన్న వీటిని వైఎస్సార్ జగనన్న నగరాలుగా వ్యవహరిస్తున్నారు. ప్రాంతాన్ని బట్టి ఒక్కోచోట వెయ్యి నుంచి 11,500 ఇళ్ల వరకు నిర్మిస్తున్నారు. ఇవి అపార్టుమెంట్లే అయినప్పటికీ ఒక్కో ప్రాంగణం చిన్న తరహా పట్టణాన్ని తలపిస్తోంది. దీంతో ప్రతి వెయ్యి నివాసాలకు ఒక కమిటీ చొప్పున సంక్షేమ సంఘాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. చెత్త సేకరణ, వీధి లైట్లు, తాగునీటి సరఫరా, ఎస్టీపీల నిర్వహణ లాంటి పనులను స్థానిక మున్సిపాలిటీలే నిర్వర్తిస్తాయి. అంతర్గత నిర్వహణను యజమానులకే అప్పగిస్తారు. అపార్టుమెంట్లు, గేటెడ్ కమ్యూనిటీల్లో మాదిరిగా టిడ్కో ఇళ్లకు సంక్షేమ సంఘాల కమిటీలు ఏర్పాటు కానున్నాయి. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఇళ్లకు ఈ తరహా కమిటీల ఏర్పాటు ఇదే తొలిసారి. ఈ మేరకు కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీ కమిషనర్లతో పాటు ఆర్జేడీలకు ఏపీ టిడ్కో ఎండీ చిత్తూరి శ్రీధర్ లేఖ పంపారు. కమిటీల విధులపై నివాసితులతో చర్చించి ఈనెల 10లోగా నివేదిక ఇవ్వాలని సూచించారు. గృహ నిర్మాణ రంగంపై ఇటీవల గుజరాత్‌లో నిర్వహించిన సదస్సుకు హాజరైన టిడ్కో అధికారులు అక్కడ అపార్ట్‌మెంట్ల నిర్వహణను పరిశీలించి ముసాయిదా సిద్ధం చేశారు. కాగా, అక్టోబరు చివరి నాటికి 40,575 యూనిట్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

రాష్ట్రంలో టిడ్కో గ్రూప్ హౌస్‌లు ఇలా

గ్రూప్ హౌస్‌లు	ప్రాంతాలు	సంఖ్య
1000 లోపు	70	32,936
1000- 2000	52	72,352
2000-3000	22	53,100
3000-6000	14	65,184
8000-11500	5	38,640
మొత్తం	163	26,2212

మెరుగ్గా అంతర్గత నిర్వహణ..



కమిటీలు ఉంటే అంతర్గత నిర్వహణ సులభతరమవుతుంది. కారిడార్లు, ప్రాంగణాల నిర్వహణ, మోటార్ల నిర్వహణ లాంటివి ఇళ్ల యజమానులే పర్యవేక్షించేందుకు కమిటీలు ఉంటే మంచిది. ఇవి ఏకరీతిన ఉండాలని భావిస్తున్నాం. రాష్ట్రంలో 2.62 లక్షలకు పైగా టిడ్కో ఇళ్లు నిర్మిస్తున్నాం. ప్రతి వెయ్యి నివాసాలకు ఒక కమిటీ చొప్పున మొత్తం 262 రెసిడెన్షియల్ వెల్ఫేర్ కమిటీలు ఏర్పాటవుతాయి. తద్వారా దేశంలో ఈ తరహా కమిటీలను నియమించిన తొలి రాష్ట్రం ఏపీ అవుతుంది.

– చిత్తూరి శ్రీధర్, టిడ్కో ఎండీ

సకాలంలో 'సబ్సిడీ'

సాక్షి, అమరావతి: ఏ ప్రభుత్వమైనా ప్రజలకు పలు సంక్షేమ పథకాలు అందిస్తుంటుంది. వాటికి అయ్యే ఖర్చును పూర్తిగా లేదా పాక్షికంగా ప్రభుత్వమే భరిస్తుంటుంది. అయితే విద్యుత్ వినియోగదారులకు ఇచ్చే సబ్సిడీ మాత్రం విద్యుత్ పంపిణీ సంస్థలు ముందుగా భరించాల్సి ఉంటుంది. ఆ మొత్తాన్ని ఆ తర్వాత ప్రభుత్వం డిస్కంలకు అందిస్తుంటుంది. ఈ చెల్లింపుల్లో జాప్యం జరిగితే విద్యుత్ సంస్థలు అప్పుల ఊబిలో కూరుకుపోతాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇదే జరిగింది. ఆ ప్రభుత్వం డిస్కంలకు చెల్లించాల్సిన సబ్సిడీని పెద్ద మొత్తంలో బకాయి పెట్టింది. దీంతో అవి ఆర్థికంగా చాలా నష్టపోయాయి. అయితే, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం డిస్కంలకు సబ్సిడీని సకాలంలో చెల్లిస్తోంది. అంతేకాకుండా టీడీపీ ప్రభుత్వం పెట్టిన బకాయిలను కూడా చెల్లిస్తోంది. దీంతో డిస్కంలు ఆర్థికంగా బలపడుతున్నాయి.

పాతవి, కొత్తవి కలిపి ఇస్తున్న ప్రభుత్వం

ప్రస్తుత 2022–23 ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో సెప్టెంబర్ 22 వరకు డిస్కంలకు చెల్లించాల్సిన సబ్సిడీ మొత్తం రూ.5,353 కోట్లు కాగా రూ.5302 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. అదే విధంగా ప్రభుత్వ విభాగాల విద్యుత్ వినియోగ చార్జీలకు రూ. 1,343 కోట్లను చెల్లించింది. గత టీడీపీ ప్రభుత్వం డిస్కంలకు రూ.7,680 కోట్లు సబ్సిడీ సొమ్మును చెల్లించలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత డిస్కంలకు ఎప్పటికప్పుడు సబ్సిడీ సొమ్ము చెల్లించడమే కాకుండా, టీడీపీ ప్రభుత్వం పెట్టిన బకాయిలను కూడా చెల్లిస్తోంది. ఇలా 2019–20 ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పటివరకు సబ్సిడీ రూ.34,901 కోట్లు కాగా, ప్రభుత్వం రూ.38,805 కోట్లు ఇచ్చింది. తాము ఇవ్వాల్సిన దానికంటే ఎక్కువగా ఇచ్చిన మొత్తం రూ.3,904 కోట్లు.

సబ్సిడీలు రావడంతో బకాయిల చెల్లింపు

ప్రస్తుత ప్రభుత్వం సబ్సిడీ మొత్తాన్ని డిస్కంలకు సకాలంలోనూ, కొన్నిసార్లు ముందుగా కూడా చెల్లిస్తోంది. మరోవైపు గత ప్రభుత్వం పెట్టిన బకాయిలనూ ఇప్పుడు చెల్లిస్తోంది. ప్రభుత్వ కచ్చితత్వంతో డిస్కంలు ఆర్థికంగా నిలదొక్కుకొన్నాయి. ఇవి విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు చెల్లించాల్సిన బిల్లులను ఎప్పటికప్పుడు చెల్లించగలుగుతున్నాయి. తద్వారా విద్యుత్ రంగం పురోభివృద్ధి సాధిస్తోంది.

– కె. విజయానంద్, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి

అపరాలు, చిరుధాన్యాలపై గురి

▶ మొదటి పేజీ తరువాయి

చిరుధాన్యాలు సాగవుతున్నాయి. కానీ, ఈ ఏడాది 58.68 లక్షల ఎకరాల్లో సాగుచేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇందులో ఇప్పటి వరకు 2.50లక్షల ఎకరాల్లో రబీ పంటల సాగుకు వడివడిగా శ్రీకారం చుట్టారు.

రూ.25 కోట్లతో కార్యాచరణ

రాష్ట్రంలో 12 లక్షల బోర్ల కింద 24.63 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఇందులోని 11.55 లక్షల ఎకరాల్లో సుమారు 10లక్షల మంది సంప్రదాయంగా వరిసాగు చేస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రస్తుత రబీ సీజన్‌లో ప్రయోగాత్మకంగా బోర్ల కింద ప్రత్యామ్నాయ పంటల సాగుకోసం రూ.25 కోట్లతో వ్యవసాయ శాఖ కార్యాచరణ సిద్ధంచేసింది. ఇందులో భాగంగా బోర్ల కింద 750 క్లస్టర్ల (ఒక క్లస్టర్ కింద 50 ఎకరాలు) పరిధిలోని 37,500 ఎకరాల్లో వరికి బదులుగా అపరాలు, నూనెగింజల సాగును ప్రోత్సహించనున్నారు. ఇలా ఒక్కో క్లస్టర్‌లోని రైతులకు విత్తనాలు, సూక్ష్మ పోషకాలు, జీవన ఎరువులు, వ్యవసాయ యంత్ర పరికరాలను 50 శాతం సబ్సిడీపై అందించనున్నారు. అదే విధంగా మిషన్ మిల్లెట్ పాలసీ ద్వారా బోర్ల కింద ప్రాంతాలతోపాటు మైదాన ప్రాంతాల్లో కూడా ప్రస్తుత రబీ సీజన్‌లో కనీసం 50వేల ఎకరాల్లో రాగి, కొర్ర పంటల సాగును ప్రోత్సహించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

కనీసం మూడు లక్షల ఎకరాలు లక్ష్యం

అలాగే, ఈ కార్యాచరణ ద్వారా వచ్చే ఫలితాలను బట్టి రానున్న రెండేళ్లలో కనీసం మూడు లక్షల ఎకరాల్లో రైతులను ఆరుతడి పంటల వైపు మళ్లించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఎకరా వరికి అవసరమయ్యే నీటితో సుమారు ఎనిమిది ఎకరాల్లో ఆరుతడి పంటలు సాగుచెయ్యొచ్చు. నేల స్వభావం, నీటి లభ్యతను బట్టి వరికి బదులు ఆరుతడి పంటలైన పెసర, మినుము, ఉలవలు, జొన్న, మొక్కజొన్న, వేరుశనగ, రాగులు, కొర్రలు వేసుకుంటే మంచి ఆదాయం వస్తుందంటూ బోర్లకింద సాగుచేసే రైతులతో సమావేశాలు ఏర్పాటుచేసి అవగాహన కల్పిస్తున్నారు. వాట్సప్ గ్రూపుల ద్వారా చిన్నచిన్న వీడియో సందేశాలతో పాటు గ్రామస్థాయిలో కరపత్రాల ద్వారా ప్రచారం చేస్తున్నారు.

బోర్ల కింద ఆరుతడి పంటలే మేలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బోర్ల కింద వరికి ప్రత్యామ్నాయంగా అపరాలు, నూనెగింజలు, చిరుధాన్యాల సాగును ప్రోత్సహించేందుకు కార్యాచరణ సిద్ధంచేశాం. ఈ ఏడాది బోర్ల కింద 37,500 ఎకరాల్లో నూనెగింజలు, అపరాలతో పాటు 50 వేల ఎకరాల్లో చిరుధాన్యాల సాగుకు రాయితీలు అందించనున్నాం. ఇలా దశల వారీగా రానున్న నాలుగు సీజన్లలో కనీసం మూడు లక్షల ఎకరాల్లో పంటల మార్పిడి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

– చేవూరు హరికిరణ్, స్పెషల్ కమిషనర్, వ్యవసాయ శాఖ

అవయవ దానం.. అత్యంత దీనం!

సాక్షి ప్రతినిధి, అనంతపురం: అవయవదానం చేసేందుకు దాతలు పెద్దగా ముందుకు రావడం లేదు. అవగాహన లేమే దీనికి ప్రధాన కారణం. రాష్ట్రంలో అవయవ దానం చేసే వారిని వేళ్ల మీద లెక్క పెట్టొచ్చంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. బ్రెయిన్ డెడ్(ఇక బతికే అవకాశం లేని) వారి నుంచి బంధువుల అనుమతితో వివిధ అవయవాలను సేకరించి చావు బతుకుల్లో ఉన్న మరికొందరికి పునర్జన్మనివ్వచ్చు. కానీ ఇందుకు ముందుకురావడం లేదు. 2020, 2021 సంవత్సరాల్లో కరోనా మహమ్మారి కారణంగా దాతల సంఖ్య మరింతగా తగ్గిపోగా, అదే సమయంలో అవయవాలు కావాల్సిన బాధితుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. జీవన్‌దాన్ ట్రస్ట్‌లో పేరు నమోదు చేసుకున్న బాధితులు ప్రస్తుతం 2,615 మంది ఉన్నారు. వీళ్లు కాకుండా రిజిస్టర్ కాని బాధితులు మరెంతో మంది ఉన్నారు. అలాంటి వారిలో కిడ్నీ బాధితులదే సింహభాగం. రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందుతున్న వారు చాలా మంది ఉన్నారు. వీరి నుంచి అవయవాలు సేకరించి జబ్బు బారిన పడ్డ బాధితులకు ఇవ్వొచ్చు.

మహా సంకల్పానికి జన నీరాజనం

సాక్షి, అమరావతి/ సాక్షి నెట్‌వర్క్: ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేత హోదాలో 2017 నవంబర్ 6న ప్రజా సంకల్ప పాదయాత్ర ప్రారంభించి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులు, అభిమానులు ఆదివారం సంబరాలు నిర్వహించారు. ఊరూవాడా దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆ తర్వాత కేక్‌లు కట్ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అప్పట్లో పాదయాత్ర చేపట్టడానికి దారితీసిన పరిస్థితులను వివరిస్తూ.. పాదయాత్రలో ప్రజల సమస్యలు, కష్టాలను దగ్గర నుంచి చూసి.. వాటిని పరిష్కరించడానికి ఇచ్చిన హామీలనే ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరచడం.. అధికారంలోకి వచ్చిన మూడేళ్ల నాలుగు నెలల్లోనే 98 శాతం హామీలను అమలు చేయడాన్ని చాటిచెబుతూ ప్రజాప్రతినిధులు ర్యాలీలు, పాదయాత్రలు నిర్వహించారు. ఈ సందర్భంగా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గృహ నిర్మాణ, సాంఘిక సంక్షేమ శాఖల మంత్రులు జోగి రమేష్, మేరుగు నాగార్జున, పార్టీ కార్యాలయ కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, ఎమ్మెల్యే వాసుబాబు, కార్యకర్తల సమన్వయకర్త పుత్తా ప్రతాపరెడ్డి, నార్త్ అమెరికాలో ఏపీ ప్రభుత్వ ప్రతినిధి పండుగాయల రత్నాకర్ తదితరులు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం కేక్ కట్ చేశారు. పాదయాత్రలో సీఎం వైఎస్ జగన్‌తో పాటు పాల్గొన్న వారికి నూతన వస్త్రాలు అందజేసి, శాలువాలతో సత్కరించారు.



తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న మంత్రులు, ప్రజాప్రతినిధులు, నేతలు

పాదయాత్ర హామీలే ఎన్నికల మేనిఫెస్టోగా..

ఈ సందర్భంగా గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ.. పాదయాత్రలో ఇచ్చిన హామీలనే ఎన్నికల మేనిఫెస్టోగా ప్రకటించిన సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక 98 శాతం హామీలను అమలు చేశారన్నారు. పాదయాత్ర లక్ష్యాలను ప్రతి గడపకూ తీసుకెళ్లారన్నారు. సీఎం వైఎస్ జగన్ సంక్షేమ, అభివృద్ధి పథకాలు, వికేంద్రీకరణతో సుపరిపాలన అందిస్తుండటంతో అన్నివర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన సీఎం వైఎస్ జగన్‌ను ఎదుర్కోలేక కుప్పకూలిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు తన దత్తపుత్రుడు పవన్ కల్యాణ్‌తో కలసి కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు, దత్తపుత్రుడు ఎన్ని కుట్రలు చేసినా రాష్ట్రంలో ప్రజలు నిర్మించిన వైఎస్సార్‌సీపీ కంచుకోటను బద్దలు కొట్టలేరని స్పష్టం చేశారు. సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడుతూ.. చంద్రబాబు నిరంకుశ పాలనను నిరసిస్తూ, ప్రజలకు నేనున్నానంటూ సీఎం వైఎస్ జగన్ చేసిన 3,648 కిమీల పాదయాత్ర చరిత్ర పుటల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సంక్షేమ, అభివృద్ధి పథకాలతోపాటు రాజ్యాధికారంలో సింహభాగం వాటా ఇచ్చి సామాజిక మహావిప్లవాన్ని సీఎం వైఎస్ జగన్ ఆవిష్కరించారని కొనియాడారు. గత ఎన్నికల్లో 151 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ గెలిచిందని.. వచ్చే ఎన్నికల్లో 175 స్థానాల్లో విజయం సాధించడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు.

ఊరూరా వేడుకలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్ర చేపట్టి ఐదేళ్లు గడచిన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు అన్నదాన కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించాయి. ఆయా ప్రాంతాల్లోని పార్టీ కార్యాలయాల్లో పండుగ వాతావరణంలో సంబరాలు చేసుకున్నారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సహనం, కాలం అనేవి అత్యంత శక్తిమంతమైన యోధులు.
- లియో టాల్‌స్టాయ్

సాక్షి

సోమవారం, నవంబర్, 7

అమ్మ మరిచిన పాట

పక్క ఫ్లాట్‌లో పాపాయి పుట్టింది. బుజ్జిగా ఉండుంటుంది. కళ్లు తెగ తెరిచి తల్లిని చూస్తూ ఉండుంటుంది. పాలు సరిపోతుండొచ్చు. గుండెలకు హత్తుకుని ఇచ్చే వెచ్చదనం సరిపోతుండొచ్చు. అయినా సరే కయ్‌మని ఏడుస్తుంది. నేను ఏడుస్తున్నానహో అని చెప్పడానికి ఏడుస్తున్నట్టుంది. నాకేదో కావాలహో అని చెబుతున్నట్టు ఏడుస్తుంటుంది. అమ్మకు పాలికేళ్లుంటాయి. ఎత్తుకుని సముదాయిస్తుంది. అటూ ఇటూ తిప్పుతూ ఊరుకోబెడుతుంది. పాపాయి ఏడుపు ఆపదే! బహుశా అమ్మ పాడాలేమో! యుగాలుగా తల్లులందరూ పసికందుల కోసం మనోహరమైన గాయనులై ఎత్తే గొంతును ఆ తల్లి కూడా ఎత్తాలేమో!

'ఆయి ఆయి ఆయి ఆపదలు కాయీ'.

ఆహా. ఒకప్పుడు ఏ అమ్మయినా ఈ పాట అందుకుంటే పసినోరు ఠక్కున మూతపడేది. గొంతులో లయ ఊయల ఊపుతున్నట్టుండేది. ఏదమ్మా... మళ్లొకసారి పాడు అన్నట్టుగా పాపాయి మెడ కదిలించేది. 'ఆయి ఆయి ఆయీ... ఆపదలు కాయీ'. చిట్టి బంగారు తల్లికి ఏ ఆపదలూ రాకూడదు. ఈ బంగరు బుజ్జాయి బొజ్జ నిండా పాలు తాగి, కంటి నిండా కునుకు తీయాలి. వివశుల్ని చేసే చిర్నవ్వు నిదురలో నవ్వాలి. గుప్పిళ్లు బిగించాలి. ఉత్తుత్తికే ఉలికి పడాలి. అందుకు తల్లి ఏం చేయాలి? పాడాలి.

'ఏడవకు కుశలవుడ రామకుమార... ఏడిస్తె నిన్నెవ్వరెత్తుకుంటారు?' సీతాదేవి పాడకుండా ఉందా? అడవిలో తావు కాని తావులో, లోకుల మధ్య ఇద్దరు కుమారులను కని, వారికి సర్వం తానై, వారు ఒడిలో ఉంటే అదే పెన్నిధిగా భావించి, ఆ కారడవిలో, రాత్రివేళ, ఏనాడైనా దడుపు వల్లో కలత చేతో ఏడిస్తే సీత పాడకుండా ఉందా? 'ఉంగరమ్ములు కొనుచు ఉయ్యాల గొనుచు ఊర్మిళా పినతల్లి వచ్చె ఏడవకు. పట్టు అంగీ గొనుచు పులిగోరు గొనుచు భూదేవి అమ్మమ్మ వచ్చె ఏడవకు'. సీతాదేవి పాడుతున్నదా? పిల్లలకు తన సొద చెప్పుకుంటున్నదా? ఆశను వారిలో సజీవంగా ఉంచుతున్నదా? ఏమో! పాడటం మాత్రం మానలేదు. వాళ్ల నాన్న విన్న పాటను తిరిగి వల్లెవేయక ఉండలేదు. 'రామా లాలీ మేఘ శ్యామా లాలి... తామరస నయన దశరథ తనయా లాలీ'...

తల్లి గొంతు ఎలా ఉంటే ఏమి? బిడ్డ కోసం పాడితే అందులోకి అమృతం వచ్చేస్తుంది. వాత్సల్యపు తేనె తొర్లి పడుతుంది. నా పంచప్రాణాలు నీవే కన్నా అనే భావం మాటలు రాని చిట్టిగుండెకు గట్టిగా చేరుతుంది. పాపాయికి అది కావాలి. పసివాడికి ఆ మాట చెవిన పడాలి. అందుకై చెవి రిక్కిస్తుంది ఒడిలో ఉండే కలువమొగ్గ. 'జో అచ్యుతానంద జోజో ముకుంద.. రార పరమానంద రార గోవింద'... వింటుంటే నిద్రాదేవి బింకం చెదిరేలా లేదూ! అయ్యో తల్లి... నీ బిడ్డను చేరి హాయిగా నిద్ర పుచ్చుతాలే అని బెట్టు తీసి గట్టున పెట్టేట్టు లేదూ!!

శ్రీమంతుల ఇంట్లో వారసుడు పుట్టాడట. సంగీతం వినిపించే ఖరీదైన ఆట వస్తువులు కొంటారు. యూట్యూబ్‌లో జింగిల్స్ వినిపిస్తారు. మధ్యతరగతి ఇంట్లో లక్ష్మీదేవి పుట్టిందట. కొత్త గౌన్లు కొంటారు. బంగరు దండ వేస్తారు. ఏడ్చిన ప్రతిసారీ పాలకే అని భ్రమసి ఎదను నోటికందిస్తారు. పేదవాడి గుడిసెలో ముత్యాలమూట ఒడిలోకొచ్చి పడిందట. ముద్దులు పుణుకుతారు. కంటి మీద రెప్పేయక కాచుకుంటారు. ఏడుస్తూ ఉంటే అగ్గిపెట్టె మీద దరువేసి వినిపిస్తారు. తెలుగు ఉంది మనకు. భాష ఉంది మనకు. రాగం ఉంది, పసికందుల నిదురకై భావం ఉంది మనకు. పాడమని చెప్పారు పెద్దలు పిల్లల కోసం. పాటలు అందించి వెళ్లారు పిల్లల కోసం. తల్లిపాలు పోయి పోత పాలు వచ్చె. లాలిపాట పోయి హోరుపాట వచ్చె. పిల్లలకు తెలుసు ఇది బాగలేదని. అందుకే ఏడుస్తారు. తల్లికి అమ్మమ్మ పాట ఇవ్వలేదు. తల్లి తనకు పుట్టిన బిడ్డకు పాట ఇవ్వబోదు. లాలిపాట అదృశ్యమయ్యే నేలా మనది?

'నిద్ర నీ కన్నులల్లు మబ్బు మొగముల్లు నిద్రకూ నూరేళ్లు నీకు వెయ్యేళ్లు... నిన్ను గన్నయ్యకూ నిండు నూరేళ్లు... జో జో'.... తల్లి బిడ్డతో చేసే తొలి సంభాషణ లాలిపాట. బిడ్డ జీవితంలో సంగీతాన్ని తొలిగా ప్రవేశపెట్టేదే లాలిపాట. శ్రుతి తప్పని జీవితాన్ని కాంక్షించేదే లాలిపాట. ఒంటరితనం మిగిలినప్పుడు పాటను తోడు చేసుకొమ్మని ఉపదేశం చేసేదే లాలిపాట. సర్వం సంగీతమయమైన ఈ జగత్తులో బిడ్డకు స్వాగతం పలికేదే లాలిపాట. కాని తల్లి గొంతు ఫోన్‌లో బిజీ. తల్లి గొంతు ఏదో పని పురమాయింపులో బిజీ. తల్లి గొంతు ఇరుగు పొరుగు పలకరింపుల్లో బిజీ.

బిడ్డ పుడితే చేయవలసిన సాంగేలు అనేకం పోయాయి. బిడ్డ పుడితే హాజరు కావాల్సిన బంధుమిత్రులు ముఖం చూపించలేనంత బిజీగా ఉన్నారు. చీటికి మాటికి వచ్చి ఆ చిట్కా, ఈ విరుగుడు చెప్పే ముసలమ్మలు సొంతింట, పరాయింట కాన రావడం లేదు. దిష్టి చుక్కలు, సాంబ్రాణి ధూపాలు లేవు. గోరువెచ్చని నీళ్లతో కాళ్లన బోర్లించి స్నానం చేయించి ఇచ్చే అమ్మలక్కలు లేరు. సంస్కృతి అంటే ఏమిటి? అది ఏదో మహా విగ్రహాల్లో, అపూర్వ ఉత్సవాల్లో ఉండదు. కుటుంబంలో నిబిడీకృతం అయ్యే చిన్నచిన్న ఆనందాల్లో, ముచ్చట్లలో ఉంటుంది. ముగ్గు, మామిడి తోరణం లేనిది కూడా ఇల్లే. కాని అవి రెండూ ఉన్న ఇల్లు తెలుగుదనపు ఇల్లు.

ఏడుపు ఆపి, పిల్లలు బుల్లి పెదాలు విప్పి, భలే నవ్వాలి. ఇంటింటా బిడ్డ కోసం పాడి తల్లి ఆవులించాలి. 'ఏడవకు ఏడవకు వెర్రి నాగన్న... ఏడిస్తే నీ కళ్లు నీలాలు కారు... నీలాలు కారితే నే చూడలేను... పాలైన కారవే బంగారు కళ్లు...'.

నిజంగా భక్తులేనా? పైకి మాత్రమేనా?

కామెంట్



కరణ్ థాపర్

అంబేడ్కర్‌ను బీజేపీ కానీ, నరేంద్ర మోదీ కానీ విశేషంగా గౌరవిస్తున్నట్లు పైకి కనబడుతోంది. మోదీ అయితే తాను అంబేడ్కర్ భక్తుడిని అని చెప్పుకున్నారు. కానీ బీజేపీ నమ్ముతున్న అనేక కీలక అంశాలు అంబేడ్కర్ చెప్పినదానికి పూర్తి విరుద్ధంగా ఉంటున్నాయి. భారత్‌లో మెజారిటీ వర్గపు భావన పట్ల బీజేపీ నిబద్ధత క్రమంగా పెరుగుతోంది. అలాంటి వైఖరి విధ్వంసకరమైనదని అంబేడ్కర్ విశ్వసించారు. హిందూరాజ్ ఒక వాస్తవంగా మారితే, నిస్సందేహంగా అది ఈ దేశానికి అతిపెద్ద విపత్తు అవుతుందని రాశారు. మైనారిటీల పట్ల వివక్ష ప్రదర్శించకుండా ఉండాల్సిన విధి తమదేనని మెజారిటీ గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. స్వేచ్ఛాయుతమైన, న్యాయబద్ధమైన ఎన్నికలు కొనసాగుతున్నప్పటికీ భారతీయ ప్రజాస్వామ్యం నియంతృత్వంలోకి అడుగుపెడుతుందని కూడా అంబేడ్కర్ ఆనాడే కలవరపడ్డారు. కొత్తగా ఉదయించిన ఈ ప్రజాస్వామ్యం తన రూపాన్ని కొనసాగిస్తూనే వాస్తవానికి నియంతృత్వానికి చోటిచ్చే అవకాశం ఉందని చెప్పారు. అలాంటి ప్రమాదం ఈరోజు కనబడటం లేదా?

నరేంద్ర మోదీ నేతృత్వంలోని భారతీయ జనతా పార్టీ బి.ఆర్. అంబేడ్కర్‌ను ఒక ఆదర్శ మూర్తిగానే కాకుండా, తమ విశిష్ట కథా నాయకుల్లో ఒకరిగా కూడా గౌరవిస్తోంది. 2015లో ప్రధాని మాట్లాడుతూ, బాబాసాహెబ్ అంబేడ్కర్ ఒక సామాజిక వర్గానికి మాత్రమే కాకుండా, యావత్ ప్రపంచానికే స్ఫూర్తిదాయకమని చెప్పారు. 2016లో మరో సందర్భంలో తాను అంబేడ్కర్ భక్తుడిని అని ప్రకటించుకున్నారు. అయితే బీజేపీ విశ్వసిస్తున్న లేక పాటిస్తున్న అనేక కీలక అంశాలు అంబేడ్కర్ చెప్పిన దానికీ, పాటించిన దానికీ పూర్తి విరుద్ధంగా ఉంటున్నాయని కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ అధ్యయనం చేసి ప్రచురించిన 'అంబేడ్కర్: ఎ లైఫ్' వెల్లడించింది.

హిందూయిజం, హిందూ–రాజ్‌పై అంబేడ్కర్, బీజేపీల మధ్య తీవ్రమైన వ్యత్యాసాలు ఉన్నాయని శశి థరూర్ రచన పేర్కొంది. భారత్‌లో మెజారిటీ వర్గపు భావన పట్ల బీజేపీ నిబద్ధత క్రమంగా పెరుగుతోంది. కానీ అలాంటి వైఖరి విధ్వంసకరమైనదని అంబేడ్కర్ ఆనాడు విశ్వసించారు. ''హిందూ రాజ్ ఒక వాస్తవంగా మారితే, నిస్సందేహంగా అది ఈ దేశానికి అతిపెద్ద విపత్తు అవుతుంది'' అని అంబేడ్కర్ రాశారు. ''హిందువులు ఏమైనా చెప్పవచ్చు. కానీ, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలకు హిందూయిజం పెనుముప్పు. ఈ విషయంలో అది ప్రజాస్వామ్యంతో ఏమాత్రం సరిపోలదు. హిందూ-రాజ్‌ని ఏ విధంగానైనా సరే నిరోధించి తీరాలి'' అని అంబేడ్కర్ పేర్కొన్నారు.

వాస్తవానికి అంబేడ్కర్ హిందూయిజాన్ని ఏమాత్రం ఇష్టపడలేదు. హిందూ నాగరికతను మానవజాతిని బానిసత్వంలోకి దింపడానికి పన్నిన క్రూరమైన కుట్రగా ఆయన పేర్కొన్నారు. హిందూయిజానికి సరైన పేరు అపకీర్తి అని మాత్రమే అన్నారాయన. దీన్ని బట్టి హిందువులను కూడా ఆయన ఇష్టపడనట్లే కనిపిస్తుంది. ''హిందువులు... పిదపతనంతో కుంగిపోయి ఉన్నప్పటికీ శక్తిని కోరుకుంటున్న పిగ్మీలు, మరుగుజ్జులకు చెందిన జాతి... హిందువులు మంచిగానో, చెడ్డగానో ఉండవచ్చు కానీ ఉత్తమ హిందువు అంటూ ఎవరూ ఉండరు'' అన్నారు అంబేడ్కర్.

అంబేడ్కర్ భావాల గురించి బీజేపీకి తెలియకుండా ఉంటుందా... లేదా మనం అజ్ఞానులం అనీ, అంబేడ్కర్‌ను మనం కనుగొనలేమనీ అది భావిస్తోందా? లేక తనకు ప్రయోజనకరమైన కారణాలతో అంబేడ్కర్‌ను అది ఉద్దేశపూర్వకంగా కౌగలించుకుంటోందా? అందుకోసమే నిక్కచ్చిగానూ, ఇబ్బందికరంగానూ ఉండే అంబేడ్కర్ భావాల్లో పొడసూపే వ్యత్యాసాలను కూడా బీజేపీ పట్టించుకోకుండా ఉంటోందా?



భారతీయ మైనారిటీలపై అంబేడ్కర్ అభిప్రాయాలను మీరు చూసినట్లయితే, ఈ ప్రశ్నలు మరింతగా ఇబ్బందిపెడతాయి. 1948లో రాజ్యాంగ సభలో అంబేడ్కర్ ప్రసంగిస్తూ, మైనారిటీల పట్ల వివక్ష ప్రదర్శించకుండా ఉండాల్సిన విధి మెజారిటీ పైనే ఉందని స్పష్టంగా చెప్పారు. ''భారతదేశంలోని మైనారిటీలు తమ అస్తిత్వాన్ని మెజారిటీ చేతుల్లో ఉంచడానికి అంగీకరించారు... వారు మెజారిటీ పాలన పట్ల విశ్వాసంతో ఉండటానికి అంగీకరించారు. ఆ మెజారిటీ ప్రాథమికంగా మతపరమైన మెజారిటీనే తప్ప రాజకీయ మెజారిటీ కాదు. మైనారిటీల పట్ల వివక్ష ప్రదర్శించకుండా ఉండాల్సిన విధి తమదేనని మెజారిటీ గుర్తుంచుకోవాలి.''

అలాంటి విధిని, బాధ్యతను ఆమోదించడం అటుంచి దాన్ని బీజేపీ గుర్తిస్తుందా? అంబేడ్కర్ ఎన్నడైనా 'బాబర్ కి ఔలద్', 'అబ్బా జాన్' అనే మాటల్ని ఆమోదించేవారా? 'కబరస్తాన్, శ్మశాన్ ఘాట్' అనే భావనలను ఆయన ఆమోదించేవారా? లేదా ముస్లిం మతస్థులను మొత్తంగా పాకిస్తాన్‌కి పంపించేస్తామనే బెదిరింపులను ఆమోదించేవారా? ఇలా ప్రశ్నించడం ద్వారానే బహుశా ప్రశ్నలకు సమాధానం రాబట్టగలం.

అయితే అంబేడ్కర్ ఆనాడే ఒక హెచ్చరిక చేశారు. 1948 నవంబర్‌లో తాను చేసిన సుప్రసిద్ధ ప్రసంగంలో అత్యంత స్పష్టంగా ఒక విషయాన్ని వెల్లడించారు. ''మైనారిటీలు విస్ఫోటక శక్తి. అది కానీ వెలుపలకు వచ్చిందంటే మొత్తం రాజ్యవ్యవస్థనే పేల్చివేస్తుంది'' అన్నారు. నిజానికి 70 సంవత్సరాల క్రితం మైనారిటీలు చిన్న సంఖ్యలో ఉండేవారు. భయపడుతుండేవారు. తమను నిర్లక్ష్యం చేసినా పెద్దగా పట్టించుకునే వారు కాదు. కానీ ఈరోజు వారి జనాభా 20 కోట్లు. తమను ఎంతగా ఆగౌరవ పరుస్తున్నారో, సమాజం నుంచి ఎంతగా తమను వేరుపరుస్తున్నారో అనే విషయంలో వీరు చైతన్యంతో ఉన్నారు.

అంబేడ్కర్ బతికి ఉంటే ఈరోజు చాలా ఆందోళన చెంది ఉండేవారు. కానీ బీజేపీ ఆయన భయాలను పంచుకునేదా లేక అర్థం చేసుకునేదా? బీజేపీ నిప్పుతో చెలగాటమాడుతోందని అంబేడ్కర్ భావించేవారని మీరు ఊహించగలరా? కానీ బీజేపీ మాత్రం ప్రస్తుతం చాలా ఉల్లాసంగా పని చేసుకుపోతున్నట్లు కనిపిస్తోంది.

భారత్ ఎలాంటి తరహా ప్రజాస్వామిక దేశంగా మారిపోతోందో మీరు గుర్తించినప్పుడు అంబేడ్కర్ భావాలకూ, బీజేపీ ఆచరణకూ మధ్య ఉన్న మరో అంతరం స్పష్టమవుతుంది. స్వేచ్ఛాయుతమైన, న్యాయబద్ధమైన ఎన్నికలు కొనసాగుతున్నప్పటికీ భారతీయ ప్రజాస్వామ్యం నియంతృత్వంలోకి అడుగుపెడుతుందని అంబేడ్కర్ ఆనాడే కలవరపడ్డారు. కొత్తగా ఉదయించిన ఈ ప్రజాస్వామ్యం తన రూపాన్ని కొనసాగిస్తూనే వాస్తవానికి నియంతృత్వానికి చోటిచ్చే అవకాశం ఉందని ఆయన ఆనాడే చెప్పారు. ప్రజామద్దతు ఎంత అధికంగా ఉంటే అంత అధికంగా నియంతృత్వం ఆవిర్భవించే అవకాశం ఉంటుందని అంబేడ్కర్ 1948లోనే హెచ్చరించారు.

అలాంటి ప్రమాదం ఈరోజు జరగడం లేదా? మన రాజకీయాల్లో ప్రస్తుతం ఒక ప్రచండాకృతి ఆధిపత్యం చలాయిస్తోంది. ఆ ప్రచండాకృతి చుట్టూ వ్యక్తి ఆరాధన అల్లుకుపోతోంది. ఎలాంటి అసమ్మతినీ అది సహించడం లేదు. పార్లమెంటును తరచుగా సంప్రదించడం లేదు. ఎన్నికల కమిషన్, న్యాయవ్యవస్థ బలహీన పడిపోయాయి. సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థల కోరలు పెంచారు. మీడియాను నిర్వీర్యం చేసి పడేశారు.

చివరగా, భారతదేశం విషయంలో బీజేపీని, దాని దార్శనికతను అంబేడ్కర్ ఎలా భావించి ఉండేవారో అని నేను ఆశ్చర్యపడుతున్నాను. నరేంద్ర మోదీ తనకు ఒక భక్తుడిగా ఉండటాన్ని చూసి అంబేడ్కర్ నిజంగా గర్వపడేవారా? బీజేపీవారు తన పాదముద్రల పైనే నడుస్తున్నారని అంబేడ్కర్ నమ్మి ఉండేవారా?

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయులు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఇప్పటికి తెలుస్తోంది



'శాంతికి నిజమైన అడ్డంకి పాకిస్తాన్ సైన్యం: అది జిహాదిస్టులకు ఆశ్రయం ఇస్తుంది. ఉదారవాద రాజకీయ నాయకులను భయాందోళనలకు గురిచేస్తుంది' అని పదకొండేళ్ల క్రితం రాశాను. అప్పుడు వచ్చిన దూషణలు ఆశ్చర్యం కలిగించాయి. కానీ ఇప్పుడు రాసివుంటే పరిస్థితులు కొంచెం భిన్నంగా ఉండేవనిపిస్తోంది.

- మీరా సేఠి, పాకిస్తాన్ కథకురాలు

సానుకూల పోరు



ట్రెయిన్‌లో సీటు కోసం ఒక పండిట్‌తో పోట్లాట జరిగింది. జుమా (శుక్రవారం నమాజు) కోసం నేను కుర్తా వేసుకోవడంతో ఆయన నన్ను 'మౌల్వీ' (ఇస్లాం పండితుడు) అనుకున్నారు. పోట్లాట ఇదీ: ఉన్న ఒకే ఖాళీ సీటులో నన్ను కూర్చోమని ఆయనా, ఆయన్ని కూర్చోమని నేనూ! చివరకు ఆ సీటును ఒకావిడకు ఇవ్వడానికి లేచేముందు ఇద్దరం కలిసి కాసేపు కూర్చున్నాం.

- పర్వేజ్ మండీవాలా, డెంటిస్ట్

పేరు వెనక...



మీకు తెలుసా? హైదరాబాద్‌లోని కాచిగూడకు ఆ పేరు 'కాఛీ' సామాజిక వర్గం నుంచి వచ్చింది. సంప్రదాయంగా వీళ్లు గార్డెనింగ్ చేస్తారు. బుందేల్‌ఖండ్ నుంచి వచ్చారు. 1900ల తొలినాళ్లలో నిజాం రాజ్యంలోని ఒక కులంగా వీరు నమోదయ్యారు. నింబోలి అడ్డాలో ఒక కాఛీ కమ్యూనిటీ హాల్ కూడా ఉంది.

- సయ్యద్ అక్బర్, సంపాదకుడు

విధానం మారాలి



ఎవరో రాజకీయ నాయకుడు వెళ్లేందుకు నోయిడా ఎక్స్‌ప్రెస్‌వే మీద చాలాసేపు ట్రాఫిక్ నిలిపేశారు. వాహనాలు బారులుతీరాయి. జనాలకు చిర్రెత్తుకొచ్చింది. ఈ విధానంలో మార్పు రావాలి. రోడ్లను ఫ్రీగా ఉంచడం అనేది కేవలం అంబులెన్సులకు మాత్రమే వర్తింపజేయాలి.

- పారుల్ ఎం. శర్మ, కంటి సర్జన్

'అతిసార' బాధితులకు జీవామృత ప్రదాత

దిలీప్ మహాలనోబిస్ పేరు చాలా తక్కువమంది వినుంటారు. కానీ అక్టోబర్ 16న మరణించిన ఈయన కొన్ని వేల ప్రాణాలు... మరీ ముఖ్యంగా పసిపిల్లల ప్రాణాలు కాపాడటంలో కీలకపాత్ర పోషించాడని తెలిస్తే మాత్రం ప్రజారోగ్య రంగంలో ఓ గొప్ప వైద్యుడిని కోల్పోయామని అనిపించక మానదు. ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్ (ఓఆర్‌ఎస్)ను జనాభా స్థాయిలో ఒక చికిత్సా పద్ధతిగా అందుబాటులోకి తీసుకురావడంలో మహాలనోబిస్‌ది చాలా ముఖ్యమైన పాత్ర. ఈ ఓఆర్‌ఎస్ పుణ్యమా అని అతిసార, కలరా వంటి వ్యాధుల నుంచి వేగంగా కోలుకోగలుగుతున్నారు. ఇలా కొన్ని వేల మంది ప్రాణాలను ఓఆర్‌ఎస్ కాపాడగలిగింది. ఓరల్ రీహైడ్రేషన్ థెరపీ (ఓఆర్‌టీ) అంటే.. నీటికి సూక్ష్మ మోతాదుల్లో చక్కెరలు, లవణాలు కలిపి ఇవ్వడమే. లవణాల్లో ముఖ్యంగా సోడియం, పొటాషియంలు ప్రధానంగా ఉంటాయి. అతిసార వల్ల శరీరంలోని ద్రవాల మోతాదు తగ్గడానికి విరుగుడుగా ఈ ఓఆర్‌ఎస్ పనిచేస్తుంది. ఐక్యరాజ్యసమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు భారత ఉపఖండం అందించిన అతి గొప్ప ఆయుధం ఈ ఓఆర్‌టీ అని 'కరెంట్ సైన్స్' పత్రిక పేర్కొంది.

ఓఆర్‌ఎస్ అందుబాటులోకి వచ్చేంతవరకూ కలరా వంటి వ్యాధుల చికిత్సలో రక్తనాళాల ద్వారా ద్రవాలను శరీరానికి అందించడమే ప్రధానంగా ఉండేది. పొట్టకు విశ్రాంతి కలిగించే పేరుతో కలరా వ్యాధిగ్రస్థులకు ఆహారం ఇచ్చేవారు కాదు. నీళ్లు కూడా కొద్దికొద్దిగా తాగించే వాళ్లు. దీంతో పోష్టికాహార లోపం ముదిరి సమస్య జటిలమయ్యేది. ఓఆర్‌టీ దీనికి పూర్తి విరుద్ధమైనది. 1978–2008 మధ్యకాలంలో ఓఆర్‌టీ వల్ల కోట్లమంది అతిసారతో మరణించకుండా నివారించగలిగామని గణాంకాలు చెబుతున్నాయి.

తీవ్రమైన అతిసార వ్యాధికి చికిత్స చేసేందుకు 1960లలోనే ఓరల్ రీహైడ్రేషన్ థెరపీ అందుబాటులోకి వచ్చింది. అత్యధికుల ప్రాణాలు తీస్తున్న అతిసారకు 'ఓఆర్‌ఎస్' చాలా సులువైన, సమర్థమైన చికిత్స. అయితే అప్పట్లో వైద్యులు చాలామంది దీన్ని ప్రతిఘటించారు. దాదాపు ఈ సమయంలోనే ప్రపంచం కలరా మహమ్మారి గుప్పిట్లో ఉండేది. 1961లో ఇండోనేసియాలో మొదలై 1963కల్లా బంగ్లాదేశ్ (అప్పటి తూర్పు పాకిస్తాన్)కు వ్యాపించి, 1964లో భారత్‌లోకి వచ్చింది. ఓఆర్‌ఎస్‌పై అప్పటికే పరిశోధనలు జరుగుతున్నా ప్రపంచ ఆరోగ్య సంస్థ 1970 నాటికి గానీ ఇంట్రావీనస్ ఫ్లూయిడ్లను భారీ ఎత్తున పంపిణీ చేయడం ద్వారా మేల్కొలేదు. ఈ సమయంలోనే ఢాకా కేంద్రంగా కలరా రీసెర్చ్ లాబొరేటరీ టీకా తయారీకి పరిశోధనలు చేస్తుండేది. దక్షిణాసియాలో ఉన్న అమెరికా సైనికులను కాపాడుకునేందుకు ఈ టీకా ఉపయోగపడుతుందని అనుకునేవారు.

1971లోనే తూర్పు పాకిస్తాన్ కాస్తా బంగ్లాదేశ్‌గా అవతరించింది. అనేక సమస్యల కారణంగా కలరా రీసెర్చ్ లాబొరేటరీ... కలరా టీకాతోపాటు ఓఆర్‌టీ ప్రయోగాలను కూడా తాత్కాలికంగా నిలిపివేసింది. దిలీప్ మహాలనోబిస్ 1966లో కలకత్తాలోని 'జాన్ హాప్కిన్స్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ మెడికల్ రీసెర్చ్ అండ్ ట్రెయినింగ్'లో పని చేస్తూ ఉండేవారు. ఈ సంస్థ ద్వారా కలరా రీసెర్చ్ ప్రోగ్రామ్‌లోనూ పని చేస్తుండేవారు. పశ్చిమ బెంగాల్‌లో సుమారు 3.5 లక్షల మంది బంగ్లాదేశ్ శరణార్థులున్న 'బనగాన్' శిబిరంలో కలరా బాధితులకు చికిత్స అందిస్తుండేవారు. ఒక దశలో అందుబాటులో ఉన్న ఇంట్రా వీనస్ ఫ్లూయిడ్లు పూర్తిగా ఖర్చయి పోయాయి. ఓఆర్‌ఎస్‌ను వాడేందుకు ఇదే తగిన సమయమని మహాలనోబిస్ అనుకున్నారు. అయితే ప్యాకెట్లేవీ అందుబాటులో లేవు. దీంతో వారు చక్కెర, ఉప్పు తీసుకొచ్చి డ్రమ్ముల్లో ద్రావణాన్ని సిద్ధం చేశారు. క్యాంపుల్లో ఉన్న కలరా వ్యాధిగ్రస్థులకు ఇవ్వడం మొదలుపెట్టారు. జాన్ హాప్కిన్స్ ఇన్‌స్టిట్యూట్‌లోని గ్రంథాలయం కాస్తా ఓఆర్‌ఎస్ ఫ్యాక్టరీగా మారింది. అనుమతులున్న చికిత్స పద్ధతి కాకపోవడంతో మహాలనోబిస్ చాలా రిస్క్ చేశారు. రెండు మూడు వారాల్లోనే తమ నిర్ణయం తప్పేమీ కాదని స్పష్టమైంది. ఎందుకంటే ఓఆర్‌ఎస్ ద్రావణాన్ని తీసుకున్న వారికి స్వస్థత చేకూరింది. శిక్షణ పొందిన సిబ్బంది లేకపోయినా కార్యకర్తల ద్వారానే ఈ ఓఆర్‌ఎస్‌ను అందించవచ్చునని అర్థమైంది.

నివాళి



దిలీప్ మహాలనోబిస్


బనగాన్ శిబిరంలో ఓఆర్‌ఎస్ ద్రావణం ఇచ్చిన తరువాత ఏం జరిగిందో విశ్లేషించినప్పుడు మరణాల రేటు గణనీయంగా తగ్గినట్లు స్పష్టమైంది. ఈ తగ్గుదల ఐదు శాతం నుంచి 40 శాతం వరకూ ఉన్నట్లు గుర్తించారు. మహాలనోబిస్ బృందం ఈ ఓఆర్‌ఎస్‌కు 'ఓరల్ సెలైన్' అని పేరు పెట్టింది. ఓఆర్‌ఎస్‌ను తయారు చేసుకునే పద్ధతులను వివరిస్తూ పాంప్లెట్ల ద్వారా సరిహద్దుల్లో పంచిపెట్టారు. ఈ విషయాన్ని అందిపుచ్చుకున్న బంగ్లాదేశ్ రేడియో స్టేషన్ కూడా ఓఆర్‌ఎస్ తయారీ ప్రక్రియ వివరాలను ప్రసారం చేయడం మొదలుపెట్టింది. అయినా చాలా సైన్స్ పత్రికలు మహాలనోబిస్ పరిశోధనా ఫలితాల ప్రచురణకు తిరస్కరించాయి. అయితే ప్రపంచ ఆరోగ్య సంస్థలో అప్పట్లో బ్యాక్టీరియా వ్యాధుల విభాగానికి అధ్యక్షుడిగా ఉన్న ధీమన్ బారువాకు మహాలనోబిస్ సమర్పించిన సమాచారం నమ్మదగిందిగానే అనిపించింది. అదే విషయాన్ని ఆయన ప్రపంచ ఆరోగ్య సంస్థలోనూ వివరించారు. ఫలితంగా 1978లో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఓఆర్‌టీపై ప్రపంచ స్థాయిలో ప్రచారం మొదలుపెట్టింది. మహాలనోబిస్ పనులకు గుర్తింపుగా అదే ఏడాది జూలై 29న 'పోలెన్ పీడియాట్రిక్ రీసెర్చ్ ప్రైజ్'ను అందించారు. ఈ రోజునే ప్రపంచ ఓఆర్‌ఎస్ దినంగా జరుపుకుంటున్నారు. 2006లో 'ప్రిన్స్ మహీడాల్' అవార్డు కూడా మహాలనోబిస్‌కు లభించింది.

ఆయన ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రధాన కార్యాలయంలో అతిసార వ్యాధి నియంత్రణ కార్యక్రమానికి అధ్యక్షుడిగానూ వ్యవహరించారు. 1990లో 'మహాలనోబిస్ సొసైటీ ఫర్ అప్లైడ్ స్టడీస్'ను పశ్చిమ బెంగాల్‌లో ఏర్పాటు చేసి నాణ్యమైన జీవితం, మెరుగైన ఆరోగ్యం అందరికీ అందాలన్న లక్ష్యంతో పనిచేశారు. ముఖ్యంగా తన వారసత్వాన్ని కొనసాగించగల యువ శాస్త్రవేత్తలనూ సిద్ధం చేశారు.

– రజీబ్ దాస్‌గుప్తా, సెంటర్ ఫర్ సోషల్ మెడిసిన్ అండ్ కమ్యూనిటీ హెల్త్, జేఎన్‌యూ, ఢిల్లీ

జాగ్రత్తలు పాటించాల్సిందే!

సందర్భం



కేబీ గోపాలం

రెండు సంవత్సరాల పాటు కరోనా మహమ్మారి దెబ్బకు బతుకులు దయనీయంగా మారిన తీరు అందరికీ జ్ఞాపకం ఉంది. కొన్నాళ్లపాటు లాక్‌డౌన్ పేరున అందరూ తలుపులు పెట్టుకుని ఇళ్లలోనే బందీలు అయిన సంగతి వెంటాడుతూనే ఉన్నది. అయినా చాలా మంది మూతికి మాస్కులు పెట్టుకోవాలి అన్న సంగతి మరచిపోయారు. గుంపులు గుంపులుగా చేరడం గురించి ఎవరూ భయపడడం లేదు. చేతులు, పరిసరాలను శానిటైజ్ చేసుకోవడమూ తగ్గిపోయింది. బహుశా కోవిడ్ కేసులు బాగా తగ్గిపోవడం వల్లనే చాలామంది ఇలా కనీస జాగ్రత్తలు తీసుకోకుండా తిరుగుతున్నట్టున్నారు. అయితే కోవిడ్ పీడ ఇంతటితో విరగడైందని భావించరాదు. మహమ్మారి మరోసారి విజృంభించడానికి సిద్ధమవుతోందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

'సైన్స్' పత్రికలో గ్రెచెన్ ఫోగెల్ అనే పరిశోధకుడు ఈ మధ్యనే ఒక పరిశోధన పత్రం వెలువరించాడు. మరొక పెద్ద కోవిడ్ వేవ్ రానున్నదని ఆ పత్రంలో ఆయన ప్రకటించాడు. కోవిడ్ గురించి బాగా పట్టించుకున్న వాళ్లకు ఒమిక్రాన్ అన్న పేరు జ్ఞాపకం ఉంటుంది. సార్స్ కోవ్ 2 అనే వైరస్ వల్ల కోవిడ్ వచ్చిందని తెలుసు. ఆ వైరస్‌లో జన్యు మార్పులు జరిగి కొత్త రకాలు వచ్చినట్టు కూడా తెలుసు. అందులో చివరిది ఒమిక్రాన్. అది కూడా మళ్లీ ఒకసారి మార్పులకు గురైందట. ఫలితంగా వచ్చిన మరో కొత్త రకానికి రోగనిరోధక వ్యవస్థ నుంచి తప్పుకునే బలం ఎక్కువగా ఉందట. అటువంటి రకాలు ఒకటి కన్నా ఎక్కువే వచ్చే అవకాశం ఉంది అంటున్నారు పరిశోధకులు.



చలికాలం ముంచుకు వస్తున్నది. అప్పటికల్లా ఈ కొత్త రకాలు తలెత్తవచ్చు అంటున్నారు. ప్రపంచం మొత్తం మీద కొత్త కోవిడ్ కేసులు బాగా తరిగిన మాట వాస్తవమే. కానీ చైనా, యూరప్‌లలో అవి మళ్లీ తలెత్తుతున్నాయి. యూరప్‌లో వచ్చిన కేసులను బాగా పరిశీలించారు. అక్కడ రెండు రకాల వైరస్‌లు కనిపించాయి. అవి రెండూ యాంటీ బాడీస్ నుంచి తప్పించుకునే బలం గలవని కూడా తెలిసింది. టీకా వేయించుకున్న వారికీ, అంతకుముందు వ్యాధి వచ్చి తగ్గిన వారికి కూడా ఈ కొత్త వైరస్ రకాల వల్ల వ్యాధి మళ్లీ వచ్చే అవకాశం ఉంది. అమెరికా లాంటి దేశాలలో ఎక్కువ వైరస్ రకాల మీద పనిచేయగల వ్యాక్సిన్లను ఇచ్చారు. మన దగ్గర ఆ పరిస్థితి లేదు. కరోనా వైరస్ ఎక్కడ వచ్చినా ప్రపంచమంతటా వ్యాపించడానికి అవకాశాలు ఉన్న సంగతి తెలిసిందే. 'సైన్స్' వ్యాసంలో వ్యాధి ముందుగా అమెరికా, యూరప్‌లలో కనిపిస్తుంది అని వివరించారు.

కరోనా వైరస్ కనిపించకుండా పోయింది, ఇక వచ్చే అవకాశం లేదు అని చాలామంది భ్రమలో ఉన్నారు. కానీ ఈ కొత్తరకం వైరస్‌లు త్వరలోనే ప్రపంచాన్ని మళ్లీ గడగడలాడించనున్నాయని మరికొన్ని పత్రికలు కూడా రాశాయి. కొత్త వేవ్‌ను తట్టుకునేందుకు ఏం చేయాలనే సంగతులపైనా పరిశోధనలు మొదలయ్యాయి. ప్రస్తుతం బీఏ 2.75.2, బీక్యూ 2.1 అనే స్ట్రెయిన్లు కొత్తగా కనిపిస్తున్నాయి.

మనిషిలోని రోగనిరోధక శక్తిని ఎదుర్కొనే బలం ఈ రెంటిలోనూ ఇంతకు ముందు వచ్చిన అన్నిరకాల కంటే ఎక్కువగా ఉందని అంటున్నారు పరిశోధకులు. ఇందులో బీక్యూ 2.1 రకం త్వరగా వ్యాపిస్తుంది కూడా! త్వరలోనే ఇది ప్రపంచమంతటా ఉత్పాతం కలిగించనుందనేది పరిశోధకుల అభిప్రాయం. ఈ చలి కాలంలో వైరస్ గనుక వచ్చిందంటే దానితో పోరాడడానికి అన్ని రకాలా మనం సిద్ధంగా ఉండాలి అని వారు హెచ్చరిస్తున్నారు. వ్యాధి వచ్చినప్పుడు తొందరగా ఏదో చేయాలని టీకాలు వేశారు తప్పిస్తే, ఎక్కువ కాలం ఆ వ్యాక్సిన్లు పనిచేసే తీరును గురించి పరిశీలించడానికి అవకాశం దొరకలేదు. ఇప్పుడు ఆ దిశలోనూ శోధన జరగాలి.

శాస్త్రవేత్తలు జనాన్ని భయపెట్టడం కోసం ఇటువంటి హెచ్చరికలు చేయడం లేదు. రానున్న ముప్పు గురించి ముందుగానే జాగరూకులను చేయడం వారి విధి. జాగ్రత్తగా ఉండటం మన బాధ్యత. మన అజాగ్రత్త మరో మృత్యుహేలను సృష్టిస్తుందనేది అందరూ గుర్తించాలి.

వ్యాసకర్త అనువాదకుడు, రచయిత

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, తిథి: శు.చతుర్దశి ప.3.48 వరకు, తదుపరి పౌర్ణమి, నక్షత్రం: అశ్వని రా.1.02 వరకు, తదుపరి భరణి, వర్జ్యం: రా.8.56 నుండి 10.34 వరకు, దుర్ముహూర్తం: ప.12.06 నుండి 12.52 వరకు, తదుపరి ప.2.23 నుండి 3.08 వరకు, అమృతఘడియలు: సా.5.43 నుండి 7.21 వరకు, కార్తీక పౌర్ణమి: రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు, యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు: సూర్యోదయం 6.04 : సూర్యాస్తమయం 5.24.

క్లుప్తంగా

చేతిరాత బాలేదని విద్యార్థిని చితకబాదిన టీచర్


ఆస్పత్రిలో విద్యార్థి హరీష్

పలమనేరు: చేతిరాత బాలేదని విద్యార్థిని టీచర్ చితకబాదిన ఘటన చిత్తూరు జిల్లా పలమనేరులో శనివారం జరగ్గా ఆదివారం వెలుగు చూసింది. గుడియాత్తం రోడ్డులోని శ్రీచైతన్య టెక్నో పాఠశాలలో హరీష్ ఏడో తరగతి చదువుతున్నాడు. అతడి చేతిరాత బాగోలేదని శివ అనే టీచర్ ఆగ్రహించి హరీష్ చేయిని నులితిప్పి చితకబాదాడు. తీవ్రమైన నొప్పితో ఇంటికి చేరిన హరీష్‌ను అతడి తల్లిదండ్రులు ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. పలు పరీక్షలు నిర్వహించి హరీష్ భుజం ఎముక పక్కకు తొలగినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై తల్లిదండ్రులు విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు హరీష్ తండ్రి నాగరాజు తెలిపారు.

9న ఉక్కు పోరాట కమిటీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

ఉక్కునగరం: ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 9న బైక్ ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ నెల 11, 12 తేదీల్లో విశాఖలో ప్రధాని మోదీ పర్యటిస్తున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నట్లు ప్రధాని ప్రకటించాలని పోరాట కమిటీ డిమాండ్ చేస్తోంది. నిరసనల్లో భాగంగా ఉక్కునగరం, నిర్వాసిత కాలనీల్లో బైక్ ర్యాలీ చేపట్టనున్నారు. దీనికనుగుణంగా కమిటీలు ఏర్పాటు చేసి అన్ని విభాగాల్లో కార్మికులను సమాయత్తం చేస్తున్నామని పోరాట కమిటీ తెలిపింది.

సెల్‌ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు చోరీ

కడప శివార్లలో కంటైనర్‌ను వదిలేసిన దొంగలు

కడప అర్బన్: ఓ కంటైనర్ నుంచి రూ.కోటి విలువైన సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను చోరీచేసి దానిని వదిలేసి వెళ్లిపోయిన దుండగుల ఉదంతం వైఎస్సార్ జిల్లా కేంద్రం కడపలో చోటుచేసుకుంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఉదంతానికి సంబంధించిన వివరాలిలా వున్నాయి.. కడప నగర శివార్లలోని దేవుని కడప ఆర్చి సమీపంలో ఉన్న పెట్రోల్ బంక్ వద్ద ఓ కంటైనర్ (హెచ్‌ఆర్ 38వై 3224)ను పదిరోజుల క్రితం కొందరు వదిలేసి వెళ్లారు. నిజానికి.. న్యూఢిల్లీ నుంచి చెన్నైకి వెళ్లాల్సిన ఈ కంటైనర్ ముంబై, హైదరాబాద్, దువ్వూరు, నెల్లూరు మీదుగా చెన్నై చేరుకోవాల్సి వుంది. ఈ కంటైనర్‌లో ఎంతో విలువైన సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను భద్రపరిచి, కోడింగ్‌తో లాక్ చేసి మరీ నిర్వాహకులు ఎంతో పకడ్బందీగా పంపించారు. కానీ, ఈ కంటైనర్‌లోని రూ.కోటి విలువైన సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను నిందితులు హైదరాబాద్–దువ్వూరు మార్గమధ్యంలో అపహరించారు. కంటైనర్ సకాలంలో చేరకపోయేసరికి నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు హైదరాబాద్–దువ్వూరు మధ్యలో సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేపట్టి కడప శివార్లలో కంటైనర్‌ను కనుగొన్నారు. కొందరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ఈ చోరీలో కంటైనర్ డ్రైవర్ ప్రమేయం ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఈ సంఘటనపై కడప డీఎస్పీ బి. వెంకటశివారెడ్డిని వివరణ కోరగా.. చోరీ జరిగిన విషయం వాస్తవమేనని, సోమవారం సాయంత్రానికి పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు.

వేటగాళ్ల తూటాకు చిరుత బలి

- దాని గోర్లు విక్రయించేందుకు యత్నం
- నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్న అటవీశాఖ అధికారులు


చిరుతను వేటాడాక ఫొటో దిగిన మధు

చిత్తూరు : వేటగాళ్ల తూటాకు చిరుత బలైన ఘటన యాదమరి, గుడిపాల మండలాల సరిహద్దు అటవీ ప్రాంతాల్లో జరిగింది. తమిళనాడు సరిహద్దులో యాదమరి, గుడిపాల మండలాలున్నాయి. చిత్తూరు రూరల్‌లోని తప్పాతపల్లెకు చెందిన మధు, యాదమరి మండలం డీకే చెరువుకు చెందిన గంగాధర్, గొందివాళ్ల ఊరుకు చెందిన రుద్ర, గుడిపాల మండలం చుక్కావారిపల్లెకు చెందిన బోసు.. స్నేహితులు. రాత్రి వేళల్లో అడవి జంతువులను వేటాడటం వారి వృత్తి. రెండు మూడు నెలల కిందట సరిహద్దు మండలాల్లో చిరుత ఉన్నట్టు గుర్తించిన వేటగాళ్లు ఉచ్చులు వేశారు. కానీ ఉచ్చులకు చిరుత చిక్కకపోవడంతో నాటు తుపాకీతో కాల్చి చంపారు. చనిపోయిన చిరుతతో ఫొటోలు కూడా దిగారు. చిరుత గోర్లు ఇళ్లకు తీసుకెళ్లి విక్రయించేందుకు ప్రయత్నించారు. అయితే ఈ విషయం అటవీశాఖ అధికారులకు తెలియడంతో నలుగురు వేటగాళ్లను అదుపులోకి తీసుకుని, విచారిస్తున్నారు. ఇప్పటి వరకు ఎన్ని జంతువులను వేటాడారు.. వాటి మాంసాన్ని ఎక్కడెక్కడ విక్రయించారని ఆరా తీస్తున్నారు. అలాగే చిరుతకు సంబంధించిన గోర్లు, ఎముకలను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. దీనిపై ఎఫ్‌వో చైతన్యకుమార్‌ను వివరణ కోరగా త్వరలోనే వేటగాళ్ల అరెస్ట్ చూపుతామని తెలిపారు.

వెదురు.. పోషకాల సిరులు



పర్యావరణ పరిరక్షణకు ఎంతగానో దోహదం చేసే వెదురు నిలువెల్లా పోషకాలతో మానవాళికి ఆరోగ్య సిరులనూ అందిస్తోందని పరిశోధనల్లో తేలింది. ఇతర వృక్ష జాతుల కంటే 35 శాతం అధికంగా ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేసే ఈ పచ్చ బంగారం దీర్ఘకాలిక రోగుల పాలిట ఆరోగ్య ప్రదాయినిగా మారుతోందని వెల్లడైంది. అరుదుగా దొరికే వెదురు బియ్యంతో పాటు టీ పౌడర్ వంటి ఉత్పత్తులు ఆన్‌లైన్ మార్కెట్‌లో అందుబాటులో ఉండగా.. ఇతర ఉత్పత్తులు అటవీ ప్రాంతాల్లో విరివిగా లభిస్తున్నాయి.

- సాక్షి, అమరావతి

- వెన్ను, కీళ్ల నొప్పుల్ని తగ్గించే వెదురు బియ్యం
- మధుమేహం, కొలెస్ట్రాల్ తగ్గుతాయని అధ్యయనాల్లో వెల్లడి
- వెదురు పిలకలు, చిగుళ్లు, రెమ్మలతో వంటకాలు.. ఊరగాయలు
- ఆకుల నుంచి టీపొడి



వెదురు బియ్యం చాలా రుచి



వెదురు బియ్యం చాలా అరుదుగా లభిస్తాయి. మా ఇంట్లో అప్పుడప్పుడూ ఈ బియ్యం వాడుతుంటాం. ఆన్‌లైన్ మార్కెట్‌లో లభిస్తున్నాయి. రుచికరంగా ఉంటాయి. మధుమేహ రోగులకు ఎంతో మేలు చేస్తాయి. మైదాన ప్రాంతాల్లో వెదురు విస్తరణను ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నందున భవిష్యత్‌లో వెదురు ఉత్పత్తులు విరివిగా దొరికే అవకాశం ఉంది.

– తమ్మినేని రాఘవేంద్ర, డైరెక్టర్, ఏపీ మేదరి కార్పొరేషన్

20 హెక్టార్లలో వెదురు సాగు చేస్తున్నా



నేను ఏజెన్సీ ప్రాంతంలో 20 హెక్టార్లలో వెదురు సాగు చేస్తున్నా. ఏజెన్సీ సంతల్లో వెదురు బియ్యం దొరుకుతాయి. వెదురు పిలకలు, చిగుళ్లు, రెమ్మలతో చేసే వంటకాలు చాలా రుచికరంగా ఉంటాయి. – నారాయణ, రైతు, పాడేరు

50 ఏళ్లకు వెదురు బియ్యం



వెదురు మొక్కకు 50 ఏళ్లు నిండాక కంకులు వేసి (పుష్పించి).. వాటిలోంచి ధాన్యం మాదిరిగా వెదురు వడ్లు కాస్తాయి. వాటి నుంచి వెదురు బియ్యాన్ని సేకరిస్తారు. అంటే.. ఒక్కో వెదురు చెట్టు 50 ఏళ్ల వయసులో ఒకసారి మాత్రమే 1–2 కిలోల బియ్యం వరకు ఇస్తుంది. ఈ బియ్యంతో అన్నం, పాయసం, పొంగలి వంటి వంటకాలు చేసుకోవచ్చు. వీటిని వినియోగించడం వల్ల వెన్నునొప్పి, కీళ్ల నొప్పులతో పాటు శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గిస్తుందని అధ్యయనాల్లో వెల్లడైంది. వీటిలో తక్కువగా ఉండే గ్లెసైమిక్ ఇండెక్స్ మధుమేహాన్ని అదుపులో ఉంచుతుంది. అధికంగా ఉండే ఐరన్, ఫాస్పరస్ వంటి మూలకాలు గుండెకు మేలు చేస్తాయి. రక్తపోటును నియంత్రిస్తాయి. ఈ బియ్యంలో కాల్షియం, భాస్వరం, ఇనుము, వీటిలో మాంసకృత్తులు, విటమిన్ బీ–6, పీచు పదార్థాలు అధికంగా ఉంటాయి. ఇవి ఎముకల్ని దృఢంగా ఉంచడంలో సహాయపడతాయి. మన రాష్ట్రంలో బుట్టాయగూడెం, పోలవరం, అరకు, పాడేరు, సీలేరు, నల్లమల అటవీ ప్రాంతాల్లో వెదురు బియ్యం దొరుకుతుంటాయి. ఆదివాసీల నుంచి సేకరించే వెదురు బియ్యాన్ని ఆన్‌లైన్ ద్వారా ఈ–కామర్స్ సంస్థలు వినియోగదారులకు విక్రయిస్తున్నాయి.

రెమ్మ రెమ్మకో రోగం దూరం

వెదురు రెమ్మలు ఇటీవలి కాలంలో బాగా ప్రాచుర్యం పొందాయి. వెదురు మొలకలు (వెదురు దుంప నుంచి మొలకెత్తేవి), రెమ్మలు, చిటారు కొమ్మన కనిపించే చిగుళ్లతో వివిధ వంటకాలను తయారు చేసుకోవచ్చు. వీటిని నేరుగానూ తినేయొచ్చు. ఇటీవల కాలంలో సూప్‌లలో వీటిని ఎక్కువగా వినియోగిస్తున్నారు. తాజా పిలకలు, చిగుళ్లతో ఊరగాయలు తయారు చేస్తున్నారు. వెదురు రెమ్మల్ని తింటే గుండె జబ్బులకు దూరంగా ఉండొచ్చని కార్డియాలజిస్టులు సైతం సిఫార్సు చేస్తున్నారు. వీటిలో క్యాన్సర్ నిరోధక, యాంటీ బయాటిక్, యాంటీ వైరల్ లక్షణాలు ఉన్నాయని పలు అధ్యయనాల్లో వెల్లడైంది. ధమనులను శుభ్రం చేయడం, చెడు కొలెస్ట్రాల్‌ను కరిగించడంలో సహాయపడతాయి.

వీటి పిలకలతో ఊబకాయం దూరం



వెదురు పిలకలు, చిగుళ్లతో చేసిన వంటకాలను తినడం ద్వారా ఊబకాయానికి దూరంగా ఉండొచ్చని చెబుతున్నారు. వర్షకాలంలో ప్రతి మొక్కకు 4 నుంచి 10 పిలకల వరకు వస్తాయి. వెదురు పిలకలను ఉడికించి వంటల్లో ఉపయోగిస్తారు. కొన్ని ప్రాంతాల్లో 2–3 రోజుల పాటు నానబెట్టి పచ్చడి చేస్తారు. మరికొన్ని ప్రాంతాల్లో ఊరగాయగా వాడుతుంటారు. పిలకల్లో పిండి పదార్థాలు, ప్రొటీన్లతో పాటు కాపర్, ఐరన్, పాస్పరస్, పొటాషియం వంటి మూలకాలు, రిబోఫ్లేవిన్, విటమిన్ ఏ, కే, ఈ, బీ–6 పుష్కలంగా ఉంటాయి. వీటిలో లభించే పైటోస్టెరాల్స్, పైటో న్యూట్రియంట్స్ కొలెస్ట్రాల్‌ను తగ్గించి గుండెకు ఆరోగ్యాన్నిస్తాయి.

వెదురు ఉప్పు.. బహుప్రియం సుమీ!



వెదురు ఉప్పు కొరియాలో ఎక్కువగా వాడతారు. అందుకే దీన్ని కొరియన్ సాల్ట్ అని పిలుస్తారు. మూడేళ్ల వయసున్న వెదురును సేకరించి.. వాటిని సమానంగా కత్తిరించి.. అందులో సముద్రపు ఉప్పు నింపి బాగా కాలుస్తారు. ఈ క్రమంలో వెదురు నుంచి వెలువడిన ద్రవాలు ఉప్పుతో కలుస్తాయి. ఇలా తొమ్మిదిసార్లు చేస్తే ఉప్పు ఊదా రంగులోకి మారుతుంది. అందుకే దీన్ని 'పర్పుల్ సాల్ట్' అని కూడా పిలుస్తుంటారు. ప్రపంచంలో అత్యంత ఖరీదైన లవణాలలో ఇదొకటి. దీని ధర పావు కిలో రూ.8 వేలపై మాటే. వంటంతా అయ్యాక.. చివరగా ఫినిషింగ్ సాల్ట్‌గా వాడే వెదురు ఉప్పులో క్యాన్సర్‌ను నిరోధించే గుణాలూ ఉన్నాయంటారు. చర్మ, దంత సౌందర్యానికి ఉపకరిస్తుంది. వెదురు(లేత) కొమ్మలను పౌడర్ రూపంలో మార్చి వంటకాల్లో వాడుతుంటారు.

శ్రీకాళహస్తి ఆలయ పైకప్పు లీకేజీపై పరీక్షలు


పనులను పర్యవేక్షిస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం పైభాగంలో లీకేజీల నివారణకు ఆదివారం తిరుపతి ఐఐటీ నిపుణులు పరీక్షలు చేశారు. తిరుపతి ఐఐటీ ప్రొఫెసర్ ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో సాంకేతిక సిబ్బంది ఆలయం పైభాగాన్ని పరిశీలించి నమూనాలు సేకరించారు. గతంలో డ్రిల్లింగ్ చేసిన చోట పురాతన కట్టడాల నిర్మాణంలో వినియోగించే పదార్థాల మిశ్రమంతో తయారు చేసిన రసాయనాన్ని వేశారు. పదిరోజుల తర్వాత ఈ రసాయనం ఎంత వరకు వ్యాపించి లీకేజీని అరికడుతుందనేది అంచనా వేస్తారు. అనంతరం మూడు లేయర్ల కాంక్రీటును తొలగించి పాతసున్నపు శ్లాబుపై మిశ్రమ రసాయనం పూత వేయనున్నారు. ఈ పని చేయాలంటే మంచి ఎండలు ఉండాలని ఐఐటీ నిపుణులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ పురాతనమైన శ్రీ కాళహస్తీశ్వరాలయంలో లీకేజీ సమస్యగా మారిందన్నారు. గతంలో చేసిన పనుల వల్ల లీకేజీని అరికట్టకపోగా, మరింత ఆందోళనకరంగా మారిందన్నారు. ఐఐటీ నిపుణుల సహకారంతో ఆధునిక, పురాతన పద్ధతులను మేళవించి పూర్తిస్థాయిలో లీకేజీని అరికట్టే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఈవో సాగర్‌బాబు మాట్లాడుతూ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల తర్వాత లీకేజీలకు మరమ్మతు పనులు పూర్తి చేస్తామన్నారు. డీఈ మురళీధర్, ఏఈ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

'వందే భారత్'లో త్వరలో స్లీపర్ కోచ్‌లు

- రైల్వే శాఖ నిర్ణయం

సాక్షి, అమరావతి: ప్రతిష్టాత్మక 'వందే భారత్' ఎక్స్‌ప్రెస్ రైళ్లలో స్లీపర్ కోచ్‌లను త్వరలో ప్రవేశపెట్టాలని రైల్వే శాఖ నిర్ణయించింది. దేశంలో రెండో అతి వేగంగా ప్రయాణించే రైలు అయిన ఈ ఎక్స్‌ప్రెస్‌లో ప్రస్తుతం చెయిర్ కార్ కోచ్‌లే ఉన్నాయి. పూర్తిగా ఏసీ కోచ్‌లు ఉన్న 16 వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లను రైల్వే శాఖ దేశంలో ప్రవేశపెట్టింది. పూర్తిగా ఏసీ చెయిర్ కార్ కోచ్‌లే ఉన్న ఈ రైళ్లకు ప్రయాణికుల నుంచి ఆదరణ లభిస్తోంది. స్లీపర్ కోచ్‌లు లేకపోవడంపై ప్రయాణికుల నుంచి ప్రతికూల స్పందన కూడా వ్యక్తమవుతోంది. దీన్ని గుర్తించిన రైల్వే శాఖ.. చైర్ కార్ కోచ్‌లతో పాటు స్లీపర్ కోచ్‌లనూ అందుబాటులోకి తేవాలని నిర్ణయించింది. స్లీపర్ కోచ్‌లతో ఉన్న ఒక్కో వందే భారత్ నిర్మాణానికి రూ.113 కోట్లతో టెండర్లు ఖరారు చేసింది. ఆ మేరకు మొత్తం 400 రైళ్ల కోసం ప్రభుత్వ రంగ సంస్థ 'భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్‌ఈఎల్)'తో పాటు ఏడు సంస్థలకు కాంట్రాక్టును ఇచ్చింది. 2023లో 18 రైళ్లు, 2024లో 24 రైళ్లు, 2025లో 30 రైళ్లను ప్రవేశపెట్టనుంది. అనంతరం ఏటా 30 కొత్త రైళ్లను ప్రవేశపెట్టాలని రైల్వే శాఖ నిర్ణయించింది.

బాబుకు పరాభవం తప్పదు

770వ రోజు రిలే దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి నేతలు

తాడికొండ : ప్రజా ఉద్యమానికి ఎదురెళితే బాబు అండ్ కోకు పరాభవం తప్పదని బహుజన పరిరక్షణ సమితి నేతలు హెచ్చరించారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 770వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షల్లో ఆదివారం పలువురు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. 60 మంది లేని అమరావతి అరసవెల్లి యాత్ర ముగిసిందని, కేవలం రైతులతోనే ఉద్యమం నిర్వహించాలని కోర్టు ఆదేశిస్తే.. యాత్ర ముగించి ఎందుకు పారిపోయారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజల్లో లేని ఉద్యమాన్ని రెచ్చగొట్టేందుకు అరువు పార్టీలకు ప్యాకేజీలిచ్చి దొంగ ఉద్యమం చేయిస్తున్న చంద్రబాబుకు పతనం తప్పదన్నారు. కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నేతలు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పులి దాసు, పల్లె బాబు తదితరులు పాల్గొన్నారు.

8న 11 గంటల పాటు శ్రీవారి ఆలయం మూసివేత

తిరుమల: చంద్ర గ్రహణం కారణంగా నవంబర్ 8న ఉదయం 8.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు శ్రీవారి ఆలయ తలుపులు మూసి ఉంచుతారు. ఈ కారణంగా 8న బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది. దీంతో 7న ఎలాంటి సిఫార్సు లేఖలు స్వీకరించబోమని టీటీడీ తెలిపింది. మంగళవారం మధ్యాహ్నం 2.39 గంటల నుంచి సాయంత్రం 6.27 గంటల వరకు చంద్రగ్రహణం ఉంటుంది. ఈ కారణంగా 8న శ్రీవాణి,రూ.300 దర్శన టికెట్లను టీటీడీ రద్దు చేసింది. రాత్రి 7.30 గంటలకు ఆలయ తలుపులు తెరిచి శుద్ధి చేసి సర్వదర్శనానికి అనుమతిస్తారు.

భక్తజనరంజకంగా 'బాలకాండ'

ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమల నాదనీరాజనం వేదికపై ఆదివారం 13వ విడత బాలకాండ అఖండ పారాయణం జరిగింది. శ్రీ హనుమత్ సమేత సీతా రామలక్ష్మణుల ఉత్సవమూర్తుల సమక్షంలో బాలకాండలోని 61 నుంచి 65 సర్గల వరకు ఉన్న 137 శ్లోకాలను, యోగవాసిష్ఠం– ధన్వంతరి మహామంత్రంలోని 25 శ్లోకాలనూ పారాయణం చేశారు. వేద పండితులు అఖండ పారాయణం చేయగా పలువురు భక్తులు వారిని అనుసరించి శ్లోక పారాయణం చేశారు.


బాలకాండ పారాయణంలో వేదాలను ఆలపిస్తున్న వేద పండితులు

సర్వ దర్శనానికి 38 గంటలు

తిరుమలలో 31 క్యూ కంపార్ట్‌మెంట్లు నిండి ఉన్నాయి. సర్వదర్శనానికి 38 గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 3 గంటలు పడుతోంది. శనివారం అర్ధరాత్రి వరకు 82,604 మంది శ్రీవారిని దర్శించుకున్నారు. 37,025 మంది తలనీలాలు సమర్పించారు. హుండీలో రూ.5.57 కోట్లు వేశారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

శ్రీవారిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.రాజేశ్వరరావు, తెలంగాణ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఏపీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, పెద్దారెడ్డి, ఎమ్మెల్సీ భరత్, ఎంపీ బ్రహ్మానందరెడ్డి, తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవి సతీమణి లక్ష్మి రవి దర్శించుకున్నారు.

కాణిపాకంలో 2 రోజుల పాటు ఆర్జిత సేవల రద్దు

కాణిపాకం (యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో 2 రోజులపాటు ఆర్జిత సేవలు, అభిషేకాలను రద్దు చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో రాణాప్రతాప్ తెలిపారు. ఆదివారం ఆలయ సమావేశపు మందిరంలో వీరు విలేకరులతో మాట్లాడారు. సోమవారం స్వామి వారికి అన్నాభిషేకం సందర్భంగా ఆర్జిత సేవలను రద్దు చేసినట్లు చెప్పారు. అలాగే, మంగళవారం చంద్ర గ్రహణం సందర్భంగా ఆలయాన్ని ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మూసి వేస్తుండటంతో ఆర్జిత సేవలు, అభిషేకాలు రద్దు చేసినట్లు వివరించారు. 9వ తేది నుంచి ఆర్జిత సేవలు, అభిషేకాలు యథావిధిగా ఉంటాయన్నారు.

1,940 గ్రామాల్లో రీ సర్వే పూర్తి

- ఆ గ్రామాల్లో నంబర్ 13 నోటిఫికేషన్లు జారీ
- సర్వేలో వచ్చిన 18,387 వినతుల్లో 18,277 పరిష్కారం
- 3,258 గ్రామాలకు డ్రోన్ ఛాయాచిత్రాలు విడుదల
- అనుకున్న దానికంటె వేగంగా భూముల రీ సర్వే

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ జగనన్న శాశ్వత భూరక్ష, శాశ్వత భూహక్కు పేరుతో ప్రతిష్టాత్మకంగా చేస్తున్న భూముల రీ సర్వే 1,940 గ్రామాల్లో పూర్తయింది. ఈ గ్రామాల్లో 17 లక్షల 25 వేల 690 ఎకరాలను పూర్తిగా కొలిచి సర్వే పూర్తిచేశారు. ఆ గ్రామాల్లో సర్వే పూర్తికి సంబంధించిన నంబర్ 13 నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. ఈ గ్రామాలకు కొత్త రెవెన్యూ రికార్డులు అందుబాటులోకి రానున్నాయి. శ్రీకాకుళం జిల్లాలో అత్యధికంగా 351 గ్రామాల్లో రీ సర్వే పూర్తిచేశారు. విజయనగరం జిల్లాలో 181, అనకాపల్లిలో 143, చిత్తూరులో 125, కాకినాడలో 121, నెల్లూరు జిల్లాలో 118 గ్రామాల్లో భూముల కొలత పూర్తయింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో అతి తక్కువగా రెండుగ్రామాల్లో మాత్రమే సర్వే పూర్తి చేయగలిగారు. ఆ జిల్లాలో వ్యవసాయ భూములు కొండలు, గుట్టల్లో ఉండడం, మొబైల్ సిగ్నల్స్ అందకపోవడంతో డ్రోన్ల ద్వారా సర్వేచేయడం ఇబ్బందికరంగా మారింది. అందుకే అక్కడ త్వరలో డీజీపీఎస్ సర్వే చేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. గుంటూరు జిల్లాలో ఐదుగ్రామాలు, నంద్యాల జిల్లాలో 11, ఎన్టీఆర్ జిల్లాలో 14, పశ్చిమగోదావరి జిల్లాలో 16 గ్రామాల్లో మాత్రమే సర్వే పూర్తయింది. ఇక్కడా డీజీపీఎస్, ఏరియల్ సర్వేకి ఏర్పాట్లు చేస్తున్నారు.

త్వరలో 1,329 గ్రామాల్లో పూర్తికానున్న సర్వే

త్వరలో మరో 1,329 గ్రామాల్లో రీ సర్వే పూర్తికానుంది. కొద్దిరోజుల్లోనే ఈ గ్రామాలకు సంబంధించిన 13 నంబర్ నోటిఫికేషన్లు జారీచేయనున్నారు. రీ సర్వేకి సంబంధించి రైతులు, భూయజమానుల నుంచి 18,387 వినతులు, అభ్యంతరాలు వచ్చాయి. వాటిలో 18,277 వినతులను మొబైల్ మేజిస్ట్రేట్ బృందాలు పరిష్కరించాయి. ఇప్పటివరకు 6,533 గ్రామాల్లో డ్రోన్‌సర్వే పూర్తయింది. అందులో 3,258 గ్రామాలకు సంబంధించి అభివృద్ధి చేసిన డ్రోన్ ఛాయాచిత్రాలను సర్వే బృందాలకు అందించారు. వాటి ఆధారంగా 2,273 గ్రామాల్లో క్షేత్రస్థాయి నిజనిర్ధారణ (గ్రౌండ్ ట్రూతింగ్) పూర్తయింది. 2,022 గ్రామాల్లో గ్రౌండ్ వ్యాలిడేషన్ (హద్దుల నిర్ధారణ) పూర్తిచేశారు. విభాగాల వారీగా రీ సర్వేను అనుకున్న దానికంటె వేగంగా నిర్వహిస్తున్నట్లు సర్వే, సెటిల్మెంట్ అధికారులు చెబుతున్నారు.

నేటి భవితలో..

- ఎస్ఎస్‌సీ జాబ్స్: పదో తరగతితోనే కానిస్టేబుల్ కొలువు

స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ).. కేంద్ర సాయుధ దళాలు, ఇతర భద్రత విభాగాల్లో.. 24,369 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.
పదో తరగతి అర్హతతోనే వీటికి పోటీపడొచ్చు. ప్రారంభంలోనే నెలకు రూ.40వేల వరకూ వేతనం అందుకోవచ్చు! ఈ నేపథ్యంలో.. ఎస్ఎస్‌సీ కానిస్టేబుల్ నోటిఫికేషన్, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు, విజయానికి ప్రిపరేషన్ గైడెన్స్..

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం– కరెంట్ అఫైర్స్:

జాతీయం,అంతర్జాతీయం,రాష్ట్రీయం,వర్తమాన అంశాలు, క్రీడలు, వార్తల్లో వ్యక్తులు తదితర వివరాలతో వీక్లీ కరెంట్ అఫైర్స్ రౌండ్ అప్.

- విద్య, ఉద్యోగ సమాచారం

నేటి భవిత పేజీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

సీజేఐ 'వీడ్కోలు విచారణ' లైవ్



సాక్షి, న్యూఢిల్లీ: భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ యు.యు.లలిత్ నేతృత్వంలోని ప్రధాన ధర్మాసనం జరిపే చివరి సారి విచారణ ప్రత్యక్ష ప్రసారం కానుంది. జస్టిస్ లలిత్ మంగళవారం పదవీ విరమణ చేయనున్నారు. గురునానక్ జయంతి సందర్భంగా ఆ రోజు సుప్రీంకోర్టుకు సెలవుదినం. ఈ నేపథ్యంలో జస్టిస్ లలిత్, కాబోయే సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, న్యాయమూర్తి జస్టిస్ బేలా ఎం.త్రివేదీలతో కూడిన ధర్మాసనం సోమవారం జరిపే లాంఛన విచారణను తమ వెబ్‌సైట్లో లైవ్ స్ట్రీమింగ్ చేయాలని కోర్టు నిర్ణయించింది. రిటైరయ్యే సీజేఐ చివరి విచారణను తన వారసునితో కలిసి చేపట్టడం ఆనవాయితీ. కేంద్ర ప్రభుత్వోద్యోగాలు, విద్యా సంస్థల ప్రవేశాల్లో ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించడంపై దాఖలైన పిటిషన్లపై సీజేఐ ధర్మాసనం సోమవారం తీర్పు వెలువరించనుంది. ఆగస్టు 26న సీజేఐగా రిటైరైన జస్టిస్ ఎన్.వి.రమణ చివరి రోజు చేపట్టిన విచారణను తొలిసారిగా కోర్టు లైవ్ స్ట్రీమ్ చేసింది.

హిందూ ప్రధానిగా గర్విస్తున్నా

నా ఎన్నిక భిన్నత్వానికి నిదర్శనం



లండన్: బ్రిటన్ మొట్టమొదటి హిందూ ప్రధాని అయినందుకు గర్వపడుతున్నానని భారత సంతతికి చెందిన రిషి సునాక్ అన్నారు. ప్రధాని పగ్గాలు చేపట్టిన తర్వాత తొలిసారిగా ఒక ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన మనసులో భావాల్ని పంచుకున్నారు. ప్రధానిగా తాను ఎన్నికవడం బ్రిటన్‌లో భిన్నత్వానికి నిలువెత్తు నిదర్శనమని వ్యాఖ్యానించారు.యూకేకి 42 ఏళ్ల వయసులోనే ప్రధాని అయిన రిషి సునాక్ ఏదైనా ముఖ్య కార్యక్రమం చేయడానికి ముందు గోమాతకి పూజ చేస్తారు. దీపావళి పండుగని ఘనంగా జరుపుకుంటారు. ''ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు డౌనింగ్ స్ట్రీట్‌లో దీపావళి పండుగకి దివ్వెలు వెలిగించాను. అలా చెయ్యగలగడం మన దేశం ఎంత అద్భుతమైనదో చాటి చెప్పింది. అదే సమయంలో అదో పెద్ద విషయం కాదన్న అంశాన్ని కూడా చెప్పింది.' అని సునాక్ అన్నారు. ప్రధాని ఎన్నిక సమయంలో బోరిస్ జాన్సన్ ప్రధాని కావడానికి వీలుగా తాను పోటీ నుంచి తప్పుకుంటానని జరిగిన ప్రచారాన్ని తోసిపుచ్చారు. ''పార్లమెంటులో నా సహచర ఎంపీల నుంచి నాకు గట్టి మద్దతు ఉంది. దేశం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయి ఉన్న సమయంలో ప్రధానిగా నేనే సరైన వ్యక్తినని గట్టిగా నమ్మాను. రేసు నుంచి తప్పుకోవాలన్న ఆలోచన నాకు ఎప్పుడూ రాలేదు'' అని సునాక్ స్పష్టం చేశారు.

పుతిన్ నోట హిరోషిమా మాట!

యూరప్ దేశాధినేతల్లో కలవరం



మాస్కో: రెండో ప్రపంచ యుద్ధ కాలంలో హిరోషిమా, నాగసాకిలపై అణుబాంబులు వేసిన ఉదంతం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నోటి వెంట రావడం యూరప్ దేశాల గుండెల్లో గుబులు రేపుతోంది. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌తో ఫోన్ సంభాషణలోనే ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం విశేషం! ''యుద్ధం గెలిచేందుకు పెద్ద నగరాలపై బాంబులు వేయాల్సిన అవసరం లేదు. రెండో ప్రపంచ యుద్ధమే ఇందుకు ఉదాహరణ'' అంటూ జపాన్‌లోని హిరోషిమా, నాగసాకిలపై దాడులను పుతిన్ ఉటంకించారు. చరిత్రలో తొలిసారిగా 1945 ఆగస్టు 6న హిరోషిమాపై, 9న నాగసాకిపై అమెరికా అణుబాంబులు వేయడం, ఆ దెబ్బకు జపాన్ తక్షణం ఓటమి అంగీకరించి లొంగిపోవడం తెలిసిందే. ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని ముగించేందుకు పుతిన్ కూడా అలాంటి ఆలోచనే చేస్తున్నట్టు యూరప్ దేశాధినేతలు అనుమానిస్తున్నారు. తీవ్రస్థాయి రేడియో ధార్మికతను వెదజల్లే డర్టీ బాంబులను ఉక్రెయిన్ తమపై వేయజూస్తోందని రష్యా ఆరోపిస్తుండటం, తామూ అదే పని చేయాల్సొస్తుందంటూ బెదిరిస్తుండటం వేడిని పెంచుతోంది.

క్లుప్తంగా...

మహిళలకు ప్రత్యేకం

హిమాచల్ ప్రదేశ్‌లో బీజేపీ మేనిఫెస్టో విడుదల

సిమ్లా: హిమాచల్ ప్రదేశ్ ఎన్నికల్లో అన్ని వర్గాలపై వరాలు కురిపిస్తూ భారతీయ జనతా పార్టీ మేనిఫెస్టో విడుదల చేసింది. హిందుత్వ, అభివృద్ధి, సంక్షేమం సమ్మిళితంగా రూపొందించింది. మహిళలకు ప్రత్యేకంగా మేనిఫెస్టో రూపొందించారు. తాము అధికారంలోకి వస్తే ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)ని అమలు , మహిళలకు విద్యా వ్యవస్థలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో 33% కోటా, సమాజంలో వివిధ వర్గాల సాధికారత సాధించేలా చర్యలు తీసుకుంటామన్న హామీలతో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా మేనిఫెస్టో విడుదల చేశారు. తన సొంత రాష్ట్రమైన హిమాచల్ ప్రదేశ్‌లో గెలుపు కోసం మేనిఫెస్టోపై నడ్డా ప్రత్యేక దృష్టి సారించారు. 8 లక్షల ఉద్యోగాలు కల్పన, ఆరు నుంచి 12వ తరగతి చదివే బాలికలకు సైకిళ్లు, ఉన్నత విద్య చదివే అమ్మాయిలకు స్కూటర్లు అందిస్తామని, కొత్తగా అయిదు మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేస్తామని మేనిఫెస్టోలో హామీ ఇచ్చారు.

కట్ కాపీ పేస్ట్ మేనిఫెస్టో : కాంగ్రెస్ విమర్శ

బీజేపీ ఎన్నికల మేనిఫెస్టో తమ పార్టీ నుంచి కట్ కాపీ పేస్ట్‌గా మార్చిందని కాంగ్రెస్ మండిపడింది. గత ఎన్నికల్లో హామీలను, ఈ సారి మేనిఫెస్టోని కలగలిపేసి తమ మేనిఫెస్టోను విడుదల చేసిందని హిమాచల్ ప్రదేశ్ కాంగ్రెస్ ఎన్నికల ఇన్‌చార్జ్ రాజీవ్ శుక్లా విమర్శించారు. గత ఎన్నికల హామీలను నెరవేర్చని పార్టీ ఈ సారి హామీలను ఎలా నెరవేరుస్తారని శుక్లా ప్రశ్నించారు.

గుజరాత్ సర్కార్‌పై కాంగ్రెస్ చార్జిషీట్

అహ్మదాబాద్: డిసెంబర్‌లో జరగనున్న అసెంబ్లీ ఎన్నిక నేపథ్యంలోగుజరాత్‌లోని బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలపై 22 అంశాలతో కూడిన చార్జిషీట్‌ను కాంగ్రెస్ విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేకి అనీ, ఆకలి, భయం, నిరంకుశ పాలన మాత్రమే సగటు గుజరాతీకి దక్కాయని అందులో ఆరోపించింది. ఇటీవల 135 ప్రాణాలను బలి తీసుకున్న మోర్బి ఘటన, బిల్కిస్ బానో కేసులో నిందితుల విడుదల వంటి అంశాలను చార్జిషీటులో ప్రస్తావించింది. బీజేపీ హయాంలో గత మూడు దశాబ్దాలుగా ప్రజా వ్యతిరేక, అస్తవ్యస్త పాలన రాష్ట్రంలో కొనసాగుతోందని విమర్శించింది. మహాత్మాగాంధీ, సర్దార్ పటేల్‌ల గుజరాత్‌లో మళ్లీ గర్వించే ప్రభుత్వం ఏర్పడేలా తమకు ఓటేయాలని ప్రజలను కోరింది. ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల దృష్టిని మరల్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నందునే చార్జిషీట్‌ను విడుదల చేసినట్లు కాంగ్రెస్ సీనియర్ నేత భరత్‌సిన్హ్ సోలంకి ఆదివారం మీడియాకు తెలిపారు.

గనిలో 9 రోజులు... కాఫీ పొడితో బతికారు

సియోల్: దక్షిణ కొరియాలో ఓ గనిలో చిక్కుబడ్డ ఇద్దరు కార్మికులు ఏకంగా 9 రోజుల పాటు కేవలం కాఫీ పొడి తింటూ ప్రాణాలు కాపాడుకున్నారు. చివరికి శుక్రవారం రాత్రి సహాయక సిబ్బంది వారిని సురక్షితంగా బయటికి తీసుకొచ్చారు. ఇది నిజంగా నమ్మశక్యం కాని అద్భుతమేనని అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ అన్నారు. వారి వయసు 62, 56 ఏళ్లు కావడం విశేషం. అక్టోబర్ 26న గని కుప్పకూలడంతో ఏకంగా 620 అడుగుల లోతున చిక్కుబడిపోయారు. ''ధైర్యం కోల్పోలేదు. మా దగ్గర 30 ఇన్‌స్టంట్ కాఫీ స్టిక్స్ ఉన్నాయి. అవి తింటూ గుహ పై భాగం నుంచి కారే నీటితో దాహం తీర్చుకుంటూ గడిపాం'' అంటూ తమ అనుభవాలను వివరించారు.

జామకాయ దొంగిలించాడేమోనని... దళితున్ని కొట్టి చంపారు

లఖ్‌నవూ: తోటలోంచి జాంపండు దొంగిలించాడనే అనుమానంతో ఓ దళిత యువకున్ని విచక్షణారహితంగా కొట్టిచంపిన అనుమాష ఘటన యూపీలోని అలీగఢ్ జిల్లాలో శనివారం జరిగింది. ఓం ప్రకాశ్ అనే ఆ యువకుడు అడవి నుంచి తిరిగొస్తూ జాంపళ్ల తోట వద్ద కింద పడున్న పండును తీసుకున్నాడు. దాన్ని దొంగిలించాడనే అనుమానంతో తోట యజమానులు భీంసేన్, భన్వారీ లాఠీలు, ఇతర భారీ వస్తువులతో స్పృహ తప్పేదాకా అతన్ని చితకబాదారు. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయాడు. నిందితులిద్దరినీ అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు.

'ఏ' అంటే ఆదివాసీలు

- వారి ఆశీస్సులతో ప్రచారం ప్రారంభించడం అదృష్టం: మోదీ
- ఆ గుజరాత్, మై బనావ్యూ చే.. ప్రధానమంత్రి కొత్త నినాదం



మోదీ అభివాదం

అహ్మదాబాద్: ''నాకు 'ఏ' అంటే ఆదివాసీలు. వారి ఆశీస్సులతో గుజరాత్‌లో ఎన్నికల ప్రచారం ప్రారంభించడం అదృష్టంగా, గౌరవంగా భావిస్తున్నా. ఆదివాసీలు నివసించే ప్రాంతాల్లో గతంలో డాక్టర్ల కోసం వెతుక్కోవాల్సి వచ్చేది. ఇప్పుడు ఆసుపత్రులు, వైద్య కళాశాలలు ఏర్పాటవుతున్నాయి'' అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. సొంత రాష్ట్రం గుజరాత్‌లోని వల్సాద్ జిల్లా కప్రాడా తాలూకా నానా పోంధా గ్రామంలో ఆదివారం ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత రాష్ట్రంలో ఆయన ప్రచారంలో పాల్గొనడం ఇదే మొదటిసారి. ఆ గుజరాత్, మై బనావ్యూ చే(ఈ గుజరాత్‌ను నేను తయారు చేశా) అనే కొత్త నినాదానికి మోదీ శ్రీకారం చుట్టారు. ప్రసంగం మధ్యలో ప్రజలతో పలుమార్లు ఈ నినాదాన్ని పలికించారు. రెక్కల కష్టంతో గుజరాత్‌ను తాము తయారు చేశామని ప్రజలంతా భావిస్తున్నారని వెల్లడించారు. ప్రతి ఒక్కరి హృదయం నుంచి వస్తున్న ప్రతి శబ్దం 'ఆ గుజరాత్, మై బనావ్యూ చే' అని చెబుతోందన్నారు. రాష్ట్రంలో బీజేపీని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని నిర్ణయించుకున్నారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ రికార్డు మెజార్టీతో నెగ్గబోతున్నట్లు తనకు సమాచారం అందిందని, పాత రికార్డులను బద్దలు కొట్టడానికే తాను ఇక్కడికి వచ్చానని ఉద్ఘాటించారు. ముఖ్యమంత్రిగా నరేంద్ర మోదీ సాధించిన రికార్డుల కంటే భూపేంద్ర పటేల్(గుజరాత్ సీఎం) రికార్డులు బలంగా ఉండాలని తాను కోరుకుంటున్నానని వివరించారు. రాష్ట్ర ప్రజల కోసం చాలినంత సమయం కేటాయిస్తానన్నారు.

రాష్ట్ర ప్రగతి స్ఫూర్తిదాయకం

ప్రజాసేవ అనేది గుజరాత్ సంప్రదాయం, సంస్కృతిలో ఒక భాగమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ఆదివాసీలు, ఇతర వర్గాలు కలిసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. గుజరాత్ ప్రగతిని స్ఫూర్తిగా తీసుకొని దేశ ప్రగతి కోసం కృషి చేస్తున్నామని చెప్పారు. తాను ఢిల్లీలో ఉన్నప్పటికీ గుజరాత్ నుంచి కొత్త విషయాలు నేర్చుకుంటూ ఉంటానని తెలిపారు. తన తర్వాత ఇక్కడ ముఖ్యమంత్రులు పనిచేసిన వారంతా అభివృద్ధి కోసం శ్రమించారని ప్రశంసించారు.

దుష్టశక్తులకు పరాజయమే

సమాజంలో విద్వేషాలను రెచ్చగొట్టేవారికి ప్రజలు కచ్చితంగా బుద్ధి చెబుతారని మోదీ అన్నారు. గుజరాత్‌ను అప్రతిష్టపాలు చేస్తున్న దుష్టశక్తులకు రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం తప్పదని చెప్పారు. అలాంటి శక్తులు రాష్ట్రం నుంచి తుడిచిపెట్టుకుపోవడం ఖాయమని స్పష్టం చేశారు.



విశ్వనాథునికి కార్తీక శోభ

వారణాసిలో దేవ దీపావళి(కార్తీక పూర్ణిమ)ని పురస్కరించుకుని ఆదివారం కాశీ విశ్వనాథ ఆలయం ద్వారం వద్ద వేలాది ప్రమిదలను వెలిగించిన దృశ్యం

భూమాత రక్షణకు భుజం కలిపి...

ఈజిప్ట్‌లో 'కాప్-27' ప్రారంభం

- నేడు, రేపు విస్తృతస్థాయిలో సంప్రదింపులు
- వాతావరణ మార్పులు, దుష్పరిణామాలపై చర్చలు
- కీలక ఒప్పందాలు కుదిరే అవకాశం

షెర్మ్-ఎల్-షేక్(ఈజిప్ట్): ప్రపంచాన్ని బెంబేలెత్తిస్తున్న వాతావరణ మార్పులు, ఉక్రెయిన్-రష్యా యుద్ధం, ఆకాశాన్నంటుతున్న ద్రవ్యోల్బణం, ఆహారం, ఇంధన కొరత వంటి ప్రతికూల పరిణామాల నడుమ భాగస్వామ్యపక్షాల సదస్సు (కాప్-27) ఆదివారం ప్రారంభమయ్యింది. ఈజిప్ట్‌లోని ఎర్ర సముద్ర తీరప్రాంత నగరం షెర్మ్-ఎల్-షేక్ ఇందుకు వేదికగా మారింది. ప్రపంచదేశాల నుంచి వందలాది మంది ప్రతినిధులు హాజరయ్యారు. వాతావరణ మార్పులు, దుష్పరిణామాలు, నియంత్రణ చర్యలు, గత ఒప్పందాల అమలు తీరుపై రెండు రోజులపాటు విస్తృతంగా చర్చించనున్నారు. కాప్-27లో భాగంగా ఈ నెల 7, 8న జరిగే సమావేశాలకు పలు దేశాల అధినేతలు హాజరుకానున్నారు. వాతావరణ మార్పుల నియంత్రణే లక్ష్యంగా గతంలో కాప్ సదస్సులు జరిగాయి. అయితే, ఆశించిన లక్ష్యాలేవీ నెరవేరలేదు. అగ్ర దేశాల సహాయ నిరాకరణే ఇందుకు కారణం. తాజా సదస్సులో ఏం తేలుస్తారన్నది ఆసక్తికరంగా మారింది. కీలక ఒప్పందాలు కుదిరే అవకాశం ఉంది.

తరానికి ఒకసారి వచ్చే అవకాశం

వాతావరణ మార్పులు భూగోళంపై సమస్త జీవజాలానికి విసురుతున్న పెను సవాళ్లపై ఐక్యరాజ్యసమితికి చెందిన 'ఇంటర్ గవర్నమెంటల్ ప్యానెల్ ఆన్ క్లైమేట్ ఛేంజ్' చైర్మన్ హోయిసంగ్ లీ ఆందోళన వ్యక్తం చేశారు. కాప్-27లో ఆయన ప్రారంభోపన్యాసం చేశారు. భూతాపాన్ని ఎదుర్కొనేందుకు అన్ని దేశాలు సన్నద్ధం కావాలని, హరితగృహ(గ్రీన్ హౌజ్) వాయువుల ఉద్గారాన్ని తక్షణమే తగ్గించుకోవాలని పిలుపునిచ్చారు. మన జీవితాలను, మన భూగ్రహాన్ని కాపాడుకొనేందుకు తరానికి ఒకసారి వచ్చే అవకాశం ఇదేనని చెప్పారు.

ఇంకెన్ని హెచ్చరికలు కావాలి?

గత ఏడాది గ్లాస్గోలో జరిగిన కాప్ సదస్సులో నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించడంలో ప్రపంచదేశాలు చెప్పుకోదగ్గ పురోగతి సాధించాయని కాప్-26 అధ్యక్షుడు, బ్రిటిష్ రాజకీయవేత్త అలోక్ శర్మ తెలిపారు. కర్బన ఉద్గారాల నియంత్రణపై మరిన్ని లక్ష్యాలను ఏర్పర్చుకోవడం, 2015 పారిస్ ఒప్పందంలోని నిబంధనలను ఖరారు చేయడం, బొగ్గు వినియోగాన్ని దశలవారీగా తగ్గించుకోవడం వంటివి ఈ లక్ష్యాల్లో ఉన్నాయని తెలిపారు. ఉష్ణోగ్రత పెరుగుదలను 1.5 డిగ్రీలకు (2.7 ఫారన్‌హీట్) పరిమితం చేయాలన్న ఆశయాన్ని కొనసాగించాలని కోరారు. పారిస్ ఒప్పందంలో ఇదే అత్యంత కీలక లక్ష్యమని గుర్తుచేశారు. ఉష్ణోగ్రత పెరుగుదలను కచ్చితంగా నియంత్రించాలని, దీన్ని పారిశ్రామిక విప్లవం నాటికంటే ముందున్న ఉష్ణోగ్రతకు తీసుకురావాలన్నారు. అయితే, ఈ దిశగా సాగుతున్న ప్రయత్నాలకు కొన్ని బడా దేశాలు తూట్లు పొడుస్తున్నాయని అలోక్ శర్మ తీవ్రంగా ఆక్షేపించారు. ఉక్రెయిన్‌పై రష్యా అధ్యక్షుడు పుతిన్ దండయాత్ర వల్ల అంతర్జాతీయంగా సంక్షోభాలు పుట్టుకొచ్చాయని గుర్తుచేశారు. పలు దేశాలు అప్పుల్లో కూరుకుపోతున్నాయని వాపోయారు. ఒకే సమయంలో ఒకటి కంటే ఎక్కువ అంశాలపై దృష్టి పెట్టేలా సామర్థ్యం పెంచుకోవాలన్నారు. మాటలు కట్టిబెట్టి కార్యాచరణలోకి దిగాలన్నారు. ప్రపంచ దేశాల అధినేతలకు ప్రపంచ నుంచి ఇంకా ఎన్ని మేల్కొలుపులు, హెచ్చరికలు అవసరం? అని అలోక్ శర్మ ప్రశ్నించారు. సదస్సులో యూఎన్ క్లైమేట్ చీఫ్ సైమన్ స్టియిల్ మాట్లాడారు. పారిస్ ఒప్పందంలోని లక్ష్యాలను సాధించడానికి అన్ని ప్రయత్నాలు సాగిస్తున్నామని ఆతిథ్య దేశమైన ఈజిప్ట్ విదేశాంగ మంత్రి సమేహ్ షౌక్రీ చెప్పారు. కాప్-27 అధ్యక్షుడిగా షౌక్రీ బాధ్యతలు చేపట్టనున్నారు. ఇక ప్రతిజ్ఞల దశ నుంచి క్షేత్రస్థాయిలో కార్యాచరణ దిశగా ముందుకెళ్లాలని ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దెల్ ఫతా ఎల్-సిసీ పిలుపునిచ్చారు.



కాప్ సదస్సుకు హాజరైన ప్రతినిధులు. ప్రసంగిస్తున్న యూఎన్ క్లైమేట్ చీఫ్ సైమన్ స్టియిల్

2015-2022.. ఎనిమిదేళ్లు అత్యంత వేడి

న్యూఢిల్లీ: పారిశ్రామిక విప్లవం (1850-1900) కంటే ముందునాటి సగటు ఉష్ణోగ్రత కంటే 2022లో అంతర్జాతీయంగా ఉష్ణోగ్రత 1.15 డిగ్రీల సెల్సియస్ అధికంగా ఉండనుందని ప్రపంచ వాతావరణ సంస్థ(డబ్ల్యూఎంఓ) వెల్లడించింది. ఫలితంగా 2015 నుంచి 2022 దాకా.. ఎనిమిదేళ్లు 'అత్యంత వేడి' సంవత్సరాలుగా రికార్డుకెక్కుతాయని తెలియజేసింది. ఈజిప్ట్‌లో జరుగుతున్న కాప్-27 సదస్సు సందర్భంగా ఆదివారం ఈ మేరకు ఒక నివేదిక విడుదల చేసింది. 1993 నుంచి ఇప్పటిదాకా సముద్ర నీటి మట్టం రేటు రెండింతలు పెరిగిందని వెల్లడించింది. 2022 సంవత్సరం ఐదు లేదా ఆరో అత్యంత వేడి సంవత్సరంగా రికార్డులో చేరుతుందని ప్రపంచ వాతావరణ సంస్థ వివరించింది.

జిన్‌పింగ్, నరేంద్ర మోదీ లేకుండానా?

కాప్-27 సదస్సులో 120కి పైగా దేశాల నేతలు, ప్రతినిధులు పాల్గొంటారని ఈజిప్ట్ ప్రభుత్వం ప్రకటించింది. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ హాజరు కానున్నారు. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరవుతారా? లేదా? అనేది ఇంకా నిర్ధారణ కాలేదు. కర్బన ఉద్గారాల విషయంలో పెద్ద దేశాలైన చైనా, భారత్ అధినేతలు లేకుండా కాప్-27 సదస్సులో కుదిరే ఒప్పందాలపై నిపుణులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, కాప్ సదస్సు వేదిక వద్ద నిరసన తెలిపేందుకు ప్రయత్నించిన మానవ హక్కుల సంస్థల ప్రతినిధులను పోలీసులు అడ్డుకున్నారు. నిరసనలకు దిగిన వారిని అరెస్టు చేశారని న్యూయార్క్‌కు చెందిన 'హ్యూమన్ రైట్స్ వాచ్' ఆరోపించింది. నిరసనకారులపై ఆంక్షలు ఎత్తివేయాలని కోరింది.

ఏడింట్లో నాలుగు బీజేపీకి...

ఉప ఎన్నికల ఫలితాలు వెల్లడి

న్యూఢిల్లీ: ఈ నెల 3వ తేదీన ఉప ఎన్నికలు జరిగిన ఆరు రాష్ట్రాల్లోని ఏడు అసెంబ్లీ స్థానాల ఫలితాలు ఆదివారం వెల్లడయ్యాయి. ఇందులో నాలుగు బీజేపీ గెలుచుకోగా, ఆర్‌జేడీ, శివసేన ఠాక్రే వర్గం, టీఆర్ఎస్ తలొకటి దక్కించుకున్నాయి. యూపీలోని గోలా గోరఖ్‌నాథ్ స్థానాన్ని బీజేపీ నిలబెట్టుకుంది. పార్టీకి చెందిన అమన్ గిరి సమీప ప్రత్యర్థి, సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థిని 34 వేల ఓట్ల తేడాతో ఓడించారు. బిహార్‌లోని గోపాల్‌గంజ్‌లో బీజేపీకి చెందిన కుసుమ్ దేవి సమీప ప్రత్యర్థి ఆర్‌జేడీకి చెందిన మోహన్ గుప్తాపై 68 వేల పైచిలుకు ఓట్ల మెజారిటీ సాధించారు. ఇదే రాష్ట్రంలోని మొకామాలో ఆర్‌జేడీ అభ్యర్థిని నీలం దేవి 16వేల ఓట్ల మెజారిటీ గెలిచారు. ఒడిశాలోని ధామ్‌నగర్‌లో బీజేడీకి చెందిన అవంతిదాస్‌పై బీజేపీ అభ్యర్థి సూర్యవంశీ సూరజ్ 4,845 ఓట్ల మెజారిటీ సాధించారు. తెలంగాణలోని మునుగోడు నుంచి టీఆర్ఎస్‌కు చెందిన కె.ప్రభాకర్‌రెడ్డి గెలిచారు. ముంబైలోని అంధేరి (వెస్ట్)నియోజకవర్గం నుంచి శివసేన ఉద్ధవ్ ఠాక్రే వర్గానికి చెందిన రుతుజా లట్కే విజయం సాధించారు. ఎమ్మెల్యే రమేశ్ లట్కే గత మృతి చెందడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. రమేశ్ భార్య రుతుజకు పోటీగా బీజేపీ సహా ప్రధానపార్టీలు అభ్యర్థిని నిలబెట్టలేదు. రెండో స్థానంలో 14.79 శాతం మంది నోటాకు ఓటేశారు.

భజన్‌లాల్ మనవడి విజయం

హరియాణాలోని ఆదంపూర్‌లో బీజేపీకి చెందిన భవ్య బిష్ణోయ్ తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్‌కు చెందిన జై ప్రకాశ్‌పై 16 వేల మెజారిటీ సాధించారు. మాజీ సీఎం భజన్‌లాల్ కుటుంబానికి 1968 నుంచి ఇక్కడ వరుస విజయాలు సాధిస్తూ వస్తోంది. భజన్‌లాల్ 9 సార్లు, ఆయన భార్య ఒక పర్యాయం, కుమారుడు కుల్దీప్ బిష్ణోయ్ 4 సార్లు ఇక్కడ విజయం సాధించారు. భజన్‌లాల్ మనవడే భవ్య బిష్ణోయ్. కుల్దీప్ బిష్ణోయ్ ఆగస్టులో కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడంతో ఇక్కడ ఉప ఎన్నిక నిర్వహించారు.



ధామ్‌నగర్ నియోజకవర్గంలో బీజేపీ శ్రేణుల సంబరం

టాంజానియాలో కూలిన విమానం..19 మంది మృతి



టాంజానియాలో విమానం కూలి 19 మంది చనిపోయారు. ప్రెషిసన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం 43 మంది ప్రయాణికులతో దారెస్సలాం నుంచి బుకోబాకు బయలుదేరింది. సాంకేతిక లోపం తలెత్తి బుకోబా ఎయిర్‌పోర్టు పక్కనే ఉన్న గ్రేట్ విక్టోరియా జలాశయంలో పడిపోయింది.

రెబెల్ సవాల్

హిమాచల్ ప్రదేశ్‌లో బీజేపీ, కాంగ్రెస్‌లకు అదే సమస్య

- బీజేపీకి 20, కాంగ్రెస్‌కు 12 స్థానాల్లో రెబెల్స్ బెడద

హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన పార్టీలకు రెబెల్స్ బెడద అతి పెద్ద తలనొప్పిగా మారింది. రాష్ట్రంలో నియోజకవర్గాలు చిన్నవి. గెలుపు మార్జిన్‌లు కూడా తక్కువే. దీంతో ప్రతీ ఓటు కీలకమే. అందుకే ఎప్పుడు ఎన్నికలు జరిగినా పార్టీల గెలుపోటముల్ని నిర్దేశించే స్థాయిలో రెబెల్స్ ఉంటున్నారు.


హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తూ ఉండడంతో బీజేపీ, కాంగ్రెస్‌లు రెబెల్స్‌ను ఎదుర్కోవడానికి తమ సర్వశక్తుల్ని ధారపోయాల్సి వస్తోంది. మొత్తం 68 అసెంబ్లీ స్థానాలున్న రాష్ట్రంలో చాలా స్థానాల్లో రెబెల్ అభ్యర్థుల్ని బుజ్జగించి నామినేషన్ వెనక్కి తీసుకోవడానికి రెండు పార్టీల అగ్రనాయకత్వం చాలా కృషి చేసింది. మాట వినని కొందరు నాయకుల్ని పార్టీ నుంచి బహిష్కరించింది. అయినప్పటికీ చాలా స్థానాల్లో రెబెల్స్ తమ ప్రతాపాన్ని చూపిస్తామని సవాల్ చేస్తున్నారు.

ఇరు పార్టీలకూ డేంజర్‌బెల్స్

ఎన్నికల నామినేషన్ ఉపసంహరణ గడువు అక్టోబర్ 29న ముగిసిన తర్వాత కాంగ్రెస్‌కు 12 స్థానాల్లోనూ, బీజేపీకి 20 స్థానాల్లోనూ రెబెల్స్ డేంజర్ బెల్స్ మోగిస్తున్నారు. పచ్చద్, అన్ని, థియోగ్, సులాహ్, చౌపల్, హమీర్‌పూర్, అర్కి స్థానాల్లో కాంగ్రెస్‌కు రెబెల్స్ ముప్పు పొంచి ఉంటే, బీజేపీకి మండి, బిలాస్‌పూర్, కాంగ్రా, ధర్మశాల, ఝండూటా, చంబా, డెహ్రా, కులు, నలగఢ్, ఫతేపూర్, కిన్నూర్, అన్ని , సుందర్‌నగర్, నచన్, ఇండోరాలో రెబెల్స్ నుంచి గట్టి పోటీ ఎదురవుతోంది.

- అసెంబ్లీ స్పీకర్‌గా పని చేసిన గంగూరామ్ ముసాఫిర్ పచ్చద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి దయాల్ ప్యారీపై పోటీ పడుతూ కాంగ్రెస్ విజయావకాశాలను దెబ్బ తీసే అవకాశాలు కనిపిస్తున్నాయి
- థేగ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు రెబెల్ నాయకులు విజయ్ పాల్ ఖాచి, ఇందు వర్మ కంటి అధికారిక అభ్యర్థి కుల్ దీప్ సింగ్ రాథోడ్‌కి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు.
- హమీర్‌పూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కి ఆశిష్ శర్మ, బీజేపీకి నరేష్ దార్జి తిరుగుబాటు అభ్యర్థులు గుండెల్లో దడ పుట్టిస్తున్నారు.
- కాంగ్రెస్ పార్టీ దివంగత నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి వీరభద్ర సింగ్ సొంత నియోజకవర్గం అర్కిలో ఆయనకు అత్యంత సన్నిహితుడైన రాజేందర్ ఠాకూర్‌కు టిక్కెట్ నిరాకరించడంతో ఆయన రెబెల్‌గా పోటీ పడుతున్నారు.
- బీజేపీ పార్టీ నుంచి బహిష్కరించిన మాజీ ఎమ్మెల్యే తేజ్‌వంత్ సింగ్ నేగి (కిన్నూర్), మనోహర్ ధిమన్ (ఇండోరా), కిశోర్ లాల్ (అన్ని), ఎల్ ఠాకూర్ (నలగఢ్), కృపాల్ పర్మార్ (ఫతేపర్) ఇప్పుడు రెబెల్ అభ్యర్థుగా మారి ఎన్నికల్ని హీటెక్కిస్తున్నారు.
- కులులో రాచ కుటుంబానికి చెందిన బీజేపీ మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్ సింగ్ కుమారుడు, హితేశ్వర్ సింగ్ రెబెల్ అభ్యర్థిగా పోటీపడుతున్నారు.





5% ఓట్లు రెబెల్స్‌కే..!

గత కొద్ది ఏళ్లుగా ఎన్నికల ఫలితాల తీరు తెన్నుల్ని పరిశీలిస్తే గెలిచిన పార్టీకి, ఓడిపోయిన పార్టీకి మధ్య 5% ఓటింగ్ తేడా కనిపిస్తుంది. దీనికి రెబెల్స్ ప్రధాన కారణం. పార్టీ గెలుపోటములను తమ గుప్పిట్లోకి తీసుకొని శాసించే స్థాయిలో రెబెల్స్ ఉండే ఏకైక రాష్ట్రం హిమాచల్ ప్రదేశ్ కావడం విశేషం.

పార్టీ కంటే అభ్యర్థే కీలకం

హిమాచల్ ప్రదేశ్‌లో మొత్తం 68 స్థానాలకు గాను చాలా నియోజకవర్గాల్లో వాతావరణం పరిస్థితులు అనుకూలంగా ఉండవు. దీంతో ఈ రాష్ట్రంలోని ఎన్నికల్లో పార్టీల కంటే అభ్యర్థే కీలకంగా ఉంటారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఉల్లాసంగా చీతాలు: మోదీ

న్యూఢిల్లీ: నమీబియా నుంచి తీసుకువచ్చి మధ్యప్రదేశ్‌లోని కునో నేషనల్ పార్కులో ఉంచిన 8 చీతాలు ఆరోగ్యంగా, చురుగ్గా ఉన్నాయని, కొత్త వాతావరణానికి అలవాటు పడుతున్నాయని ప్రధాని మోదీ సంతోషం వ్యక్తం చేశారు. 'ఇది చాలా గొప్పవార్త. నిర్బంధ క్వారంటైన్ తర్వాత కునో పార్కు వాతావరణానికి అలవాటు పడేందుకు వీలుగా రెండు చీతాలను మాత్రం మరింత పెద్దదైన ఎన్‌క్లోజర్‌లోకి వదులుతామని అధికారులు చెప్పారు. ఆ తర్వాత మిగతా వాటిని విడతలుగా వదులుతారు'అని మోదీ ఆదివారం ట్వీట్ చేశారు. రెండు చీతాలను శనివారం పెద్ద ఎన్‌క్లోజర్‌లోకి వదులుతున్న వీడియోను ఆయన షేర్ చేశారు. పెద్ద ఎన్‌క్లోజర్ విస్తీర్ణం ఐదు చదరపు కిలో మీటర్ల మేర ఉంటుందని అధికారులు చెప్పారు. 30-66 నెలల వయస్సున్న 8 చీతాలను సెప్టెంబర్ 17న కునో నేషనల్ పార్కు క్వారంటైన్ జోన్‌లో ప్రధాని మోదీ విడుదల చేసిన విషయం తెలిసిందే.



సాక్షి శ్రీకాకుళం

సోమవారం । 7 । నవంబర్ । 2022



నేటి నుంచే స్కూల్‌గేమ్స్

జిల్లా కేంద్రంలో నేటి నుంచి స్కూల్‌గేమ్స్ పోటీలు ప్రారంభం కానున్నాయి. అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు.

- 8లో



డీసీసీబీని అభివృద్ధి చేద్దాం

డీసీసీబీని సమష్టిగా అభివృద్ధి చేసుకుందామని అధికారులు పిలుపునిచ్చారు. సిక్కోలులో మహా సభలు జరిగాయి.

- 8లో

8న నీలమణి దుర్గ ఆలయం మూసివేత

పాతపట్నం: పాతపట్నం నీలమణిదుర్గ ఆలయాన్ని చంద్ర గ్రహణం సందర్భంగా ఈ నెల 8వ తేదీ మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 9వ తేదీ ఉదయం 7.30 గంటల వరకూ మూసివేయనున్నామని ఆలయ ఈఓ టి.వాసుదేవరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సంప్రోక్షణ పూజలు అనంతరం ఆలయం తెరిచి శుద్ధి చేసి, భక్తులకు దర్శనాల కోసం అనుమతిస్తామని ఈఓ తెలిపారు.

న్యూస్‌రీల్

'రాష్ట్ర పోటీల్లో రాణించాలి'

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర మాస్టర్స్ చాంపియన్‌షిప్ పోటీలకు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు బొడ్డేపల్లి నారాయణరావు, ప్రధాన కార్యదర్శి పాలకొండ అప్పారావు పిలుపునిచ్చారు. రాష్ట్రపోటీల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో ఆదివారం శ్రీకాకుళంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పాలకొండ అప్పారావు మాట్లాడుతు నెల్లూరు వేదికగా ఏపీ రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్–2022 పోటీలు డిసెంబర్ 16 నుంచి 18 వరకు జరగనున్నట్టు పేర్కొన్నారు. నెలరోజులపాటు ఉదయం, సాయంత్రం సాధన చేయాలని వెటరన్ అథ్లెట్స్‌కు సూచించారు. సంఘ కార్యనిర్వాహక కార్యదర్శి, పీడీ చల్లా జగదీష్, ఉపాధ్యక్షుడు ఎం.కామయ్య తదితరులు పలు సూచనలు చేశారు.

నాటకాలపై వర్క్‌షాపులు అవసరం



మాట్లాడుతున్న పరిషత్తుల సమాఖ్య అధ్యక్షుడు రామారావు

శ్రీకాకుళం కల్చరల్: యువతను నాటక రంగం వైపు ఆకర్షించడానికి వారికి నాటకాలపై వర్క్‌షాపులు నిర్వహించాలని సభ తీర్మానించింది. స్థానిక బాపూజీ కళామందిర్‌లో నాటక రంగ అభివృద్ధిపై ఆదివారం సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా పరిషత్తుల నిర్వహణకు తేదీలను నిర్ణయించేందుకు తదుపరి సమావేశంలో చర్యలు తీసుకునేందుకు నిర్ణయించారు. నాటకాలను స్కూళ్లలో ఒక సబ్జెక్టుగా తీసుకురావాలని, అందుకు ప్రభుత్వానికి విన్నవించాలని నిర్ణయించారు. కళాకారుల సమస్యలపైనా, పరిషత్తులు నిర్వహించడంలో వచ్చే సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో పరిషత్తుల సమాఖ్య అధ్యక్షులు బుద్దాల వేంకటరామారావు, ప్రధాన కార్యదర్శి జవ్వాది దాశరధి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు చిట్టి వేంకటరావు, ప్రెస్ విభాగం ఉపాధ్యక్షుడు జి.రామకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.సత్యప్రసాద్, అనేక జిల్లాలనుంచి పరిషత్ నిర్వాహకులు, కళాకారులు పాల్గొన్నారు.

నీటి ట్యాంకు ధ్వంసం

మెళియాపుట్టి: మండలంలోని అతి పెద్ద పంచాయతీ చాపరలోని ఎస్సీ, బీసీ కాలనీల్లో తాగునీటి సదుపాయం కోసం ఇటీవల సర్పంచ్ బోసి రామారావు మినీ నీటి పథకం ఏర్పాటు చేశారు. పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి చేతులమీదుగా వీటిని ప్రారంభించారు. 250 కుటుంబాలకు తాగునీరు ఇచ్చే ఈ నీటి ట్యాంకును గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ విషయాన్ని గమనించిన సర్పంచ్ ఆదివారం నాడు వెంటనే నూతన ట్యాంక్ ఏర్పాటు చేశారు. ప్రజల కోసం ఏర్పాటు చేసిన వనరులపై కక్ష సాధింపు చూపడం శోచనీయమన్నారు.

రాధామాధవ స్వామికి 56 వంటకాలతో నైవేద్యం



రాధామాధవ స్వామికి 56 వంటకాలతో నైవేద్యం

టెక్కలి: కార్తీక మాసం సందర్భంగా టెక్కలి పెద్దబ్రాహ్మణవీధిలో గల రాధా మాధవ స్వామి మఠంలో ఆదివారం 56 రకాల వంటకాలతో స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. మఠాధిపతి మదన్ గోపాల్ దాస్‌జీ మహారాజ్ నేతృత్వంలో బాబా గౌర్ గోవింద్‌దాస్ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలను పంచిపెట్టారు.

తొలి అడుగుకు 5 ఏళ్లు

మూడువేల ఆరువందల నలభై ఎనిమిది కిలోమీటర్ల మేర సుదీర్ఘంగా సాగిన పాదయాత్రకు తొలి అడుగు పడిన రోజు ఇది. చరిత్రలో నిలిచిపోయే సంక్షేమ పాలనకు పునాది రాయి పడిన రోజూ ఇదే. ఐదేళ్ల కిందట ఇదే రోజు అప్పటి ప్రతిపక్ష నాయకుడి హోదాలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంకల్ప పాదయాత్రకు తొలి అడుగు వేశారు. ఆ అడుగు ఆగకుండా అధికార పీఠం వరకు ఆయనను తీసుకెళ్లింది. ఆ పయనం పేదల బాధలను నయం చేసింది. ఆ ప్రస్థానం తెలుగుజాతి మదిలో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. ఆ సందర్భాన్ని గుర్తు చేసుకుని వైఎస్సార్ సీపీ నాయకులు ఆదివారం జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.



ఆమదాలవలస రూరల్: తొగరాంలో కేక్ కట్ చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



కాశీబుగ్గ: పలాసలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, తదితరులు



ఇచ్ఛాపురం రూరల్: విజయ స్థూపం వద్ద కేక్ కట్ చేస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ, పిరియా సాయిరాజ్, నర్తు రామారావు తదితరులు



టెక్కలి: టెక్కలిలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ, కేంద్ర మాజీ మంత్రి కృపారాణి, మంజు తదితరులు



శ్రీకాకుళం పీఎన్ కాలనీ: శ్రీకాకుళంలోని ఏడురోడ్ల కూడలి వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

భయపడొద్దు.. బయటపడదాం!



కిడ్నీ వ్యాధి.. దశాబ్దాలుగా ఉద్దానాన్ని పట్టి పీడిస్తున్న మహమ్మారి. దీని ఆకలికి ఇప్పటికే వేల మంది బలైపోయారు. ప్రతి ఇంటా ఈ వ్యాధి బాధితులు కనిపిస్తున్నారు. అయితే ఉద్దానం ప్రాంతీయులే కాకుండా ప్రజలంతా ఈ వ్యాధిపై అవగాహన పెంచుకోవడం మేలని కిడ్నీ వ్యాధి నిపుణురాలు డాక్టర్ శరత్ జ్యోత్స్న చెబుతున్నారు. ఈ వ్యాధి ముదిరితే గానీ తెలియదని, అందుకే ముందు నుంచీ జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. ఆహార అలవాట్లను క్రమబద్ధం చేసుకుంటే వ్యాధి నుంచి దూరంగా ఉండవచ్చని అంటున్నారు. భయపడే బదులు అవగాహన పెంచుకుని వ్యాధి నుంచి బయటపడదామని తెలిపారు. కిడ్నీ వ్యాధి, దాని పర్యవసానాలపై 'సాక్షి'తో ఆమె తన అభిప్రాయాలు పంచుకున్నారు. –కాశీబుగ్గ

సాక్షి ఇంటర్వ్యూ



కిడ్నీవ్యాధి నిపుణురాలు డాక్టర్ శరత్ జ్యోత్స్న



- ఉద్దానమే కాదు అందరూ అప్రమత్తంగా ఉండాలి
- కిడ్నీ వ్యాధి నిర్మూలనకు అన్ని పీహెచ్‌సీల్లో పటిష్ట చర్యలు
- 'సాక్షి'తో కిడ్నీవ్యాధి నిపుణురాలు డాక్టర్ శరత్ జ్యోత్స్న

సాక్షి: ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ రోగులు పెరుగుతున్నారు. అందుకు గల కారణాలు ఏంటి? ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపడుతుంది?

డాక్టర్: కేవలం ఉద్దానం ప్రాంతంలో మాత్రమే కిడ్నీ వ్యాధులు ఉన్నాయని అనుకోవడం చాలా తప్పు. కిడ్నీ సమస్యలు అనేవి ఆహార అలవాట్ల వల్ల వస్తాయి. అన్ని ప్రాంతాల్లోనూ కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఉన్నారు. ఉద్దానంలో అధికంగా ఉన్నాయి. అయితే కారణాలు ఇంకా అన్వేషిస్తున్నారు. సీఎం వైఎస్ జగన్ చొరవ తీసుకుని కిడ్నీ రీసెర్చ్ సెంటర్ నిర్మిస్తున్నారు. ఆ నిర్మాణం పూర్తయితే కారణాలు దొరకవచ్చు.

సాక్షి: ఈ వ్యాధి వచ్చిందని ఎలా తెలుస్తుంది. లక్షణాలు ఏమైనా ఉన్నాయా?

డాక్టర్: లక్షణాలను బట్టి కిడ్నీ వ్యాధిని గుర్తించడం కష్టం. బాగా ముదిరాకే కిడ్నీ వ్యాధి ఉందని బయటకు తెలుస్తుంది. అయితే స్క్రీనింగ్ టెస్టుల ద్వారా ముందుగా వ్యాధిని తెలుసుకోవచ్చు. అందుకే ముందస్తుగా మేలుకుంటే వ్యాధి నుంచి తొందరగా బయటపడతారు. ఆలస్యమైతే కష్టమవుతుంది. డయాలసిస్‌తో జీవిత కాలం పెంచుకోవచ్చు. దాత ఉంటే కిడ్నీ మార్పిడి చేసుకోవచ్చు. అందుకే ఏవైనా ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు కిడ్నీ పరీక్షలు సైతం చేసుకుంటూ ఉండాలి.

సాక్షి: ఎవరికి ఈ వ్యాధి ఎక్కువగా సోకుతుంది?

డాక్టర్: బీపీ, సుగర్, స్థూలకాయం, స్మోకింగ్ అలవాటు, సొరియాసిస్, కీళ్ల వాతం, కుటుంబంలో వంశపారపర్యం, దీర్ఘకాల వ్యాధులు ఉన్నవారు, తరచూ మందులు ముఖ్యంగా పెయిన్‌కిల్లర్లు వాడుతున్న వారికి, మూత్ర సమస్యలు ఉన్నవారికి తొందరగా వచ్చే అవకాశం ఉంది. మూత్రం సరిగా కాకపోవడం, కాలు, ముఖం, పొంగులు రావడం, మనిషి కాలిపోయినట్లు నల్లగా మారడం వంటి లక్షణాలు ఉంటాయి. వికారం, నీరసం, ఆకలి మందగించడం, వాంతులు, నిస్సత్తువగా కనిపించడం, పరిసరాలపై ఆసక్తి లేకపోవడం, జ్వరం రావడం, మందులు వేసినా తగ్గకపోవడం, రాత్రి మేలుకొని పగలు పడుకోవడం, శరీరంలో గుర్తుపట్టే విధమైన మార్పులు వంటి లక్షణాలను కొంచెం సీరియస్‌గా తీసుకోవాలి.

సాక్షి: కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఎలాంటి సేవలు అందిస్తున్నారు?

డాక్టర్: జిల్లాలో ఉన్న వ్యాధిగ్రస్తులను దృష్టిలో పెట్టుకుని అన్ని పీహెచ్‌సీల్లో స్క్రీనింగ్ టెస్ట్, శ్రీకాకుళం, టెక్కలి, పలాస, సోంపేట, కవిటి, హరిపురంలో ఉచిత డయాలసిస్ కేంద్రాల్లో మూడు షిఫ్టలలో ఉచిత సేవలు అందుతున్నాయి. ఉచిత మందులు, ఇంజెక్షన్లు ఇస్తున్నాం. స్థాయిని బట్టి రూ.5 వేలు నుంచి రూ.10 వేలు వరకు పింఛన్లు ఇస్తున్నారు. రిమ్స్‌లో బోర్డు కమిటీ పర్యవేక్షణ జట్టు ఉంటుంది. వారందరి సమ్మతితో పింఛను అందుతోంది. క్రియాటిన్ లెవెల్స్ ఐదు పాయింట్లు దాటినా తీవ్రత పెరిగినా ఏది ముందయినా మూడు నెలలకు అందరికీ రూ.10వేలు పింఛన్ అందిస్తున్నాం. ప్రతి శనివారం కిడ్నీ రోగులకు పర్యవేక్షణ డివిజన్ వారీగా చేపడుతున్నాం.

సాక్షి: చివరగా కిడ్నీవ్యాధులపై మీరిచ్చే సలహాలు ఏమిటి?

డాక్టర్: కిడ్నీ ఉన్న ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. మా ప్రాంతానికి రాదు కదా అనుకోవద్దు. మనకు ఏ సమస్య వచ్చినా తిరిగి తిరిగి కిడ్నీ మీదకు పడుతుంది. అందుకే ఆరోగ్యసూత్రాలు పాటించి వ్యాయామం చేయాలి. ముఖ్యంగా చిన్నారులకు ప్రాథమిక దశలోనే నిద్రలో మూత్రం పోయడం, ఇన్‌ఫెక్షన్ల వంటి వాటిని గుర్తించి నయం చేయించుకోవాలి. వ్యాధి రాకుండా అప్పుడప్పుడూ పరీక్షలు చేసుకుని జాగ్రత్తపడాలి.

సాక్షి: వ్యాధి సోకినవారు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి? ఆహారపు అలవాట్లు ఎలా ఉండాలి.?



డాక్టర్: వ్యాధి గ్రస్తులు వారి క్రియాటిన్ లెవెల్స్ బట్టి ఆహార అలవాట్లలో మార్పులు చేసుకోవాలి. వైద్య సేవలు ఇతర సపర్యలు వ్యక్తిగతంగా ఉంటాయి. అందరికీ ఒకే సలహాలు, సూచనలు పనికిరావు. సాధారణంగా అయితే కిడ్నీ వ్యాధిగ్రస్తులు, కిడ్నీలో రాళ్లు ఉన్న వారు చికెన్, మటన్, కూల్‌డ్రింక్స్, ఫాస్ట్‌ఫుడ్, ఆయిల్‌ఫుడ్, పిజ్జా, బర్గర్‌లకు (పాస్పరస్ అధికంగా ఉంటుంది కనుక) దూరంగా ఉండాలి. కిడ్నీలో రాళ్లు ఉన్న వారు పండ్లు, కొబ్బరి బొండాం తీసుకోకూడదు. గుడ్లు, చేపలు, పుట్టగొడుగు తినవచ్చును. వారి స్థాయిని బట్టి నాలుగు లీటర్ల నీరు తీసుకోవాలి. కనీసం ఆరుగంటల నిద్ర తప్పనిసరిగా ఉండాలి. రోజూ కనీసం 20 నిమిషాలు వ్యాయమం చేయాలి. లేదంటే 60 నిమిషాలు నడవాలి. అవసరానికి మించి ఫుడ్ తీసుకోకూడదు, యాంటీ బయాటిక్ మాత్రలు, పెయిన్‌కిల్లర్స్‌కు దూరంగా ఉండాలి.

తెర పడింది

- ముగిసిన రాష్ట్ర స్థాయి నాటిక పోటీలు
- మూడు రోజుల పాటు ఆకట్టుకున్న ప్రదర్శనలు



ప్రభంజనం నాటికలోని ఓ సన్నివేశం

శ్రీకాకుళం కల్చరల్: మూడురోజులుగా జిల్లా కేంద్రంలోని బాపూజీ కళామందిర్‌లో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి నాటిక పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఆఖరి రోజు ప్రదర్శనలు తిలకించేందుకు వచ్చిన ఎంపీ రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ కళాకారులకు ఎలాంటి సాయం అయినా అందిస్తానని తెలిపారు. ప్రభంజనం నాటిక ప్రదర్శకులకు పారితోషికంతో పాటు జ్ఞాపిక అందించారు. పోటీల్లో భాగంగా చివరి రోజు ఆదివారం ప్రభంజనం. ప్రక్షాళన నాటికలను ప్రదర్శించారు.

నాన్నా నేనొచ్చేస్తాకు ప్రథమ బహుమతి

పోటీల్లో చిలకలూరిపేటకు చెందిన అంజనా రాథోడ్ థియేటర్స్ ప్రదర్శించిన 'నాన్నా నేనొచ్చేస్తా' నాటికకు ప్రథమ బహుమతి, ప్రకాశం కళా పరిషత్, కరవది వారి 'కొత్త భూతం' ద్వితీయ బహుమతి, కత్రపాడుకు చెందిన ఉషోదయా కళానికేతన్ వారు ప్రదర్శించిన 'ప్రక్షాళన'కు తృతీయ బహుమతి లభించాయి. ప్రముఖ పౌరాణిక నటులు యడ్ల గోపాలరావు వీరికి బహుమతులు అందించారు. ఉత్తమ నటుడిగా రాంబాబు(అక్షయం), ఉత్తమ క్యారెక్టర్ నటిగా రాంబాయమ్మ(దేవుడు), ఉత్తమ నటిగా సావిత్రి (నాన్నా నేనొచ్చేస్తా), ఉత్తమ ప్రతినాయకుడిగా రామకృష్ణ (కొత్త భూతం), ఉత్తమ క్యారెక్టర్ యాక్టర్‌గా దశరథరాం(కొత్తభూతం), ఉత్తమ సహ నటుడిగా శ్రీరామ్(నాన్నా నేనొచ్చేస్తా), ఉత్తమ సహాయ నటుడు మల్లేశం (ప్రభంజనం), ఉత్తమ ఆహార్యం శ్రీజ సాదినేని, ఉత్తమ రంగాలంకరణ, శ్రీజ సాదినేని, ఉత్తమ రచన తాళాబత్తుల వేంకటేశ్వరరావు(నాన్నా నేనొచ్చేస్తా), ఉత్తమ దర్శకత్వం ఆర్ఎస్ఆర్ నాయక్ (నాన్నానేనొచ్చేస్తా), జూరీ అవార్డు వెంకటరావు, ఈ పున్నయ్య, (ప్రక్షాళన), రంగమ్మ, ఎస్.మాధవి (ప్రభంజనం) లభించాయి.



ప్రథమ బహుమతి అందుకుంటున్న 'నాన్నా నేనొచ్చేస్తా' నాటిక సభ్యులు

మార్కెట్‌కు కార్తీక పౌర్ణమి సందడి

శ్రీకాకుళం కల్చరల్:

పవిత్ర కార్తీక పౌర్ణమి సందర్భంగా నగరంలోని మార్కెట్లు రద్దీగా మారాయి. పౌర్ణమికి సంబంధించిన పూజా సామగ్రి కోసం జనం మార్కెట్‌కు తరలివచ్చారు. దానిమ్మ కిలో రూ.250, ఆపిల్స్ రూ.250, కమలాలు రూ.60, అరటి పండ్లు డజను రూ.80లు విక్రయించారు. ఉసిరి కాయలు రూ.100, రేగిపండ్లు రూ.100, ఇక పూల విషయానికి వస్తే బంతి కేజీ రూ.240లు, కాగడామల్లి కేజీ రూ.300, చామంతులు కేజీ రూ.500లు వరకు అమ్మకాలు సాగించారు. పసుపు, కుంకుమ కొనుగోళ్లు, తోరణాలు, చెక్కలు, తమలపాకులు, అరటి పండ్లు, కొబ్బరి కాయల కొనుగోళ్లతో సందడిగా మారింది.



మార్కెట్‌లో పువ్వుల కొనుగోళ్లు

కిక్కిరిసిన అరసవల్లి



ప్రత్యేక దర్శన క్యూలో కిక్కిరిసిన భక్తులు

అరసవల్లి: అరసవల్లి ఆదివారం జన సంద్రమైంది. ఉదయం 5 గంటలకే భక్తులు క్యూలైన్లలో చేరుకోగా.. కొన్ని గంటల్లోనే ఆలయ పరిసరాలన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఈశాన్య మార్గం నుంచి భక్తులకు ఆలయంలోకి అనుమతించడంతో భక్తులు సజావుగా దర్శనాలు చేసుకునే వీలు కలిగింది. కార్తీక మాసం సందర్భంగా మహిళలు పుష్కరిణి వద్ద కార్తీక దీపాలను వెలిగించి ప్రసాదాలను స్వామికి నివేదించారు. గర్భాలయంలో స్వర్ణాలంకరణలో ఆదిత్యుడు దర్శనం ఇవ్వడంతో భక్తులు కనులారా బంగారు స్వామిని దర్శించారు. ఆదివారం సాయంత్రం మహా ద్వాదశ హారతితో అలంకరణను తొలిగించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎక్కడా ఇబ్బందులు రాకుండా ఈఓ వి.హరిసూర్యప్రకాష్ తగు చర్యలు చేపట్టారు. ఆలయంలో ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకరణ దర్శన చర్యలు చేపట్టారు.

రూ.13.90 లక్షలు ఆదాయం

కార్తీక సందడి కారణంగా ఆదివారం ఒక్కరోజులో రూ.13,90,150 వరకు ఆదాయం లభించింది. దర్శన టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.9.53,600 లక్షలు, విరాళాల రూపంలో రూ.66,550 లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.3,75 లక్షలు వరకు ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు. ఎంపీ రామ్మోహన్ నాయుడు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు తదితరులు ఆదిత్యుడిని దర్శించుకున్నారు.

క్లుప్తంగా

మృత్యు ఒడికి వలస జీవి


కూన కుసరావు (ఫైల్)

ఆమదాలవలస రూరల్: మండలంలో కలివరం గ్రామ పంచాయతీ పీర్‌సాహెబ్‌పేట గ్రామానికి చెందిన కూన కుసరావు అలియాస్ లక్ష్మణ్ అనారోగ్యంతో దక్షిణ ఆఫ్రికాలో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కుసరావు కూలి పనుల కోసం నెల రోజుల కిందట దక్షిణాఫ్రికా దేశం వెళ్లాడు. అక్కడ తీవ్రమైన జ్వరం రావడంతో తోటి డ్రైవర్లు, స్నేహితులు ఆస్పత్రిలో చేర్పారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం రాత్రి మృతి చెందాడు. కుసరావు మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడు కుసరావుకు భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

మృతి చెందిన వృద్ధుని వివరాలు లభ్యం

నరసన్నపేట: మండలం ఉర్లాం రైల్వే స్టేషన్ వద్ద తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో మరణించిన వృద్ధుడి వివరాలు తెలిశాయి. మృతుడు నరసన్నపేట మండలం వీఎన్ పురానికి చెందిన ముద్దాడ అప్పలనాయుడుగా గుర్తించారు. 'సాక్షి'లో వచ్చిన వార్తను చూసి ఆమదాలవలస రైల్వే పోలీసులకు సంప్రదించామని మృతుని భార్య నారాయణమ్మ, కుమారులు రాజు, రమణ తెలిపారు. ఆదివారం ఉదయం స్వగ్రామం నుంచి బాడాం బంధువుల ఇళ్లకు వెళ్తూ పట్టాలు దాటుతున్నప్పుడు ట్రైన్ ఢీకొని ఉంటుందని రైల్వే ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు.

అదృశ్యమైన వృద్ధుడు మృతి


చిన్నయ్య (ఫైల్)

నరసన్నపేట: మండలంలోని చోడవరం పంచాయతీ సోమవారం పేటకు చెందిన మొండి చిన్నయ్య (80) మృతదేహాన్ని మొయ్యవానిపేట వద్ద పోలాకి కాలువలో ఆదివారం గుర్తించారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి చిన్నయ్య కనిపించడం లేదు. కుటుంబ సభ్యులు పరిసరాలు, బంధువుల ఇళ్ల వద్ద వెతికారు. అయినా ఆచూకీ లభించలేదు. చివరకు ఆదివారం మధ్యాహ్నం పోలాకి చానెల్‌లో మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. మృతుని కుమారుడు మొండి రవి చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ సింహాచలం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతికి గల కారణాలు తెలియకపోవడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతునికి భార్య నారాయణమ్మ ఉన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కి. 10గ్రా.)	50,380-00
బంగారం(22కి. 10గ్రా.)	46,460-00
వెండి (కిలో)	60,500-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 445.00
విజయనగరం	రూ. 449.00
శ్రీకాకుళం	రూ. 449.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹195	₹ 215

నేటి నుంచే స్కూల్‌గేమ్స్

- నాలుగు రోజులపాటు మొత్తం 32 క్రీడాంశాల్లో ఎంపిక
- ముస్తాబైన ఆర్ట్స్ కళాశాల మైదానం, కోడిరామ్మూర్తి స్టేడియం


శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఎస్‌జీఎఫ్ అధికారుల పర్యవేక్షణలో ఖోఖో కోర్టులను సిద్ధంచేస్తున్న పీడీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: పాఠశాలల క్రీడల (స్కూల్ గేమ్స్) సర్వం సిద్ధమైంది. రెండేళ్లుగా కోవిడ్‌తో పాఠశాలల క్రీడలకు నోచుకోని బాలబాలికలు మైదానం బాట పట్టనున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ పరిధిలోని పాఠశాల క్రీడల సమాఖ్య (స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో సోమవారం నుంచి జరగనున్న జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ ఎంపిక పోటీలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. అండర్-14, అండర్-17 వయో విభాగాల్లో జిల్లాలో అత్యంత ఆదరణ కలిగిన వాలీబాల్, కబడ్డీ, ఖోఖో మూడు క్రీడాంశాల్లో తొలిత నియోజకవర్గ స్థాయి ఎంపికలను నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ మూడు క్రీడాంశాలను కలుపుకొని మొత్తం 32 క్రీడాంశాల్లో జిల్లాస్థాయి పోటీల నిర్వహణకు చర్యలు తీసుకున్నారు. జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ అండర్-14, అండర్-17 బాలబాలికల ఎంపిక పోటీలకు ఆతిథ్యమిస్తున్న జిల్లా కేంద్రంలోని కోడిరామ్మూర్తి స్టేడియం ప్రాంగణం, ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్)కళాశాల మైదానాలు ముస్తాబయ్యాయి. ఎస్‌జీఎఫ్ జిల్లా సంయుక్త కార్యదర్శి బీవీ రమణ, పీఈటీ సంఘ నాయకులు ఎంవీ రమణ, ఎం.సాంబమూర్తి నేతృత్వంలో కోర్టులకు తుది మెరుగులు దిద్దారు. మైదానాల వద్దే పోటీలకు హాజరయ్యే బాలబాలికలకు జగనన్న గోరుముద్ద పేరిట భోజనాలు కూడా అందించనున్నారు. పోటీలకు హాజరయ్యే బాలబాలికలు ఎలిజిబులిటీ ఫారంపై హెచ్‌ఎం, పీడీ సంతకంతోపాటు పాఠశాల రౌండ్ సీల్ వేసి తీసుకురావాలని, అలాగే స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్‌లను తప్పనిసరిగా తీసుకురావాలని ఎస్‌జీఎఫ్ జిల్లా సంయుక్త కార్యదర్శి బడి వెంకటరమణ సూచిస్తున్నారు. పాఠశాలలు చెల్లించాల్సిన ఫీజులను పక్కాగా చెల్లించాలని డీఈఓ సూచిస్తున్నారు.

నేడు ఎంపికలు జరిగే క్రీడాంశాలు: కబడ్డీ(బాలురు), వాలీబాల్(బాలురు), ఖోఖో(బాలురు), షటిల్ బ్యాడ్మింటన్(బాలురు), బాస్కెట్‌బాల్, సెపక్‌తక్రా, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్.

రేపు ఎంపికలు జరిగే క్రీడాంశాలు: కబడ్డీ (బాలికలు), వాలీబాల్ (బాలికలు), ఖోఖో (బాలికలు), షటిల్ బ్యాడ్మింటన్(బాలికలు), బేస్‌బాల్ (ఉదయం), సాఫ్ట్‌బాల్ (మధ్యాహ్నం), టేబుల్‌టెన్నిస్ (న్యూ సెంట్రల్ స్కూల్ వేదికగా) జరగనున్నాయి.

వైద్య బృందం పర్యవేక్షణలో ట్రిపుల్ ఐటీ


విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం చాన్సలర్ ప్రొఫెసర్ కేసీ రెడ్డి

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) వైద్య బృందం పర్యవేక్షణలో ఉంది. క్యాంపస్‌లో ఆదివారం విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. రక్తహీనత ఉన్న వారికి మందులు అందించారు. మరోవైపు రాష్ట్ర రాజీవ్ గాంధీ వైజ్ఞానిక విశ్వవిద్యాలయం చాన్సలర్ ప్రొఫెసర్ కేసీ రెడ్డి, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేశలి అప్పారావు ట్రిపుల్ ఐటీని ఆదివారం సందర్శించారు. వసతి గృహం, మెస్, డార్మిటరీ, కిచెన్ పరిశీలించారు. ప్రస్తుతం ట్రిపుల్ ఐటీలో 19 మందికి వైద్య సేవలు అందజేస్తున్నారు. శ్రీకాకుళం రిమ్స్‌లో తొమ్మిది మంది చికిత్స పొందుతున్నారు. వీరిని అధికారులు పరామర్శించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి అదుపులోనే ఉండగా, కొందరు మాత్రం భయపడుతున్నట్లు సమాచారం. దీంతో అధికారులు వారిపై దృష్టి పెట్టి క్లాస్‌వర్క్ సజావుగా సాగిస్తున్నారు. తల్లిదండ్రులను కలవడంతో పాటు ఇళ్లకు వెళ్లేందుకు కూడా అవకాశం ఇస్తున్నారు. క్లాసులు కోల్పోయే వారికి మరోసారి చెప్పేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు, అధికారులు స్థానికంగా ఉండి పర్యవేక్షిస్తున్నారు.

కారణాలపై దర్యాప్తు

ఫుడ్ పాయిజన్ దురదృష్టకరమని రాష్ట్ర రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం చాన్సలర్ ప్రొఫెసర్ కేసీ రెడ్డి అన్నారు. ఆయన ట్రిపుల్ ఐటీలో విలేకరులతో మాట్లాడారు. గురువారం చపాతీ తిన్న తర్వాత వాంతులు, కడుపు నొప్పి వచ్చినట్లు విద్యార్థులు చెబుతున్నారని, తనకు సమాచారం తెలిసిన వెంటనే సీఎం వైఎస్ జగన్‌తో పాటు మంత్రి బొత్స జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లానని అన్నారు. దీనిపై కారణాలు అన్వేషిస్తున్నామని, నివేదిక వచ్చాక కారకులపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని తెలిపారు. క్యాంపస్‌లో సాధారణ వాతావరణం నెలకొందని, అకడమిక్ ఏడాది కోల్పోకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. మరోవారంపాటు వైద్య సేవలు కొనసాగుతాయన్నారు. మెనూ మార్చడంతో పాటు పారిశుద్ధ్య చర్యలపై దృష్టి పెడుతున్నామని పేర్కొన్నారు. త్వరలో 20 పడకలతో ప్రత్యేకంగా స్థానికంగా ఆస్పత్రి, వైద్యులు, వైద్య సిబ్బందిని నియమించనున్నట్లు ఆయన చెప్పారు.


కిచెన్‌లో వంటకాలు పరిశీలిస్తున్న రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ అప్పారావు

రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేశలి అప్పారావు మాట్లాడుతూ నాలుగు రోజుల్లో నివేదిక వచ్చాక కారకులపై చర్యలు తీసుకుంటామన్నారు. దాదాపు 215 మంది విద్యార్థులు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొన్నారని తెలిపారు. ఇలాంటివి భవిష్యత్‌లో పునరావృతం కాకూడదన్నారు. తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దని, పిల్లల చదువు, ఆరోగ్యంపై సంస్థ బాధ్యత తీసుకుంటుందని తెలిపారు.

సమష్టిగా డీసీసీబీని అభివృద్ధి చేద్దాం

- ఆప్కాబ్ పర్సన్ ఇన్‌చార్జి మల్లెల ఝాన్సీరాణి
- రైతులకు సీఎం వైఎస్ జగన్ ప్రాధాన్యమిస్తున్నారు: కృష్ణదాస్


మాట్లాడుతున్న ఝాన్సీరాణి

శ్రీకాకుళం అర్బన్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 13 డీసీసీబీ బ్యాంకులు రైతులకు మాత్రమే కాకుండా అన్ని వర్గాల ప్రజలకూ మరింత చేరువయ్యేలా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కృషిచేయాలని ఆప్కాబ్ పర్సన్ ఇన్‌చార్జి మల్లెల ఝాన్సీరాణి అన్నారు. ఏపీసీసీబీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు బీఎస్ రాంబాబు అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రెండు రోజుల 13వ మహాసభలు శ్రీకాకుళంలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఝాన్సీరాణి మాట్లాడుతూ కమర్షియల్ బ్యాంక్‌లకు దీటుగా డీసీసీబీ బ్యాంక్‌లు పనిచేస్తున్నాయన్నారు. యూనియన్‌లు వారి హక్కుల కోసమే కాకుండా సంస్థ అభివృద్ధికి కూడా కృషిచేయాలన్నారు. ఆప్కాబ్ నుంచి ఒక ప్రత్యేక అధికారిని డీసీసీబీకి తీసుకురావడం జరిగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డీసీసీబీలకూ కంప్యూటరీకరణ పూర్తి చేశామన్నారు.

మాజీ డిప్యూటీ సీఎం, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ వ్యవసాయానికి, రైతులకు ప్రాధాన్యమిస్తున్నారని తెలిపారు. మన జిల్లా వ్యవసాయాధారితమని, జిల్లాలోని రైతులకు, చిరు వ్యాపారులకు, చిల్లర వర్తకులకు మరింత చేరువై రుణాలు మంజూరు చేసేలా చూడాలన్నారు. డీసీసీబీ బ్యాంక్‌లలో మహిళా సంఘాలను కూడా భాగస్వామ్యం చేయాలన్నారు. ఎంపీ రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ కోఆపరేటివ్ వ్యవస్థలో ప్రస్తుతం మూడంచెల విధానం నడుస్తోందని, దీన్ని రెండంచెల విధానానికి మార్చాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర రెడ్డి వల్లే డీసీసీబీలు, పీఏసీఎస్‌లు ఈరోజు ఇంత ఉజ్వలంగా ఉన్నాయని గుర్తు చేశారు. కృష్ణాజిల్లా డీసీసీబీ చైర్మన్ టి.నాగేశ్వరరావు మాట్లాడుతూ సహకార వ్యవస్థలో యూనియన్‌లు ప్రారంభమైన తర్వాతనే ఉద్యోగులకు భద్రత లభించిందన్నారు.

డీసీసీబీ జిల్లా చైర్మన్ కరిమి రాజేశ్వరరావు మాట్లాడుతూ ఏపీసీసీబీఈఏ 13వ మహాసభలు శ్రీకాకుళంలో నిర్వహించడం జిల్లాకే గర్వకారణంగా ఉందన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి లాగే ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కూడా రైతుల పక్షపాతిగా నిలిచి అన్ని రకాలుగా వారిని ఆదుకుంటున్నారన్నారు.

కార్యక్రమానికి ముందు డే అండ్ నైట్ కూడలి నుంచి అంబేడ్కర్ ఆడిటోరియం వరకూ సహకార ఉద్యోగులంతా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐబీఈఏ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీహెచ్ వెంకటాచలం, తపన్ కుమార్, రంగబాబు, డోల జగన్, సింతు సుధాకర్, డీసీసీబీ సీఈఓ డి.వరప్రసాద్, జీఎం శిమ్మ జగదీష్, ఎస్‌వీఎస్ సత్యన్నారాయణ, దశరథ, ఉపేంద్ర, రామకృష్ణ, ఇతర జిల్లాల డీసీసీబీ చైర్మన్‌లు, సహకార సంఘ ఉద్యోగులు, అధిక సంఖ్యలో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంత్‌కు గ్రీన్ ఆర్మీ ఆర్థిక సాయం


ప్రశాంత్‌కు నగదు అందజేస్తున్న గ్రీన్ ఆర్మీ ప్రతినిధులు

మందస: మండలంలోని సొండిపూడి గ్రామానికి చెందిన దడ్ల ప్రశాంత్‌కు గ్రీన్ ఆర్మీ ఆదివారం ఆర్థిక సాయం అందించింది. రెండు కిడ్నీలు పాడవ్వడంతో ప్రశాంత్‌కు తప్పనిసరిగా కిడ్నీ మార్పిడి జరగాలని వైద్య నిపుణులు చెప్పారు. నిరుపేద బాధితునికి ఆపరేషన్‌కు ఆర్థిక స్థోమత లేకపోవడంతో 'అమ్మ వేడుకోలు' అనే శీర్షికన 'సాక్షి' ఓ కథనం ప్రచురితమైంది. దీంతో ఇదే గ్రామానికి చెందిన ఔగాన ఈశ్వరరావు రూ.20వేలు నగదు అందించగా, దాతలు సాయం చేయడానికి ముందుకు వస్తున్నారు. పలాస-కాశీబుగ్గకు చెందిన గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్ ఆధ్వర్యంలో ప్రతినిధులు రూ.10వేలను ప్రశాంత్‌కు అందజేశారు. కార్యక్రమంలో గ్రీన్ ఆర్మీ కార్యదర్శి బందావు తిరుమల, సభ్యులు దాసరి శ్రీనివాసరావు, నీలాపు లక్ష్మీనారాయణ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు దడ్ల కిరణ్‌కుమార్, స్థానిక పెద్దలు యానాది వాసుదేవు, ఎరుమాకు తులసీదాసు, మిస్క గణపతి, నితీష్ కూడా ఉన్నారు.

పూలతోటల పెంపకంతో అదనపు ఆదాయం


బంతిపూల తోటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త హరికుమార్

ఎల్.ఎన్.పేట: పూలతోటల పెంపకంతో రైతులకు అదనపు ఆదాయం వస్తుందని ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ వి.హరికుమార్ అన్నారు. మండలం చొర్లంగి, కవిటి గ్రామాల్లో సాగు చేస్తున్న ఉద్యాన పంటలను, పూల తోటలను ఆయన ఆదివారం పరిశీలించారు. గ్రామాల్లో ఖాళీగా ఉన్న రైతుల స్థలాల్లో తక్కువ మొత్తంలో పూల తోటలు, పండ్ల తోటలు పెంచాలని సూచించారు. పూల తోటల పెంపకంతో తక్కువ రోజుల్లో ఆదాయం వస్తుందన్నారు. ప్రస్తుత మార్కెట్‌లో పూలకు ఎప్పుడూ డిమాండ్, ధర ఉంటుందని రైతులకు అవగాహన కలిగించారు. బంతి మొక్కలు నాటిన 40వ రోజున కొనలు తుంచటం వల్ల పూల దిగుబడి పెరుగుతుందన్నారు. పూత దశలో మల్టికే (13.0.45) మందును పిచికారీ చేయడం ద్వారా దిగుబడి పెంచుకోవచ్చని వివరించారు. నాటిన 30 రోజుల తర్వాత వేపనూనె 2 మిల్లీలీటర్లు లీటరు నీటికి కలుపుకొని పిచికారీ చేయటం వలన చీడపీడలను తగ్గించుకోవచ్చన్నారు. పూలతోటల పెంపకానికి ముందుకు వచ్చే రైతులకు ఉద్యాన విభాగం ద్వారా కొన్ని రాయితీలను అందిస్తామని పేర్కొన్నారు. ఆయనతో పాటు రైతులు శివ్వాల సుదర్శనరావు, మహంతి సూర్యనారాయణ ఉన్నారు.

ఆ యువకునికి నాలుగు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు


సాహుకారి కిరణ్‌కుమార్

పలాస: ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎంతో కష్టపడుతున్న నేటి యువతరానికి ఆ యువకుడు ఆదర్శనీయుడు. నాలుగు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికై అందరినీ అబ్బుర పరిచాడు. అతడే పలాస మండలం బొడ్డపాడు గ్రామానికి చెందిన సాహుకారి కిరణ్‌కుమార్. స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ నిర్వహించిన కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ 2020 ఎగ్జామ్‌లో ఉన్నత కొలువు సాధించాడు. జాతీయ స్థాయిలో 863 ర్యాంకు సాధించి సెంట్రల్ బోర్డు ఆఫ్ ఇన్‌డైరెక్టర్ టాక్సెస్ అండ్ కస్టమ్స్‌లో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎంపికయ్యాడు. ఇతను మందస మండలం కుంటికోట నారాయణ మోడల్ స్కూల్‌లో పదో తరగతిలో 571 మార్కులు సాధించాడు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఇంటర్మీడియట్ 92 శాతం, ఇంజినీరింగ్‌లో 86 శాతం మార్కులతో పూర్తి చేశాడు. క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో సాఫ్ట్‌వేర్ కొలువు సాధించి రెండేళ్లు పనిచేశాడు. ఆ తర్వాత భారతీయ రైల్వే శాఖకు, పోస్టల్ శాఖకు ఎంపికయ్యాడు. అక్కడితో ఆగకుండా పై పదవుల కోసం ప్రయత్నం చేసి ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసర్‌గా కొలువు సాధించాడు. అక్కడ జాయిన్ కాకుండానే సెంట్రల్ జీఎస్టీ, ఎక్సైజ్ డిపార్టుమెంట్లలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్నత పదవికి అర్హత సాధించాడు. ఈయనను ఉద్దానం ప్రాంత విద్యార్థి వృద్ధి వేదిక అధ్యక్ష కార్యదర్శులు ఇశాకోటి జోగారావు, బి.చిన్నారావు , రెయ్యి చిన్నారావు, బి.ఓంకార్, కుత్తుం ప్రకాశరావు తదితరులు అభినందించారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి


పంట పొలంలో మృతి చెందిన బమ్మిడి జోగారావు


జోగారావు (ఫైల్)

పాతపట్నం: పంట పొలంలో విద్యుత్ షాక్ తగిలి పాతపట్నం మండలం చంగుడి గ్రామానికి చెందిన రైతు బమ్మిడి జోగారావు(38) ఆదివారం మృతి చెందారు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. చంగుడి గ్రామానికి చెందిన బమ్మిడి జోగారావు ఆదివారం ఉదయం వరి పొలానికి నీరు పెట్టడానికి వెళ్లారు. మోటారు వేయగా నీరు రాకపోవడంతో విద్యుత్ ఫ్యూజు పోయిందని గమనించి స్తంభం ఎక్కి ఫ్యూజు సరిచేస్తుండగా షాక్ కొట్టింది. దీంతో పెద్ద కేక వేసి అక్కడికక్కడే మృతి చెందాడు. పొలానికి వెళ్లిన భర్త తిరిగి రాకపోవడంతో భార్య నిర్మల పొలం వద్దకు వెళ్లి చూడగా జోగారావు విగత జీవిగా కనిపించాడు. దీంతో ఆమె కన్నీరుమున్నీరయ్యారు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు పొలంలో ఉన్న మృతదేహాన్ని పాతపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి పోస్టుమార్టం చేయించారు. తర్వాత మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతునికి యశ్వంత్(2), హేమతేజ(మూడు నెలలు) అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ ఎస్ కామేశ్వరరావు తెలిపారు.

సర్పంచ్ భర్త, అనుచరులపై టీడీపీ నాయకుల దాడి

కాశీబుగ్గ: పలాస మండలం అల్లుకోల పంచాయతీ సర్పంచ్ దువ్వాడ వామాక్షి భర్త దువ్వాడ రాజశేఖర రావు(రవి), వైఎస్సార్‌సీపీ నాయకుడు పైల లక్ష్మీనారాయణలపై ఆదివారం తెలుగుదేశం నాయకులు దాడికి పాల్పడ్డారు. నీటి తగాదాపై రాజీ కుదుర్చుకుందామని సమావేశం ఏర్పాటు చేసి రప్పించి ఓ ప్రణాళికతో దాడి చేశారని బాధితులు వెల్లడించారు. సమావేశానికి వెళ్లిన వెంటనే టీడీపీ నాయకులు పైల గిరిధర్, గేదెల బాబూరావు, పైల ఢిల్లీశ్వరరావు, పైల లవ కుమార్, పైల నారాయణ రావు తదితరులు మూకుమ్మడిగా దాడిచేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీరు పలాస ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. కాశీబుగ్గ సీఐ సాకేటి శంకరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఊరూరా ప్రజా సంకల్ప సంబరం

ప్రతిపక్ష నాయకుడి హోదాలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 2017 నవంబర్ ఆరో తేదీన ప్రారంభించిన ప్రజాసంకల్ప యాత్రకు ఆదివారంతో ఐదేళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహాలకు క్షీరాభిషేకాలు చేసి.. పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఆస్పత్రుల్లో రోగులకు మిఠాయిలు, పండ్లను పంపిణీ చేశారు. పాదయాత్ర సమయంలో ప్రజల కష్టాలు తెలుసుకున్న జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి జనాలకు చేరువయ్యారని వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న పార్టీ నాయకులు కొనియాడారు.

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ప్రజాసంకల్పయాత్రలో పేదోడి ఆకలి, కార్మికుల కష్టాలు, వృద్ధుల ఆర్తనాదాలు, మహిళల ఇబ్బందులను స్వయంగా చూసి చలించిపోయిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అప్పుడే సంక్షేమ రాజ్య స్థాపనకు కంకణం కట్టుకున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ప్రజాసంకల్ప యాత్ర చేపట్టి ఐదేళ్లయిన సందర్భంగా శ్రీకాకుళం ఏడురోడ్ల కూడలి వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి శత శాతం జరగాలంటే వికేంద్రీకరణతోనే సాధ్యపడుతుందన్న దూరదృష్టితో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మూడు రాజధానులకు ఆలోచన చేశారని చెప్పారు. టీడీపీ నేతలు స్వలాభం కోసం కుళ్లు రాజకీయాలు చేయడం మానుకోవాలన్నారు. టీడీపీ ప్రస్తుతం వెంటిలేటర్‌పై ఉందని, రాష్ట్ర అభివృద్ధికి ఇలాగే అడ్డుతగిలితే చరిత్రహీనులుగా మిగిలిపోతారన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, పార్టీ నగర అధ్యక్షుడు సాధు వైకుంఠరావు, కె.వి.ఎస్.ప్రకాష్, శ్రీనివాసరావు, టంకాల బాలకృష్ణ, మహిబుల్లాఖాన్, కసపల తేజ, వాన రమేష్ తదితరులు పాల్గొన్నారు.


లావేరులో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

రణస్థలం: జనబలమే తన బలమని బలంగా నమ్మి నిరూపించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలవాలని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ అన్నారు. ప్రజా సంకల్పయాత్ర ప్రారంభించి ఆదివారానికి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా జె.ఆర్.పురంలోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి ప్రజా సంక్షేమ పాలనకు నాడు జగనన్న చేసిన 3,468 కిలోమీటర్ల పాదయాత్రే నాంది అన్నారు. పాదయాత్రలో ప్రజల కష్టాలు చూసి చలించిపోయారని, ఎండనకా, వాననకా, రాత్రనక, పగలనక 14 నెలలు ప్రజల మధ్యనే గడిపిన మహా నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు.

నవరత్నాలతో పాటు రైతన్నలకు కష్టాలు తీర్చేందుకు రైతు భరోసా కేంద్రాలు, ప్రజలకు అత్యుత్తమ సేవలు వేగవంతంగా అందించేందుకు గ్రామ సచివాలయాలు, గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం చేరువ చేసేందుకు గ్రామీణ వైద్య కేంద్రాలు, ఆశ వర్కర్లకు రూ. 10 వేలు వేతనం, ఆర్టీసీని ప్రభుత్వం సంస్థలో విలీనం చేయడం, అవినీతి లేని పాలన అందించేందుకు వలంటీర్ల వ్యవస్థ, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కార్పొరేషన్ కల్పించడం, రాజన్న ముద్దబిడ్డ 108కు నూతన వాహనాలు, డ్రైవర్లకు వేతనాల పెంపు, వెయ్యి రూపాయలు దాటిన రోగాలకు ఆరోగ్య శ్రీ, మహిళలకు జగనన్న ఆసరా, డ్వాక్రా రుణాలు మాఫీ, ఇలా ప్రతీది ప్రజా సంకల్ప యాత్రలో ప్రజల కష్టాలు చూసి చేసినవేనని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లా ఆనందరావుపాత్రుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు మహంతి పెదరామినాయుడు, మైలపల్లి కామరాజు, బడి రాంబాబు, బవిరి రమణ, పాశపు ముకుంద, గొర్లె అప్పలనర్సునాయుడు, రెడ్డి విశ్వేశ్వరరావు, చినరామినాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.


లావేరు: వెంకటాపురంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసిన పార్టీ శ్రేణులు

విప్లవాత్మక మార్పులకు శ్రీకారం

లావేరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి చేపట్టిన ప్రజాసంకల్పయాత్ర విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రొక్కం బాలకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతన్నాయుడు అన్నారు. లావేరు, వెంకటాపురం గ్రామాల్లోని దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు భూరాడ చిన్నారావు, వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి దేశెట్టి తిరుపరావు, ఎంపీటీసీ సభ్యులు ఇనపకుర్తి సతీష్, జె.భానోజీరావు, సర్పంచ్‌లు బొంతు ఎల్లంనాయుడు, పిల్లా రాము, జగ్గురోతు సత్యన్నారాయణ, ఎచ్చెర్ల ఏఎంసీ డైరెక్టరు లంకపల్లి నారాయణరావు, ఉప సర్పంచ్ పి.దాము, లింగాలవలస మాజీ సర్పంచ్ వాళ్లే దాలినాయుడు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మీసాల అప్పారావు, పార్టీ సీనియర్ నాయకులు ఇనపకుర్తి చలపతిరావు, సగరపు విశ్వనాథం, లంకపల్లి గోపి, పడాల పాపారావు, లంకలపల్లి చిన్నారావు, బగ్గు హరిప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.


రణస్థలం: వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సాయికుమార్


ఎచ్చెర్ల క్యాంపస్: కుశాలపురం బైపాస్ కూడలిలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


జి.సిగడాం: వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న నాయకులు

ఐదేళ్ల సంబరాలు

ఎచ్చెర్ల క్యాంపస్: కుశాలపురం పంచాయతీ బైపాస్ కూడలి వద్ద ప్రజాసంకల్ప యాత్ర ఐదేళ్ల సంబరాలను పార్టీ శ్రేణులు జరుపుకున్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ప్రజాసంకల్ప యాత్ర స్ఫూర్తితో రాష్ట్రంలో ఆదర్శపాలన సాగుతోందని ఆనందం వ్యక్తం చే శారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు సనపల నారాయణరావు, మాజీ ఎంపీపీ బల్లాడ జనార్దనరెడ్డి, నాయకులు మాడుగుల మురళీధర్‌బాబా, పైడి త్రిమూర్తులు, పైడి రవి, నేతింటి నీలం, గుండ రవి, దుంప చిన్నారెడ్డి పాల్గొన్నారు.

ప్రజల కోసమే..

జి.సిగడాం: ప్రతిపక్ష నాయకుడి హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్ప యాత్ర భారతదేశ చరిత్రలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ అన్నారు. సర్వేశ్వరపురం వద్ద ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం ముషినివలస వరకు ప్రజలలో నాడు.. ప్రజల కోసం నేడు పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం ప్రజల కోసం శ్రమిస్తున్నారన్నారు. సర్పంచ్‌లు చందక సతీష్, కుమరాపు శ్రీనివాసరావు, రాష్ట్ర డైరెక్టర్ మామిడి బలరాం, మండల వైఎస్సార్‌సీపీ బూత్ కన్వీనర్ ఆబోతుల జగన్నాథం, సహకార సంఘం అధ్యక్షుడు ఏర్నేన ప్రకాశరావు, ఏపీటీసీ సభ్యుడు కుమరాపు రమేష్‌నాయుడు, పెద్ది శ్రీనివాసరావు, నాయకులు డోల వెంకటరమణ, మీసాల దానకర్ణ, కుమరాపు రాంమూర్తినాయుడు, కుమరాపు శ్రీనివాసరావు, ఆదినారాయణ, కృష్ణ ఆదిత్యవర్మరాజు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

గ్రామాల్లో అన్నప్రసాదం వితరణ


అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

జి.సిగడాం: కార్తీకమాసం రెండో ఆదివారం సందర్భంగా పలు గ్రామాల్లోని ఆలయాల ప్రాంగణంలో అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. పున్నాం, మానంపేట, మద్రివలస, పెంట గ్రామాల్లో జరిగిన అన్నదానంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కవి సమ్మేళనం


కవి సమ్మేళనంలో పాల్గొన్న తెరవే సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని శాంతినికేతన్ కళాశాలలో తెలుగు రచయితల వేదిక (తెరవే) 74వ నెలవారీ సాహితీ సమ్మేళనం ఆదివారం జరిగింది. తెరవే అధ్యక్ష కార్యదర్శుల ఆధ్వర్యంలో 14 మంది కవులు పలు అంశాలపై కవితలు వినిపించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ సెట్‌శ్రీ సీఈఓ. సురంగి మోహనరావు మాట్లాడుతూ సమాజాన్ని మేల్కొలిపే రచనలు వినిపించారని అభినందించారు. బ్రహ్మజీ సాహితీ ప్రసంగం చేశారు. కార్యక్రమంలో ఐఎన్‌డీ ప్రసాద్, ఎం.శ్రీనివాసరావు, ఎన్.హరి సత్యనారాయణ, బి.కోమలరావు, ఉత్తావల్లి నాగేశ్వరరావు, ఎం.ఉపేంద్రశర్మ, ఆర్.వి.రమణమూర్తి, ఇద్ది పాపయ్య, నిక్కు అప్పన్న, కె.సంతోష్‌కుమార్, బి.వెంకటరావు, ఈశ్వరరావు, బి.మోహన్‌గాంధీ, జగన్నాధరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దీపోత్సవం


దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

జి.సిగడాం: మద్రివలస గ్రామంలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా దీపోత్సవం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

దుప్పట్ల వితరణ


దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దాతలు

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని బెహరా మనోవికాస కేంద్రంలో దివ్యాంగులకు జిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిమెంట్ డిస్ట్రిబ్యూషన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కాపవరపు శీజు, డాడీ హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఫౌండర్ ప్రభాస్ సూర్య, జిల్ ఫౌండేషన్ సభ్యులు సత్యసాయి, సాయి, శివ ప్రసాద్, శేఖర్, వినోద్, మనోజ్, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బెజ్జిపురంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

లావేరు: బెజ్జిపురం గ్రామంలో సోమవారం ఉదయం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దన్నాన రాజినాయుడు ఆదివారం తెలిపారు. ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరగనున్న కార్యక్రమానికి నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు హాజరు కావాలన్నారు.

గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన


కథల పోటీలు నిర్వహిస్తున్న గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు

లావేరు: పుస్తక పఠనంతో జ్ఞానం లభిస్తోందని లావేరు శాఖాగ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. గ్రంథాలయంలో ఆదివారం పుస్తక ప్రదర్శన, చదవడం మాకిష్టం కార్యక్రమాలు నిర్వహించారు. మహాభారతం, రామాయణం, ఇతిహాసాలు, ఖురాన్, బైబిల్, పోటీ పరీక్షలకు చెందిన సుమారు 200 రకాల పుస్తకాలను ప్రదర్శనలో ఉంచారు. అనంతరం విద్యార్థులకు కథలు చదవడంపై పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. గ్రంథాలయ సహాయకుడు ఎ.గడ్డెయ్య ఉన్నారు.

ధైవత్వానికి చేరువకావాలి

శ్రీకాకుళం న్యూకాలనీ/కల్చరల్: ప్రతిఒక్కరూ దైవత్వానికి చేరువకావాలని ప్రగతి భారతమ్ ట్రస్ట్ చైర్మన్ తమనంపూడి రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.బి.జి.నాయుడు అన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం 'అఘోర్ అఖాడా–ఉజ్జయిని ఉప పీఠాధిపతుల'తో చేపడుతున్న ప్రత్యేక కార్యక్రమాలకు సంబంధించిన బ్రోచర్‌ను ఆదివారం శ్రీకాకుళంలోని ఓ హోటల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకాకుళం దమ్మల రెల్లివీధిలో సోమవారం ఉజ్జయిని ఉప పీఠాధిపతి రాజేష్‌నాథ్ అఘోరి ఆధ్వర్యంలో గోపూజ, శివాభిషేకం, భైరవ, దశ మహావిద్యాహవనం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు పండి యోగేశ్వరరావు, నూకల రోహిత్, ఇ.సీతరాజు, బాబూరావు, గురుమూర్తి, గణేష్, జగన్ తదితరులు పాల్గొన్నారు.


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

ఆలయ అభివృద్ధికి రూ. లక్ష విరాళం

రణస్థలం: కోటపాలెం శేరీలో వెలిసియున్న భద్రమహంకాళీ అమ్మవారి ఆలయ అభివృద్ధికి ఎన్‌టీఆర్ జిల్లా తిరువూరు పట్టణానికి చెందిన కలిశెట్టి రాంబాబు లక్ష రూపాయల విరాళంగా ప్రకటించారు. ఈ మొత్తాన్ని ఆలయ కమిటీ సమక్షంలో కోటపాలెం సర్పంచ్ గొర్లె జగదీష్‌కు ఆదివారం ఆలయ ప్రాంగణంలో అందజేశారు. కోటపాలెం ఎంపీటీసీ సభ్యుడు సుంకరి కిశోర్ కుమార్, కమిటీ సభ్యులు చౌదరి రాము, గొర్లె సీతారాం, మహంతి బోగినాయుడు, భాస్కరరావు, పిన్నింటి శ్యామ్, మీసాల దుర్గారావు, శంకర్, సురేష్, కిరణ్, ఆలయ ధర్మకర్త పాల్గొన్నారు.


విరాళాన్ని అందజేస్తున్న రాంబాబు

రోటరీ క్వీన్‌గా శ్వేత

శ్రీకాకుళం అర్బన్: రోటరీ డిస్ట్రిక్ట్–3020 స్థాయిలో విశాఖపట్నం వాల్తేరు క్లబ్‌లో రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ ఆధ్వర్యంలో విజయవాడ నుంచి ఇచ్ఛాపురం వరకు ఉన్న రోటరీ ప్రతినిధుల కుటుంబ సభ్యులకు 'రోటరీ క్వీన్' పోటీలు నిర్వహించారు. ఇందులో శ్రీకాకుళం రోటరీ క్లబ్‌కి చెందిన బరాటం శ్వేత శ్రీనివాస్ 'రోటరీ క్వీన్'గా ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా శ్వేతను సహాయ గవర్నర్ ఎంఆర్‌కే దాస్, అధ్యక్షులు అన్నెపు సత్యనారాయణ, కార్యదర్శి బరాటం శ్రీనివాస్, ప్రాంతీయ కార్యదర్శులు సి.వి.రాజులు, డి.శివశంకర్, ఉపాధ్యక్షులు డాక్టర్ గీతా శ్రీకాంత్ ఆదివారం అభినందించారు.


బరాటం శ్వేత శ్రీనివాస్

అవినీతి నిర్మూలన అందరి బాధ్యత

శ్రీకాకుళం రూరల్: అవినీతి నిర్మూలనకు అందరూ కలిసి రావాలని విజిలెన్స్ డీఎస్పీ ఎస్.కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. మునసబుపేటలోని గురజాడ విద్యాసంస్థలో ఆదివారం విజిలెన్స్ అవగాహన వారోత్సవాలలో భాగంగా ఆయన మాట్లాడారు. కరప్షన్ ఫ్రీ ఇండియా ఫర్ డెవలప్‌మెంట్ నేషన్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ అశోక్, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వక్తలు

చిన్నారులకు వక్తృత్వ పోటీలు

శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళంలోని చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం చిన్నారులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. 25 మంది పిల్లలు హాజరుకాగా, విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఎల్.నందికేశ్వరరావు, బీఎంఎస్ పట్నాయక్, నటుకుల మోహన్, సాయిప్రసాద్, నిక్కు హరిసత్యనారాయణ, అప్పలనాయుడు, ఎల్.దీప్తి తదితరులు పాల్గొన్నారు.

దక్షిణామూర్తి స్తోత్రంపై ప్రవచనాలు

శ్రీకాకుళం కల్చరల్: శివకేశవుల అభేదాలను తెలిపేదే దక్షిణామూర్తి స్తోత్రమని, కార్తీక మాసంలో దీన్ని చదవడం మంచిదని ప్రముఖ వక్త నిష్టల నర్సింహమూర్తి అన్నారు. నగరంలోని ఉపనిషన్మందిరంలో దక్షిణామూర్తి స్తోత్రంపై ఆదివారం ప్రసంగించారు. కార్యక్రమంలో ఎస్. నారాయణమూర్తి, బి.కోమలరావు, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.


వక్తను సత్కరిస్తున్న మందిర సభ్యులు

నేటి నుంచి విద్యుత్ సరఫరా వేళల్లో మార్పు

లావేరు: మండలంలో సోమవారం నుంచి త్రీఫేజ్ విద్యుత్ సరఫరా వేళల్లో మార్పులు చేసినట్టు ఏఈ పి.వెంకటరమణమూర్తి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఇంతవరకూ ఉదయం ఆరు నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకూ సరఫరా ఉండేదన్నారు. సోమవారం నుంచి ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ త్రీఫేజ్‌లో కరెంటు సరఫరా ఉంటుందని.. రైతులు గమనించాలన్నారు.

చురుగ్గా హద్దురాళ్ల ఏర్పాటు


పనులు పరిశీలిస్తున్న తహశీల్దార్ వెంకటరావు

శ్రీకాకుళం రూరల్: రీసర్వే జరిగిన ప్రభుత్వ భూముల్లో హద్దురాళ్ల ఏర్పాటు చురుగ్గా జరుగుతోందని శ్రీకాకుళం రూరల్ మండల తహశీల్దార్ ఎస్.వెంకటరావు తెలిపారు. ఆదివారం బైరివానిపేట, బైరి, బలివాడ గ్రామాల్లో 80 హద్దురాళ్లు ఏర్పాటు చేశారు. వారంలోగా ఈ ప్రక్రియ పూర్తి చేస్తామని చెప్పారు.

ఎమ్మెల్సీ ఓటు హక్కు దరఖాస్తుల అందజేత


డీటీకి దరఖాస్తులు అందిస్తున్న మామిడి శ్రీకాంత్

శ్రీకాకుళం రూరల్: ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటు హక్కుకు సంబంధించిన ఫారం–18 దరఖాస్తులను రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్, ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల పరిశీలకుడు మామిడి శ్రీకాంత్ డిప్యూటీ తహశీల్దార్ రాజుకు అందజేశారు. ఇప్పటి వరకు ఆరు వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ధనుంజయకు పరామర్శ

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎన్ని ధనుంజయరావు ఇటీవల ప్రమాదానికి గురికావడంతో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ఆదివారం పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి అండగా ఉంటామని భరోసానిచ్చారు.

నర్సింగరావు మృతికి సంతాపం

శ్రీకాకుళం కల్చరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ పి.జగన్మోహనరావు తండ్రి పి.నర్సింగరావు (రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్) ఆదివారం సాయంత్రం తన ఇంటి వద్ద మృతిచెందారు. ఈయన పీఎన్‌కాలనీలోని న్యూసెంట్రల్ స్కూల్‌ను స్థాపించారు. సోమవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈయన మృతిపట్ల పలువురు సంతాపం తెలిపారు.

ప్రత్యేక ఆధార్ కేంద్రాల ఏర్పాటు

రణస్థలం: ఆధార్ కార్డుతో ఓటర్ కార్డును జత చేయడానికి ఫారం 6–బీని ఓటర్ స్వచ్ఛందంగా నమోదు చేయించుకోవచ్చునని ఎచ్చెర్ల నియోజకవర్గ ఎన్నికల ఉప తహసీల్దార్ జి.కె.శ్రీనివాస్ తెలిపారు. రణస్థలంలో డోర్ టు డోర్ ఆధార్ అనుసంధానం, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ నమోదు ఫారాలను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లోని బూత్ లెవెల్ అధికారుల సమక్షంలో ఆధార్ సేకరణ కోసం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గతంలో జనవరిలో మాత్రమే ఓటర్ నమోదుకు అవకాశం ఉండేదని, కానీ ప్రస్తుతం 17 ఏళ్లు నిండిన యువతి, యువకులు జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబర్ నెలల్లో నమోదుకు అవకాశం కల్పించి ఓటర్ జాబితా నవీకరణ చేస్తామన్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో 309 పోలింగ్ కేంద్రాల పరిధిలో 2,36,465 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వీరిలో పురుషులు 1,19,636, మహిళలు 1,16,803 నమోదై ఉన్నారన్నారు. ఇంటి వద్దకే బూత్ లెవెల్ అధికారులు వచ్చి అధార్ అనుసంధాన ప్రక్రియ చేస్తున్నారని వారికి సహకరించాలన్నారు.


డోర్ టు డోర్ పరిశీలిస్తున్న శ్రీనివాస్

మధుమేహంపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న డాక్టర్ లుకలాపు ప్రసన్నకుమార్

శ్రీకాకుళం అర్బన్: మధుమేహ వ్యాధి జీవన శైలి, ఆహారపు అలవాట్లు, వంశపారంపర్యంగా సంక్రమిస్తుందని, దీనిపై పూర్తి అవగాహన ఉండాలని రిమ్స్ డిప్యూటీ సూపరింటెండెంట్, ఆర్థో వైద్య నిపుణుడు డాక్టర్ లుకలాపు ప్రసన్నకుమార్ అన్నారు. లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో రైతు బజార్ ఎదురుగా ఆదివారం ఉచిత మధుమేహ వైద్యశిబిరం నిర్వహించారు. మధుమేహ వైద్య నిపుణుడు డాక్టర్ సత్య స్వరూప్ పలు సూచనలు అందించారు. అనంతరం 300 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీకాకుళం సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు కె.ఎన్.ఎస్.వి. ప్రసాద్, రీజనల్ చైర్మన్ నటుకుల మోహన్, జోన్ చైర్మన్ డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, ప్రొఫెసర్ విష్ణుమూర్తి, పొన్నాడ రవికుమార్, వి.జగన్నాథంనాయుడు, క్లబ్ ప్రతినిధులు శ్రీనివాసరావు, శిల్లా మణి, తర్లాడ అప్పలనాయుడు, జి.ఈశ్వరరావు, మురళి, శ్రీను, చిరంజీవి, మౌళి, ఢిల్లేశ్వరరావు పాల్గొన్నారు.

పంచారామాలకు బస్సు సేవలు

శ్రీకాకుళం అర్బన్: కార్తీకమాసం సందర్భంగా ఒకే రోజు పంచారామాలను దర్శించుకునే సదవకాశం కల్పిస్తున్నట్లు ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ కె.మాధవ్ తెలిపారు. ఆదివారం శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో వాకర్లు, వయోజనులు, పలు దేవాలయాల్లోని భక్తులకు పంచారామాల దర్శనంపై కరపత్రాలను పంపిణీ చేసి అవగాహన కల్పించారు. ఒకేరోజు అమరావతి, ద్రాక్షారామం, పాలకొల్లు, భీమేశ్వరం, సామర్లకోట శైవక్షేత్రాల దర్శనం చేయిస్తామన్నారు. శబరి మలయాత్ర, అరకు, విశాఖకు టూర్ ప్యాకేజీలు, పిక్నిక్‌లకు ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ వి.రమేష్, ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు, టీఐ–3 ఎల్ఎస్ నాయుడు, ఆర్టీసీ ఉద్యోగులు కె.జి.రావు, జి.త్రినాథ్, ఎంపీ రావు తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ఆవరణలో అవగాహన కల్పిస్తున్న ఆర్టీసీ అధికారులు

చిన్నారులకు దేశభక్తి గీతాలాపన పోటీలు


మాట్లాడుతున్న హారికాప్రసాద్

శ్రీకాకుళం అర్బన్: నవభారతావని నిర్మాణానికి పునాదులు వేసిన మహనీయుడు జవహర్ లాల్ నెహ్రూ అని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు హారిక ప్రసాద్ అన్నారు. నగరంలోని హడ్కో కాలనీ పార్కు గ్రంథాలయంలో బాలల దినోత్సవం సందర్భంగా చిన్నారులకు దేశభక్తి గీతాల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ నిక్కు అప్పన్న, ప్రొఫెసర్ విష్ణుమూర్తి, గ్రంథాలయ అధికారి ఉగ్రసేన్, బాలకథా నిలయం వ్యవస్థాపకుడు ఉమామహేశ్వరరావు, ఉపాధ్యాయులు రవి, రవితేజ పాల్గొన్నారు.

యువకుడికి గాయాలు

శ్రీకాకుళం క్రైమ్ : పట్టణంలోని ఏపీహెచ్‌బీ కాలనీకి చెందిన కె.ఆదినారాయణ అనే యువకున్ని శనివారం రాత్రి ద్విచక్రవాహనదారుడు ఢీకొనడంతో కాళ్లు, చేతులకు గాయాలయ్యాయని ట్రాఫిక్ ఎస్ఐ పి.వి.రమణ తెలిపారు. 80 ఫీట్ రోడ్డులో ఓ రెస్టారెంటులో వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న ఆదినారాయణ విధులు ముగించుకుని ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ద్విచక్రవాహనదారుడు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందని చెప్పారు. బాధితుడు ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

క్లుప్తంగా

శ్రీశైలానికి 22,203 క్యూసెక్కుల వరద

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయానికి ఆదివారం సాయంత్రానికి జూరాల, సుంకేసుల నుంచి 22,203 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. రెండు జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పాదన అనంతరం 51,635 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు విడిచిపెట్టారు. బ్యాక్‌వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా 4,500 క్యూసెక్కులు, హంద్రీ–నీవా సుజల స్రవంతికి 1,688 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతలకు 1,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం జలాశయంలో 880.60 అడుగుల మట్టంలో 191.2118 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ప్రధాని పర్యటనకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు



ప్రధాని పర్యటన మార్గాన్ని సందర్శిస్తున్న సోము వీర్రాజు, ఎంపీ జీవీఎల్ తదితరులు

ఎంవీపీకాలనీ (విశాఖ తూర్పు): విశాఖపట్నంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పర్యటనకు పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు పిలుపునిచ్చారు. ఈ నెల 11, 12 తేదీల్లో ప్రధాన మంత్రి పర్యటించనున్న నేపథ్యంలో రెండు రోజులుగా పార్టీ శ్రేణుల సన్నద్ధతపై సమీక్షలు నిర్వహిస్తున్న ఆయన ఆదివారం ప్రధాని పర్యటించే మార్గాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సోము వీర్రాజు మాట్లాడుతూ 11వ తేదీన భారతీయ జనతా పార్టీ శ్రేణులు ప్రధాన మంత్రికి ఘనస్వాగతం పలుకుతాయని తెలిపారు. ఈ సందర్భంగా భారీ రోడ్ షో నిర్వహిస్తామని, ఉత్తరాంధ్ర ప్రసిద్ధ సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీ జి.వి.ఎల్.నరసింహారావు, ఎమ్మెల్సీ మాధవ్, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్‌రాజు, విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఇది.. ప్రధాని మోదీకి గౌరవసభ

- 12వ తేదీ 11 గంటలకు సభ.. ప్రజలు 10గంటలకే రావాలి
- ప్రధానమంత్రికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఘన స్వాగతానికి ఏర్పాట్లు
- ఏర్పాట్లపై సమీక్షలో మంత్రి అమర్‌నాథ్, ఎంపీ విజయసాయిరెడ్డి



సమీక్షలో మాట్లాడుతున్న ఐటీ శాఖ మంత్రి అమర్‌నాథ్, ఎంపీ విజయసాయిరెడ్డి

సాక్షి, విశాఖపట్నం: దాదాపు నాలుగేళ్ల తర్వాత ఈ నెల 11వ తేదీన విశాఖపట్నం వస్తున్న ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి ఘనస్వాగతం పలికేందుకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు విజయసాయిరెడ్డి చెప్పారు. 12వ తేదీ ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ప్రధాని బహిరంగసభని రాజకీయసభగా కాకుండా.. మోదీకి అందిస్తున్న గౌరవసభగా అన్ని పార్టీల ప్రతినిధులు, ప్రజలు భావించాలని కోరారు. ప్రధాని మోదీ పర్యటన ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడానికి రెండురోజుల పర్యటనకు వస్తున్న ప్రధాని సభాప్రాంగణంలో అసౌకర్యాలు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధాని సభకు పెద్ద ఎత్తున హాజరయ్యే ప్రజలు ఎంత సురక్షితంగా సభకు వస్తారో, అంతే సురక్షితంగా వారు ఇళ్లకు చేరుకునేలా చూడాలన్నారు. ఈ సభలో ముందుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగిస్తారని తెలిపారు. ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు విజయసాయిరెడ్డి మాట్లాడుతూ ప్రధాని మోదీ ఈ నెల 11వ తేదీ రాత్రి ఏడుగంటలకు విశాఖ చేరుకుంటారని, ఆయనకు సీఎం వైఎస్ జగన్ ఆత్మీయ స్వాగతం పలుకుతారని చెప్పారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి, ప్రధాని కొద్దిసేపు సమావేశమవుతారన్నారు. 12వ తేదీన ఆంధ్ర యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో జరిగే సభలో ఏడు పథకాలకు మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని చెప్పారు. ప్రధాని సభకు భారీగా తరలివచ్చే జనానికి అవసరమయ్యే కనీస సౌకర్యాలను 10వ తేదీ నాటికి పూర్తిచేయాలని అధికారుల్ని కోరారు. ముఖ్యంగా తాగునీరు, టాయిలెట్స్, ఫస్ట్ ఎయిడ్ సెంటర్లను ఎక్కడికక్కడ ఏర్పాటు చేయాలని సూచించారు. 11 గంటలకి మోదీ సభ ప్రారంభం అవుతుందని, 10 గంటలకే ప్రజలు సభా ప్రాంగణానికి వచ్చేలా చూడాలని చెప్పారు.

25 మందితో కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్

కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టాయిలెట్లు, అంబులెన్సులు, మెడికల్ క్యాంపులు, తాగునీరు అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. సభా ప్రాంగణానికి జనం తరలివచ్చే మార్గాలను నిరంతరం పర్యవేక్షించేందుకు 25 మంది సిబ్బందితో కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నగర పోలీస్ కమిషనర్ శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రధాని సభకు జనాన్ని తీసుకువచ్చే వాహనాలను నగరంలోని వివిధ ప్రాంతాల్లో పార్క్ చేయడానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సభాప్రాంగణం నుంచి వీవీపీలు వెళ్లిన తర్వాత జనాన్ని సురక్షితంగా వారి గమ్య స్థానాలకు చేర్చేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే నాగిరెడ్డి, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, విజయనగరం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ విశాఖ ఉత్తర నియోజకవర్గం ఇన్‌చార్జ్, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు, జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, ఏయూ రిజిస్ట్రార్ కృష్ణమోహన్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

● తెలంగాణ

కారెక్కిన మునుగోడు

▶ మొదటి పేజీ తరువాయి

కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డికి 97,006 ఓట్లురాగా.. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి 86,697 ఓట్లు, పాల్వాయి స్రవంతికి 23,906 ఓట్లు వచ్చాయి. మొత్తం 686 పోస్టల్ బ్యాలెట్లు, 5 సర్వీసు ఓట్లలో.. టీఆర్‌ఎస్‌కు 405 పోస్టల్, 3 సర్వీసు ఓట్లు.. బీజేపీకి 211 పోస్టల్, ఒక సర్వీసు ఓటు.. కాంగ్రెస్‌కు 41 పోస్టల్, ఒక సర్వీసు ఓటు లభించాయి. మిగతా ఓట్లు బరిలో ఉన్న మిగతా 44 మంది అభ్యర్థులు, నోటాకు పడ్డాయి.

బీజేపీ, టీఆర్‌ఎస్ మధ్యే..

ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపులో తొలుత బీజేపీ, టీఆర్‌ఎస్ మధ్య నువ్వానేనా అన్నట్టుగా కొనసాగింది. దీనితో రాష్ట్రవ్యాప్తంగా ఫలితాలపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. మొత్తం 15 రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరిగింది. ఇందులో 3 రౌండ్లలో బీజేపీ ఆధిక్యం సాధించగా, మిగతా అన్ని రౌండ్లలో టీఆర్‌ఎస్ హవా కనిపించింది. కాంగ్రెస్ తొలి నుంచీ 3వ స్థానంలోనే ఉంది. మొత్తంగా బీజేపీ అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డిపై టీఆర్‌ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి 10,309 ఓట్లు మెజారిటీ సాధించారు.

ఆద్యంతం ఉత్కంఠగా..

ఉప ఎన్నిక పోలింగ్‌కు సంబంధించి అన్ని సర్వేలు టీఆర్‌ఎస్ వైపే మొగ్గుచూపాయి. భారీ మెజారిటీ వస్తుందని అనుకున్నా 10,309 ఓట్లు ఎక్కువ వచ్చాయి. అయితే ప్రతి రౌండ్ ఓట్ల లెక్కింపులో కొద్దిపాటి ఆధిక్యమే కనిపించడంతో ఉత్కంఠ నెలకొంది. బీజేపీ మొదటి రౌండ్ నుంచి 10వ రౌండ్ వరకు గట్టి పోటీ ఇస్తూ వచ్చింది. తర్వాత పరిస్థితి మెల్లగా టీఆర్‌ఎస్ వైపు మొగ్గింది. 12వ రౌండ్ సమయానికి టీఆర్‌ఎస్ గెలుపు ఖాయమైపోయిందన్న అంచనాకు వచ్చేశారు. అయితే నియోజకవర్గంలో బీజేపీకి ఓట్లు పెరిగాయి. 2018లో బీజేపీ అభ్యర్థి గంగిడి మనోహర్‌రెడ్డికి 12,725 ఓట్లు లభించాయి. తాజాగా బీజేపీ అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డికి 86,694 ఓట్లు వచ్చాయి. మొత్తంగా నియోజకవర్గంలో బీజేపీకి పట్టు పెరిగిందని ఆ పార్టీ నేతలు అంటున్నారు.

ఉప ఎన్నికపై ఎవరేమన్నారంటే..

బీజేపీకి చెంప దెబ్బ

డబ్బు, మద్యం, అధికార మదంతో జనం గొంతు నొక్కి, ఓటర్లను కొనాలని బీజేపీ చేసిన ప్రయత్నాలు మునుగోడు ప్రజల చైతన్యం ముందు విఫలమయ్యాయి. మునుగోడు ప్రజలు తెలంగాణ ఆత్మ గౌరవాన్ని చాటిచెబుతూ బీజేపీకి చెంపదెబ్బ రుచి చూపించారు. ప్రధాని మోదీ, అమిత్‌షాలు వెనుక ఉండి నడిపిన ఈ ఉప ఎన్నిక ఎపిసోడ్‌లో ప్రజల తీర్పుతో వారికి చెక్కరొచ్చింది.

– కేటీ రామారావు, మంత్రి, టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

ఇది గొప్ప ప్రజా తీర్పు

మునుగోడు ఉప ఎన్నికలో ఓటర్లు గొప్ప తీర్పు ఇచ్చారు. ధర్మమే గెలిచింది. అహంకారానికి, ఆత్మగౌరవానికి మధ్య జరిగిన యుద్ధంలో ఆత్మగౌరవమే నెగ్గింది. బీజేపీ.. డబ్బు అహంకారంతో ప్రజలను మభ్యపెట్టి గెలవాలని చూసినా, ప్రజలు వారి యత్నాన్ని తిప్పికొట్టారు. మునుగోడు ప్రజల రుణం తీర్చుకుంటాం.

– కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

ఫలితం కంటే నిబద్ధత ముఖ్యం

రాజకీయాల్లో గెలుపోటములు సహజం. ఫలితం కంటే ఎంత నిబద్ధతతో పని చేశామన్నది ముఖ్యం. మునుగోడులో ప్రలోభాలకు లొంగకుండా, నిఖార్సుగా, నిబద్ధతగా పని చేసిన ప్రతి కార్యకర్తకు, నాయకులకు హృదయ పూర్వక ధన్యవాదాలు.

– ట్విటర్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

నైతిక విజయం నాదే

31వ తేదీ వరకు ధర్మ యుద్ధంలా సాగింది. 1వ తేదీ నుంచి బయటి వ్యక్తులు నియోజకవర్గంలోకి వచ్చి తిష్ట వేయడంతో పరిస్థితి మారిపోయింది. పోలీసుల సహకారంతో మంత్రులు ప్రజలకు డబ్బులు పంచారు. భయభ్రాంతులకు గురి చేశారు. ఒక వ్యక్తిని ఓడించేందుకు 100 మంది ఎమ్మెల్యేలను మోహరించారు. తెరాసది అధర్మ గెలుపు. నైతిక విజయం నాదే.

– కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి

5 వేల మెజారిటీతో గెలుస్తా అనుకున్నా

గత ఎన్నికల కంటే ఎక్కువ మెజారిటీతోనే కాంగ్రెస్ గెలుస్తుందని అందరూ భావించారు. కనీసం 5 వేల మెజారిటీతో గెలుస్తాననుకున్నా. అయితే ఆశించిన స్థాయిలో ఓట్లు రాలేదు.

– పాల్వాయి స్రవంతి, కాంగ్రెస్ అభ్యర్థి

ప్రజా తీర్పును శిరసా వహిస్తాం

మునుగోడు ఉప ఎన్నికలో ప్రజాతీర్పును శిరసావహిస్తున్నాం. గెలిచినప్పుడు పొంగిపోము. ఓడిపోయినప్పుడు కుంగిపోము. రాజగోపాల్‌రెడ్డి యుద్ధంలో హీరోలా పోరాడారు. టీఆర్‌ఎస్ నేతలు పిచ్చి కూతలతో బీజేపీ కార్యకర్తల మనోస్థైర్యాన్ని దెబ్బ తీయలేరు. మరింత ఉత్సాహంతో, కసితో ప్రజల పక్షాన పోరాడతాం.

– బండి సంజయ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు

ఖర్చుకు వెనకాడొద్దు

విద్యుత్ ప్రమాదాల నివారణకు పటిష్ట వ్యవస్థను రూపొందించండి

- అభివృద్ధి చెందిన దేశాల్లోని విధానాలను అధ్యయనం చేయాలి
- సబ్‌స్టేషన్ల కమిటీలతో విద్యుత్ ప్రమాదాలపై అవగాహనా సదస్సులు నిర్వహించండి
- విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను తరచూ తనిఖీ చేయాలి
- విద్యుత్ సంస్థలకు మంత్రి పెద్దిరెడ్డి ఆదేశం



సాక్షి, అమరావతి: విద్యుత్ ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన భద్రతా వ్యవస్థను రూపొందించాల్సిందిగా రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. ఇంధన శాఖ అధికారులతో ఆయన ఆదివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇటీవల అనంతపురం జిల్లాలో విద్యుత్ ప్రమాదం జరిగిన వెంటనే సీఎం వైఎస్ జగన్ తక్షణమే స్పందించి బాధిత కుటుంబాలకు రూ.10 లక్షలను పరిహారంగా అందజేశారని, అయితే ముమ్ముందు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారన్నారు. విద్యుత్ సంస్థల బలోపేతానికి ఇప్పటికే రూ.40వేల కోట్లు ఇచ్చిన ప్రభుత్వం ప్రజలకు విద్యుత్ భద్రత కల్పించే విషయంలో ఎంత వ్యయం చేసేందుకైనా వెనుకాడదని పెద్దిరెడ్డి స్పష్టంచేశారు. అభివృద్ధి చెందిన దేశాల్లో విద్యుత్ భద్రతకు అనుసరిస్తున్న సాంకేతిక పద్ధతులను అధ్యయనంచేసి తగిన కార్యాచరణ రూపొందించాలని ఆయన సూచించారు.

ప్రమాదాల నివారణకు సూచనలు..

ఇక విద్యుత్ ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విద్యుత్ సబ్‌స్టేషన్ల కమిటీల సమావేశాలు నిర్వహించడంతోపాటు పత్రికలు, వివిధ మీడియాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని, పోస్టర్లు, కరపత్రాలు పంపిణీ వంటి చర్యలు చేపట్టాలన్నారు. అలాగే.. మంత్రి ఇంకా ఏం చెప్పారంటే..

- క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందికి ప్రజలను విద్యుత్ ప్రమాదాల నుంచి కాపాడే వివిధ అంశాలపై శిక్షణనివ్వాలి.
- విద్యుత్ ప్రమాదాలకు ఆస్కారం ఉన్నచోట్ల హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయాలి. ఆపరేషన్, మెయింటెనెన్స్ సిబ్బంది, కాంట్రాక్టు ఏజెన్సీలు వీటిని కచ్చితంగా పాటించాలి.
- విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు వంటి వాటిని క్రమం తప్పకుండా తనిఖీ చేయాలి. ఈ పనులు నిర్వహించే చోట ప్రమాదాల నివారణకు లోకల్ ఎర్తింగ్ ఏర్పాటు చేయాలి.
- హైటెన్షన్ విద్యుత్ లైన్ల సమీపంలో గృహాలు, ఇతర నిర్మాణాలను చేపట్టకూడదు.
- ఏడువేల మంది ఎనర్జీ అసిస్టెంట్లకు విద్యుత్ భద్రతా అంశాలపై శిక్షణనిచ్చి వారి సేవలను వినియోగించుకోవాలి.
- 1912 టోల్ ఫ్రీ నంబర్లపై అవగాహన కల్పించాలి. ఫిర్యాదులను డిస్కంలు పరిష్కరించాలి.
- ఈ కార్యక్రమంలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ బి. శ్రీధర్, డిస్కంల సీఎండీలు కె. సంతోషరావు, జె. పద్మ జనార్దనరెడ్డి, ఏపీఈఎస్ ఈసీఎం సీఈఓ ఎ. చంద్రశేఖరరెడ్డి, వివిధ జిల్లాల నుంచి అధికారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా అథ్లెటిక్స్ పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: సిక్కోలులో అథ్లెటిక్స్ పోటీలు కన్నుల పండువగా సాగాయి. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం స్వర్గీయ కొన్న చిన్నారావు మెమోరియల్ పేరిట నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్–2022 పోటీలు ఆద్యంతం ఉత్సాహంగా సాగాయి. జిల్లా నలుమూలల నుంచి రికార్డు స్థాయిలో 800 మంది వరకు బాలబాలికల హాజరయ్యారు. అండర్ 12, 14, 16, 18, 20 వయో విభాగాల్లో పోరు కొనసాగింది. ముఖ్యంగా 100, 200, 400 మీటర్ల పరుగు పందాలు, లాంగ్ జంప్, హైజంప్, షాట్‌పుట్, జావెలిన్ త్రో, డిస్కస్ త్రో నువ్వా–నేనా అన్నట్లుగా సాగాయి. పోటీలకు హాజరైన బాలబాలికలకు, అఫీషియల్స్‌కు నిర్వాహకులు నాణ్యమైన వసతి, భోజనాలు సౌకర్యాలు కల్పించారు.

పోటీలను ప్రారంభించిన కృష్ణదాస్..

ఈ పోటీలను ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అండర్–16 బాలుర 800 మీటర్ల పరుగు పందెంను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ జిల్లాలో క్రీడలను ప్రోత్సహించేందుకు దశాబ్దన్నర నుంచి క్రీడా పోటీలను నిర్వహిస్తున్న కొన్న వెంకటేశ్వరరావు, వారి కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వంతోపాటు దాతల ప్రోత్సాహం కూడా క్రీడలకు అవసరమన్నారు. గెలుపోటములను సమానంగా తీసుకోవాలని క్రీడాకారులకు దాసన్న పిలుపునిచ్చారు. మీట్ నిర్వాహకులు, అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొన్న వెంకటేశ్వరరావు(వాసు) మాట్లాడుతూ పోటీల నిర్వహణలో తమకు అన్ని విధాలుగా సహకరిస్తున్న మిత్రబృందానికి కృతజ్ఞతలు తెలిపారు. అంతకు ముందు స్వర్గీయ కొన్న చిన్నారావు చిత్రపటానికి అతిథులు, అధికారులు, నిర్వాహకులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పూర్వపు జాతీయ అథ్లెటిక్స్ క్రీడాకారులు పద్మజ, వెంకటరమణ మూర్తి దంపతులను మాజీ డిప్యూటీ సీఎం కృష్ణదాస్, వాసు, నిర్వహణ కమిటీ ప్రతినిధులు తదితరులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ ఎంవీ పద్మావతి, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుందరరావు మాస్టారు పాల్గొన్నారు.

విజేతలకు పతకాలు, ప్రశంసా పత్రాల అందజేత..

ఈ సందర్భంగా జరిగిన ముగింపు, బహుమతుల పంపిణీ కార్యక్రమానికి శ్రీకాకుళం మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి హాజరై పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. తండ్రి జ్ఞాపకార్థ రూ.లక్షలు వెచ్చించి క్రీడాపోటీలను నిర్వహిస్తున్న కొన్న వెంకటేశ్వరరావు, వారి కుటుంబ సభ్యులను ఆదర్శంగా నిలుస్తారని మెచ్చుకున్నారు.

శిల్పకళా సంపదకు ఆనవాలు

కొండగుళ్లు

- ఏకశిలపై బ్రహ్మలింగేశ్వరస్వామి
- కార్తీక మాసంలో పిక్‌నిక్ స్పాట్



కొండగుళ్లు కొండపై నిర్మించిన బ్రహ్మలింగేశ్వరస్వామి, సత్యనారాయణస్వామి ఆలయాలు

వేపాడ:

ప్రాచీన శిల్పకళాసంపదకు ఆనవాలుగా నిలిచిన దేవాలయాల్లో కొండగుళ్లు బ్రహ్మలింగేశ్వర స్వామి ఆలయం ఒకటి. జిల్లాలోని వేపాడ మండలం, గుడివాడ సమీపంలో ఉన్న ఈ ఆలయానికి కార్తీక మాసంలో పూజల కోసమే కాకుండా పిక్‌నిక్ స్పాట్‌గా భక్తులు అధికసంఖ్యలో వస్తుంటారు. గుడివాడ, కరకవలస, చామలాపల్లి, ఆకులసీతంపేట గ్రామాల నడుమ ఏకశిలపై వెలసిన బ్రహ్మలింగేశ్వర స్వామి ఆలయం కార్తీక మాసంలో పూజలకు నిలయమైంది. 1816–1818 సంవత్సరాల మధ్యకాలంలో విజయనగర సంస్థానాధీసులు ఏకశిలపై నిర్మించిన ఆలయం, ముస్లింరాజుల దాడులకు గురైందని పెద్దలు చెబుతుంటారు. ఆలయ గోడలపై ఉన్న శిల్పకళా సంపద సింహాచలం దేవాలయాన్ని పోలి ఉండడం విశేషం. ఆలయ ప్రాంగణంలో శిలాశాసనం ఎవరికీ అంతుపట్టని విధంగా ఉంది. పురాతత్వ శాస్త్రవేత్తలు, ఆంధ్రాయూనివర్సిటీ ఆర్కియాలజీ ప్రొఫెసర్లు, తిరుమల, తిరుపతి దేవస్థానం అధికారులు పలుమార్లు ఈ శిలాఫలకాన్ని పరిశీలించినప్పటికీ ఎవరూ ఆ లిపిని కనుక్కోలేకపోవడం శోచనీయం. ఏకశిలపై ఉన్న కొండగుళ్లు ప్రాంతంలో సింహాద్రప్పన్న స్వామి అడుగు మోపేసరికి ఆ ప్రాంతం ఒక సొరంగంగా మారడంతో అక్కడినుంచి ఆయన సింహాచలం వెళ్లిపోయారని పూర్వీకులు చెబుతున్నారు. ఎండోమెంటు అధీనంలో ఉన్న ఈ ఆలయానికి రికార్డులపరంగా ఆస్తులు ఉన్నప్పటికీ అభివృద్ధి అంతంతమాత్రంగా ఉండేది. భక్తులు అధికంగా విరాళాలు అందించడంతో ఆలయం అభివృద్ధి చెందింది.

పిక్‌నిక్ స్పాట్‌గా..

కార్తీకమాసంలో పిక్‌నిక్ స్పాట్‌గా పేరుండడంతో ప్రతి సోమవారం భారీ సంఖ్యలో అన్నసమారాధన, ఆలయం పరిసరాల్లో మామిడితోటల్లో పిక్‌నిక్‌లు జరుగుతూ ఉంటాయి. ఈ ఏడాది ఐదు సోమవారాలు వచ్చాయి. ఆలయ అర్చకుడు లట్టాల శంకరశర్మ ప్రతి సోమవారం ప్రత్యేక పాలాభిషేకం, రుద్రాభిషేకం నిర్వహిస్తూ ఉంటారు.



ఆలయంలో శివలింగానికి అభిషేకం చేస్తున్న అర్చకుడు శంకరశర్మ



సింహాద్రప్పన్న అడుగుతో సొరంగం ఏర్పడి స్థలం ఇదే

కొండగుళ్లు ఇలా వెళ్లాలి

బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయానికి వెళ్లాలంటే మూడు ప్రధాన రహదారులున్నాయి. మండలకేంద్రం వేపాడ నుంచి దబ్బిరాజుపేట, చామలాపల్లి మీదుగా కొండగుళ్లు, వేపాడ–సోంపురం ప్రధాన రహదారిలో జగ్గయ్యపేట నుంచి గుడివాడమీదుగా కొండగుళ్లు వెళ్లే రహదారి తారురోడ్డు కావడంతో భక్తులసంఖ్య పెరిగింది. సోంపురం నుంచి జాకేరు రోడ్డులో వెళ్తే కరకవలస మీదుగా కొండగుళ్లు చేరుకోవచ్చు. ఈ ఏకశిలపై బ్రహ్మలింగేశ్వర స్వామి ఆలయం, సత్యనారాయణ స్వామి, నవగ్రహాలు, శివపార్వతుల విగ్రహాలు, ధ్వజస్తంభం, నందివిగ్రహం నిర్మించారు. సుమారు 200 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ దేవాలయం అభివృద్ధిలో దేవదాయశాఖ నిర్లక్ష్యం చేసినప్పటికీ దాతలు సహకారంతో అభివృద్ధి చెందుతోంది.



కైలాసగిరిని పోలి ఉన్న పార్వతీపరమేశ్వరుల విగ్రహాలు

నాటకాలపై వర్క్‌షాపులు అవసరం



మాట్లాడుతున్న పరిషత్తుల సమాఖ్య అధ్యక్షుడు రామారావు

శ్రీకాకుళం కల్చరల్: యువతను నాటక రంగంవైపు ఆకర్షించడానికి వారికి నాటకాలపై వర్క్‌షాపులు నిర్వహించాలని సభ తీర్మానించింది. స్థానిక బాపూజీ కళామందిర్‌లో నాటక రంగ అభివృద్ధిపై ఆదివారం సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా పరిషత్తుల నిర్వహణకు తేదీలను నిర్ణయించేందుకు తదుపరి సమావేశంలో చర్యలు తీసుకునేందుకు నిర్ణయించారు. నాటకాలను స్కూళ్లలో ఒక సబ్జెక్టుగా తీసుకురావాలని, అందుకు ప్రభుత్వానికి విన్నవించాలని నిర్ణయించారు. కళాకారుల సమస్యలపైనా, పరిషత్తులు నిర్వహించడంలో వచ్చే సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో పరిషత్తుల సమాఖ్య అధ్యక్షులు బుద్దాల వేంకటరామారావు, ప్రధాన కార్యదర్శి జవ్వాది దాశరథి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు చిట్టి వేంకటరావు, ప్రెస్ విభాగం ఉపాధ్యక్షుడు జి.రామకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.సత్యప్రసాద్ పాల్గొన్నారు.

నీటి ట్యాంకు ధ్వంసం

మెళియాపుట్టి: మండలంలోని అతి పెద్ద పంచాయతీ చాపరలోని ఎస్సీ, బీసీ కాలనీల్లో తాగునీటి సదుపాయం కోసం ఇటీవల సర్పంచ్ బోసి రామారావు మినీ నీటి పథకం ఏర్పాటు చేశారు. పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి చేతులమీదుగా వీటిని ప్రారంభించారు. 250 కుటుంబాలకు తాగునీరు ఇచ్చే ఈ నీటి ట్యాంకును గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ విషయాన్ని గమనించిన సర్పంచ్ ఆదివారం నాడు వెంటనే నూతన ట్యాంక్ ఏర్పాటు చేశారు. ప్రజల కోసం ఏర్పాటు చేసిన వనరులపై కక్ష సాధింపు చూపడం శోచనీయమన్నారు.

ఊబకాయంతో అవస్థలు

- మహిళల్లో పెరుగుతున్న ఊబకాయం
- జీవన శైలిలో మార్పులే కారణమంటున్న వైద్య నిపుణులు
- శారీరక వ్యాయమానికి దూరమవుతున్న మహిళలు
- జిల్లాలో 10 నుంచి 15 శాతం మంది ఊబకాయం బాధితులు
- పట్టణ ప్రజల్లో ఊబకాయులు అధికం



ఊబకాయం ఉన్న మహిళ

విజయనగరం ఫోర్ట్:

జీవన శైలిలో మార్పులు, శారీరక వ్యాయమం లేకపోవడం, జంక్ ఫుడ్స్ అధికంగా తినడం తదితర కారణాల వల్ల ఊబకాయం బారిన జనం పడుతున్నారు. ఊబకాయం బారిన పడిన వారిలో పురుషుల కంటే మహిళలే అధికంగా ఉన్నారు. పిల్లలు, భర్త, అత్తమామల సంరక్షణలో పడి మహిళలు వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపడం లేదు. తగిన శారీరక శ్రమ లేకపోవడంతో టీవీలు, సెల్ చూసుకుంటే ఒకే చోట ఎక్కువ సేపు కూర్చోవడం వల్ల కూడా ఊబకాయం బారిన పడుతున్నారు. జిల్లాలో 10 నుంచి 15 శాతం ఊబకాయంతో బాధపడుతున్నారు. ఊబకాయం కారణంగా అనేక అనారోగ్య సమస్యలు బారిన పడుతున్నారు. ఊబకాయలను ఎగతాళి చేయడం వారిని మానసికంగా కృంగదీస్తుంది. ఊబకాయం ఉన్న మహిళలు ఎక్కువగా మానసికంగా ఇబ్బంది పడుతున్నట్టు తెలుస్తోంది. ఉమ్మడి విజయనగరం జిల్లా జనాభా దాదాపు 24 లక్షలు కాగా 2.30 లక్షల నుంచి 3.45 లక్షల వరకు ఊబకాయంతో బాధపడుతున్నారు.

ఊబకాయంతో ఎక్కువ మంది వస్తున్నారు..



ఇటీవల ఊబకాయంతో ఎక్కువ మంది ఆస్పత్రికి వస్తున్నారు. వారిలో కూడా మహిళలే ఎక్కువగా ఉన్నారు. కొవ్వు అధికంగా ఉన్న పదార్థాలు, మాంసం అధికంగా తినడం, జంక్ ఫుడ్స్ తినడం వల్ల ఊబకాయం బారిన పడుతున్నారు. ఊబకాయం తగ్గడానికి శారీరక వ్యాయమం చేయడంతో పాటు ఆహార విషయంలో మార్పులు తీసుకోవడం ద్వారా ఊబకాయాన్ని తగ్గించవచ్చు.

– డాక్టర్ మురళీకృష్ణ, వైద్యాధికారి, ఎన్‌సీడీ విభాగం

పట్టణ ప్రాంతాల్లో అధికం

గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణ ప్రాంతాల్లోనే మహిళలు, పురుషులు ఊబకాయంతో ఎక్కువగా ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అయితే మహిళలు, పురుషులు పొలాల్లో పని చేస్తారు. దీంతో వారికి నిత్యం శారీరక శ్రమ ఉంటుంది. అదేవిధంగా గ్రామీణ ప్రాంత ప్రజలు కూరగాయలు, పప్పు దినుసులు, పాలు వంటి సమతుల్య ఆహారాన్ని తింటారు. జంక్‌ఫుడ్స్ అనేది అరుదుగా తింటారు. పట్టణ ప్రాంతంలో ఉన్న మహిళలు ఇంటికే పరిమితం అవుతారు. వారికి శారీరక శ్రమ అనేది చాలా తక్కువ. దీనికి తోడు జంక్ ఫుడ్స్ ఎక్కువగా తింటారు. ఫిజ్జాలు, బర్గర్‌లు ఎక్కువగా, నూడిల్స్, చాట్స్ వంటివి ఎక్కువగా తింటారు. దీని వల్ల ఊబకాయం బారిన ఎక్కువగా పడుతున్నారు.

పూర్వీకులు మంచి ఆహారాన్ని తినేవారు

పూర్వకాలంలో సహజ సిద్ధంగా పండించే ఆహారాన్ని ఎక్కువగానే తినేవారు. పొలాల్లో, పెరటి తోటల్లో కూరగాయలు, పండ్లు సాగు చేసి వాటిని తినేవారు. పశువుల గెత్తంతోనే వరి పంటను పండించేవారు. దీంతో ఆరోగ్యకరమైన పంట వచ్చేది. అందులో పోషక విలువలు ఎక్కువగా ఉండడం వల్ల అవి తిన్న ప్రజలు ఎంతో ఆరోగ్యంగా ఉండేవారు. బీపీ, షుగర్, గుండె జబ్బులు అనేవి దరి చేరేవి కావు. గుండె జబ్బు అనేది ఒకశాతం ఉండడం కూడా గగనమే. నేడు అనేక మంది గుండె జబ్బులు బారిన పడుతున్నారు. తక్కువ వయసులోనే గుండె పోటు, పక్షవాతం వంటి వ్యాధులు బారిన పడుతున్నారు.

వ్యాయమం తప్పనిసరి

ఆరోగ్యంగా ఉండాలన్నా, ఊబకాయం బారిన పడకుండా ఉండాలన్నా ప్రతి ఒక్కరు శారీరక వ్యాయమం చేయాలి. పనిలో పడి ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయకూడదు. నడవడం, పరిగెత్తడం, ఈత కొట్టడం, ఏదైనా ఆట ఆడడం చేయాలి. రోజులో కనీసం 30 నుంచి 40 నిమిషాల పాటు వ్యాయమం చేస్తే మంచిది. ఈ విధంగా వ్యాయమం చేసినట్టయితే వ్యాధులు దరిచేరవు.

'రాష్ట్ర పోటీల్లో రాణించాలి'

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర మాస్టర్స్ చాంపియన్‌షిప్ పోటీలకు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు బొడ్డేపల్లి నారాయణరావు, ప్రధాన కార్యదర్శి పాలకొండ అప్పారావు పిలుపునిచ్చారు. రాష్ట్రపోటీల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో ఆదివారం శ్రీకాకుళంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పాలకొండ అప్పారావు మాట్లాడుతు నెల్లూరు వేదికగా ఏపీ రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్–2022 పోటీలు డిసెంబర్ 16 నుంచి 18 వరకు జరగనున్నట్టు పేర్కొన్నారు. నెలరోజులపాటు ఉదయం, సాయంత్రం సాధన చేయాలని వెటరన్ అథ్లెట్స్‌కు సూచించారు. సంఘ కార్యనిర్వాహక కార్యదర్శి, పీడీ చల్లా జగదీష్, ఉపాధ్యక్షుడు ఎం.కామయ్య పాల్గొన్నారు.

మంచి మాట

పరీక్ష... లేదా పరీక్షలు అనే మాట విద్యారంగంలో తరచూ వినిపిస్తూ ఉంటుంది. చెప్పిన పాఠాలు విద్యార్థి ఎంత శ్రద్ధగా విన్నాడు, ఎంత జ్ఞానాన్ని పొందాడు, దాని సారమెంత అన్నది ఉపాధ్యాయులు అంచనా వేయాలి. అలా వేసే అంచనానే పరీక్షంటే. పరీక్ష అతణ్ణి పైతరగతులకు పంపే ఒక పక్రియ లేదా సాధనం. అయితే పరీక్ష అనేది విద్యార్థులకు మాత్రమే పరిమితం కాదు. చదువున్నా లేకపోయినా, జీవితంలో ప్రతి ఒక్కరూ పరీక్షకు గురి అయిన వారే. తమను తాము పరీక్ష చేసుకునేవారే. ఇంతకీ పరీక్ష అంటే ఏమిటి, ఎందుకో తెలుసుకుందాం.

ఏమిటి ఈ పరీక్ష? ఎందుకు?

మన మాట తీరు, ఇతరులతో మన సంబంధాలు, వారితో మన వర్తన, విలువలు, నీతి, నిజాయితీ, తోటి మానవుల పట్ల మన భావన, ప్రేమ ఇటువంటి అనేకమైన వాటిని అంచనా వేసుకునేందుకు కూడా పరీక్ష అవసరం. మన జీవిత ప్రవాహ సారాన్ని అర్థం చేసుకుని దాన్ని ఎప్పటికప్పుడు మదింపు చేసుకోవాలి. అంటే మన జీవితాన్ని పరీక్షించుకోవాలి. దాన్ని మరింత ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలంటే ఈ పరీక్ష అనేది ప్రతి ఒక్కరికి అవసరం.

ఇతర జీవులకు, మనకు ఉండే జనన మరణాల సారూప్యతకు భిన్నంగా, గొప్పగా మన జీవనవిధానాన్ని గమనిస్తూ జీవితాన్ని మార్పు చేసుకోగలమా? అలా మన తెలివితేటలకు, ఆధిక్యతకు ఒక విశిష్టత, అర్థం చూపగలమా? ఆ ఆలోచన వచ్చిన వారెవరైనా తమ శల్య పరీక్షకు సంసిద్ధులైతే జీవితాన్ని చక్కగా మలచు కోవటం కష్టం కానే కాదు. అది మనోవికాసానికి, గొప్ప ఆలోచనలకు దారి తీసి మానవాళికి ఉపయుక్తం అయ్యే అనేక ఆవిష్కరణలకు దారితీస్తుంది.'శోధించని జీవిత జీవనయోగ్యం కాదు' అన్నాడు సోక్రటీస్.

ఈ పరీక్షకు విద్యార్థి, పరీక్షాధికారి ఎవరికి వారే. విద్యార్థి సంవత్సరకాలంలో పుస్తకాలలోని తను పొందిన జ్ఞానాన్ని ఎలా జ్ఞప్తికి తెచ్చుకుంటాడో అలా ప్రతి వ్యక్తి తను గడిపిన, గడుపుతున్న జీవితాన్ని నెమరు వేసుకోవాలి. వివిధ సందర్భాలలో తన మాటలు, ప్రవర్తన అనుబంధాలకు, ఆప్యాయతలకు ఎంత విలువనిచ్చాయి, వాటిని తను ఎంత నిలబెట్టుకున్నాడో స్ఫురణకు తెచ్చుకోవాలి. తన వర్తన ఇతరుల మనస్సుల నేమైనా అకారణంగా గాయపరిచిందేమో తరచి చూసుకోవాలి.

వృత్తి జీవితంలోనూ ఒక ఉద్యోగి, రచయిత, కళాకారుడు తమ కృషి లేదా పని తీరును సమీక్షించుకోవడమూ పరీక్షే. జీవితాన్ని ఎంత నిశితంగా పరీక్షలకు గురి చేస్తే అంతగా మన వ్యక్తిత్వం సార్థక మవుతుంది. ఇక్కడ పరీక్ష పత్రం తయారు చేసేది, సమాధానాలు రాసేది మనమే. దీనితో విద్యార్థి పాత్ర ఉపాధ్యాయుని పాత్రగా మారుతుంది. ఇప్పుడు పరీక్షాధికారిగా వీటి మంచి చెడులను విశ్లేషించాలి. మంచికి మురిసిపోతూ మనల్ని మనమే ప్రశంసించుకో కూడదు. మంచిని చూసినంత బాగా, నిశితంగా లోపాలను చూడాలి. నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వ్యవహరించగలగాలి. ఆ ఫలితాలను లోతుగా చూసి, ఒక నిజమైన, ఖచ్చితమైన మదింపు వేసుకోవాలి. అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకునే వివేచన కావాలి. ఇక్కడ బేషజాన్ని, అహాన్ని విడిచి తప్పులను దిద్దుకునే సంస్కారం అలవరుచుకోవాలి. పెద్దలు, అనుభవజ్ఞుల సలహాలు తీసుకోవాలి. విద్యార్థి తన విద్యాభ్యాసకాలంలో రాసే పరీక్షలు కొన్నే ఉంటాయి. కాని మనం జీవితాంతం మన జీవితాన్ని పరీక్షకు గురి చేయాల్సిందే. సరిదిద్దుకుంటూ ముందుకు సాగాల్సిందే. సోక్రటీస్ చెప్పిన మాటల సారమిదే.

తల్లిదండ్రులు, అమ్మమ్మ, తాతయ్యలు ఉపాధ్యాయులు ఈ శోధన తత్వాన్ని పిల్లలు అలవాటు చేసుకునేలా చెయ్యాలి.ఈ శోధన మనిషి వ్యక్తిత్వ వికాసానికి ఎంతో దోహదం చేస్తుంది.

కొందరు వ్యక్తులకు ఈ శోధన చిన్నతనం నుండే సహజంగా ఉంటుంది. ఆ శోధనా దృష్టి కొందరిలో అతి చిన్న వయస్సులోనే ఏర్పడి చక్కని రూపు దాల్చి ఉన్నత పథంలో పయనం చేసి మొత్తం మనవాళికి దాని ఫలితాలను అంది స్తుంది. వారు చిర స్మరణీయులవుతారు. ఈ శోధనాతత్వం ప్రతి ఒక్కరికీ అవసరం. ముఖ్యంగా ఉపాధ్యాయులకు, శాస్త్రవేత్తలకు, నాయకులకు చాలా అవసరం. ఎప్పటికప్పుడు తాము చేసిన పనిని, దానిలోని తప్పుల్ని తెలుసుకుని తమను తాము నూతనంగా ఆవిష్కరించుకుంటారు. సోక్రటీస్ అన్న మాటలలో పరిశీలన, తార్కికత, ఉత్సాహం, ఆధ్యాత్మికత పెనవేసుకున్నాయి.

ప్రశ్నించే, శోధించే గుణాలు ఉన్నాయి.



> వృత్తి జీవితంలోనూ ఒక ఉద్యోగి, రచయిత, కళాకారుడు తమ కృషి లేదా పని తీరును సమీక్షించుకోవడమూ పరీక్షే. జీవితాన్ని ఎంత నిశితంగా పరీక్షలకు గురి చేస్తే అంతగా మన వ్యక్తిత్వం సార్థకమవుతుంది.

– లలితా వాసంతి

సన్నిధి

గురువాణి



వసంతశోభ - ప్రసన్న వదనం

మనిషి ఏ కారణం చేత అలజడికి గురవుతాడు... అంటే రాగద్వేషాలవల్ల. నాకు ఇది కావాలి.. అన్న కోర్కె ఏర్పడగానే మనసు ఉద్విగ్నమవుతుంది. అది కదిలిపోతుంది. అలాగే ఇతరులపట్ల ద్వేషభావం కలగడం, వారిపట్ల కోపం కలగడం వాటి వల్ల కూడా మనసు చెదురుతుంది. వీటిని గెలిచిన వారు మహాత్ములవుతారు. వారు ప్రశాంత జీవనం గడపగలుగుతారు.

ప్రత్యేకంగా కోరిక లేకపోయినా నా వల్ల ఎప్పుడు కూడా ఇతరులకు మంచి జరగాలన్న భావనతోపాటూ అంతటా భగవంతుడిని చూడగలగడం మహాత్ముల లక్షణం. సమస్త ప్రాణులలో తనను చూసుకోగలగడం, తనలో సమస్త ప్రపంచాన్ని చూడగలగడం వీరి ప్రత్యేకత. అప్పుడు నేను–అది అన్నభావన ఉండదు.అది వేరు అన్న ప్రసక్తి ఉండదు. ఇటువంటి వారు ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి కదిలిపోతూ ఉంటారు. అలా ఎందుకంటే... లోకానికి హితం చేకూర్చడం కోసం. అదెలా ఉంటుందంటే ... చైత్ర వైశాఖ మాసాల్లో వచ్చే వసంత రుతువులాగా... ఈ రుతువులో చెట్లన్నీ పుష్పిస్తాయి. సతతహరితములై.. ఆకు పచ్చని రంగుతో శోభిస్తూ ఉంటాయి. మహాత్ములు కూడా అంతే... ప్రశాంత వదనంతో ప్రస్ఫుటంగా కనిపిస్తూ దేశ సంచారం చేస్తూ ప్రజలందరి మేలు కోరుతుంటారు.

సర్వసాధారణంగా మనందరికీ 'ప్రేయస్సు' ఉంటుంది. అంటే మనసుకు ఏది ప్రియమో దానిని సాధించుకోవాలనే తాపత్రయం ఉంటుంది. ఏది జీవుల్లో పతనం చేయదో, ఏది ఆత్మకు ఉన్నతిని కల్పిస్తుందో, జీవుణ్ణి ఉద్ధరిస్తుందో, ఏది ఇంద్రియ నిగ్రహానికి కారణమవుతుందో అటువంటివాటిని ప్రతిపాదించి, సమర్థించి, ప్రచారం చేసి, ప్రబోధం చేసి అనుష్ఠానపర్యంతం అందరిలోకి దానిని ప్రవేశపెట్టడానికి ప్రయత్నిస్తుంటారు. అందువల్ల వారు వసంత రుతువులాగా ఉంటారు.


మనం రాగద్వేషాలతో పాపపుణ్యాలు చేస్తుంటాం. పాపం చేస్తే దుఃఖాన్ని, పుణ్యం చేస్తే సుఖాన్ని అనుభవించాలి. ఏది అనుభవించాలన్నా శరీరం కావాలి కదా. ఈ శరీరం మీద వ్యామోహం ఉన్నంత కాలం అలా జనన మరణ చక్రంలో తిరుగుతూనే ఉంటాం. కానీ మహాత్ములు సంసార సముద్రాన్ని దాటేసారు. అంటే తనకోసం, తనవారికోసం... అనే భ్రాంతిని తొలగించుకొని అందరూ తనవారే అన్న తత్త్వంతో లోకసంచారం చేస్తూంటారు.

అలాంటి మహాత్ముల సాంగత్యంలో సామాన్యులమైన మనం వారు అందుకున్నంత ఉన్నత శిఖరాలను అందుకోకపోయినా, సంసార జీవితాలు గడుపుతూనే వారి స్ఫూర్తితో రాగద్వేషాలను వీలయినంత తగ్గించుకోవడం, సృష్టిలోని సమస్త ప్రాణులనూ సమాదరణ భావనతో చూడడం, బాధితులపట్ల కారుణ్యం చూపడం, ద్వేషభావాన్ని విడనాడడం, క్షమించే గుణాన్ని పెంపొందింప చేసుకోవడం వంటి లక్షణాలు అసాధ్యమైనవేమీ కావు. మహాత్ములు కూడా జన్మతః మనలాగే పుట్టి పెరిగారు..అన్న చైతన్యంతో వ్యవహరిస్తే మనం, మన కుటుంబాలు, మన సమాజంలో అనవసరమైన అలజడులు ఉండవు. క్షుల్లకార్పణ్యాలతో, కోపతాపాలతో, స్వార్థంతో అభ్యుదయాన్ని ఎన్నటికీ సాధించలేం. వికాసం ఎలా జరగాలన్నా మన జీవితాల్లో ప్రశాంతత ఉండాలి. అప్పుడు మన జీవితంలోకి కూడా వసంతం తొంగి చూస్తుంది. మహాత్ములిచ్చే సందేశం కూడా అదే.


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

సువార్త

విశ్వాస మూలంగా జీవించు!



నీతిమంతుడు విశ్వాసమూలముగా జీవించును (రోమా 1:17). శత్రుదుర్భేద్యంగా ఉన్న రోమా పట్టణంలోని వ్యక్తులకు పౌలు రాసిన ఉత్తరం విలక్షణమైనది. ఆ పట్టణంలో ఉన్నవారు సామాన్యులేమీ కాదు. వారికి అన్ని విషయాల్లో ప్రావీణ్యత ఉంది. ప్రపంచాన్ని ఏలుబడి చేస్తున్న రాజ్యం అది. ఆఖరుకు యూదులపై కూడా పట్టు సాధించారు. అటువంటి ప్రాంతంలో ఉన్నవారికి విశ్వాసం గొప్పతనాన్ని, క్రీస్తు ప్రభువు ఔన్నత్యాన్ని తెలుపడమే లక్ష్యంగా ఈ మాటలు రాశాడు.

క్రీస్తు శకం 1517 అక్టోబరు 31న జర్మనీ దేశానికి చెందిన మార్టిన్ లూథర్ అనే భారం కలిగిన దైవజనుడు దేవుని సంఘాన్ని సంస్కరించడానికి నడుం బిగించాడు. దేవుని వాక్యాన్ని పదే పదే చదువుతూ ఆనాటి సంఘ పెద్దలను, సంఘాన్ని తమ గుప్పెట్లో పెట్టుకున్న వారిని ఎదిరించాడు. దేవుని ఆత్మశక్తితో నింపబడి సత్యానికి స్తంభంగా నిలబడ్డాడు. నీతిమంతుడు విశ్వాసమూలంగా జీవించును అనే సత్యాన్ని ప్రగాఢంగా నమ్మి దానిని ప్రపంచానికి చాటి చెప్పాడు. ఆనాడు సంఘంలో జరుగుతున్న అరాచకాలను ఖండిస్తూ 95 బైబిల్ సిద్ధాంతాలను జర్మనీ దేశంలోని విటెన్‌బర్గ్ ఆలయ ద్వారాల మీద అతికించాడు. సత్యం కోసం ప్రాణాలు తెగించి పోరాడాడు. వాటిని ఉపసంహరించుకోమని ఆనాటి పెద్దలు హెచ్చరిక చేసినప్పుడు 'నేను చెబుతున్నవి లేఖనానుసారం కాకపోతే వాటిని వెనక్కి తీసుకుంటానని ఖండితంగా చెప్పిన ధైర్యవంతుడు మార్టిన్ లూథర్'. ప్రపంచ చరిత్రలో క్రైస్తవ్యంలో ఒక వినూత్న మార్పును తీసుకొని వచ్చాడు. దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను సత్యంతోనూ ఆరాధించాలని బైబిల్ ప్రబోధిస్తుంది.

విశ్వాసం లేకపోతే క్రైస్తవ్యానికి పునాది ఏది? పరిశుద్ధ గ్రంథమంతా విశ్వాసాల మాలిక. ఒక మానవుడు రక్షింపబడాలంటే దేవుని మీద విశ్వాసం ఉండాలి. క్రీస్తు ప్రభువు మానవ పాపపరిహారార్థమై సిలువలో మరణించి విమోచనా క్రయధనాన్ని సంపూర్ణంగా చెల్లించాడని విశ్వసించాలి. అంతమాత్రమే గాక విపత్కర పరిస్థితుల్లో కూడా వాత్సల్యపూర్ణుడైన దేవునియందు విశ్వాసాన్ని కనుపరచాలి. దేవుని ప్రజలు దేవుని మీద చూపిన అఖండ విశ్వాసం ద్వారా ఎన్నో గొప్ప కార్యాలు చరిత్రలో జరిగాయి నేటికీ జరుగుతున్నాయి కూడా. దేవునియందు అచంచల విశ్వాసం కలిగిన వారి జాబితా పరిశుద్ధ గ్రంథంలో స్పష్టంగా రాయబడినది.

ప్రేమామయుడైన దేవుడు తన మీద పెట్టుకున్న విశ్వాసాన్ని ఏనాడూ వమ్ము చేయలేదు. ఆయన విశ్వాసానికి కర్త, విశ్వాసాన్ని కొనసాగించువాడు. చరిత్రలో దేవుడు ఏ ఒక్కరిని వంచించలేదు. స్వనీతితో ఉన్నంతకాలం నీవు విశ్వాస సంబంధివి కానేకావు. యేసుక్రీస్తు ప్రభువు దేవుడని, ఆయన మృతుల్లో నుండి లేచాడని పరిపూర్ణంగా విశ్వసించువాడే నిజమైన క్రైస్తవుడు. విశ్వాస మూలంగా జీవించేవాడిని దేవుడు తన ప్రణాళికలు నెరవేర్చడానికి హృదయపూర్వకంగా వాడుకుంటాడు. ఆయన ప్రణాళికలు ఎప్పుడూ అమోఘమైనవే. అట్టివారి ద్వారా ఆయన ఘన నామం అన్ని వేళలా అత్యధికంగా మహిమపరచబడుతుంది.

– డా॥ జాన్ వెస్లీ, క్రైస్ట్ వర్షిప్ సెంటర్

సినిమా


● కమల్


● మణిరత్నం

హిట్ కాంబో రిపీట్

ప్రముఖ నటుడు కమల్‌హాసన్ తన బర్త్ డే (నవంబరు 7) సందర్భంగా ఫ్యాన్స్‌కు సూపర్ సర్‌ప్రైజ్ ఇచ్చారు. మణిరత్నం దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నట్లు ఆదివారం ప్రకటించారు కమల్‌హాసన్. దాదాపు 35 సంవత్సరాల తర్వాత ఈ కాంబినేషన్‌లో రూపొందనున్న సినిమా ఇదే కావడం విశేషం. 1987లో వారిద్దరి కాంబోలో 'నాయకన్'(తెలుగులో 'నాయకుడు') అనే హిట్ సినిమా వచ్చింది. మళ్లీ ఇన్నేళ్ల తర్వాత కలిసి పనిచేయబోతున్నారు కమల్ –మణిరత్నం. ఉదయ నిధి స్టాలిన్ సమర్పణలో కమల్ హాసన్, మణిరత్నం, ఆర్. మహేంద్రన్, శివ అనంత్ ఈ కొత్త సినిమా నిర్మించనున్నారు. కమల్ కెరీర్‌లో 234వ చిత్రంగా రూపొందనున్న ఈ చిత్రాన్ని 2024లో రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. ''ముప్పై ఐదు సంవత్సరాల క్రితం మణిరత్నంగారితో పనిచేసినప్పుడు ఎంత ఉత్సాహంతో ఉన్నానో ఇప్పుడూ అలాగే ఉన్నాను. ఈ ఉత్సాహానికి ఏఆర్ రెహమాన్, ఉదయనిధి స్టాలిన్ తోడవ్వడం హ్యాపీ'' అన్నారు కమల్‌హాసన్. ''కమల్‌సర్‌తో మళ్లీ వర్క్ చేయడం సంతోషంగా, గర్వంగా, గౌరవంగా ఉంది''అన్నారు మణిరత్నం.


● రాకేష్ శశి, అల్లు అరవింద్, అనూ ఇమ్మాన్యుయేల్, అల్లు అర్జున్, అల్లు శిరీష్, ధీరజ్, బన్నీ వాస్

ఈ రోజు కోసమే ఎదురు చూశాను - అల్లు అర్జున్

''నా సినిమా హిట్ అయినా కూడా నేను ఇంత ఆనందంగా ఉండను.. నా తమ్ముడు శిరీష్ 'ఊర్వశివో రాక్షసివో' తో హిట్ కొట్టడం చాలా చాలా ఆనందంగా ఉంది.. ఈ రోజు కోసమే నేను ఎదురు చూశాను'' అని హీరో అల్లు అర్జున్ అన్నారు. అల్లు శిరీష్, అనూ ఇమ్మాన్యుయేల్ జంటగా రాకేష్ శశి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఊర్వశివో రాక్షసివో'. అల్లు అరవింద్ సమర్పణలో ధీరజ్ మొగిలినేని నిర్మించిన ఈ సినిమా ఈ నెల 4న విడుదలయింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన 'ఊర్వశివో రాక్షసివో బ్లాక్ బస్టర్ సెలబ్రేషన్స్' కి ముఖ్య అతిథిగా హాజరైన అల్లు అర్జున్ మాట్లాడుతూ–''ఈ చిత్రాన్ని ఇంత పెద్ద హిట్ చేసిన ప్రేక్షక దేవుళ్లకు కృతజ్ఞతలు. ఈ సినిమా మా గీతా ఆర్ట్స్‌కి, మా నాన్న–అమ్మలకు, నాకు, శిరీష్‌కి చాలా స్పెషల్ ఫిల్మ్. ఇకపై ఈ బ్యానర్‌లో ఎన్ని హిట్స్ వచ్చినా 'ఊర్వశివో రాక్షసివో' మరచిపోలేని అనుభూతి. ఈ హిట్ ఇచ్చిన రాకేష్ శశికి కృతజ్ఞతలు. శిరీష్‌తో హిట్ కొట్టిన మా నాన్నకి కంగ్రాట్స్. ఈ చిత్రంలో శిరీష్ నటన బాగుందని అందరూ అంటుంటే సంతోషంగా ఉంది. ఈ సినిమా తనని మరో మెట్టు ఎక్కించింది. 'పుష్ప 1' తగ్గేదే లే.. 'పుష్ప 2' అస్సలు తగ్గేదే లే. ఈ సినిమా పాజిటివ్‌గా ఉంటుంది'' అన్నారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ–''ఐకాన్‌స్టార్‌గా ఆల్ ఇండియా స్థాయికి వెళ్లిపోయిన మన బన్నీ(అల్లు అర్జున్). ఇప్పుడిప్పుడు సక్సెస్ చూస్తూ స్టార్‌గా ఎదుగుతున్న మన శిరీష్. వాళ్లిద్దరూ ఇక్కడ ఉంటే నాకంటే ఆనంద పడేవారు ఎవరుంటారు. 'ఊర్వశివో రాక్షసివో' చిత్రాన్ని ఆదరించిన తెలుగు ప్రేక్షకులకు థ్యాంక్స్'' అన్నారు.

నిర్మాత 'దిల్' రాజు మాట్లాడుతూ–''20 ఏళ్ల క్రితం 'ఆర్య' సినిమాతో నేను, సుకుమార్, బన్నీ కలిసి ప్రయాణం స్టార్ట్ చేశాం. ఈ రోజు మేము, మా సంస్థ పాన్ ఇండియా స్థాయికి వెళ్లిపోయాం. 'ఆర్య' చేసేందుకు ముఖ్య కారణం అల్లు అరవింద్‌గారు. 'ఊర్వశివో రాక్షసివో'తో మంచి సక్సెస్ అందుకున్న టీమ్‌కి అభినందనలు. శిరీష్‌తో నేను ఓ సినిమా చేయాలి.. త్వరలో చేసి, తన బాకీ తీర్చేస్తాను'' అన్నారు. ''ఊర్వశివో రాక్షసివో' ప్రయాణంలో నాకు సపోర్ట్ చేసిన అరవింద్, బన్నీవాస్‌గార్లకు ఎప్పుడూ రుణపడి ఉంటాను. ఇంత మంచి హిట్ అందించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు'' అన్నారు చిత్ర నిర్మాత ధీరజ్ మొగిలినేని. ''ఊర్వశివో రాక్షసివో' సినిమా సక్సెస్‌ని అల్లు శిరీష్‌గారిని అభిమానించే వారికి అంకితం ఇస్తున్నాను'' అన్నారు రాకేష్ శశి. ''అరవింద్‌గారి అబ్బాయిగా పుట్టడం నా అదృష్టం. బన్ని అన్న.. నన్ను ఓ తమ్ముడిలా కాకుండా కొడుకులా చూస్తాడు.. తన తమ్ముడిగా పుట్టడం నా అదృష్టం'' అన్నారు శిరీష్.

ఈ వేడుకలో దర్శక–నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, నిర్మాత ఎస్‌కేఎన్, నటుడు సునీల్ తదితరులు పాల్గొన్నారు.

యాక్షన్ ఎంటర్‌టైనర్ షురూ


● వీవీ వినాయక్, నాగశౌర్య

నాగశౌర్య హీరోగా ఎస్ఎస్ అరుణాచలం దర్శకత్వంలో కొత్త సినిమా షురూ అయింది. బేబీ అద్వైత, భవిష్య సమర్పణలో వైష్ణవి ఫిలింస్‌పై శ్రీనివాసరావు చింతలపూడి, విజయ్ కుమార్ చింతలపూడి, డా.అశోక్ కుమార్ చింతలపూడి నిర్మిస్తున్న ఈ చిత్రం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత అభిషేక్ అగర్వాల్ కెమెరా స్విచ్చాన్ చేయగా, దర్శకుడు వీవీ వినాయక్ క్లాప్ కొట్టారు. డైరెక్టర్ తిరుమల కిషోర్ దర్శకత్వం వహించారు. న్యూరో హాస్పిటల్ సాంబ శివారెడ్డి, జి.ఎస్.కె ఇన్‌ఫ్రాటెక్ సంతోష్ కుమార్ స్క్రిప్టును యూనిట్‌కి అందజేశారు. ''యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రమిది. యూత్, ఫ్యామిలీ ఆడియన్స్‌కి నచ్చే అంశాలున్నాయి. నాగశౌర్య కెరీర్‌లో 24వ చిత్రంగా రూపొందుతున్న ఈ మూవీలో విభిన్నమైన పాత్రలో కనిపించనున్నారు శౌర్య'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: హారిస్ జయరాజ్, కెమెరా: వెట్రి పళనిసామి, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: బండి భాస్కర్.

"ఆదిత్య 369' సినిమా (1991) చేస్తున్నప్పుడు ఎలాంటి అనుభూతికి లోనయ్యానో మళ్లీ ముప్పై ఏళ్ల తర్వాత ఆ తరహా ఫీలింగ్, ఎగ్జైట్‌మెంట్‌ను 'యశోద' సినిమాకు ఫీలయ్యాను. నా కెరీర్‌లో హిట్, ఫ్లాప్ సినిమాలు చూశాను. అయితే 'యశోద' స్పెషల్ ఫిల్మ్" అని నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ అన్నారు. సమంత టైటిల్ రోల్ నటించిన చిత్రం 'యశోద'. శ్రీదేవి మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా శివలెంక కృష్ణప్రసాద్ చెప్పిన విశేషాలు...

కాంబినేషన్స్ కాదు.. కథ ముఖ్యం - శివలెంక కృష్ణప్రసాద్



● మా అంకుల్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంగారు సెప్టెంబరు 25, 2020లో స్వర్గస్తులయ్యారు. ఆ టైమ్‌లో ఎస్పీ చరణ్‌కు సపోర్ట్‌గా ఉండేందుకు చెన్నై వెళ్లాను. ఆ తర్వాత ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ సెంథిల్ ద్వారా హరి–హరీష్‌ల వద్ద ఉన్న 'యశోద' కథ విన్నాను. ఈ చిత్రాన్ని తొలుత వేరే నిర్మాతను అనుకున్నారు దర్శకులు. కానీ తిరిగి నా వద్దకే వచ్చింది. అందుకే ఈ మూవీకి మా అంకుల్ ఆశీస్సులు ఉన్నాయి.

● సరోగసీ నేపథ్యంలో సాగే క్రైమ్ థ్రిల్లర్ మూవీ 'యశోద'. ఈ సినిమాకు తెలుగులో సమంత డబ్బింగ్ చెప్పారు. హాస్పిటల్‌లో చికిత్స పొందుతూనే తమిళంలో కూడా డబ్బింగ్ చెప్పారు.. సమంత అంకితభావానికి హ్యాట్సాఫ్. ● హరి–హరీష్‌లు తమిళులు. పెద్దగా తెలుగు రాదు. తెలుగు డైలాగ్స్ రాసేందుకు సీనియర్ జర్నలిస్టులు పులగం చిన్నారాయణ, చల్లా భాగ్యలక్ష్మిలను వారికి పరిచయం చేశాను.. వారి వర్క్ దర్శకులకు నచ్చింది. ఈ సినిమా కోసం సహ నిర్మాత చింతా గోపాలకృష్ణారెడ్డిగారు హెల్ప్ చేశారు. కథలో కొత్తదనం లేనిదే ప్రేక్షకులు సినిమాలను ఆదరించడం లేదు. అందుకే నిర్మాతలు కాంబినేషన్స్‌పై కాకుండా కథపై దృష్టి పెడుతున్నారు. ● మా అబ్బాయి అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాడు. ఇండస్ట్రీలో నా ఎత్తుపల్లాలను దృష్టిలో పెట్టుకుని సినిమా రంగంవైపు రావొద్దని చెప్పాను. నా సినిమాలకు డిజిటల్ పరంగా మా అమ్మాయి దివ్య హెల్ప్ చేస్తుంది. నా రిటైర్మెంట్ తర్వాత 'ఒకప్పుడు శ్రీదేవి మూవీస్ అనే సంస్థ ఉండేది, శివలెంక కృష్ణప్రసాద్ మంచి సినిమాలు తీశారు' అని ప్రేక్షకులు నన్ను గుర్తుపెట్టుకుంటే చాలు.


● అంకిత, సాయి రోనక్, విష్వక్‌సేన్

రొమాంటిక్ కామెడీ

సాయి రోనక్, అంకితా సాహా, బిస్మీ నాజ్ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'రాజయోగం'. రామ్ గణపతి దర్శకత్వంలో మణి లక్ష్మణరావు నిర్మించిన ఈ చిత్రం డిసెంబరు 9న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్ రిలీజ్ వేడుకలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విష్వక్ సేన్ మాట్లాడుతూ– ''రోనక్ భవిష్యత్‌లో ఇంకా మంచి యాక్టర్‌గా ఎదగాలని కోరుకుంటున్నాను'' అని అన్నారు. ''ప్రతి ఆడియన్‌కు సినిమా నచ్చుతుంది'' అని అన్నారు సాయి రోనక్. ''చిత్ర బృందంలోని అందరికీ ఈ సినిమాతో రాజయోగం పట్టాలి. మా టీమ్‌కు సపోర్ట్‌గా ఉన్న రాజీవ్ గారికి థ్యాంక్స్'' అన్నారు లక్ష్మణ్. ''రొమాంటిక్ కామెడీ ఫిల్మ్ ఇది. ఈ సినిమాలో దాదాపు వందలిప్ లాక్ సీన్స్ ఉన్నాయి. కథ ప్రకారమే ఉన్నాయి. రాజీవ్, లక్ష్మణ్‌గార్లకు థ్యాంక్స్'' అన్నారు రామ్ గణపతి.

అప్పుడు ఇండస్ట్రీ నుంచి వెళ్లిపోతాను!

- విష్వక్‌సేన్

విష్వక్‌సేన్ ప్రొఫెషనలిస్ట్ కాదని, అందుకే తనతో సినిమా చేయడం లేదంటూ దర్శక–నిర్మాత–నటుడు అర్జున్ సర్జా ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ విషయంపై 'రాజ యోగం' టీజర్ లాంచ్ వేదికగా విష్వక్‌సేన్ స్పందించి, మాట్లాడుతూ– "నేను సినిమా నుంచి వెళ్లిపోతానని చెప్పలేదు. సినిమాను నేను ఆపేయలేదు. 'మరొక్కరోజు షూటింగ్‌ను ఆపేస్తే మరి కొన్ని అంశాలు చర్చించుకుని షూటింగ్‌కు వెళదామని ఆయనకు(అర్జున్‌ని ఉద్దేశిస్తూ..) మెసేజ్ పెట్టాను అంతే'. కొంతసేపటి తర్వాత 'మాట్లాడేది ఏం లేదు. డబ్బులు వెనక్కి పంపండి' అని వాళ్ల మేనేజర్ ఉమేష్ నుంచి మెసేజ్ వచ్చింది. అయినా షూటింగ్ షెడ్యూల్ ఉన్న రోజు పొద్దునే లేచి షూటింగ్ ఆపమని నేను చెప్పడం తప్పే. అయితే అయిష్టంగా సెట్స్‌లో పాల్గొని డౌట్స్ అడుగుతూ ఓ నాలుగు రోజుల తర్వాత రెండు రోజులు బ్రేక్ తీసుకుందామనడం ఇంకా పెద్ద తప్పు అవుతుంది కదా. సెట్స్‌లోని అందరు నన్ను మెచ్చుకోవాలనే తపనతో నేను లొకేషన్‌కు వెళ్లేవాడిని. కానీ ఈ సినిమాకు ఆ ఫీలింగ్ రాలేదు. దీంతో నాలో నాకే భయం వేసింది. కథ చర్చల్లో నా మాటలు పట్టించుకునేవారు కాదు. ఆయనకు ఇబ్బంది అయితే ప్రెస్‌మీట్ పెట్టి మాట్లాడారు. కానీ ఇప్పుడు మా ఇంట్లోవారు, నా శ్రేయోభిలాషులు ఇబ్బందిపడుతున్నారు.. నేను ఎవరికి చెప్పుకోవాలి. నాకు తెలిసి నా అంత కమిటెడ్, ప్రొఫెషనల్ యాక్టర్ ఎవరూ ఉండరు. సినిమాల్లో తప్పు చేస్తే మాట్లాడండి. సెట్స్‌లో నేనే ఏదైనా తప్పుచేస్తే ఇప్పుడే ఇండస్ట్రీ నుంచి వెళ్లిపోతాను. ఎవర్నీ అగౌరవ పరచాలని నేను అనుకోవడం లేదు. ఒకవేళ నిజంగా నేను ఇన్‌సల్ట్ చేసి ఉంటే సారీ సర్ (అర్జున్‌ని ఉద్దేశిస్తూ...). నేను ఏం చేసినా సినిమా బాగా రావాలనే చేశాను. సినిమా కంటే ఎవరూ పెద్ద కాదు. అన్నిటి కంటే సినిమాయే పెద్దది" అన్నారు.

థ్రిల్లింగ్ లవ్‌స్టోరీ


● గురుపవన్

ఉదయ్ శంకర్, జెన్నీఫర్ ఇమ్మాన్యుయేల్ జంటగా గురు పవన్ దర్శకత్వం వహించిన చిత్రం 'నచ్చింది గాళ్ ఫ్రెండూ'. అట్లూరి ఆర్.సౌజన్య సమర్పణలో అట్లూరి నారాయణరావు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా గురు పవన్ మాట్లాడుతూ– ''వైజాగ్ నేపథ్యంలో సాగే థ్రిల్లింగ్ లవ్‌స్టోరీ చిత్రమిది. మన మొబైల్స్‌లో ఉండే ఇన్వెస్ట్‌మెంట్ యాప్స్ వల్ల ఏదైనా తప్పు జరిగితే ఎంతమంది నష్టపోతారు? అలాంటి సమస్య నుంచి బాధితులను హీరో ఎలా బయటపడేశాడు? అనే అంశాల నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుంది. ఉదయ్‌శంకర్ క్యారెక్టర్ కొత్తగా ఉంటుంది. జెన్నీఫర్‌కు ఈ సినిమాతో మంచి పేరు వస్తుంది'' అన్నారు.

కమర్షియల్ గాలోడు

'సుడిగాలి' సుధీర్, గెహ్నా సిప్పి జంటగా నటించిన చిత్రం 'గాలోడు'. రాజశేఖర్ రెడ్డి పులిచర్ల దర్శకుడు. ప్రకృతి సమర్పణలో సంస్కృతి ఫిలింస్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 18న విడుదల కానుంది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సుధీర్ మాట్లాడుతూ– ''కోవిడ్ సమయంలో చాలా ఒడిదుడుకులు ఎదుర్కొని ఈ సినిమాను పూర్తి చేసి, ఇప్పుడు రిలీజ్ చేస్తున్నాం. 'సాఫ్ట్‌వేర్ సుధీర్' తర్వాత నాకు మరో అవకాశం ఇచ్చిన రాజశేఖర్‌గారికి ధన్యవాదాలు. 'గాలోడు' ట్రైలర్‌కు మంచి స్పందన రావడం హ్యాపీ. సినిమా కూడా అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చుతుంది'' అన్నారు. ''మంచి కమర్షియల్ కథాంశంతో రూపొందిన చిత్రమిది. హిట్ కొడతామనే నమ్మకం ఉంది'' అన్నారు రాజశేఖర్‌రెడ్డి. ''కాలేజ్ యూత్‌కి, ఫ్యామిలీ ఆడియన్స్‌కు కనెక్ట్ అయ్యే సినిమా ఇది'' అన్నారు గెహ్నా సిప్పి.


● రాజశేఖర్ రెడ్డి, సుధీర్, గెహ్నా సిప్పి



హుసాముద్దీన్‌కు పతకం ఖాయం

ఆసియా బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ బాక్సర్ హుసాముద్దీన్ (57 కేజీలు) సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. జోర్డాన్‌లో ఆదివారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో హుసాముద్దీన్ 5-0తో హేంగ్‌సియోక్ లీ (కొరియా)పై గెలిచాడు. భారత్‌కే చెందిన శివ థాపా (63.5 కేజీలు) కూడా సెమీస్ చేరి కనీసం కాంస్యాన్ని ఖాయం చేసుకున్నాడు. తద్వారా ఈ టోర్నీ చరిత్రలో అత్యధికంగా ఆరు పతకాలు సాధించిన బాక్సర్‌గా నిలిచాడు.

ప్రమోద్ భగత్‌కు స్వర్ణం

ప్రపంచ పారా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పురుషుల సింగిల్స్ ఎస్‌ఎల్3 విభాగంలో డిఫెండింగ్ చాంపియన్ ప్రమోద్ భగత్ టైటిల్ నిలబెట్టుకోగా... మహిళల సింగిల్స్ ఎస్‌యు5 విభాగంలో మనీషా రామదాస్ విజేతగా అవతరించింది. టోక్యోలో ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో ప్రమోద్ భగత్ 21-19, 21-19తో భారత్‌కే చెందిన నితీశ్‌ను ఓడించాడు. మనీషా 21-15, 21-15తో మామికో టొయోడా (జపాన్)పై గెలిచింది. పురుషుల డబుల్స్‌లో ప్రమోద్ భగత్-మనోజ్ సర్కార్ జంట ఫైనల్లో ఓడి రజతం సాధించింది.



దర్జాగా సెమీస్‌కు...

- జింబాబ్వేపై భారత్ 71 పరుగులతో విజయం
- గ్రూప్-2లో అగ్రస్థానం
- సూర్యకుమార్ మెరుపులు
- రాణించిన రాహుల్, అశ్విన్
- గురువారం సెమీస్‌లో ఇంగ్లండ్‌తో 'ఢీ'



'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సూర్యకుమార్

గత ఏడాది టి20 వరల్డ్‌కప్‌లో లీగ్ దశలోనే ఇంటికొచ్చిన భారత్ ఈసారి టోర్నీలో లీగ్ టాపర్‌గా సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. టీమిండియా చిన్న జట్లను తేలిగ్గా తీసుకోలేదు. పెద్ద జట్లతో గాభరా పడలేదు. ప్రతీ పోరు విలువైందన్నట్లుగానే ఆడింది. దక్షిణాఫ్రికాతో మ్యాచ్ మినహా ప్రతి మ్యాచ్‌లోనూ బ్యాటర్లు, బౌలర్లు చక్కగా రాణించారు. సమష్టి బాధ్యత కనబరిచారు. దీంతో టీమిండియా ఈ టోర్నీలో టైటిల్ ఫేవరెట్‌గా మారింది. గురువారం అడిలైడ్‌లో జరిగే రెండో సెమీఫైనల్లో ఇంగ్లండ్‌తో రోహిత్ శర్మ బృందం సమరానికి సై అంటోంది.

మెల్‌బోర్న్: సూర్యకుమార్ యాదవ్‌ను సహచరులంతా అతని పేరులోని మూడక్షరాలతో స్కై (ఎస్‌కేవై) అంటారు. ఈ ప్రపంచకప్‌లో అతను కూడా ఆ పేరుకు (ఆకాశం) తగ్గట్లే హద్దేలేని ఇన్నింగ్స్‌లతో జట్టును గెలిపిస్తున్నాడు. అభిమానుల్ని అలరిస్తున్నాడు. జింబాబ్వేతో పోరులో అయితే 'సూపర్ సండే' స్పెషల్ ఇన్నింగ్స్ ఆడాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సూర్య (25 బంతుల్లో 61; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపుల సునామీతో... 'సూపర్ 12' గ్రూప్-2 చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 71 పరుగుల తేడాతో జింబాబ్వేపై జయభేరి మోగించి 8 పాయింట్లతో 'టాపర్'గా నిలిచింది. మొదట భారత్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 186 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్ (35 బంతుల్లో 51; 3 ఫోర్లు, 3 సిక్సర్లు) కూడా మెరిపించాడు. సీన్ విలియమ్స్‌కు 2 వికెట్లు దక్కాయి. తర్వాత జింబాబ్వే 17.2 ఓవర్లలో 115 పరుగులకే ఆలౌటైంది. బర్ల్ (22 బంతుల్లో 35; 5 ఫోర్లు, 1 సిక్స్), రజా (24 బంతుల్లో 34; 3 ఫోర్లు) మెరుగ్గా ఆడారు. అశ్విన్ (3/22), షమీ (2/14), హార్దిక్ పాండ్యా (2/16) ప్రత్యర్థిని మూకుమ్మడిగా దెబ్బకొట్టారు.



రాహుల్



అశ్విన్

సూర్య ప్రతాపం...

ఓవరాల్‌గా ఈ మెగా ఈవెంట్‌లో 'భారత 360' సూర్య బ్యాటింగ్ ఓ లెవెల్లో వుంది. ఈ మ్యాచ్‌లో అది మరో స్థాయికి చేరింది. సూర్య 12 ఓవర్ ఆఖరిబంతికి క్రీజులోకి వచ్చాడు. అప్పుడు టీమిండియా స్కోరు (87/2) వందయినా కాలేదు. అతను రాగానే రాహుల్ అవుటయ్యాడు. అవకాశమిచ్చిన రిషభ్ పంత్ (3) చేజార్చుకున్నాడు. స్కోరు 101/4గా ఉన్న దశలో జింబాబ్వే సంచలనంపై ఆశలు పెట్టుకోకుండా సూర్యకుమార్ రెచ్చిపోయాడు. కొన్నిషాట్లయితే ఊహకే అందవు. ఆఫ్‌సైడ్‌కు దూరంగా వెళుతున్న బంతుల్ని ఆన్‌సైడ్‌లో సిక్సర్లుగా మలచడం అద్భుతం. 15 ఓవర్లలో 107/4గా ఉన్న స్కోరు అతని సునామీ ఇన్నింగ్స్‌తో 186/5గా మ్యాచ్ ఛేంజింగ్ ఫిగర్ అయ్యింది. ఆఖరి 5 ఓవర్లలో 79 పరుగులు వచ్చాయి. 16వ ఓవర్లో సూర్య వరుసగా 2 బౌండరీలు కొడితే పాండ్యా మరో ఫోర్ కొట్టాడు. 17వ ఓవర్ వేసిన ఎన్‌గరవా ఆఫ్‌సైడ్‌లో వేసిన వైడ్ యార్కర్‌లను 4, 6గా కొట్టడం మ్యాచ్‌కే హైలైట్. చటారా ఓవర్లో ఎక్స్‌ట్రా కవర్స్ మీదుగా బాదిన సిక్సర్, ఎన్‌గరవ ఆఖరి ఓవర్లో వరుసగా సూర్య 6, 2, 4, 6లతో మొత్తం 21 పరుగులు వచ్చాయి. 23 బంతుల్లో సూర్య (5 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఫిఫ్టీ పూర్తయ్యింది. అంతకుముందు ఓపెనర్లలో రోహిత్ (15) విఫలమైనా... రాహుల్, కోహ్లి (25 బంతుల్లో 26; 2 ఫోర్లు)తో కలిసి స్కోరును నడిపించాడు. 34 బంతుల్లో (3 ఫోర్లు, 3 సిక్సర్లు) రాహుల్ అర్ధశతకం సాధించాడు.

మన పేస్‌కు విలవిల

జింబాబ్వే బ్యాటర్లు లక్ష్యఛేదనను అటుంచి... అసలు క్రీజులో నిలిచేందుకే కష్టపడ్డారు. టాప్, మిడిలార్డర్ భారత పేస్ బౌలింగ్‌కు విలవిల్లాడింది. ఓపెనర్లు మదెవెర్ (0)ను భువీ, ఇర్విన్ (13)ను హార్దిక్, చకబ్వా (0)ను అర్ష్‌దీప్, సీన్ విలియమ్స్ (11)ను షమీ... ఇలా వరుసలోని నలుగురు బ్యాటర్స్‌ను నలుగురు బౌలర్లు దెబ్బకొట్టడంతో జింబాబ్వే ఓటమివైపు నడిచింది. సికిందర్ రజా, రియాన్ బర్ల్ చేసిన పరుగులు జట్టు వంద దాటేందుకు ఉపయోగపడ్డాయి. ఆఖరి వరుస బ్యాటర్స్ అశ్విన్ ఉచ్చులో పడటంతో ఆలౌట్ అయ్యేందుకు ఎంతోసేపు పట్టలేదు.

1 క్యాలెండర్ ఇయర్‌లో అంతర్జాతీయ టి20ల్లో 1,000 పరుగులు సాధించిన తొలి భారతీయ క్రికెటర్‌గా సూర్యకుమార్ యాదవ్ గుర్తింపు పొందాడు. ఈ ఏడాది సూర్య 28 టి20 మ్యాచ్‌లు ఆడి 1,026 పరుగులు చేశాడు.

21 ఈ ఏడాది రోహిత్ శర్మ కెప్టెన్సీలో టి20ల్లో భారత్ సాధించిన విజయాలు. క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక విజయాలు అందించిన కెప్టెన్‌గా బాబర్ ఆజమ్ (2021లో 20) పేరిట ఉన్న రికార్డును రోహిత్ అధిగమించాడు.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రాహుల్ (సి) మసకద్జా (బి) సికందర్ 51; రోహిత్ (సి) మసకద్జా (బి) ముజరబాని 15; కోహ్లి (సి) బర్ల్ (బి) విలియమ్స్ 26; సూర్యకుమార్ (నాటౌట్) 61; పంత్ (సి) బర్ల్ (బి) విలియమ్స్ 3; పాండ్యా (సి) ముజరబాని (బి) ఎన్‌గరవ 18; అక్షర్ పటేల్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 186. వికెట్ల పతనం:** 1-27, 2-87, 3-95, 4-101, 5-166. **బౌలింగ్:** ఎన్‌గరవ 4-1-44-1, చటార 4-0-34-0, ముజరబాని 4-0-50-1, మసకద్జా 2-0-12-0, బర్ల్ 1-0-14-0, సికందర్ రజా 3-0-18-1, సీన్ విలియమ్స్ 2-0-9-2.

జింబాబ్వే ఇన్నింగ్స్: మదెవెర్ (సి) కోహ్లి (బి) భువనేశ్వర్ 0; ఇర్విన్ (సి అండ్ బి) పాండ్యా 13; చకబ్వా (బి) అర్ష్‌దీప్ 0; విలియమ్స్ (సి) భువనేశ్వర్ (బి) 11; సికందర్ (సి) సూర్య (బి) పాండ్యా 34; టోని (ఎల్బీడబ్ల్యూ) (బి) షమీ 5; బర్ల్ (బి) అశ్విన్ 35; మసకద్జా (సి) రోహిత్ (బి) అశ్విన్ 1; ఎన్‌గరవ (బి) అశ్విన్ 1; చటార (సి అండ్ బి) అక్షర్ 4; ముజరబాని (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (17.2 ఓవర్లలో ఆలౌట్) 115. వికెట్ల పతనం:** 1-0, 2-2, 3-28, 4-31, 5-36, 6-96, 7-104, 8-106, 9-111, 10-115. **బౌలింగ్:** భువనేశ్వర్ 3-1-11-1, అర్ష్‌దీప్ 2-0-9-1, షమీ 2-0-14-2, పాండ్యా 3-0-16-2, అశ్విన్ 4-0-22-3, అక్షర్ 3.2-0-40-1.

దక్షిణాఫ్రికా విలాపం

దక్షిణాఫ్రికాకు ఇది కొత్త కాదు... ఆ జట్టును అభిమానించే వారికీ ఇది కొత్త కాదు... ఐసీసీ టోర్నీల్లో ఒకదశలో అద్భుత విజయాలు సాధిస్తూ ఒక్కసారిగా ఫేవరెట్‌గా మారిపోవడం, ఆ తర్వాత కీలక సమయంలో అనూహ్య ఓటమిని ఆహ్వానించి నిష్క్రమించడాన్ని ఆ జట్టు అలవాటుగా మార్చుకుంది. నిజం...ఈసారి వర్షం దక్షిణాఫ్రికా అదృష్టాన్ని దెబ్బ తీయలేదు. ఇదంతా స్వయంకృతమే. ఫామ్‌లో ఉన్న భారత్‌పై గెలుపొందిన తర్వాత సఫారీలకు తిరుగు లేదనిపించింది. కానీ పాకిస్తాన్ చేతిలో ఓటమితో పరిస్థితి కొంత మారింది. అయితే చివరి లీగ్ మ్యాచ్ బలహీనమైన నెదర్లాండ్స్‌తో కావడంతో ఇబ్బంది అనిపించలేదు. కానీ పేలవ ఆటతో జట్టు చిత్తయింది. నెదర్లాండ్స్ స్ఫూర్తిదాయక ప్రదర్శన ముందు నిలవలేక సెమీస్ అవకాశాలను కాలదన్నుకుంది. కెప్లర్ వెసెల్స్ కాలం నుంచి క్రానే, కిర్‌స్టెన్, పొలాక్, కలిస్, డివిలియర్స్, స్టెయిన్‌లాంటి దిగ్గజాలు తల వంచినట్లుగానే మరోసారి 'చోకర్స్' పదానికి సార్థక నామధేయంగా తమ పేరును నిలబెట్టుకుంది.

- 13 పరుగులతో నెదర్లాండ్స్ అనూహ్య విజయం
- సెమీస్ అవకాశం చేజార్చుకున్న సఫారీ టీమ్



దక్షిణాఫ్రికా కెప్టెన్ బవుమా బౌల్డ్

అడిలైడ్: టి20 ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా సెమీఫైనల్ చేరకుండా నిష్క్రమించింది. ఆదివారం జరిగిన తమ చివరి లీగ్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 13 పరుగుల తేడాతో నెదర్లాండ్స్ చేతిలో ఓటమి పాలైంది. మ్యాచ్ గెలిస్తే ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా సెమీస్ చేరగలిగే స్థితిలో బరిలోకి దిగిన సఫారీ టీమ్ సమష్టి వైఫల్యంతో దెబ్బ తింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన నెదర్లాండ్స్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 158 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అకర్‌మన్ (26 బంతుల్లో 41 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), మైబర్గ్ (30 బంతుల్లో 37; 7 ఫోర్లు), టామ్ కూపర్ (19 బంతుల్లో 35; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), మ్యాక్స్ ఓ డౌడ్ (31 బంతుల్లో 29; 1 ఫోర్, 1 సిక్స్) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. అనంతరం దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 8 వికెట్లకు 145 పరుగులే చేయగలిగింది. రిలీ రోసో (19 బంతుల్లో 25; 2 ఫోర్లు)దే అత్యధిక స్కోరు కాగా, బ్రెండన్ గ్లోవర్ (3/9) సఫారీలను పడగొట్టాడు. తొలి వికెట్‌కు 51 బంతుల్లో 58 పరుగులు జోడించి మైబర్గ్, డౌడ్ నెదర్లాండ్స్‌కు శుభారంభం అందించగా, ఆపై తక్కువ వ్యవధిలో 3 వికెట్లు తీసి డచ్ జోరును సఫారీ జట్టు నియంత్రించింది. అయితే చివరి 2 ఓవర్లలో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 31 పరుగులు రాబట్టి నెదర్లాండ్స్ గౌరవప్రదమైన స్కోరు సాధించింది. ఛేదనలో మొదటి నుంచీ దక్షిణాఫ్రికా తడబడింది. ఒకదశలో 112/4తో దక్షిణాఫ్రికా నిలవగా, మిల్లర్ క్రీజ్‌లో ఉండటంతో గెలుపుపై ఆశలు పెంచుకుంది. అయితే మిల్లర్ అవుట్‌తో అంతా తలకిందులైంది.

అత్యద్భుత క్యాచ్‌తో...

నెదర్లాండ్స్ ఆటగాడు వాన్ డర్ మెర్వ్ పట్టిన సూపర్ క్యాచ్‌తోనే సఫారీ టీమ్ ఓటమి దిశగా మళ్లింది. 2009, 2010 ప్రపంచకప్‌లలో దక్షిణాఫ్రికా తరఫునే ఆడిన వాన్ డర్ మెర్వ్ ఈసారి అదే జట్టును దెబ్బ కొట్టాడు. విజయానికి 29 బంతుల్లో 47 పరుగులు చేయాల్సిన స్థితిలో గ్లోవర్ వేసిన బంతిని మిల్లర్ పుల్ చేయబోగా బంతి అనూహ్యంగా గాల్లోకి లేచింది. షార్ట్ ఫైన్‌లెగ్‌లో ఉన్న మెర్వ్ వెనక్కి తిరిగి పరుగెడుతూ స్క్వేర్‌లెగ్ వద్ద అద్భుత రీతిలో క్యాచ్ అందుకున్నాడు. అతనొక్కడే కాదు, నెదర్లాండ్స్‌ను గెలిపించిన మైబర్గ్, అకర్‌మన్, బ్రెండన్ గ్లోవర్ దక్షిణాఫ్రికాలోనే పుట్టి అక్కడే దేశవాళీ క్రికెట్ ఆడి ఆ తర్వాత నెదర్లాండ్స్‌కు వలస వెళ్లడం విశేషం.



మెర్వ్

వచ్చే ప్రపంచకప్‌కు నెదర్లాండ్స్ అర్హత

దక్షిణాఫ్రికాపై గెలుపుతో నెదర్లాండ్స్ జట్టు 2024లో వెస్టిండీస్-అమెరికా సంయుక్తంగా ఆతిథ్యమిచ్చే టి20 ప్రపంచకప్‌కు నేరుగా అర్హత సాధించింది. తాజా ప్రపంచకప్‌లో టాప్-8లో నిలిచిన జట్లకు (భారత్, పాకిస్తాన్, న్యూజిలాండ్, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, నెదర్లాండ్స్, శ్రీలంక) తదుపరి మెగా టోర్నీకి నేరుగా అర్హత కల్పించారు. ఆతిథ్య దేశాల హోదాలో వెస్టిండీస్, అమెరికా కూడా అర్హత పొందాయి. ఐసీసీ ర్యాంకింగ్ ఆధారంగా మరో రెండు జట్లకు బెర్త్‌లు లభిస్తాయి. 2024 ప్రపంచకప్‌లో 20 జట్లు పాల్గొంటున్నాయి. మిగతా ఎనిమిది బెర్త్‌లు రీజినల్ క్వాలిఫయింగ్ టోర్నీల ద్వారా ఖరారవుతాయి.

స్కోరు వివరాలు

నెదర్లాండ్స్ ఇన్నింగ్స్: మైబర్గ్ (సి) రోసో (బి) మార్క్‌రమ్ 37; ఓ డౌడ్ (సి) రబడ (బి) మహరాజ్ 29; కూపర్ (సి) డికాక్ (బి) మహరాజ్ 35; అకర్‌మన్ (నాటౌట్) 41; డి లీడ్ (బి) నోర్జే 1; ఎడ్వర్డ్స్ (నాటౌట్) 12; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు 158). వికెట్ల పతనం:** 1-58, 2-97, 3-112, 4-123. **బౌలింగ్:** పార్నెల్ 4-0-32-0, రబడ 3-0-37-0, ఇన్‌గిడి 3-0-35-0, నోర్జే 4-0-10-1, మహరాజ్ 4-0-27-2, మార్క్‌రమ్ 2-0-16-1.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: డి కాక్ (సి) ఎడ్వర్డ్స్ (బి) క్లాసెన్ 13; బవుమా (బి) మీకెరెన్ 20; రోసో (సి) డౌడ్ (బి) గ్లోవర్ 25; మార్క్‌రమ్ (సి) మైబర్గ్ (బి) క్లాసెన్ 17; మిల్లర్ (సి) వాన్ డర్ మెర్వ్ (బి) గ్లోవర్ 17; క్లాసెన్ (సి) వాన్ బీక్ (బి) డి లీడ్ 21; పార్నెల్ (సి) ఎడ్వర్డ్స్ (బి) గ్లోవర్ 0; మహరాజ్ (సి) డౌడ్ (బి) డి లీడ్ 13; రబడ (నాటౌట్) 9; నోర్జే (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 145. వికెట్ల పతనం:** 1-21, 2-39, 3-64, 4-90, 5-112, 6-113, 7-120, 8-141. **బౌలింగ్:** ఫ్రెడ్ క్లాసెన్ 4-0-20-2, మీకెరెన్ 3-0-33-1, అకర్‌మన్ 3-0-16-0, వాన్ డర్ మెర్వ్ 2-0-19-0, గ్లోవర్ 2-0-9-3, వాన్ బీక్ 3-0-23-0, డి లీడ్ 3-0-25-2.

సెమీఫైనల్లో ఎవరితో ఎవరు

నవంబర్ 9: పాకిస్తాన్ X న్యూజిలాండ్
వేదిక: సిడ్నీ; మధ్యాహ్నం గం. 1:30 నుంచి

నవంబర్ 10: భారత్ X ఇంగ్లండ్
వేదిక: అడిలైడ్; మధ్యాహ్నం గం. 1:30 నుంచి

స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం

టి20 ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

గ్రూప్-1

జట్టు	మ్యా	గె	ఓ	ర	పా	నె.ర.
న్యూజిలాండ్	5	3	1	1	7	2.113
ఇంగ్లండ్	5	3	1	1	7	0.473
ఆస్ట్రేలియా	5	3	1	1	7	-0.173
శ్రీలంక	5	2	3	0	4	-0.422
ఐర్లాండ్	5	1	3	1	3	-1.615
అఫ్గానిస్తాన్	5	0	3	2	2	-0.571

గ్రూప్-2

జట్టు	మ్యా	గె	ఓ	ర	పా	నె.ర.
భారత్	5	4	1	0	8	1.319
పాకిస్తాన్	5	3	2	0	6	1.028
దక్షిణాఫ్రికా	5	2	2	1	5	0.874
నెదర్లాండ్స్	5	2	3	0	4	-0.849
బంగ్లాదేశ్	5	2	3	0	4	-1.176
జింబాబ్వే	5	1	2	1	3	-1.138

నోట్: మ్యా-మ్యాచ్‌లు, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు, పా-పాయింట్లు, నె.ర-నెట్ రన్‌రేట్

పాక్ చిద్విలాసం

భారత్ చేతిలో చివరి బంతికి ఓటమితోనే స్వదేశంలో పాకిస్తాన్‌పై ఎప్పటిలాగే తీవ్ర విమర్శలు, తిట్లు... ఆపై సునాయాసంగా గెలవాల్సిన పోరులో అనూహ్యంగా జింబాబ్వే చేతిలోనూ పరాజయం... సెమీస్ అవకాశాలు దాదాపు ముగిసిపోగా, టోర్నీ ముగిశాక నేరుగా పాక్‌కు వెళ్లకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై కూడా చర్చలు షురూ! కానీ ఆ జట్టు రాత ఒక్కసారిగా మారింది. నెదర్లాండ్స్‌ను పదునైన బౌలింగ్‌తో కట్టడి చేసి, సఫారీలకు షాక్ ఇవ్వడంతో కొంత పరువు తిరిగొచ్చింది. అయినా సరే ఆశలు లేవు! కానీ దక్షిణాఫ్రికా ఓటమి జట్టుకు ఒక్కసారిగా ఊపిరి పోసింది. అంతే... బౌలింగ్‌లో సత్తా చాటి బంగ్లాదేశ్‌ను కట్టిపడేసింది. గెలిస్తే తామూ ముందంజ వేయగలమని తెలిసినా బంగ్లాదేశ్ బ్యాటింగ్‌లో చేతులెత్తేసింది. స్వల్ప లక్ష్య ఛేదనలో జింబాబ్వే అనుభవం గుర్తుకు వచ్చినా, చివరకు పాక్ గట్టెక్కింది. అనిశ్చితి నిండిన తమ ఆటను మరో మలుపు తిప్పుతూ వరుసగా రెండో ప్రపంచకప్‌లో సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది.

- తప్పనిసరిగా నెగ్గాల్సిన మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌ను ఓడించి సెమీస్ చేరిక
- రాణించిన షాహీన్ అఫ్రిది



షాహీన్ అఫ్రిది

అడిలైడ్: ప్రతికూల పరిస్థితుల్లోనూ చివరి వరకు పోరాడిన పాకిస్తాన్‌కు అదృష్టం కూడా కలిసొచ్చింది. ఫలితంగా ఆ జట్టు టి20 వరల్డ్ కప్‌లో సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది. ఆదివారం జరిగిన పోరులో పాక్ 5 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 127 పరుగులు చేసింది. నజ్ముల్ హొస్సేన్ (48 బంతుల్లో 54; 7 ఫోర్లు) అర్ధ సెంచరీ సాధించాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' షాహీన్ అఫ్రిది (4/22) ప్రత్యర్థిని కుప్పకూల్చాడు. అనంతరం పాకిస్తాన్ 18.1 ఓవర్లలో 5 వికెట్లకు 128 పరుగులు చేసింది. రిజ్వాన్ (32 బంతుల్లో 32; 2 ఫోర్లు, 1 సిక్స్), హారిస్ (18 బంతుల్లో 31; 1 ఫోర్, 2 సిక్స్‌లు) రాణించారు.

గత మ్యాచ్ హీరో లిటన్ దాస్ (10) తక్కువ స్కోరుకే వెనుదిరగ్గా, 10 ఓవర్లలో బంగ్లా 70/1 వద్ద నిలిచింది. అయితే తర్వాతి ఓవర్లో షాదాబ్ వరుస బంతుల్లో 2 వికెట్లతో దెబ్బ కొట్టాడు. సౌమ్య సర్కార్ (20) క్యాచ్ ఇవ్వగా, తర్వాతి బంతికి షకీబ్ (0) వివాదాస్పద రీతిలో ఎల్బీడబ్ల్యూ అయ్యాడు. అయితే అంపైర్ నిర్ణయాన్ని ప్రశ్నిస్తూ షకీబ్ రివ్యూ కోరాడు. రీప్లేలో బంతి బ్యాట్‌కు తగిలినట్లుగా కనిపిస్తున్నా... బ్యాట్ నేలకు తాకడంతోనే 'స్పైక్' వచ్చినట్లు చెబుతూ మూడో అంపైర్ రుసెరె 'అవుట్'గా ప్రకటించాడు. అసహనంతో షకీబ్ మైదానంలోనే నిలబడిపోగా, చివరకు బయటకు వెళ్లాల్సి వచ్చింది. ఆపై మరో 52 పరుగులే జోడించి బంగ్లాదేశ్ తర్వాతి 5 వికెట్లు కోల్పోయింది. ఛేదనలో 'సున్నా' వద్దే రిజ్వాన్ ఇచ్చిన క్యాచ్‌ను కీపర్ నూరుల్ వదిలేశాడు. ఆపై జాగ్రత్తగా పాక్ లక్ష్యం దిశగా సాగింది. చివర్లో తక్కువ వ్యవధిలో 3 వికెట్లు కోల్పోయి కొంత ఉత్కంఠ నెలకొన్నా...మసూద్ పట్టుదలగా క్రీజ్‌లో నిలిచి పని పూర్తి చేశాడు.

స్కోరు వివరాలు

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: నజ్ముల్ (బి) ఇఫ్తికార్ 54; దాస్ (సి) మసూద్ (బి) అఫ్రిది 10; సర్కార్ (సి) మసూద్ (బి) షాదాబ్ 20; షకీబ్ (ఎల్బీ) (బి) షాదాబ్ 0; అఫీఫ్ (నాటౌట్) 24; మొసద్దిక్ (బి) అఫ్రిది 5; నూరుల్ (సి) హారిస్ (బి) అఫ్రిది 0; తస్కీన్ (సి) బాబర్ (బి) అఫ్రిది 1; నసుమ్ (సి) వసీమ్ (బి) రవూఫ్ 7; ముస్తఫిజుర్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు 6; మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 127. వికెట్ల పతనం:** 1-21, 2-73, 3-73, 4-91, 5-107, 6-107, 7-109, 8-126. **బౌలింగ్:** షాహీన్ అఫ్రిది 4-0-22-4, నసీమ్ 3-0-15-0, వసీమ్ 2-0-19-0, హారిస్ రవూఫ్ 4-0-21-1, షాదాబ్ 4-0-30-2, ఇఫ్తికార్ 3-0-15-1.

పాకిస్తాన్ ఇన్నింగ్స్: రిజ్వాన్ (సి) నజ్ముల్ (బి) ఇబాదత్ 32; బాబర్ (సి) ముస్తఫిజుర్ (బి) నసుమ్ 25; నవాజ్ (రనౌట్) 4; హారిస్ (సి) నసుమ్ (బి) షకీబ్ 31; మసూద్ (నాటౌట్) 24; ఇఫ్తికార్ (సి) నజ్ముల్ (బి) ముస్తఫిజుర్ 1; షాదాబ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (18.1 ఓవర్లలో 5 వికెట్లకు) 128. వికెట్ల పతనం:** 1-57, 2-61, 3-92, 4-121, 5-126. **బౌలింగ్:** తస్కీన్ 3-0-26-0, నసుమ్ 4-0-14-1, షకీబ్ 4-0-35-1, ముస్తఫిజుర్ 4-0-21-1, ఇబాదత్ 3.1-0-25-1.

'షూటౌట్'లో స్పెయిన్‌పై భారత్ విజయం

భువనేశ్వర్: ప్రొ హాకీ లీగ్ 2022-2023 సీజన్‌లో భారత జట్టు మూడో విజయం నమోదు చేసింది. స్పెయిన్ జట్టుతో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 'షూటౌట్'లో 3-1తో గెలిచింది. నిర్ణీత సమయం ముగిసేసరికి రెండు జట్లు 2-2తో సమంగా నిలిచాయి. భారత్ తరఫున కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ రెండు గోల్స్ (12వ, 32వ ని.లో) సాధించగా... స్పెయిన్ జట్టుకు మిరాలెస్ (43వ ని.లో), అమత్ పెరె (55వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. 'షూటౌట్'లో భారత్ తరఫున హర్మన్‌ప్రీత్, రాజ్‌కుమార్ పాల్, అభిషేక్... స్పెయిన్ తరఫున గెరార్డ్ క్లాప్స్ సఫలమయ్యారు. స్పెయిన్ ప్లేయర్లు మెనిని, వియోలోంగా, మిరాలెస్ షాట్‌లను భారత గోల్‌కీపర్ కృషన్ బహదూర్ పాఠక్ నిలువరించాడు. తొమ్మిది జట్లు పాల్గొంటున్న ఈ లీగ్‌లో భారత్ ఎనిమిది పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది.




ఆసీస్‌లో లంక క్రికెటర్ గుణతిలక అరెస్ట్




సిడ్నీ: టి20 ప్రపంచ కప్ ఆడేందుకు ఆస్ట్రేలియా వెళ్లిన శ్రీలంక క్రికెటర్ దనుష్క గుణతిలక కటకటాల పాలయ్యాడు. ఈ నెల 2న ఓ మహిళపై లైంగిక దాడికి పాల్పడ్డారనే ఆరోపణలతో సిడ్నీ పోలీసులు అతన్ని అరెస్ట్ చేశారు. 31 ఏళ్ల గుణతిలకపై అత్యాచారం కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు చేపట్టినట్లు సిడ్నీ పోలీసులు వెల్లడించారు. దీంతో సూపర్-12లో నిష్క్రమించిన శ్రీలంక జట్టు గుణతిలక లేకుండానే ఆదివారం స్వదేశానికి పయనమైంది. ఆన్‌లైన్ డేటింగ్ ద్వారా పరిచయమైన 29 ఏళ్ల మహిళను రోజ్ బేలోని ఇంట్లో కలిసిన లంక క్రికెటర్ ఆమెపై అత్యాచారం చేసినట్లు పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో పేర్కొన్నారు. క్వాలిఫయింగ్ తొలి రౌండ్ పోటీల్లో ఒక్క నమీబియాతో ఆడిన గుణతిలక గాయం కారణంగా ఇతర మ్యాచ్‌లు ఆడలేకపోయాడు. ఇప్పటివరకు తన కెరీర్‌లో 8 టెస్టులు, 47 వన్డేలు, 46 టి20లు ఆడిన గుణతిలక వివాదాస్పద క్రికెటర్‌గా ముద్రపడ్డాడు. 2017లో అనుచిత ప్రవర్తన, ట్రెయినింగ్ సెషన్‌కు చెప్పాపెట్టకుండా గైర్హాజరు కావడంతో 6 వన్డేల సస్పెన్షన్ వేటు వేశారు. 2018లో కర్ఫ్యూ నిబంధనలు అతిక్రమించడంతో ఆరు నెలలు నిషేధం విధించారు. గతేడాది ఇంగ్లండ్ పర్యటనలో బయో బబుల్ బయటకు రావడంతో ఏడాది పాటు సస్పెండ్ చేసి చివరకు ఆరు నెలలకు తగ్గించారు.

మెరిసిన నితిన్, అశ్వద్



నితిన్



అశ్వద్

సాక్షి, హైదరాబాద్: కూచ్ బెహార్ ట్రోఫీ అండర్-19 క్రికెట్ టోర్నీలో భాగంగా సిక్కిం జట్టుతో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ ఇన్నింగ్స్ 355 పరుగుల భారీ ఆధిక్యంతో ఘనవిజయం సాధించింది. ఆల్‌రౌండర్ నితిన్ సాయి యాదవ్ (34 పరుగులు; 11 వికెట్లు) హైదరాబాద్ విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఓవర్‌నైట్ స్కోరు 462/6తో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్ 106 ఓవర్లలో 9 వికెట్లకు 541 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన సిక్కిం 72 పరుగులకే ఆలౌటైంది. నితిన్ సాయి యాదవ్ (3/23), అశ్వద్ రాజీవ్ (4/15) సిక్కిం జట్టును దెబ్బ తీశారు. ఫాలోఆన్ ఆడిన సిక్కిం రెండో ఇన్నింగ్స్‌లో నితిన్ సాయి యాదవ్ (8/34) స్పిన్ మ్యాజిక్‌కు 114 పరుగులకే ఆలౌటైంది.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	114	60,950
నిఫ్టీ ▲	64	18,117

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	10,475	▲	132
డోజోన్స్	32,403	▲	402
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,335	▲	146
డాక్స్	13,460	▲	330
షాంఘై	3,071	▲	73
నికాయ్	27,200	▼	464

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ప్రతి నెలా ఆదాయం కావాలా?


రిస్క్ లేని సాధనాలు బోలెడు ● సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీమ్ ● ప్రధానమంత్రి వయవందన యోజన ● డెట్, హైబ్రిడ్ ఫండ్స్ ఎస్‌డబ్ల్యూపీ, రివర్స్ మార్ట్‌గేజ్ ● రిస్క్, రాబడికి అనుకూలమైన ఎంపిక

60's 65's 70's 75's 80's 85's 90's



ప్రతి నెలా క్రమం తప్పకుండా ఆదాయం కోరుకునే వారికి ఎన్నో సాధనాలు అందుబాటులో ఉన్నాయి. స్థిరమైన ఆదాయం ఉండాలి కానీ, ఇక్కడ రిస్క్ దాదాపు ఉండకూడదనుకునే వారి ముందున్న ఏకైక మార్గం డెట్ సాధనాలే. ఉద్యోగ విరమణ చేసిన వారికి.. అప్పటి వరకు నెల నెలా వచ్చే ఆదాయం ఆగిపోతుంది. పింఛను ఏర్పాటు ఉన్న వారికి, ఆ తర్వాత కూడా ఎంతో కొంత మొత్తం ప్రతి నెలా చేతికి అందుతుంటుంది. కానీ, ఆ విధమైన ఏర్పాటు లేని వారు ఇతర ప్రత్యామ్నాయాలను చూడాల్సిందే. క్రమం తప్పకుండా ఆదాయం కోసం అందుబాటులో ఉన్న సాధనాల గురించి తెలిపే కథనం ఇది...





ఫిక్స్‌డ్ డిపాజిట్లు

బ్యాంక్‌లు ప్రతి నెలా వడ్డీని చెల్లించే ఫిక్స్‌డ్ డిపాజిట్‌లను సైతం ఆఫర్ చేస్తాయి. వడ్డీ ఆదాయం సేవింగ్స్ అకౌంట్‌లోనే జమ అవుతుంది. కనుక కావాల్సినప్పుడు ఆ మొత్తాన్ని సులభంగా ఉపయోగించుకోవచ్చు. త్రైమాసికం వారీగా, ఏడాదికోసారి వడ్డీని చెల్లించే ఆప్షన్ కూడా ఉంటుంది. బ్యాంక్‌ల్లో నెలసరి ఆదాయం (మంత్లీ ఇన్‌కమ్) చెల్లించే డిపాజిట్లపై వడ్డీ రేటు 10 ఏళ్ల కాల వ్యవధికి గరిష్ఠంగా 6.5 శాతం వరకు ఉంది. బ్యాంక్‌ల మధ్య ఈ రేటు వేర్వేరుగా ఉంటుంది. సీనియర్ సిటిజన్లకు (60 ఏళ్లు నిండిన) బ్యాంకులు అర శాతం అధికంగా ఆఫర్ చేస్తున్నాయి.

అనుకూలం/ప్రతికూలం

బ్యాంక్‌ల్లో డిపాజిట్లు ఎంతో సౌకర్యం. బ్యాంకు వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఆన్‌లైన్‌లోనే డిపాజిట్ చేసుకోవచ్చు. ప్రభుత్వరంగ బ్యాంకులు లేదంటే ప్రముఖ ప్రైవేటు బ్యాంకులను ఇందుకు ఎంపిక చేసుకోవచ్చు. మరీ చిన్న బ్యాంకులు, కోపరేటివ్ బ్యాంకుల్లో కొంత అదనపు రిస్క్ ఉంటుంది. అయినప్పటికీ, ఆర్‌బీఐ డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారంటీ స్కీమ్ కింద ఒక డిపాజిటర్‌కు రూ.5 లక్షల వరకు బీమా సదుపాయం ఉందన్న విషయాన్ని మర్చిపోవద్దు. బ్యాంకు సంక్షోభంలో పడితే ఈ మొత్తం రావడానికి సమయం పట్టొచ్చు. అందుకని ముందే పటిష్ట బ్యాంకులను ఎంపిక చేసుకుంటే సరి. వడ్డీ ఆదాయం పన్ను పరిధిలోకి వస్తుంది. వృద్ధులు అయితే ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.50వేల ఆదాయంపై పన్ను లేదు. ఇంతకుమించిన ఆదాయం వ్యక్తిగత ఆదాయానికే కలుస్తుంది. ప్రతీ ఆర్థిక సంవత్సరం ఆరంభంలో వడ్డీ ఆదాయంపై బ్యాంకులు టీడీఎస్ అమలు చేస్తుంటాయి. కనుక ఆదాయపన్ను వర్తించని వారు ఫామ్ 15జీ/హెచ్ సమర్పిస్తే సరిపోతుంది.

సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీమ్

సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీమ్ ఎంతో పాపులర్ పథకం. 60 ఏళ్లు నిండిన వారు ఇందులో డిపాజిట్ చేసుకోగలరు. 55 ఏళ్లు నిండి, పదవీ విరమణ తీసుకున్న వారు కూడా అర్హులే. ఒకరు గరిష్ఠంగా రూ.15 లక్షల వరకు ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. డిపాజిట్ కాల వ్యవధి ఐదేళ్లు. ప్రస్తుతం 7.4 శాతం వార్షిక వడ్డీ రేటు అమల్లో ఉంది. ఇది బ్యాంకు డిపాజిట్ల కంటే ఎక్కువ. ఈ రేటు ప్రకారం ప్రతి మూడు నెలలకు (ఏప్రిల్, జూలై, అక్టోబర్, జనవరిలో) వడ్డీని బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. వృద్ధులకు క్రమం తప్పకుండా ఆదాయన్ని ఇచ్చే సంప్రదాయ సాధనాల్లో ఇది మెరుగైనది.

అనుకూలం/ప్రతికూలం

ఇందులో పెట్టుబడికి ఎటువంటి రిస్క్ లేదు. భారత ప్రభుత్వం హామీనిస్తుంది. సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీమ్‌లో పెట్టుబడిని సంబంధిత ఆర్థిక సంవత్సరంలో సెక్షన్ 80సీ కింద రూ.1.5 లక్షల వరకు పన్ను మినహాయింపును కోరొచ్చు. భార్యా, భర్త వేర్వేరు ఖాతాలను తెరవొచ్చు. పోస్టాఫీసులే కాకుండా బ్యాంకుల్లో ప్రారంభించొచ్చు. బ్యాంకుల్లో ఇన్వెస్ట్ చేయడమే సౌకర్యంగా ఉంటుంది. ఎందుకంటే ఎక్కడి నుంచైనా నిర్వహించుకోవడం సులభం. ఇందులో ఆదాయంపై టీడీఎస్ అమలవుతుంది. పన్ను చెల్లించేంత ఆదాయం లేని వారు ప్రతి ఆర్థిక సంవత్సరం ఆరంభంలోనే ఫామ్ 15జీ/హెచ్ ఇస్తే టీడీఎస్ మినహాయించరు.

ప్రధానమంత్రి వయవందన యోజన

2017 మే నుంచి అందుబాటులోకి వచ్చిన పథకం ఇది. ఎల్‌ఐసీ దీన్ని నిర్వహిస్తోంది. ఒకే విడత ఇందులో ఇన్వెస్ట్ చేస్తే పదేళ్ల పాటు ఆదాయం అందుకోవచ్చు. ప్రస్తుతం ఇందులో నెలవారీ చెల్లింపు ఆప్షన్‌పై 7.40 శాతం వార్షిక రేటు చెల్లిస్తున్నారు. 2023 మార్చి 31 వరకు ఇన్వెస్ట్ చేస్తే, పదేళ్ల పాటు ఇదే రేటు అమల్లో ఉంటుంది.



అనుకూలం/ప్రతికూలం

బ్యాంకు సాధనాలతో పోలిస్తే ఇందులో అధిక రేటు అమల్లో ఉంది. పదేళ్ల కాలానికి ఒక్కటే రేటు ఉండడం వల్ల ఆదాయంలో స్థిరత్వం ఉంటుంది. బీమా కంపెనీలు అందించే పెన్షన్ ప్లాన్లతో పోల్చినా ఇందులోనే రాబడి ఎక్కువ. యాన్యుటీ ప్లాన్లతో పోలిస్తే నూరు శాతం ఇదే మెరుగైనది. ప్రభుత్వం తరఫున ఎల్‌ఐసీ దీన్ని నిర్వహిస్తోంది కనుక ఇందులో పెట్టుబడికి రిస్క్ ఉండదు. నెలవారీ, మూడు నెలలు, ఆరు నెలలు, ఏడాదికోసారి ఆదాయం చెల్లించే ఆప్షన్ ఎంపిక చేసుకోవచ్చు. ఏదైనా అనారోగ్యం బారిన పడితే దీన్ని స్వాధీనం చేసి ఆ మొత్తాన్ని వెనక్కి తీసుకోవచ్చు. అంతేకాదు, ఇందులో పెట్టుబడి విలువపై 75 శాతానికి సమానంగా రుణాన్ని ఎప్పుడైనా పొందొచ్చు. దీంతో అత్యవసరాల్లో సాయపడుతుంది. ఒకరు గరిష్ఠంగా రూ.15 లక్షల వరకే ఇన్వెస్ట్ చేసుకోగలరు. ఈ మొత్తంపై ప్రతి నెలా రూ.9,250 పెన్షన్ వస్తుంది.

పోస్టాఫీసు మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్

ఇది ఐదేళ్ల కాల వ్యవధి కలిగిన పథకం. ఈ పథకంలో ఇన్వెస్ట్ చేసుకుంటే, ప్రతి నెల వడ్డీ ఆదాయన్ని పోస్టల్ సేవింగ్ అకౌంట్‌లో జమ చేయడం జరుగుతంది. దీనిపై 6.6 శాతం రేటు ప్రస్తుతం అమల్లో ఉంది. ఒక్కరు అయితే గరిష్ఠంగా రూ.4.5 లక్షల వరకే డిపాజిట్ చేసుకునే వెసులుబాటు ఉంది. జాయింట్‌గా అయితే ఈ పరిమితి రూ.9 లక్షలుగా ఉంది.



అనుకూలం/ప్రతికూలం

బ్యాంకులతో పోలిస్తే కాస్తంత వడ్డీ రేటు ఇందులో ఎక్కువ. పైగా ఇందులో పెట్టుబడులకు భారత ప్రభుత్వం హామీదారుగా ఉంటుంది. కాకపోతే, బ్యాంకు డిపాజిట్ల మాదిరి సౌకర్యం పోస్టాఫీసు మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్‌లో ఉండదు. పోస్టాఫీసుకు వెళ్లే డిపాజిట్ చేసుకోవాల్సి ఉంటుంది. ఉపసంహరణకు కూడా వెళ్లాలి. వృద్ధులు, చిరునామా మారే వారికి ఇది అసౌకర్యం. వడ్డీ ఆదాయం పన్ను పరిధిలోకి వస్తుంది. వ్యక్తిగత ఆదాయంలో చూపించి చెల్లించాలి. ఐదేళ్లలోపు క్లోజ్ చేస్తే పెనాల్టీ పడుతుంది. బ్యాంకుల్లో ఎలాంటి పెనాల్టీలు ఉండవు.

కంపెనీల డిపాజిట్లు

బజాజ్ ఫైనాన్స్ తదితర ప్రముఖ ఎన్‌బీఎఫ్‌సీ సంస్థలు, కంపెనీలు సైతం ప్రజల నుంచి డిపాజిట్లను స్వీకరిస్తుంటాయి. వీటిల్లో అధిక క్రెడిట్ రేటింగ్ కలిగిన వాటిని ఎంపిక చేసుకోవచ్చు. 6–9 శాతం మధ్య వీటిల్లో వడ్డీ రేటు లభిస్తుంది. సీనియర్ సిటిజన్స్‌కు సహజంగా అర శాతం అధిక రేటు లభిస్తుంది. ఈ డిపాజిట్ల కాల వ్యవధి ఏడాది నుంచి ఐదేళ్ల వరకు ఉంటుంది. కొన్ని ఎన్‌బీఎఫ్‌సీలు 10 ఏళ్ల డిపాజిట్లను కూడా ఆఫర్ చేస్తున్నాయి.



అనుకూలం/ప్రతికూలం

సాధారణంగా బ్యాంకులతో పోలిస్తే అదనపు రేటును ఇవి ఆఫర్ చేస్తుంటాయి. ఇవి బ్యాంకుల నుంచి రుణం తీసుకోవాలంటే 9 శాతానికి పైనే చెల్లించాల్సి వస్తుంది. అందుకని ప్రజలకు సైతం మెరుగైన రేటును ఆఫర్ చేస్తాయి. వీటిల్లో డిపాజిట్ పూర్తిగా రిస్క్‌తో కూడినదే. ఎందుకంటే పెట్టుబడికి, వడ్డీకి ఎటువంటి గ్యారంటీ ఉండదు. ఇందులో వడ్డీ ఆదాయం ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.5,000 మించితే 10 శాతం టీడీఎస్ అమలవుతుంది. పన్ను పరిధిలో లేని వారు ఫామ్ 15జీ/హెచ్ సమర్పించి టీడీఎస్ లేకుండా చూసుకోవచ్చు. కాల వ్యవధిలోపు తీసుకుంటే పెనాల్టీ ఎక్కువగా ఉంటుంది. ఇన్వెస్ట్ చేసే ముందు పెనాల్టీ నిబంధన చూసిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలి.

కంపెనీల ఎన్‌సీడీలు



కంపెనీల నుంచి నేరుగా కొనుగోలు చేయవచ్చు. లేదంటే బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈ నుంచి కంపెనీల ఎన్‌సీడీలను షేర్ల మాదిరే కొనుగోలు చేసుకోవచ్చు. ఇవి డీమ్యాట్ ఖాతాలో జమ అవుతాయి. వడ్డీ బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది. వీటిల్లో వడ్డీ రేటు 6–11 శాతం మధ్య ఉంటుంది. ఎన్‌సీడీల కాల వ్యవధి 3–8 ఏళ్ల మధ్య ఉంటుంది. ఏఏఏ రేటెడ్ కలిగిన ఎన్‌సీడీల్లో పెట్టుబడులు పెట్టడం వరకే పరిమితం కావాలి.

అనుకూలం/ప్రతికూలం

బ్యాంకుల కంటే వడ్డీ రేటు ఎక్కువ. కానీ, ఎటువంటి హామీ ఉండదు. డీమ్యాట్ ఖాతా ఉంటే సులభంగా కొనుగోలు, విక్రయాలు చేసుకోవచ్చు. స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల ద్వారా కొనుగోలు చేస్తే టీడీఎస్ పడదు. వడ్డీ ఆదాయం పన్ను పరిధిలోకి వస్తుంది. స్టాక్ ఎక్స్ఛేంజ్‌లలో ఎన్‌సీడీల కొనుగోలు, విక్రయాల పరంగా లిక్విడిటీ తక్కువగా ఉంటుంది.

సిస్టమ్యాటిక్ విత్‌డ్రాయల్

డెట్ లేదా ఆర్బిట్రేజ్ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకుని, ప్రతి నెలా నిర్ణీత మొత్తం లభించేలా సిస్టమ్యాటిక్ విత్‌డ్రాయల్ ప్లాన్ (ఎస్‌డబ్ల్యూపీ) ఎంపిక చేసుకోవచ్చు. ఇందులో పెట్టుబడిపై రాబడి బ్యాంకు డిపాజిట్ల స్థాయిలోనే 5–6 శాతం (వార్షిక) మధ్య ఉంటుందని అనుకోవచ్చు. మార్కెట్ పరిస్థితులు, పథకం పనితీరు ఆధారంగా స్వల్ప మార్పులు ఉండొచ్చు. కావాల్సిన ఆదాయం ప్రతి నెలా వచ్చేలా ఇన్వెస్టర్లు తమ స్వేచ్ఛకొద్దీ ఎస్‌డబ్ల్యూపీని నిర్ణయించుకోవచ్చు. రాబడి మేరకు తీసుకుంటే ఫర్వాలేదు. అది చాలదనుకుంటే పెట్టుబడి నుంచి కూడా కొంత మొత్తం తీసుకున్నట్టు అవుతుంది.



అనుకూలం/ప్రతికూలం

ఫిక్స్‌డ్ డిపాజిట్ల కంటే పన్ను పరంగా ఇది మెరుగైన సాధనం. అధిక పన్ను పరిధిలో ఉన్న వారికి అనుకూలం. పెట్టుబడి, ఉపసంహరణ అంతా సులభంగా ఉంటుంది. ఆన్‌లైన్‌లోనే లావాదేవీలు నిర్వహించుకోవచ్చు. ఆర్బిట్రేజ్ ఫండ్స్ అన్నవి డెట్, ఈక్విటీల్లోనూ ఇన్వెస్ట్ చేస్తాయి. రిస్క్ కొన్ని సందర్భాల్లో తప్పించి దాదాపుగా ఉండదు.

యాన్యుటీ ప్లాన్లు

బీమా కంపెనీలు యాన్యుటీ ప్లాన్లను ఆఫర్ చేస్తుంటాయి. ఏక మొత్తంలో ఇన్వెస్ట్ చేస్తే నిర్ణీత రేటుపై ప్రతి నెలా ఇవి చెల్లింపులు చేస్తాయి. 60 ఏళ్లు దాటిన వారికి అయితే పెట్టుబడి పెట్టిన మరుసటి నెల నుంచి చెల్లింపులు చేసే ఇమీడియట్ యాన్యుటీ ప్లాన్లు, ఇంకా రిటైర్మెంట్‌కు సమయం ఉన్నవారి కోసం డిఫర్డ్ యాన్యుటీ ప్లాన్లు ఉన్నాయి. పెన్షన్ కోరుకునే వారు ఇమీడియట్ యాన్యుటీలను ఎంపిక చేసుకోవాలి. ఎన్‌పీఎస్‌లో ఇన్వెస్ట్ చేసే వారు సైతం 60 ఏళ్లు వచ్చిన తర్వాత సమకూరిన మొత్తం నిధి నుంచి 60 శాతమే వెనక్కి



తీసుకుని, మిగిలిన 40 శాతంతో యాన్యుటీ ప్లాన్‌ను తీసుకోవడం తప్పనిసరి. ఎల్‌ఐసీలో జీవన్ అక్షయ్ పెన్షన్ ప్లాన్, జీవన్ శాంతి యాన్యుటీ ప్లాన్లే. వీటిల్లో రాబడి 4–7 శాతం మధ్య ఉంటుంది.

అనుకూలం/ప్రతికూలం


యాన్యుటీ ప్లాన్ల కొనుగోలు సులభం. బ్యాంకు ఖాతాలో ప్రతి నెలా ఆదాయం జమ అవుతుంది. ఇందులో ఆదాయానికి, పెట్టుబడికి పూర్తి గ్యారంటీ ఉంటుంది. యాన్యుటీ ప్లాన్ ఒక్కసారి కొనుగోలు చేశామంటే జీవితాంతం కొనసాగించాల్సిందే. బ్యాంకు ఎఫ్‌డీల కంటే రాబడి తక్కువ. వడ్డీ ఆదాయం పూర్తిగా పన్ను పరిధిలోకి వస్తుంది. ఇదేమంత ఆకర్షణీయమైన సాధనం కాదు.

రివర్స్ మార్ట్‌గేజ్

ఇంటిని తనఖా పెట్టి పొందే రుణం ఇది. ఈ మొత్తాన్ని ఒకే విడత కాకుండా.. ప్రతి నెలా నిర్ణీత మొత్తం మీకు లభించేలా బ్యాంకుతో ఒప్పందం చేసుకోవచ్చు. ఇది ఈఎంఐకి రివర్స్ మాదిరి పనిచేస్తుంది. బ్యాంక్‌లు, హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలు దీన్ని ఆఫర్ చేస్తున్నాయి. కోరుకున్నప్పుడు తీసుకున్న మొత్తం, దానిపై వడ్డీ చెల్లించి మార్ట్‌గేజ్‌ను ఉపసంహరించుకోవచ్చు. లేదంటే తమ తదనంతరం వారసులకు దీన్ని బదిలీ చేయవచ్చు.

అనుకూలం/ప్రతికూలం

రూ.50 లక్షల నుంచి కోటి వరకు పొందడానికి ఉంటుంది. ఎక్కువ బ్యాంక్‌లు 20 ఏళ్ల కాలానికి రివర్స్ మార్ట్‌గేజ్‌ను అందిస్తున్నాయి. 60 ఏళ్లు నిండిన వారికే ఈ సదుపాయం. మార్ట్‌గేజ్ కింద ఇంటిని బ్యాంకుకు తనఖా పెట్టి రుణం పొందుతున్నా కానీ, అదే ఇంట్లో నివసించొచ్చు. తమ తదనంతరం వారసులు ఈ మొత్తాన్ని చెల్లించి బ్యాంకుల నుంచి ఇల్లు తమ పేరిట స్వాధీనం చేసుకోవచ్చు. వద్దనుకుంటే బ్యాంకు సదరు తనఖాలో ఇంటిని విక్రయించి, అప్పటి వరకు చెల్లించిన మొత్తం, దానిపై వడ్డీని మినహాయించుకుంటుంది. ఇది పోను మిగులు ఏమైనా ఉంటే వారసులకు ఇస్తుంది. రుణంపై జీవించడంగా దీన్ని అర్థం చేసుకోవాలి. ఎందుకంటే ప్రాపర్టీని తిరిగి స్వాధీనం చేసుకోవాలంటే బ్యాంకు నుంచి అప్పటి వరకు పొందిన మొత్తంపై వడ్డీ కూడా చెల్లించుకోవాలి.





రియల్ ఎస్టేట్ అద్దెలు



అద్దెలు కూడా క్రమం తప్పకుండా ఆదాయ మార్గమే. నివాసం అయితే రాబడి 1–4 శాతం మధ్యే ఉంటుంది. వాణిజ్య ప్రాపర్టీ అయితే రాబడి 5–12 శాతం మధ్య ఉంటుంది.

అనుకూలం/ప్రతికూలం

ఏటేటా ఎంతో కొంత చొప్పున అద్దె ఆదాయం పెరుగుతుంది. కనుక ద్రవ్యోల్బణం నుంచి రక్షణ ఉంటుందని చెప్పుకోవచ్చు. కాకపోతే కేవలం ఆదాయం కోణంలోనే ప్రాపర్టీపై పెట్టుబడి పెట్టలేము. ఎందుకంటే కావాల్సినప్పుడు వేగంగా అమ్ముకునే వెసులుబాటు అంతగా ఉండదు. ప్రాపర్టీ కొనుగోలుకు అధిక పెట్టుబడి అవసరం అవుతుంది.

పన్ను ఆదా బాండ్లు..

అధిక ఆదాయపన్ను పరిధిలోని వారికి ఇవి మరింత అనుకూలం. పన్ను లేని ఆదాయాన్ని అందుకోవచ్చు. ఒకవేళ నిర్ణీత కాలవ్యవధికి ముందు బాండ్లలోని పెట్టుబడులను వెనక్కి తీసుకుంటే కనుక, అప్పటి వరకు పొందిన లాభం పన్ను పరిధిలోకి వస్తుంది. గతంలో ఏటా ఈ బాండ్లను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) జారీ చేసేది. గత కొన్నేళ్లుగా వీటి జారీ లేదు. సెకండరీ మార్కెట్ నుంచి (డీమ్యాట్ ఖాతా ఉన్నవారు) కొనుగోలు చేసుకోవచ్చు. రాబడి 6–6.50 శాతం శ్రేణిలో వస్తుంది.



అనుకూలం/ప్రతికూలం

వడ్డీ ఆదాయంపై పన్ను లేకపోవడం సానుకూలం. బ్యాంకు ఎఫ్‌డీలకు తగ్గకుండా ఆదాయం ట్యాక్స్ ఫ్రీ బాండ్లలో వస్తుంది. అదే బ్యాంకు ఎఫ్‌డీల ఆదాయం అయితే పన్ను పరిధిలోకి వస్తుంది. దీర్ఘ కాలం పాటు ఇందులో పెట్టుబడులు కొనసాగించాల్సి రావడం అందరికీ అనుకూలం కాకపోవచ్చు. ముందే తీసుకుంటే వడ్డీ ఆదాయంపై పన్ను పడుతుంది. ఈ బాండ్లలో ఎక్కువ వాటికి వార్షికంగా చెల్లింపులు చేసే ఆప్షన్ మాత్రమే అందుబాటులో ఉంది. నెలవారీ ఆదాయం కోరుకునే వారికి ఇది ప్రతికూలం. సెకండరీ మార్కెట్లో లిక్విడిటీ తక్కువగా ఉంటుంది.

కొంత రిస్క్ తీసుకునే వారికి

రిస్క్ తీసుకునే వారు అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్‌ను కూడా ఎంపిక చేసుకోవచ్చు. దీర్ఘకాలంలో వీటిల్లో రాబడులు వార్షికంగా 12 శాతం వరకు ఉన్నాయి. దీర్ఘకాలంగా మంచి పనితీరు చూపిస్తున్న పథకాల నుంచి ఎంపిక చేసుకోవచ్చు. వీటిల్లో ఏకమొత్తంలో కాకుండా.. ఆరు నుంచి 12 నెలసరి వాయిదాల్లో తమవద్దనున్న కార్పస్‌ను ఇన్వెస్ట్ చేసుకుని, ఆ తర్వాత నుంచి ప్రతి నెలా నిర్ణీత మొత్తాన్ని సిస్టమ్యాటిక్ విత్‌డ్రాయల్ ప్లాన్ ద్వారా ఉపసంహరించుకోవచ్చు.



అనుకూలం/ప్రతికూలం

అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్ 25% వరకు ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేస్తాయి. కనుక ఈ మేరకు అధిక రాబడికి అవకాశం ఉంటుంది. ఈక్విటీ మార్కెట్ల దిద్దుబాటు సమయాల్లో పెట్టుబడిని కాపాడుకునేందుకు ఉపసంహరణను కొంత వరకు తగ్గించుకోవాల్సి రావచ్చు.

ప్రభుత్వ సెక్యూరిటీలు



ప్రభుత్వ బాండ్లను ఆర్‌బీఐ జారీ చేస్తుంటుంది. రిటైలర్ల కంటే ఎక్కువగా ఇనిస్టిట్యూషన్స్ ఈ సాధనంలో ఇన్వెస్ట్ చేస్తుంటాయి. ఈ బాండ్ల కాల వ్యవధి 30 ఏళ్ల వరకు ఉంటుంది. వడ్డీని ప్రతి ఆరు నెలలకు చెల్లిస్తారు. రాబడి 5–7 శాతం మధ్య ఉంటుంది.

అనుకూలం/ప్రతికూలం

పెట్టుబడికి, రాబడికి ఏ మాత్రం రిస్క్ ఉండదు. ఆర్‌బీఐ వద్ద రిటైల్ డైరెక్ట్ గిల్ట్ అకౌంట్ ప్రారంభించి ఆన్‌లైన్‌లోనే కొనుగోలు చేసుకోవచ్చు. టీడీఎస్ అమలు కాదు. వడ్డీ ఆదాయం పన్ను పరిధిలోకి వస్తుంది.

వెంకటరమణకు ప్రతిష్టాత్మక అవార్డు



పారిశ్రామిక దిగ్గజం, సీఎమ్మార్ సంస్థల అధినేత, ఏపీ దేవాంగ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు మావూరి వెంకట రమణకు ప్రతిష్ఠాత్మక ఏషియన్ యూకే బిజినెస్ మ్యాన్-2022 అవార్డు లభించింది. అవార్డును స్వీకరిస్తున్నప్పటి దృశ్యమిది.

కంపెనీలను మించిన వెంకన్న సంపద

- రూ. 2.5 లక్షల కోట్ల నికర విలువ
- బాలాజీ ముందు విప్రో, నెస్లే వంటి దిగ్గజాలు దిగదుడుపే

న్యూఢిల్లీ: వడ్డీ కాసులవాడైన తిరుపతి గోవిందుడి సంపద .. ఇంతింతై .. అన్నట్లుగా ఏయేటికాయేడు పెరుగుతూనే ఉంది. ఈ క్రమంలో వ్యాపార దిగ్గజ కంపెనీలను కూడా వెనక్కు నెట్టేస్తోంది. తాజాగా తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) వెల్లడించిన గణాంకాలను బట్టి చూస్తే ఈ విషయంలో ఐటీ సేవల దిగ్గజం విప్రో, ప్రభుత్వ రంగ చమురు దిగ్గజాలు ఓఎన్‌జీసీ, ఐవోసీ మొదలైనవి కూడా వెంకన్న ముందు దిగదుడుపే. టీటీడీ గణాంకాల ప్రకారం ఆయన సంపద విలువ రూ. 2.5 లక్షల కోట్లు. వీటిలో 10.25 టన్నుల బంగారం డిపాజిట్లు, 2.5 టన్నుల బంగారు ఆభరణాలు, రూ. 16,000 కోట్ల డిపాజిట్లు, దేశవ్యాప్తంగా 960 ప్రాపర్టీలు ఉన్నాయి. తిరుమల బాలాజీ సంపద నికర విలువ .. పలు దేశీ బ్లూ చిప్ కంపెనీల వేల్యుయేషన్ (ప్రస్తుత ట్రేడింగ్ ధరల ప్రకారం) కన్నా అధికం. స్టాక్ ఎక్స్ఛేంజీలో శుక్రవారం నాటి ముగింపు డేటా బట్టి చూస్తే విప్రో మార్కెట్ క్యాప్ రూ. 2.14 లక్షల కోట్లు కాగా అల్ట్రాటెక్ సిమెంట్‌ది రూ. 1.99 లక్షల కోట్లుగా ఉంది. స్విస్ బహుళజాతి దిగ్గజం నెస్లే భారత విభాగం మార్కెట్ విలువ రూ. 1.96 లక్షల కోట్లు. అటు ప్రభుత్వ రంగంలోని ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ), ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ) విలువ కూడా బాలాజీ ట్రస్టు సంపద కన్నా తక్కువే. రెండు డజన్ల కంపెనీలకు మాత్రమే ఇంతకు మించిన మార్కెట్ వేల్యుయేషన్ ఉంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ (రూ. 17.53 లక్షల కోట్లు), టీసీఎస్ (రూ. 11.76 లక్షల కోట్లు), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (రూ. 8.34 లక్షల కోట్లు), ఐటీసీ (రూ. 4.38 లక్షల కోట్లు) మొదలైనవి ఈ జాబితాలో ఉన్నాయి. 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 3,100 కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రకారం బ్యాంకుల్లోని నగదు డిపాజిట్లపై రూ. 668 కోట్లు, హుండీ ఆదాయం రూ. 1,000 కోట్ల వరకూ ఉంటుందని టీటీడీ అంచనా వేసింది.



రిలయన్స్ డీల్‌కు మెట్రో ఏజీ సమ్మతి!



న్యూఢిల్లీ: జర్మనీ కంపెనీ మెట్రో ఏజీకి చెందిన దేశీ క్యాష్ అండ్ క్యారీ వ్యాపారాన్ని రిలయన్స్ ఇండస్ట్రీస్ 500 మిలియన్ యూరోలకు (రూ.4,060 కోట్లు) సొంతం చేసుకోనున్నట్టు తెలుస్తోంది. గత కొన్ని వారాల నుంచి డీల్‌పై మెట్రో ఏజీ, రిలయన్స్ రిటైల్ మధ్య చర్చలు నడుస్తున్నాయని, గత వారమే రిలయన్స్ రిటైల్ డీల్‌కు మెట్రో ఏజీ అంగీకారం తెలిపినట్టు పరిశ్రమ వర్గాలు వెల్లడించాయి. మెట్రో క్యాష్ అండ్ క్యారీకి దేశవ్యాప్తంగా ఉన్న 31 హోల్‌సేల్ పంపిణీ కేంద్రాలు, భూమి, ఇతర ఆస్తులు ఈ ఒప్పందంలో భాగంగా ఉండనున్నట్టు చెప్పాయి. ఈ సమాచారాన్ని ఇరు కంపెనీల ప్రతినిధులు తిరస్కరించడం కానీ, అంగీకరించడం కానీ చేయలేదు. మార్కెట్ ఊహాగానాలపై స్పందించబోమని స్పష్టం చేశాయి.

త్వరలో పశు ఔషధి కేంద్రాలు

- దేశంలోనే ప్రభుత్వ పరంగా తొలిప్రయోగం
- రాష్ట్రంలో 52 వెటర్నరీ జనరిక్ డ్రగ్ స్టోర్స్
- తొలి కేంద్రం విజయవాడలో ఏర్పాటుకు సన్నాహాలు
- 75 శాతం సబ్సిడీ
- 35–85 శాతం మేర తగ్గనున్న బ్రాండెడ్ మందుల ధరలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పశు ఔషధి కేంద్రాలు రాబోతున్నాయి. పశుపక్ష్యాదుల ఆరోగ్య పరిరక్షణ కోసం తక్కువ ధరలకే నాణ్యమైన, బ్రాండెడ్ మందులను అందుబాటులోకి తీసుకురావాలన్న సంకల్పంతో రాష్ట్ర వ్యాప్తంగా వెటర్నరీ జనరిక్ డ్రగ్ స్టోర్ల ఏర్పాటు దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇది దేశంలోనే ప్రభుత్వ పరంగా తొలిప్రయోగం కానుంది. తొలి స్టోర్‌ను విజయవాడ పాలీక్లినిక్ ఆవరణలో ఏర్పాటు చేయనున్నారు. ఆ తర్వాత దశల వారీగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పశువుల ఆస్పత్రులు, పాలీ క్లినిక్స్‌లో మరో 52 పశు ఔషధి కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. రాష్ట్రంలో 2019 లైవ్ స్టాక్ సెన్సెస్ ప్రకారం 46 లక్షల ఆవులు, 62 లక్షల గేదెలు, 1.76 కోట్ల మేకలు, 55 లక్షల గొర్రెలు, 92 వేల పందులతో పాటు 10.79 కోట్ల పౌల్ట్రీ సంపద, 5లక్షలకు పైగా కుక్కలు ఉన్నాయి. రాష్ట్రంలో రెండు సూపర్ స్పెషాలిటీ వెటర్నరీ ఆస్పత్రులు, 12 వెటర్నరీ పాలీ క్లినిక్స్, 323 ఏరియా వెటర్నరీ ఆస్పత్రులు, 1,576 వెటర్నరీ డిస్పెన్సరీలు, 1,219 రూరల్ లైవ్‌స్టాక్ యూనిట్లు ఉన్నాయి. పెంపుడు జంతువుల పెంపకం పెరగడంతో రాష్ట్ర వ్యాప్తంగా వందలాది పెట్ డాగ్స్ కేర్ సెంటర్, పెట్‌హౌస్‌లు ఏర్పాటవుతున్నాయి. పశువులు, సన్నజీవాలతో పాటు పెంపుడు జంతువులకు ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా సమీప పశువుల ఆస్పత్రులు, పెట్ క్లినిక్స్‌కు తీసుకెళ్తున్నారు. వైద్యులు రాసే మందులు అత్యంత ఖరీదైనవి కావడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలకు భారంగా మారుతోంది. జనరిక్ మెడికల్ షాపుల తరహాలోనే వెటర్నరీ జనరిక్ డ్రగ్‌స్టోర్స్‌ను ఏర్పాటు చేయడం ద్వారా బ్రాండెడ్ వెటర్నరీ మందులను 35 నుంచి 85% తక్కువ ధరలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం సంకల్పించింది. ఒక్కో కేంద్రాన్ని రూ.4.63లక్షల అంచనాతో ఏర్పాటు చేస్తున్నారు. దీన్లో ప్రభుత్వం 75% సబ్సిడీగా ఇస్తుంది. లబ్ధిదారులు 25% సమకూర్చుకోవాల్సి ఉంటుంది.



నంద్యాల జిల్లా పెద్దమల్కాపురంలో మహిళలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న మంత్రి బుగ్గన



ప.గో. జిల్లా తాడేపల్లిగూడెంలో పథకాలను వివరిస్తున్న డిప్యూటీ సీఎం సత్యనారాయణ

గడప గడపకు మన ప్రభుత్వం



పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో కరపత్రాలు అందజేస్తున్న మంత్రి విడదల రజిని



అనంతపురం జిల్లా కణేకల్లులో మహిళకు సంక్షేమలబ్ధిని వివరిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి

విద్యుత్ వస్త్రాలు.. కరెంట్ రోడ్లు..!

విద్యుత్ ఉత్పత్తిలో కొత్త పుంతలు తొక్కుతున్న సాంకేతికత

- నూలుపోగుల మధ్య సోలార్ తీగలతో వస్త్రం తయారీ
- సౌరశక్తితో ఉత్పత్తయిన కరెంటుతో జేబులోనే ఫోన్, వాచ్ చార్జింగ్
- అందుబాటులోకి కరెంటును తయారు చేసే కారు టైర్లు
- రోడ్లపైనా సౌర పలకలతో విద్యుత్ ఉత్పత్తి




విద్యుత్ ఉత్పత్తి చేసే టైర్లు

మనం ధరించే వస్త్రాల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చు. దానితో మన జేబులోనే సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టుకోవచ్చు. నడిచే రోడ్లపై కూడా కరెంట్‌ను సృష్టించవచ్చు. ఎలక్ట్రిక్ వాహనాలకు నిశ్చింతగా చార్జింగ్ పెట్టుకోవచ్చు. ఆశ్చర్యంగా ఉన్నా... దీనిని ఆచరణలో సాధ్యం చేసి చూపించారు ఇంగ్లండ్, చైనా, స్విట్జర్లాండ్ వంటి దేశాల శాస్త్రవేత్తలు. క్రీస్తు పూర్వం 600 సంవత్సరంలో గ్రీసు దేశానికి చెందిన థేల్స్ అనే శాస్త్రవేత్త మొదటిసారి విద్యుత్ ఉనికిని గుర్తించారు. నాటి నుంచి విద్యుత్ రంగంలో సాంకేతికత రోజురోజుకు కొత్తపుంతలు తొక్కుతోంది. అవసరాలకు అనుగుణంగా నిత్యం కొత్త ఆవిష్కరణలకు ప్రయత్నం జరుగుతూనే ఉంది. ఆ ఆవిష్కరణలు ఇప్పుడు ఆచరణలోకి వస్తున్నాయి.

– సాక్షి, అమరావతి

ఒంటిపైన విద్యుత్ ఉత్పత్తి



ఇంగ్లండ్‌లోని నాటింగ్‌హామ్ ట్రెంట్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు సౌరశక్తితో విద్యుత్‌ను ఉత్పత్తి చేసే వస్త్రాన్ని తయారు చేశారు. దీంతో ఫ్యాంట్ జేబులోనే సెల్‌ఫోన్, స్మార్ట్ వాచ్ వంటి ఎలక్ట్రానిక్ వస్తువులకు చార్జింగ్ పెట్టుకోవచ్చు. నూలు పోగుల మధ్య 1,200 సూక్ష్మ సోలార్ ప్యానెల్స్‌ను అమర్చి ఈ వస్త్రాన్ని ఎండలో ఉంచి సౌరశక్తిని గ్రహించేలా చేయడంలో శాస్త్రవేత్తలు విజయం సాధించారు. ఇందుకోసం పరిశోధకులు 51 సెంటీమీటర్ల పొడవు, 27 సెంటిమీటర్ల వెడల్పు ఉన్న వస్త్రాన్ని తయారు చేశారు. నీటిలో తడిచినా పాడవకుండా అందులో ఒక్కో సోలార్ సెల్‌ను పాలిమర్ రెజిన్ కోటింగ్ చేసి వాటర్ ప్రూఫ్‌గా మార్చారు. ఒక్కో సోలార్ సెల్‌ను చిన్న వైరుతో అనుసంధానం చేసి తీగగా మార్చారు. రెండు నూలు పోగుల మధ్య సోలార్ సెల్ తీగను అమర్చుకుంటూ వస్త్రాన్ని రూపొందించారు. ఈ వస్త్రాలు 400 మిల్లీవాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశాయి. ఈ విద్యుత్ సెల్‌ఫోన్ చార్జింగ్‌కు సరిపోతుందని శాస్త్రవేత్తలు ప్రకటించారు. ఈ వస్త్రాన్ని 40 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద కూడా ఉతకవచ్చని వెల్లడించారు. దీనిని మరింత అభివృద్ధి చేసి జాకెట్లు, ఇతర వస్త్రాలను తయారు చేయడానికి ప్రయత్నిస్తున్నారు.



రోడ్డుపైనే కరెంట్ ఉత్పత్తి

విద్యుత్, ఆటోమొబైల్ రంగాలకు మధ్య సంబంధం రోజురోజుకూ బలపడుతోంది. ఇప్పటి వరకు ఎలక్ట్రిక్, హైడ్రోజన్, సోలార్ వంటి సాధనాల ద్వారా బ్యాటరీలకు చార్జింగ్ పెట్టడం జరుగుతోంది. ఇటీవల విద్యుత్ వాహనాలు పెరుగుతుండటంతో టైర్ల తయారీ కంపెనీలు చార్జింగ్ విభాగంలో కూడా సరికొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుడుతున్నాయి. విద్యుత్‌ను ఉత్పత్తి చేసే టైర్లను తయారు చేస్తున్నాయి. అమెరికాకు చెందిన గుడ్ ఇయర్ అనే అంతర్జాతీయ టైర్ల తయారీ సంస్థ 'గుడ్ ఇయర్ బీహెచ్03' అనే పేరుతో తయారు చేసిన కొత్త రకం టైర్లు, రోడ్డుతో రాపిడి (ఫ్రిక్షన్) వలన కలిగే వేడిని విద్యుచ్ఛక్తిగా మార్చడానికి సహకరిస్తాయి. ఇలా మారిన విద్యుచ్ఛక్తి కారులోని బ్యాటరీలను చార్జ్ చేయడానికి ఉపయోగపడుతుంది. మరోవైపు చైనా, స్విట్జర్లాండ్, మరికొన్ని దేశాల శాస్త్రవేత్తలు సైకిల్, బైక్‌లు, కార్లు వంటి వాహనాలు నడిచే రోడ్లపై విద్యుత్ ఉత్పత్తి కోసం ప్రయోగాలు చేస్తున్నారు. కొన్ని దేశాల్లో ఈ ప్రయోగాలు విజయవంతంగా పూర్తి చేసి ఆచరణలోకి తీసుకొచ్చేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇందుకోసం నాన్-స్లిప్ ఉపరితలం ఉన్న రోడ్లపై 50 చదరపు సెంటీమీటర్ల పరిమాణం, రెండు సెంటీ మీటర్ల మందంతో ఉన్న సౌర పలకలను అమర్చుతున్నారు. ఇవి కాంక్రీట్ రహదారులకంటే గట్టిగా, వాహనాల బరువును తట్టుకునేలా రూపొందిస్తున్నారు. వీటి ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను గృహ, వ్యాపార సముదాయాల అవసరాలకు వినియోగించవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 2,185 ఎంబీబీఎస్ సీట్లు

▶ మొదటి పేజీ తరువాయి

తుది మెరిట్ జాబితాలో ఉన్నారు.

రాష్ట్ర కోటాలో 1,865 సీట్లు..

రాష్ట్రంలో 11 ప్రభుత్వ, 16 ప్రైవేట్, రెండు మైనారిటీ, శ్రీపద్మావతి మహిళా వైద్యకళాశాలలు ఉన్నాయి. 11 ప్రభుత్వ కళాశాలల్లో 2,185 సీట్లు ఉన్నాయి. వీటిలో 325 సీట్లు ఆలిండియా కోటాలో, 1,860 సీట్లు రాష్ట్ర కోటాలో భర్తీచేస్తారు. 16 ప్రైవేట్, రెండు మైనార్టీ కళాశాలల్లో 3 వేల సీట్లున్నాయి. వీటిలో 1,500 సీట్లు కన్వీనర్ కోటాలో, మిగిలినవాటిని బీ, సీ కేటగిరీల్లో భర్తీచేస్తారు. శ్రీపద్మావతి వైద్య కళాశాలలో 175 సీట్లున్నాయి. వీటిలో 126 రాష్ట్ర కోటాలో, 26 ఆల్ ఇండియా, 23 ఎన్నారై కోటా కింద భర్తీ అవుతాయి. అన్ని కాలేజీల్లోను మొత్తం 5,360 సీట్లున్నాయి. వివరాల కోసం https://ugcq.ntruhsadmissions.com/ చూడొచ్చు.

వన్‌టైమ్ ఆప్షన్ విధానం..

ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి సంబంధించి తొలిదశ ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌లో భాగంగా ఆప్షన్‌ల నమోదుకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం శనివారం అర్ధరాత్రి నోటిఫికేషన్ జారీచేసింది. విద్యార్థులు మంగళవారం (నవంబర్ 8) రాత్రి ఏడు గంటల్లోగా ఆప్షన్‌లను నమోదు చేయాలి. ఒక్కసారి ఆప్షన్లు నమోదు చేస్తే చాలు.. వీటినే అన్ని విడతల కౌన్సెలింగ్‌కు పరిగణనలోకి తీసుకుంటారు. రీటెయిన్ విధానాన్ని ఈ ఏడాది విశ్వవిద్యాలయం అందుబాటులోకి తెచ్చింది. దీని ప్రకారం.. విద్యార్థి తనకు ఇష్టమైన కళాశాలలో తొలి దశలోనే సీటు వస్తే.. ఆ సీటుకే పరిమితం అవుతానని అంగీకారం తెలపొచ్చు. ఇలాంటి విద్యార్థులను తర్వాతి కౌన్సెలింగ్‌లకు పరిగణనలోకి తీసుకోరు.

ఆప్షన్ల నమోదులో జాగ్రత్త..

విద్యార్థులు ప్రాధాన్యత క్రమంలో ఒకేసారి ఆప్షన్‌లు నమోదు చేయాల్సి ఉంటుంది. ఆప్షన్‌ల నమోదు విషయంలో విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలి. సీనియర్‌ల సలహాలు, సూచనలు తీసుకుంటే మంచిది. అన్ని సీట్లు భర్తీ అయ్యేంత వరకూ మాప్-అప్ రౌండ్ కౌన్సెలింగ్‌లు చేపడతాం. విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఏమైనా సందేహాలు ఉంటే విశ్వవిద్యాలయం ఇచ్చిన ఫోన్ నంబర్లను సంప్రదించొచ్చు.

– డాక్టర్ శ్యామ్‌ప్రసాద్, వీసీ, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం

ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ సీట్లు ఇలా..

కళాశాల	మొత్తం సీట్లు	ఆల్ ఇండియా కోటా	రాష్ట్ర కోటా
ఏసీఎస్ఆర్ నెల్లూరు	175	26	149
ఆంధ్రా వైద్య కళాశాల, విశాఖపట్నం	250	38	212
ప్రభుత్వ వైద్య కళాశాల, అనంతపురం	150	22	128
గుంటూరు వైద్య కళాశాల	250	37	213
కర్నూలు వైద్య కళాశాల	250	37	213
రిమ్స్, కడప	175	26	149
రంగరాయ, కాకినాడ	250	37	213
రిమ్స్, ఒంగోలు	120	18	102
రిమ్స్, శ్రీకాకుళం	150	22	128
సిద్ధార్థ, విజయవాడ	175	26	149
ఎస్వీ వైద్య కళాశాల, తిరుపతి	240	36	204



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.